















భావయామి వేంకటేశం

శ్రీరస్తు

శుభమస్తు                                        అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-V

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన
**అమరవాడి సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-V**

**మొదటి ప్రచురణ**
**సెప్టెంబర్ 2011**

**రచన**
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

**వెల : అమూల్యం**

**ప్రతులకు :**
**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,**
**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. & ప్రింటింగ్ :**
**కె. మురళీ కృష్ణ**
**9848 51 51 09**





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

**- రచయిత**



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి V

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అంతరంగమెల్ల శ్రీహరికి | 35 |
| 2. | అదిగో కొలువై యున్నాడు | 41 |
| 3. | అదిగాక సౌభాగ్యమది | 167 |
| 4. | అనంతమద్భుత | 189 |
| 5. | అన్నిటి మూలంబితడు | 81 |
| 6. | అన్ని విభవముల అతడితడు | 129 |
| 7. | అస్మదాదీనాం | 195 |
| 8. | అప్పని వరప్రసాది | 115 |
| 9. | అల వటపత్రశాయి | 153 |
| 10. | అహోబలేశ్వరు దరికుల | 43 |
| 11. | ఆదరమ్మ పాదరమ్మ | 97 |
| 12. | ఆలించు పాలించు | 79 |
| 13. | ఇందిరయు దానుగూడి | 31 |
| 14. | ఇతడే అతడు కాబోయి | 137 |
| 15. | ఇదివో సుద్దులు | 95 |
| 16. | ఇదియే నాకు మతము | 61 |
| 17. | ఇన్నిటికి మూలము యీతని | 101 |







| | | |
|---|---|---|
| 18. | ఈతడే హరుడు ఈతడే అజుడు | 93 |
| 19. | ఈ విలాసంబులును | 67 |
| 20. | ఎంత నేరుచుకొన్నది | 187 |
| 21. | ఎదురులేక చరియింతరు | 183 |
| 22. | ఎంత మన్నించితో | 29 |
| 23. | ఎచ్చుట చూచిన నితడై | 159 |
| 24. | ఎటువంటి బిడ్డండే | 145 |
| 25. | ఎవ్వడో గాని ఎరుకరాదు | 49 |
| 26. | ఏటికి నెవ్వరి పొందు | 57 |
| 27. | ఏలవయ్య లోకమెల్ల | 21 |
| 28. | ఏమన వచ్చును | 107 |
| 29. | ఓహో! దేండేం | 165 |
| 30. | కంటి కంటి మిదె | 147 |
| 31. | కంటి గంటి నిలువు చక్కని | 185 |
| 32. | కాంతల మాన మనేటి | 47 |
| 33. | కిం కరిష్యామి | 159 |
| 34. | కరుణానిధిం | 23 |
| 35. | కలిగె నిదె నాకు కైవల్యము | 15 |
| 36. | కలశాపురము కాడ గంథపుమాకుల | 181 |
| 37. | కేశవ నారాయణ | 53 |
| 38. | కొమ్మ సింగారములివి | 5 |

| | | |
|---|---|---|
| 39. | కొమ్మలు పాదాలొత్తగ | 191 |
| 40. | గడ్డపార మింగితే | 169 |
| 41. | గరుడధ్వజం బెక్కె | 117 |
| 42. | గాలినే పోయా కలకాలము | 121 |
| 43. | గోనెలె కొత్తలు | 87 |
| 44. | చిత్తా అవధారు జియ్యా | 17 |
| 45. | జయమాయె నీకు నాపె | 113 |
| 46. | జవ్వనంపు మదమున | 59 |
| 47. | జవ్వాది మెత్తినది | 105 |
| 48. | త్వమేవ శరణం | 177 |
| 49. | తెగక పరమునకు | 71 |
| 50. | దేవదేవోత్తమ | 135 |
| 51. | దేవదేవంభజే | 73 |
| 52. | దేవకామినులు ఆడరో | 65 |
| 53. | దేవునికి దేవికిని | 99 |
| 54. | దేహము సంబంధము | 143 |
| 55. | ధారుణీపతికిని దలబాలో | 149 |
| 56. | నగవులు నిజమని | 83 |
| 57. | నారాయణు డీతడు | 11 |
| 58. | నారాయణా నిను | 141 |
| 59. | నిన్ను నమ్మివిశ్వాసము | 123 |







| | | |
|---|---|---|
| 60. | నీవే మాకు దిక్కు | 179 |
| 61. | నీకే శరణంటి | 139 |
| 62. | నేనేమీ చేయగ లేను | 39 |
| 63. | నేనొకటి సేయగాను | 75 |
| 64. | నేనొక్కడ లేకుండితే | 155 |
| 65. | పట్టితే పది రూపులై | 13 |
| 66. | పదుచు జేతలు గావు | 9 |
| 67. | పరమయోగీశ్వరుల | 173 |
| 68. | పరుల సేవలు చేసి | 27 |
| 69. | పాలజలనిధిలో | 33 |
| 70. | పులకల మొలకల | 127 |
| 71. | పొడవైన శేషగిరి | 109 |
| 72. | బాపుదైవమా మాపాలి | 51 |
| 73. | భావములోన బాహ్యమునందున | 193 |
| 74. | భోగీంద్రులను మీరు | 37 |
| 75. | భోగీంద్రశయనము | 175 |
| 76. | మంగళం గోవింద | 201 |
| 77. | మానవెప్పుదును | 151 |
| 78. | మాదృశానాం భవామయ | 131 |
| 79. | మిక్కిలి నేర్పరి అలమేల్మంగ | 171 |
| 80. | ముద్దుల మోమున | 133 |

| | | |
|---|---|---|
| 81. | మొకమొక మెదుట | 45 |
| 82. | మేలుకో శృంగారరాయా | 125 |
| 83. | మోసమున మాయా | 77 |
| 84. | రామ రామ రామకృష్ణ | 163 |
| 85. | రామ రామచంద్ర రాఘవ | 197 |
| 86. | వందేహం జగద్వల్లభం | 103 |
| 87. | వరుసతో సాసముఖా | 91 |
| 88. | వారిదే పో జన్మము | 9 |
| 89. | వాడె వేంకటేశుడనే వాడే | 3 |
| 90. | విజయపుటమ్మ | 119 |
| 91. | విపరీతములివి | 69 |
| 92. | విడువరాదెంతైన | 19 |
| 93. | వీడివో యిదె వింత దొంగ | 85 |
| 94. | వైష్ణవులు గానివారలు | 111 |
| 95. | వేదములే నీనివాసమట | 25 |
| 96. | వేదము దీర్పదు వేరే | 157 |
| 97. | శ్రీశోఽయం | 55 |
| 98. | సర్వేశ్వరుడే | 199 |
| 99. | సుదతుల కితనికి | 1 |
| 100. | సోదించిరిదియే | 89 |
| 101. | హరియే ఎఱుగును | 63 |






# ప్రార్థన

ఉ॥ శ్రీరమణీ మనోవిభుని చేరి నుతించెను అన్నమార్యుడున్
వారిజనాభ! నీ కరుణ వ్రాసెను వేల సుకీర్తనంబులన్
వారి మనోగతంబయిన భావన నేర్వగ నాకు శక్యమా
కోరిక దీర మున్నుడిని కూర్పుచు భావము జెప్ప జూచితిన్

కం॥ ఎన్నో జన్మల పుణ్యము
అన్నయ్యకు వివరణంబు అందించుటయున్
వెన్నుని కృపయే జుమ్మీ!!
మున్నుడినే చెప్పుటయును మురహరి కృపయే.

ఉ॥ శరణము వేడెదన్ యితని సర్వము, నాకభయప్రదాతయున్
వెరపున ఈ మహామహుని వేంకటనాథుని నామనంబునన్
తిరముగ నిల్పుమా, యెద బ్రతిష్ఠను జేయుచు అన్నమయ్యనెన్
మురియుచు వాని కీర్తనకు మున్నుడి భావములేర్చికూర్చితిన్

చం॥ గొనకొని అన్నమయ్యనిను గొల్చుచు పాడెను వేల కీర్తనల్
అనుపమ దీక్షనా గురుని నాత్మ స్మరింపుచు కొన్ని యెన్నితిన్
దినమున కొక్క కీర్తనను తేట తెనుంగున వ్రాయు ధైర్యమున్
అనువగు శక్తినీయ గదె ఆదిపరాత్పర వేంకటేశ్వరా!

కం॥ శ్రీకరుడు వేంకటేశుడు
సాకారపు పరబ్రహ్మ సత్యంబిదియే
మీకెందుకు అనుమానము?
ఆ కరుణానిధిని వేడు దన్నయ్యనెరా!

## ముందు మాట (సంపుటి-V)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'–అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స– అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









**5-1**

## మున్నుడి

శ్రీదేవి, భూదేవి పెండ్లి కూతుళ్ళు పురుషోత్తముడు వరుడు. కన్నులపండువగా జరుగుతోంది కళ్యాణం. బ్రహ్మాది దేవతలు బారులు తీరి వీక్షిస్తున్నారు. వాళ్ళు మనబోటి అల్పులకు కనబడరు కాని, మనల్నికూడ పనిలోపనిగా వధూవరులతో పాటు ఆశీర్వదిస్తారు. అందుకనే జీవితంలో ఒక్కసారన్నా... స్వామివారి కళ్యాణం జరిపించాలి. నిత్య కళ్యాణం పచ్చతోరణం అనే సంప్రదాయాన్ని ఆరువందలయేళ్ళ క్రితమే ప్రవేశపెట్టి మనల్నందరినీ తరింప జేస్తున్న "పదకవితా పితామహుడు" తాళ్ళపాక అన్నమాచార్యులవారి ఋణం తీర్చుకోగలమా? ఎన్నటికీ తీరదు... ఆనాడాయన పాడిన కీర్తన ఇది...

**కం॥ సుదతుల కిద్దరి కితనికి**
**ముదముగ జరిగేను పెండ్లి భువనాల్ చెలగెన్**
**వుదటున శాయరె వూడిగ**
**మిదె భాగ్యము అన్నమయ్య ఇంతుల కనియెన్**

**రాగం : నాగవరాళి**

సుదతుల కితనికి సోబనవేళ
వుదుటున జెలులెల్ల నూడిగాలు శాయరే ॥సుదతుల॥

ఇద్దరు పెండ్లి కూతుల కితడు గట్టె బాసిక-
మొద్దిక గప్పుర వీడే లొడిబెట్టెను
పెద్దరికాన నడుమ బెండ్లి పీటపై గూచుండె
వొద్దనుండి సతులెల్ల నూడిగాలు (సే) వేయరో ॥సుదతుల॥

రెండు చేతుల శాసలు రెట్టించి చల్ల దొడగె
దండలిద్దరి మెడల దగుల వేసె
గండు మీరి ముంజేతుల గంకణ దారాలు గట్టె
వుండినట్టే చెలువెల్ల నూడిగాలు సేయరే ॥సుదతుల॥





భూమిన నలమేల్మంగను భూసతి గాగిట గూడె
దోమటి దొడికి ముందే తొక్కె బాదాలు
యీమేటి శ్రీవేంకటేశు డిన్ని విధాల మెఱసె
వోముచును చెలులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతుల॥

**భావామృతం :**

ఓ చెలులారా! (అన్నమాచార్యులవారు కూడా...పెండ్లిచూడటానికి వచ్చిన ఒక తరుణి అని భావించాలి), సుదతులకు (శ్రీదేవి, భూదేవి అనే ఈ భామలకు), ఇతనికి (పురుషోత్తముడైన ఈ శ్రీ వేంకటేశ్వరునికీ), ఇది సోబనవేళ (శుభకార్యం జరిగే సమయం). మీరు వుదటున (గర్వంగా పెళ్ళిపెద్దలవలె) వూడిగము (సేవలు) శాయరే.

ఈ పెండ్లి కూతుళ్ళిద్దరికీ ఇతడు 'బాసికము'లు కట్టినాడు. అనుకూలంగా కర్పూర తాంబూలములను ఈ దేవేరులు వొడిలో బెట్టినాడు. ఆ తరువాత తన పెద్దరికం చూపిస్తూ మధ్యలో వేసిన పెండ్లిపీటలపై కూర్చుని వున్నాడు. ఓ సతులారా! మీరంతా ఈయన వద్దనుండి సేవలు చేయండి, తరించండి.

చూడండమ్మా! ఈ జగన్నాథుడు, రెట్టించి (రెండురెట్లయిన వుత్సాహంతో) తన రెండు చేతులతోటి శాసలు (తలంబ్రాలు) పోస్తున్నాడు. వధువులిద్దరి మెడలలోను పూల దండలను తగుల (తన చేతులను తాకిస్తూ) వేసినాడు. ఈ వరుడు (గండుమీరి తన పౌరుషము చూపిస్తూ) వధువుల ముంజేతులకు కంకణ దారాలు కట్టినాడు. ఉండినట్లే... (ఉన్నవాళ్ళంతా) వూడిగాలు (సేవలు) చేయండమ్మా! ఓ చెలులారా! మీదేకదా! భాగ్యమంటే.

ఈ భూమిని (ఈ తిరుమలలో) తన దేవేరులైన అలమేల్మంగను, భూదేవిని 'దోమటిదొడికి' (నేటి కాలంలో మన భాషలో చెప్పాలంటే... "ఎగురుకొంటూ" (ఆచారంగా, పాదాలు తొక్కి... ఆ నొప్పి తగ్గుటకా అన్నట్లు వారిని తన కౌగిట చేర్చినాడు. మేటి (నేర్పరి) యైన ఈ శ్రీవేంకటేశ్వరుడు వోముచును (జగద్రక్షణ చేయుచు) (ఇన్ని విధముల ప్రకాశించి కన్నులపండుగ చేయుచున్నాడు. ఓ చెలియలారా! మీరంతా వీరికి వూడిగాలు చేయండమ్మా! తరించండి.

5-2

## మున్నుడి

రంగనాథస్వామిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. ఈ కీర్తనలో రంగనాథస్వామి లీలలను వివరించారు అన్నమయ్య. పెరియాళువారినే శ్రీకృష్ణదేవరాయలవారు ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తులు అన్నారు. ఆయన కూతురే గోదాదేవి. ఆమె రంగనాథస్వామిని వలచి వలపించుకొంది. ఆమె తన తలలో ముడిచి విడిచిన విరిదండలను స్వామికి అర్పిస్తే వాటి సువాసనలధికమై ఆయన ప్రేమగా స్వీకరించి ఆమెనే పెండ్లాడాడు. పామరులైన తనబోటివారిని (అన్నమయ్య వంటివారిని...) "నా మీద పాటలు పాడండిరా"...అని నూరిపోశాడట...ఆహా!! వీడు వాడే వేంకటేశ్వరుడు అంటున్నారు.

**ఉ॥ వాడట వేంకటేశ్వరుడు వానిని వీడని యెంచి చూడరో**
**వాడు కరంబులన్ వలయు వావిరి ఆయుధముల్ ధరించెబో**
**కూడెను విష్ణుచిత్తులకు కూతురు నాతడు ప్రేమ మీరగా**
**నేడిటు వేంకటాద్రిపయి నీటుగ బ్రోచెను అన్నమయ్యనెన్.**

*** వావిరి = అధికమైన**

**రాగం : రసికరంజని**

వాడే వేంకటేశుడనే వాడే వీడు
వాడి చుట్టు కైదువ వలచేతివాడు ॥వాడే॥

కారిమారసుతుని చక్కని మాటలకు చొక్కి
చూరగా వేదాలగుట్టు చూపినవాడు
తీరని వేడుకతో తిరుమంగైయాళువారి
ఆరడి ముచ్చిలి కూటికి ఆసపడ్డవాడు ॥వాడే॥

పెరియాళువారి బిడ్డ పిసికి పై వేసిన
విరుల దండల మెడవేసిన వాడు
తరుణిచేయి వేసిన దగ్గరి బుజముచాచి
పరవశమై చొక్కి పాయలేని వాడు ॥వాడే॥





పామరుల దనమీది పాటలెల్లా పాడుమంటా
భూమికెల్లా నోర నూరి పోసినవాడు
మామ కూతు రలమేలుమంగ నాంచారియుదాను
గీముగానే వేంకటగిరి నుండేవాడు ॥వాడే॥

**భావామృతం :**

ఓ నరులారా! వాడే వేంకటేశ్వరుడనే వాడు. వాడే మన యెదురుగానున్న వీడు (రంగనాథుడు). వాడిచుట్టూ చేతులలో కోరిన ఆయుధాలు ధరించినవాడు.

'కారిమారన్' కుమారుడు చక్కగా మాట్లాడి తనని సంతోషపరచగా విద్యాగంధంలేని అతనికి వేదముల మర్మమెల్ల గుత్తగా యెరిగించి విఖ్యాతుని జేశాడు. తీరని వేడుకతో ఈ స్వామి అలనాడు 'తిరుమంగై ఆళ్వారు' తనని ఆరడి చేసినా (వద్దని ఆంక్షలు పెట్టినా), ముచ్చిలి (దొంగతనంగా) తిందామని దొంగకూటికి ఆశపడ్డవాడు. (ఆవిధంగా తన భక్తునికోసం యెంతకైన తను సిద్ధమేనని మరొక్కసారి నిరూపించినాడు)

పెరియాళ్వారు (విష్ణుచిత్తులవారు) వారి కూతురైన గోదాదేవి పిసికి (వాడుకొని), పై వేచిన (తనపై వేసిన) విరుల దండలను (పూమాలలను) ప్రీతిగా మెడవేసినవాడు (తన మెడలో ధరించిన శ్రీరంగనాథుడు) చేయి వేసిన గోదాదేవిని, తన భుజము చాచి దగ్గరకు తీసికొని పరవశమై చొక్కి (పరవశించి) ఆమెను పాయలేనివాడు (వదలలేని వాడు). వీడు (ఈ రంగనాథుడు) వాడే... వాడే ఏడుకొండల వేంకటేశ్వరుడు.

తనమీద, పామరులు (విద్యాగంధంలేని అల్పులైన) వారిని కూడ, పాటలెల్లా పాడమంటా (పాడండిరా కీర్తనలను) అని, భూమికెల్లా (భూలోకంలో అనేక చోట్ల) నోర నూరిపోసినవాడు. (నోటితో చెప్పి చెప్పి నూరిపోసి బోధించినవాడు). ఆ రంగనాథుని కథ ఇట్లా వుంటే... అక్కడ వేంకటాద్రిమీద (శ్రీవేంకటేశ్వరుడై) తన మామకూతురైన అలమేల్మంగమ్మ నాంచారీ, తానూ గీముగానే (నివాసముగా) నుండేవాడు.... యెవరనుకొంటున్నారు? వాడేవీడు... వీడేవాడు.

**5-3**

## మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు. అన్నమాచార్యులవారు. అన్నమయ్య కూడ ఒక చెలికత్తెయై తనతోటి చెలికత్తెలతో..."ఈ భామిని (కొమ్మ) సింగారాలు (అందాలు) కొలది వెట్టగరావు (లెక్కలేనన్ని వున్నాయి). పమ్మిన (అతిశయించిన) ఈ అందాలను వూహించాలేగాని ఇదమిద్ధంగా చెప్పుటు సాధ్యంకానిపని" అని చెబుతున్నారు. 'వయసురాని' వారికోసం ఈ కీర్తన సాధ్యమైనంత నర్మగర్భంగా వివరించాను. ఆ ప్రయత్నంలో కొండొకచో అసలుకే మోసం వచ్చి వుండవచ్చును. దాసుని తప్పులు దండముతో సరి...

**తే॥ కొమ్మ సింగారములనెంచి కొలది వెట్ట**
**రావు, సొబగుల భావించి రమణులార!**
**చెలగుడనె అన్నమార్యుడు చెలుల తోడ**
**సరస శృంగార కీర్తన హరికి దెలిపె.**

**రాగం : మిశ్రమోహన**

కొమ్మ సింగారములివి కొలది వెట్టగ రావు
పమ్మిన యీ సొబగులు భావించరే చెలులు ॥కొమ్మ॥

చెలియ పెద్దతురుము చీకట్లు గాయగాను
యెలమి మోముకళలు యెండగాయగా
బలిసి రాతిరియు పగలు వెనకముందై
కలయ కొక్కట మించీ కంటిరటే చెలులు ॥కొమ్మ॥

పొందుగ నీకె చన్నులు పొడవులై పెరగగా
నందమై నెన్నడుము బయలై వుండగా
ఇందునే కొండలు మిన్నుకిందు మీదై యొక్కచోనే
చెందివున్నవివివో చూచితిరటే చెలులు ॥కొమ్మ॥





శ్రీవేంకటేశు వీపున చేతు లీకెవి గప్పగా
యీవల నీతని చేతు లీకె కప్పగా
ఆవల కొమ్మలు తీగె ననలు కొనలు నల్లి
చేవదీరిని తిలకించిరటే చెలులూ ॥కొమ్మ॥

**భావామృతం :**

ఓ చెలియలారా! ఈ కొమ్మ (యువతి) సింగారములు (అందాలు), ఇవి అని కొలదివెట్టగ రావు (పరిమితి విధించుట సాధ్యము కానిపని). పమ్మిన (అతిశయించిన) ఈ సొబగులు (అందాలు) భావించరే (వూహించండే). ఇదమిద్ధంగా చెప్పుటకు వీలులేదు.

ఈ చెలియ 'సిగకొప్పు' చాల పెద్దది. అది చీకట్లను సృష్టించగలదు. ఆమె ముఖకాంతి యెండగాసినట్లు వున్నది. దానివల్ల రాత్రి పగలు వెనకా ముందులై (ఎన్నడూ కలసి ఒక్కచోట వుండని రేబవళ్ళు) మించి ఒక్కటైనాయా అన్నట్లుంది. ఓ చెలులారా! ఈ వింత కంటిరా! (చూశారా).

ఈమె పొంకమైన వురోజములు వున్నతములై, నెన్నడుము బయలై (శూన్యమై) యున్నందువలన... వున్నతమైన గిరులు మీదై శూన్యమైన గగనం క్రిందైనట్లున్నది. మరి ఇవిగో ఈ తారుమారు వ్యవహారం చూశారా! కనుక ఓ చెలులారా! యెన్నివింతలైనా అసాధ్యంకాదు.

ఓ భామినులారా! నల్లని దృఢమైన శ్రీవేంకటేశుని ఈ సుందరి తమకంతో తన చేతులు ఆయన వీపు చుట్టూ గప్పగా, ఆయన తన చేతుల నామె వీపు చుట్టూ బిగించినాడు. మనోజ్ఞమైన ఆ దృశ్యం సుకుమారమైన పూ లత దృఢమైన కొమ్మచుట్టూ అల్లుకొనినట్లున్నది. చేవదీరిన ఈ అల్లిక చూశారా! మీ జన్మ తరించిందే...

5-4

## మున్నుడి

ఎన్ని జన్మలెత్తినా జ్ఞానశూన్యులై జీవించి, మళ్ళీ మళ్ళీ పుట్టుతూ చనిపోతూ బ్రతుకుతున్నారు జీవులు. అవి జన్మలనటం శుద్ధదండుగ అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎవడు భారత, రామాయణాల్లోని నీ గాథలు ఈ భూమిపై ప్రచారం చేశారో వారిదేపో జన్మంటే. రాముడివై ధర్మవర్తనం నేర్పావు. కృష్ణుడివై దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశావు. నరసింహుడివై చావే అసాధ్యమైన హిరణ్యకశిపుని చంపావు. ఎన్నెన్నో రూపాలెత్తి నేడు ఈ తిరుమలలో శరణాగత రక్షకుడవైన నీవే శరణని బ్రతుకుతూ నీదయకోసం వేచివున్నాం.

**చం॥ జననము వారిదే భళిర! చక్కగ దెచ్చిరి నిన్ను భూతలిన్**
**వెనుక పురాణముల్ కలిగె వెన్నుడ! నీకథలెల్ల నెక్కుడై**
**అనిశమధర్మమెక్కుడయి, అల్పము ధర్మముయైన తావులన్**
**తనువును దాల్తువయ్య! హరి ధాత్రిని కొండల నన్నమయ్యనెన్.**

**రాగం : దేసాళం**

వారిదే పో జన్మము – వడి నిన్ను దెచ్చిరి
భారత రామాయణాలై – పరగె నీ కథలు ॥వారిదే॥

భువిమీద రావణుడు – పుట్టగాగా రాముడవై
తవిలి యిందరికి బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాడు – వెలసితేగా నీవు
అవతార మందితే ని–న్నందరును జూతురు ॥వారిదే॥

రమణ గంసాది యసు–రలు లూటి సేయగాగా
తమి గృష్ణావతార మిం–దరికైతివి
గములై యంతటి వారు – గడగితేగా నీవు నేడు
అమర జనించి మాట – లాడుదు విందరితో ॥వారిదే॥





ఎంత వుపకారియో – హిరణ్యకశిపుడు
చెంత నరసింహుడని – సేవ యిచ్చెను
ఇంతట శ్రీ వేంకటేశ – యిన్ని రూపులును నీవే
పంతాన నీ శరణని – బ్రతికితి మిదివో ॥వారిదే॥

## భావామృతం

ఓ శ్రీవేంకటేశ్వరా! జన్మము అంటే... వారిదేపో... వారు నిన్ను మాముందుకు తెచ్చారు. వారు (వ్యాసుడు, వాల్మీకి వంటి మహానుభావులు) చెప్పిన నీ కథలే భారతము, రామాయణము అని ప్రసిద్ధి చెందాయి. అంతేకాదు దుర్మార్గులని అందరూ తిట్టిపోసే రావణుడు, కంసుడు, హిరణ్యకశిపుని వల్లనే ఆ కథలు వెలుగులోకి వచ్చాయి. కాబట్టి వారివల్ల కూడా మేలే జరిగింది. లేకపోతే నీవు భూమ్మీదకెందుకొస్తావు? మాబోటి సామాన్యులు నిన్నెట్లా చూస్తారు?

రావణాసురుడు పుట్టుటవలననేకదా నీవు రాముడివై ఇంతమందికి కనబడ్డావు. అంతవాడు పుట్టాడు కాబట్టే నీవు అవతరించావు. కాబట్టి రావణుడివల్ల మంచే జరిగింది.

ఓ రమణుడా! కంసుడు మొదలైన అసురుల వల్ల కూడా వుపకారమే జరిగిందయ్యా! వాళ్ళు లూటీసేసి (పీడించి) నీ భక్తులను బాధించినందువల్లనే నీవు కృష్ణుడవై పుట్టి గొల్లవారిని కూడా వుద్ధరించావు. మాబోటి అల్పులతో కూడ మధురంగా మాట్లాడావు. నీకోసం దేవతలంతా భూమిపై అవతరించారు. మాకు కీడుకన్నా మేలే ఎక్కువ జరిగింది.

హిరణ్యకశిపుని వల్ల ప్రహ్లాదుడు బాధపడ్డమాట నిజమే కాని వాడివల్ల కూడ మాకు మంచే జరిగింది. వాణ్ణి చంపటంకోసం నీవు నరసింహుడివై అవతరిస్తే నిన్ను చూచి మేమంతా తరించాం. ఇన్ని రూపాలెత్తిన నీవే నేడు తిరుమలలో మాకోసం ఏడుకొండలవాడివై అవతరిస్తే... పంతంతో నీవే దిక్కని యేదో ఇలా బ్రతుకుతున్నాం. తండ్రీ! మాకు ఇదే బాగున్నది.

**5-5**

## మున్నుడి

నేటి నెల్లూరు జిల్లాలోని దర్శితాలూకాలోని 'పోలేపల్లి' గ్రామంలో ప్రాచీనమైన విఠలేశుని ఆలయం వున్నది. అన్నమాచార్యులవారికాలం నాటికి అదే గోపాల కృష్ణుని ఆలయం అయ్యుంటుందనీ, ఈ కీర్తనలోని కథానాయకుడు ఆ స్వామేనని కొందరు పెద్దలు నమ్ముతారు. అన్నమయ్య వాడిన పదజాలం కూడ నేటికాలంలో మనబోటివారికి అంత సుపరిచితంకాదు. నేనైతే విశ్వప్రయత్నంతో మాత్రమే ఈ వివరణన్నా ఈయగలిగా. పడుచు జేతలంటే కుఱ్ఱచేష్టలని అర్థం.

**ఆ.వె.॥ తొడికి మోవి పంటితో దుండగీడురా**
**పడుచు పనులు గావు బాలకృష్ణ!**
**తుంగభద్రత టిని దుడుకు కృష్ణుండనె**
**అన్నమయ్య కొలిచె వెన్ను నిటుల**

**రాగం : మంగళ కౌశిక**

పడుచు జేతలు గావు బాలకృష్ణుడు
తొడికీ మోవి పంటికె దుండగపు కృష్ణుడు ॥పడుచు॥

వెన్నచేతబట్టుకొని వేలు చాచి వుట్లకు
సన్న చేసీ గదవమ్మ జాణకృష్ణుడు
కన్నెలు దన్నెత్తుకొంటే కాగిట చవులు చూపీ
యెన్నిట తా నసకాడె యీ కృష్ణుడు ॥పడుచు॥

అంకెల దొంగెడు తానె అందపు చూపులు చల్లీ
లంకె మగనాండ్లపై లలి గృష్ణుడు
పొంకపు చెక్కు గీటితె పుక్కిట లోకాలు చూసి
సంకెలేక యశోదకు సటకాడు కృష్ణుడు ॥పడుచు॥





గొల్లెతలు ముద్దాడితె గురుతులెల్లా నించె
చల్లచాడెల కాడనె సరి గృష్ణుడు
అల్ల శ్రీవేంకటాద్రిని అదె తుంగభద్ర దరి
కొల్లలుగా వరా విచ్చీ గోవిందకృష్ణుడు ॥పడుచు॥

**భావామృతం :**

ఈ బాలకృష్ణుడు చేసే చేష్టలు పడుచు జేతలు (బాలుడి చేష్టలు) కావు. వీడివి యువకుని చేష్టలు. ఈ దుండగీడు (దుందుడుకు పిల్లగాడు) మా అధరములను తన పంటితో ఆకర్షిస్తాడు. ఇంకా విడమరచి చెప్పాలా?

ఒక చేత్తోవెన్న పట్టుకొని తను తింటూనే తనతోటి కుఱ్ఱాళ్ళకి వేలు చాచి వుట్లకేసి చూపించి వాటిని పగలగొట్టమని ఎట్లా సైగలు చేస్తున్నాడో చూడండి. ఈ కృష్ణుడు ఎంతటి జాణమ్మా! పడుచు పిల్లలు ఏదో చిన్నపిల్లాడులే అని తననెత్తుకొంటే, హఠాత్తుగ వారిని కౌగలించి కౌగిటిరుచి చూపిస్తాడు. ఓయమ్మో! ఈ కృష్ణుడు యెన్నిరకాలుగా నసకాడు (నసపెట్టే వాడు... అంటే ఒక పట్టాన తృప్తినొందని 'దురద' లాంటివాడు)

ఆకర్షణీయమైన తన చూపులతో తానే దొంగతనంగా కన్నెలను వశము చేసికొని ఆ మగనాండ్రపై (ఆ యువతులపై), లలి (ప్రేమ) అనే 'లంకె' బిగిస్తాడు. ఈ కృష్ణుని చేష్టలనేమని చెప్పగలము "ఏమిటిరా ఈ పనులు" అని యశోదాదేవి చక్కటి వాడి చెంపలు పట్టుకొంటే తనకేమీ తెలీదని పుక్కిట (పూరకనే) తన నోరుతెరచి దాంట్లో, సంకెలేని (అసంఖ్యాకమైన) లోకాలను చూపినాడు. వీడెంత సటకాడు (టక్కరివాడు)!!

చిన్నపిల్లాడు కదా! అని గోపికలు తనని ముద్దాడితే తాగిన చల్ల గుర్తులన్నీ వారి బుగ్గలపై నింపుతాడు. వీడికి సరియెవ్వరూ లేరు. అదిగో తుంగభద్రానది ఒడ్డున కొల్లలుగా (అంతులేకుండా) వరాలిచ్చే ఈ గోవిందకృష్ణుడే అల్ల (అదిగో) వేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడై యున్నాడు. వీనిని సేవించి తరించండి.

**5-6**

## మున్నుడి

శ్రీమన్నారాయణుని భక్తితో కీర్తిస్తూ అన్నమాచార్యులవారు శరణాగతితో ఈ కీర్తన వినిపిస్తున్నారు. భక్తులు ఆయన నెక్కడ స్మరిస్తే అక్కడే వున్నాడు. తనే కావాలన్న వారికి తాను లొంగివుంటాడట. భక్తి అనే తాటితో తప్ప యెన్ని తాళ్ళు తెచ్చినా ఆయన్ని కట్టలేమని యశోద తెలుసుకొన్నది. దుర్యోధనుడు తెలుసుకొన్నాడు. దిక్కని నమ్మినవారు యెక్కడికి పిలిస్తే... అక్కడికి వస్తాడు. ఎక్కడ చూచిన అక్కడే తన రూపం చూపే ఆయనే... మన శ్రీవేంకటేశ్వరుడు "చేచేత పూజింప సేవలు గొనడా?" అంటున్నారు.

**మ॥ నరులారా! యితడేను దేవుడనగా నారాయణుండీతడే**
**శరణంబంచును వీనిగొల్వుడిపుడే చక్కంగ రక్షించురా**
**అరిగెన్ వామనదై జగాల కొలిచెన్ ఆనాడు మూడడ్గులన్**
**వరమై గైకొనె, అన్నమయ్య పాడిడెన్ వాత్సల్య రూపున్ హరిన్.**

**రాగం : మోహన**

నారాయణుడీతడు నరులాల
మీరు శరణనరో మిమ్ము గాచీని ॥నారాయణు॥

తలచిన చోటను తానే ఉన్నాడు
వలచిన వారికైవసమెపుడు
కొలచెను మూడడుగుల జగమెల్లాను
కొలిచిన వారిని చేకొనకుండునా ॥నారాయణ॥

యెక్కడ పిలిచినా ఏమని పలికీ
మొక్కిన మన్నించు మునుముగను
రక్కసుల నణచి రక్షించు జగములు
దిక్కని నమ్మిన తిరముగా నేలడా ॥నారాయణ॥





చూచిన యందెల్ల చూపును రూపము
వోచిక పొగడిన వుండు నోటను
యేచిన శ్రీవేంకటేశుడే యితడట
చేచేత పూజింప సేవలుగొనడా ॥నారాయణ॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ మహానుభావుడే నారాయణుడు. మీరు ఈయనే దిక్కని శరణు వేడండి. మిమ్మల్ని తప్పక రక్షిస్తాడు.

ఈ దేవదేవుడు తలచిన చోటనే వున్నాడు. తానే వున్నాడు. స్వయంగా తానే వస్తాడు. తనను ఎవరు ప్రేమిస్తే వారికి కైవసమై (లొంగిపోయి) వుంటాడు. సమస్త భువనాలను మూడంటే మూడు అడుగులు (పాదాలు) పెట్టి 'కొలిచిన' వాడు కొలిచిన వారిని (పూజించినవారిని) చేకొనకుండునా?

ఈ సర్వేశ్వరుడు ఇక్కడా, అక్కడా అని చూడడు. ఎక్కడకు పిలిచినా వస్తాడు. రావటమే కాదు, ఏమి... యెందుకు పిలిచావు అని మరీ కనుక్కొంటాడు. "మొక్కిన మన్నించు మునుముగను"... (అంటే... అంత హడావుడిగా యెందుకు పిలిచావని విసుగుకొనకుండా వరుసగా మన్నిస్తాడట...). హిరణ్యకశిపుని వంటి రాక్షసుల బారినుండి కూడా తన భక్తులను కాపాడుటకు, వచ్చి రక్షిస్తాడని ఋజువయింది కదా! జగద్రక్షకుడు దిక్కని నమ్మినవారిని, తిరముగా నేలడా? (స్థిరముగా రక్షించడా?)

ఈ శ్రీహరి 'ఇందుగలడందులేడని సందేహము వలదు'... అన్నట్లు తన రూపము చూచిన యందెల్ల చూపును. ఓచిక పొగడిన (ఉచితమైన రీతిగా కీర్తించిన) ఆ కీర్తించిన వారి 'నోటి' యందే వుంటాడు. అంటే పలుకులోన పలుకు దైవము అన్నమాట.

అటువంటి ఈ శ్రీమన్నారాయణుడు వేరెవరోకాదు, యేచిన శ్రీవేంకటేశ్వరుడే (అతిశయించిన తిరుమలాధీశుడే). మరి... చేచేత పూజింప (చేతులారా పూజిస్తే) మన సేవలు గొనడా? (తప్పక స్వీకరిస్తాడు).

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తనలలో దశావతార వర్ణన కీర్తనలకొక ప్రత్యేకత వున్నది. గొప్ప 'క్విజ్ ప్రోగ్రామ్' లా సాగుతుంది. ఎంతో ఆలోచిస్తేగాని అసామాన్యులైన పండితులకు సైతం అర్థంకావు. 'పట్టితే పది రూపులనటం వల్ల' ను ఇదివరలో కొన్ని కీర్తనలు చూసినందువల్లను ఇది దశావతార వర్ణన అని తెలిసింది కాని, ఆపైన సాగలేదు. సప్తగిరీశుని శరణన్నవారు సప్తసముద్రాలే దాటగలరు. ఇదొక లెక్కా. నిద్ర లేచేసరికి భావామృత వివరణ మనస్సులో "వెలిగింది" చదవండి అదేమిటో...

**మత్తకోకిల : పట్టితే పదిరూపులై ఇల వాసుదేవుడు బుట్టెరా**
**యెట్టులున్నను మేలు జేసెను యెల్లలోకములేలెరా**
**గట్టివాడుర ద్రుంచె దుష్టుల గాచెశిష్టుల మెచ్చెరా**
**దిట్టయౌ తిరుపట్ల రాయుడు ధీరుడన్నయ తెల్పెరా.**

**రాగం : రామక్రియ**

పట్టితే పదిరూపులై పాయడు నావొద్ద దాగు
యెట్టు వున్నమేలు ఇకనెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

కన్నులనే వొకరూపు కాళ్ళబెనగీ రూపు
వెన్నెలాదురువంటి వన్నెలరూపు
నెన్నడిమిదొక రూపు నిచ్చలు నామేని మీద
ఇన్నిటా బాయడు తాను యెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

చేతిలోని దొకరూపు చేరి నాపేరిట రూపు
కాతరపు జవ్వనాన గలదు రూపు
పై తరవైనా బుజ బలముననొకరూపు
యీతల నాయందు బాయడెప్పుడైనా రానీవే ॥పట్టితే॥





కడు బుద్దుల నొకరూపు కలికి తనాల రూపు
బడిబడి బాసినాను పాయడు నన్ను
అదరి శ్రీవేంకటాద్రి మీద నన్ను గూడి
యెడయడెన్ని విధాల నెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

**భావామృతం :**

పట్టితే (అనుకుంటే) పదిరూపులై (పది అవతారములెత్తి) నావొద్ద దాగు (నా మేధస్సులో దాగి వుంటాడు), పాయడు (నన్ను విడువడు). ఆయన శ్రీమన్నారాయణుడు "సంభవామి యుగే యుగే" అని చెప్పి యున్నాడు. యెట్టులున్ననూ (ఏరూపంతోనైనా.. మేలు (లోక కళ్యాణమే) చేస్తాడు. ఇక నెప్పుడొస్తే ఏమి? రానీవే (రానీయండి, చూచి తరిద్దాం).

కన్నులనే వొకరూపు (ఈయన ఒకరూపంలో కన్నులతోనే వున్నాడు. చేప ఎన్నడూ కన్నులు తెఱచే వుంటుంది. మూయదు... కనుక ఈరూపం మత్స్యావతారము) కాళ్ళబెనగీరూపు (కాళ్ళతోఈదులాడే కూర్మావతారం). వెన్నెలవంటి తురుము (వెంట్రుకలు) గల వన్నెల రూపు (శ్వేతవరాహ అవతారము). నెన్నడిమి దొకరూపు (నడిమిపైనుంచి వేరే ఒక రూపు వున్న నరసింహుడు). నిత్యమూ నా ఒంటిమీదే వుంటాడు, యెన్నటికీ పాయడు (వదలడు). తాను యెప్పుడైనా రానీలే... మంచిదే.

చేతిలోని దొకరూపు (లోచెయ్యి.. అంటే భిక్ష స్వీకరించిన రూపము... అనగా వామనావతారము). చేరినే పేరిటరూపు (సమీపించి.. అతిశయించిన రూపము.. అనగా పరశురాముడు). కాతరపు జవ్వనాన గలదురూపు (యవ్వనమంతా కలతతోనే గడపిన రూపు... అనగా శ్రీరామావతారం). పై తరవైన (అందరికంటే యెక్కుడైన) భుజబలం గలదొకరూపు (బలరామావతారము) ఇకపైన ఈయన నన్ను విడువడు. ఎప్పుడైనా రానీవే. (రానీవే అనే మాటని నేటికాలంలో రానీలే చూద్దాం అంటున్నాం).

కడు బుద్దుల నొకరూపు (అత్యంత బుద్ధిశాలియైన బుద్ధుడు). కలికితనాల రూపు (కల్కి అవతారము). ఇట్టి అవతారమూర్తి, నేను బడిబడిబాసినాను. (క్రమము తప్పినప్పటికీ) నన్ను పాయడు (నన్ను విడువడు). అదరి (అతిశయించి) శ్రీవేంకటాద్రిమీద నన్ను సమీపించి, యెన్ని విధాలనైనా యెడయడు (త్యజించడు). ఈ శ్రీవేంకటేశ్వరుని యెప్పుడైనా రానీలే... నావాడే కదా!

**5-8**

## మున్నుడి

'మోక్షలక్ష్మి' ప్రాప్తించినప్పుడు కలిగే భావోద్వేగాన్ని పొందుతున్నారు అన్నమాచార్యులవారు. ఇదివరలో అదెవ్వరికీ దొరకని భాగ్యం అంటున్నారు. అంటే ఇదివరకెవ్వరికి ముక్తి లభించలేదని కాదు. యోగీశ్వరులకు దొరికివుండవచ్చుకాని సామాన్య సాంసారిక జీవితం గడిపి సుఖదుఃఖాలనుభవించి, కామక్రోధాలకు లోనైన బ్రతుకు గడిపిన తనకు ఆ శ్రీవేంకటేశ్వరుడు కైవల్యము నియ్యటం మాత్రం అసామాన్యమే... బహుళ జనాదరణ బొందిన భజన ఇది "నా క్రమమెల్ల నీ కైంకర్యమే" అంటున్నారు. అంటే... యేమిటి?

**కం: కైవల్యము కలిగెనురా**
**ఏవారికి దొరకలేదు ఇది తొల్లింటన్**
**శ్రీవేంకటేశ! కనుగొని**
**నీవాకిలి నన్నమయ్య నిను భజియించెన్.**

**రాగం : సింధుభైరవి**

కలిగెనిదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది ॥కలిగె॥

జయపురుషోత్తమ జయపీతాంబర
జయ జయ కరుణా జలనిధి
దయ యెఱుంగనే ధర్మము నెఱగనా
క్రియ యిది నీ దివ్య కీర్తనమే ॥కలిగె॥

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీ జనార్దనా
పరమ మెరుంగను భక్తి యెరుంగను
నిరతము నాగతి నీ దాస్యమే ॥కలిగె॥





నమో నారాయణ నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను నీ కయింకర్యమే ॥కలిగె॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదిగో... ఇదే నాకు ముక్తి లభించింది. (రాగద్వేషాలకు అతీతమైన నిత్యానంద స్థితి కలిగిందని భావము). యోగీశ్వరులకేమో గాని ఇటువంటి స్థితి, ఇదివరకు యెవ్వరికీ (సామాన్యులైన నాబోటి వారికి) సిద్ధించలేదు. కేవలం ఆ దేవదేవుని కరుణవలన లభించిన కైవల్య లక్ష్మి అది.

ఓ పురుషోత్తమా! నీకు జయము. పీతాంబరముల ధరించు కరుణాసాగరా! నీకు జయమగు గాక! నాకు 'దయ' ఇంతవరకు తెలియదు. ధర్మమార్గం యేమిటో యెరుగను. నాకు తెలిసిన సులువైన దారి ఒక్కటే వున్నది. ఆ 'క్రియ' (పని) నీ దివ్య కీర్తనము చేయుటే.

ఓ గోవిందా! నిన్ను శరణు జొచ్చియున్నాను. ఓ కేశవా! నీకు శరణు అంటున్నాను. శ్రీ జనార్దనా! శరణు శరణు. నాకు పరము (మోక్షము) అంటే యేమిటో నిజంగా తెలియదు. భక్తి అని దేనిని పిలుస్తారో యెరుగను. ఇక నా గతి (మార్గము) యేమిటి? నిరంతరము నీకు భృత్యునిగా బ్రతుకుటయే.

ఓ నారాయణుడా! నీకు వందనములు. ఓ లక్ష్మీవల్లభా! నీకు నమస్కారములు. ఓ పుండరీకాక్షా! (పద్మదళనేత్రుడవైన దేవా!) నీకు నమో వాకములు. మితి అనునది లేని ఓ శ్రీవేంకటేశ్వరా! నాక్రమము (నా పద్ధతి) యెల్లా (అంతా) నీ కైంకర్యమే (నీకు సమర్పించుకొనుటయే... అంటే నన్ను నీకు సమర్పించుకొనుట యొక్కటే.

## 5-9

## మున్నుడి

శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని దృశ్యమానం చేస్తున్నారు, అన్నమాచార్యులవారు. ఈ శ్రీమత్ అయోధ్యా విహారియే తిరుమలలోని శ్రీవేంకట నివాసుడు అంటున్నారు. "సామజ, వారి, రథముల సందడివేళ" అంటే గజ, అశ్వ, రథ సేనలు మోహరించి జయజయ ధ్వానాలు పలుకుతూ, కోలాహలం చేస్తున్నాయట. కీర్తన వింటుంటే రాజా రవివర్మ వర్ణచిత్రాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. కీర్తన పల్లవిని విని జాగ్రత్తగా అర్థంచేసికొంటే మిగతా చరణాలన్నీ ద్రాక్షాపాకమే.

**ఆ.వె॥ చిత్తగించవయ్య జియ్య! శ్రీరఘురామ!**
**అవధరింపుమనెను అన్నమయ్య**
**రాజరాజులీయు రమ్యమౌ కాన్కలన్**
**స్వీకరింపుమనెను వినుతి జేసి.**

**రాగం : సాళంగనాట**

చిత్తా అవధారు జియ్య పరాకెచ్చరికె
హత్తి కానుక లిచ్చేరు అదె రాజరాజులు ॥చిత్తా॥

రామ రఘుకుల వీర రాజీవలోచన
కోమలశ్యామల వర్ణ కొలువు వేళ
వామదేవాది మునులు వారె సుగ్రీవుడు వాడె
వేమారును వానరవీరులు మొక్కేరు ॥చిత్తా॥

దేవ సీతాసమేత ధీర లోకనాయక
భావించ నవధరించు పొజువేళ
పావని యల్లవాడె భల్లూకపతి వీడె
సేవించీని భరతుని జేకొను శత్రుఘ్నుని ॥చిత్తా॥





శ్రీమదయోధ్యావిహార శ్రీవేంకట నివాస
సామజ వాజి రథాల సందడి వేళ
సౌమిత్రి యీవంక విభీషణుడు నావలి వంక
నీ మహిమ లెల్లా మెచ్చి నీకు విన్నవించేరు ॥చిత్తా॥

**భావామృతం :**

ఓ జియ్యా! (దైవమా!) చిత్తా అవధారు (మా మనవి ఆలకింపుము). పరాకెచ్చరిక (ఏ మాత్రమూ తొట్రుపడక సావధానముగా విన్నపములను వినుము). అదె (అదిగో) రాజరాజులు (రాజులకే రాజులైనవారు), హత్తి కానుకలిచ్చేరు (నిన్ను సమీపించి బహుమతులనిస్తున్నారు) స్వీకరించి అనుగ్రహింపుము తండ్రీ!

ఓ శ్రీరామచంద్రా! రఘుకుల వీరుడవైన రాజీవలోచనా! (పద్మనయనా!), మృదువైన నల్లని శరీరవర్ణముగల నీవు కొలువుదీరియున్నవేళ ఆ దృశ్యం ఎంత కన్నులపండువుగా వున్నది!! అదిగో ఆ మునీంద్రులు, వామదేవుడు మొదలైనవారు నిన్ను ఆశీర్వదిస్తున్నారు. అనంతమైన కపిసేనని తన సుగ్రీవాజ్ఞచే కట్టుదిట్టంచేయగల వానర రాజు సుగ్రీవుడు మొదలైన వానరవీరులు వేమారు నీకు మ్రొక్కేరు. (మళ్ళీ మళ్ళీ నీకు నమస్కరించుచున్నారు).

సీతా సమేతుడవైన ఓ దేవా! లోకనాయకుడవైన నీవు ధీరుడవు. పొజువేళ (అందరూ బారులుదీరి వున్నవేళ) భావించి అవధరింపుము. (మేము వేరే చెప్పవలసిన అవసరంలేకుండానే.. మా మనోగత భావాలను గ్రహింపుము) నీ బహిఃప్రాణమైన హనుమంతుడు అదిగో, ఈ వైపున వున్నాడు. భల్లూకరాజు జాంబవంతుడు ఆ వైపున నున్నాడు. భరత శత్రుఘ్నులు పూని నిన్ను సేవించుచున్నారు.

మహాఅయోధ్యానగరాధిపతివైన శ్రీరామచంద్రా! తిరుమలాధీశుడవైన శ్రీవేంకటేశ్వరుడవూ నీవే. నీ గజ, అశ్వ రథ సేనలు కోలాహలము చేయుచున్నవి. ఇటువైపు లక్ష్మణస్వామి నిలుచుని వున్నాడు. అటువైపున రాక్షసరాజు విభీషణుడు నీ శరణాగతుడై వినయంగా నిలిచియున్నాడు. 'ఓ ప్రభూ! వీరంతా నీ మహిమలను ప్రస్తుతించుచూ నీకు విన్నపములను చేయుచున్నారు. (ఓ శ్రీరామచంద్రా! తారకరాముడవై, నన్నును తరింపజేయుము తండ్రీ!).

## మున్నుడి 5-10

కరుణారసాత్మకమైన అన్నమాచార్యులవారి కీర్తన నాస్వాదించండి. మనకు పుట్టిన పిల్లలలో ఎవడో ఒకడు పిచ్చివాడయితే వాణ్ణివదలివేస్తామా, ఇంకా ఎక్కువ జాగ్రత్త వహించి కాపాడుకొంటాము కదా! నీ బిడ్డను, నేను శరణార్థిని, పిచ్చోడిని నన్ను విడవటం న్యాయం కాదంటున్నారు.

**సీ॥ విడువరాదెంతైన వెట్టివాడను నేను**
**కడవార నవ్వక కావుమయ్య**
**జ్ఞానము నెఱుగ నజ్ఞానంబు నెఱుగను**
**మానను విషయాల మఱగినాను**
**నీ నామము నొడిగి నీ దాసుడనుకొంటి**
**దీనికే దయబూని దిద్దుకొమ్ము**
**ఎఱుగ నకర్మము ఎఱుగ సుకర్మము**
**పాట్లు సంసారాన మాననైతి**

**ఆ.వె॥ 'కాన'ముందు, వెనుక 'కాన' విచారించి**
**దేహధారినైతి అహము వీడ**
**మ్రొక్కువాడ నీకు దిక్కు వేంకటనాథ**
**అసలు వీడకనెను అన్నమయ్య.**

**రాగం : విటపి**

విడువరాదెంతైనా వెట్టివాడనైన నీకు
కడువారు నవ్వకుండా కాచుకో నన్నును ॥విడువ॥

జ్ఞానము నేనెఱుగ నజ్ఞానము నేనెఱుగను
మానను విషయములు మరిగి ఎంతైనా
నీనామము నొడిగి నీదాసుడ ననుకొందు
దీనికే వహించుకొని దిద్దుకో నన్నును ॥విడువ





అకర్మము నెఱగను సుకర్మము నెఱగను
ప్రకట సంసారముపై పాటు మానను
వొక పనివాడనై వూనిముద్రధారినైతి
మొకమాడి యిందుకే గోమున నేలు నన్నును ॥విడువ॥

వెనకగానను ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మ్రొక్కేను
ఘనుడ శ్రీవేంకటేశ కన్నులెదుట బడితి
కని పో విడువరాదు కరుణించు నన్నును ॥విడువ॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నేను వెట్టివాడనయ్యా! అలాగని నన్ను వదలివేయుట ఎంతైనా తగని పనియే. నా వెట్టి పనులకి కడువారా (మనసారా) నవ్వకో. కాని నన్నును (నన్నుకూడా) కాచుకో (రక్షించు). ఎందుకంటే నాకింకో దిక్కులేదు.

నేను జ్ఞానినా అంటేకాదు. అజ్ఞానమంటే యేమిటో కూడ తెలియదు. విషయ వాంఛ (సంగత్వము) లను బాగా మరిగి వాటిని వదలలేకుండా వున్నాను. నీ నామమును ఒడిసి పట్టుకొనినట్టి నీ దాసుడను అనుకొని జీవిస్తాను. దీనికే నన్ను భరించి నా తప్పులనన్నింటిని దిద్దుకో. ఏదోలాగున నన్ను కనికరించు.

ఓ దేవా! అకర్మము అంటే నేనెరగను. సుకర్మము అంటే కూడా తెలియదు నాకు. బహిర్గతమైన ఈ మాయా సంసారంలో పడరాని పాట్లు పడుతూనే వుంటాను కాని ఈ 'యావ' వదిలించుకోలేకుండా వున్నాను. ఒక పనివాడనై (భృత్యుడనై) దీక్ష తీసికొని వైష్ణవ ముద్ర ధరించిన నీ భృత్యుడనయ్యాను. ఇందుకే గోమున (అలవోకగా) నన్నును, మొకమూడి (దయదలచి) ఏలుకో ప్రభూ!

ప్రభూ! వెనుక గానను (నా గత జన్మగురించి నాకు తెలియదు)... ముందు విచారించుకొనను (రాబోవు జన్మలో యేమి కానున్నదో ఎరుగను). నేను నిండుగా దేహమును ధరించిన మానవమాత్రుడను. అట్లే నీకు మ్రొక్కుచున్నాను. ఘనుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీకంటబడ్డాను. నన్నుచూచి, పోవిడువరాదు (పోనియ్యరాదు). నన్నును కరుణించాలి తండ్రీ!

## మున్నుడి 5-11

అత్యద్భుతమైన కీర్తన అన్నమాచార్యులవారు హనుమంతునిపై చెబుతున్నారు ఆలకించండి. నల్లని శరీర ఛాయగల పవనపుత్రునితో ఓ హనుమా! రాముని దీవెనచేత ఈ లోకాలను పరిపాలించవయ్యా! నీవే మాకు రక్ష అంటున్నారు. మంగాంబుధిలో వెలసిన వాయునందనుడు రకరకాలైన దేవతలచేత సర్వ అవయవములకు రక్ష కల్పించుకొనినాడు. అన్నమయ్య హనుమ అంగాంగములకు యెవ్వరెవ్వరు రక్ష కల్పించుచున్నారో వివరించుచున్నారు. "నాలుక కుర్వర రక్ష" అంటే ఏమిటి? చదవండి.. మరి.

**కం॥ మంగాంబుధి హనుమయ్యకు**
**చెంగట శ్రీరామరక్ష శ్రీగిరివరుడే**
**అంగాంగములకు రక్షలు**
**అంగపు సురలెల్ల అన్నమార్యుడు తెలిపెన్.**

**అంగపు = అందమైన**

**రాగం : శంకరాభరణం**

ఏలవయ్యలోకమెల్ల యిట్టె రాముదీవెనచే
నీలవర్ణ హనుమంత నీవె మాకు రక్ష ॥ఏల॥

మొదలనింద్రుడు నీ మోమున కెల్లారక్ష
యిదెనీ శిరసునకు ఇనుడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకలురక్ష
చెదరని నీమేనికెల్ల శ్రీరామరక్ష ॥ఏల॥

పిరుదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడుడు నీకరయుగముల రక్ష
గరిమ నీ కుక్షికి కరివరదుడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీరామ రక్ష ॥ఏల॥

వడి నీపాదములకు వాయుదేవుడు రక్ష
తొడలకు వరుణుడు తొడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామ రక్ష ॥ఏల॥





నలువ నీగళరక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీ సందులకు హరుడు రక్ష
పలు నీ రోమములకు బహు దేవతలు రక్ష
చెలగు నీ చేతలకు శ్రీరామ రక్ష ॥ఏల॥

అంగపు నీ తేజమున కగ్నిదేవుడు రక్ష
శృంగారమునకెల్లా శ్రీసతి రక్ష
మంగాంబుధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష ॥ఏల॥

**భావామృతం :**

నీలవర్ణుడవైన (నల్లని) హనుమంతా! ఈ లోకముల నన్నింటినీ ఏలవయ్యా! శ్రీరాముని దీవెన నీకు ఎప్పుడూ వుంటుంది గావున నీవే మా అందరికీ రక్షకుడవు.

మొట్టమొదటగా ఇంద్రుని ఆశీర్వాదముచేత నీ ముఖమునకంతా రక్షకలుగు గాక! సూర్యునిచేత నీతలకు రక్ష కలుగుగాక! నవగ్రహములు మరియు అసంఖ్యాకమైన నక్షత్రములచేత నీ కన్నులకు రక్ష కలుగుగాక! చలించని నీ శరీరానికెల్లా శ్రీరామరక్ష కలుగుగాక!

పిరుద (వెనుకనున్న) తోకకు బెడిదపు రక్ష కలుగుగాక! గరుత్మంతునివలన నీ కరములకు రక్ష కలుగుగాక! నీ వుదరమునకు గజేంద్రరక్షకుడైన శ్రీహరి రక్ష కలుగుగాక! వైభవోపేతమైన నీమహిమకు శ్రీరాముని రక్ష కలుగుగాక!

ఓ హనుమా! వేగముగల నీ పాదములకు వాయుదేవుని రక్ష కలుగుగాక! నీ తొడకు వరుణదేవుని రక్ష కలుగుగాక! ఎన్నడూ నిన్ను వీడని నీ మేధస్సుకు వేదరాశియొక్క రక్ష కలుగుగాక! చిరంజీవివైన నీ ఆయువుకు శ్రీరామరక్ష కలుగుగాక!

నీ గళమునకు (కంఠమునకు) బ్రహ్మదేవుని రక్ష కలుగుగాక! నీ నాలుకకు ఉర్వర రక్ష (పచ్చగా పండిన నేలయొక్క రక్ష) కలుగుగాక! నీ కళ్ళకు యెముకలకు శివుని రక్ష కలుగుగాక! అసంఖ్యాకమైన నీ వెంట్రుకలకు సమస్త దేవతల రక్ష కలుగుగాక! అతిశయించిన నీ చేతులకు శ్రీరామరక్ష కలుగుగాక!

ఓ మారుతీ! నీ దేహకాంతికి అగ్నిదేవుని రక్ష కలుగు గాక! నీ మనోజ్ఞతకు శ్రీదేవియొక్క రక్ష కలుగుగాక! మంగాంబుధిలో నెలకొనిన ఓ హనుమంతుడా! నీకు ఏకాలమునందైనా, చెంగటనే (సమీపముననే) వున్న శ్రీవేంకటాద్రి నిలయుడైన శ్రీరామరక్ష (వేంకటరాముని యొక్క రక్ష) కలుగుగాక!

5-12

## మున్నుడి

సంస్కృతభాషలో చెప్పిన హరినామ సంకీర్తన ఇది. ఇటువంటి మధుర కీర్తనలకు అన్నమాచార్యులవారు పెట్టింది పేరు. దేవదేవుని పొగడు ఈ కీర్తనలో వివరించటానికి ఏమీ వుండనిమాట నిజమే కాని, సంస్కృతం రాని సామాన్యులకు భగవన్నామంలోని అర్థం వివరిస్తే... భక్తి స్థిరపడుతుందని నా నమ్మకం. ఈ జన్మలో భక్తి అంటే యెరుగని వారికి కూడ గతజన్మ పుణ్యవిశేషాన అకారణంగానే ప్రేమ జూపి అనేకమైన ప్రియమైన వాటిని ఇచ్చేవాడట...ఈ ఒక్కమాటకే అంతులేని వివరణ వ్రాయవచ్చును.

**తే॥ కరుణ పెన్నిధియౌ గదాధరుని హరిని**
**శరణునర్థించ బ్రోచు వత్సలు భజింతు**
**అనెను గీర్వాణిలో మన అన్నమయ్య**
**తేనెలూరెడి కీర్తన దేవదేవ!**

**రాగం: కన్నడ గౌళ**

కరుణానిధిం గదాధరం
శరణాగత వత్సలం భజే ॥కరుణా॥

శుకవరదం కౌస్తుభాభరణం
అకారణప్రియ మనేక దం
సకల రక్షకం జయాధికం సే-
వకపాలక మేవం భజే ॥కరుణా॥

వురగ శయనం మహోజ్జ్వలం తం
గరుడా రూఢం కమనీయం
పరమపదేశం పరమం భవ్యం





హరిం దనుజభయదం భజే ॥కరుణా॥

లంకాహరణం లక్ష్మీ రమణం
పంకజ సంభవ భవప్రియం
వేంకటేశం వేదనిలయం శు-
భాంకం లోకమయం భజే ॥కరుణా॥

**భావామృతం:**

కరుణానిధియును, కౌమోదకి అను గదను ధరించినవాడను, తనను శరణు కోరిన వారిని యెట్టి పరిస్థితిలోను పదునాల్గు లోకాలలో యెక్కడ వున్నా వెళ్ళి రక్షించువాడును అయిన శ్రీమన్నారాయణుని భజించెదను.

ఆయన శుకమహర్షికి భాగవతమును బోధించు వరమునను(గహించినాడు. జీవుల భాగ్యఫలముగా అనేకమైన ప్రియముల నొసగువాడు. సర్వులను రక్షించువాడు. అధికముగా విజయముల నొసగువాడు. తనను సేవించు వారిని పరిపాలించు ప్రభువు ఆ శ్రీహరియే. నేను అటువంటి దేవదేవుని మాత్రమే భజించెదను గాక!

శ్రీహరి ఆదిశేషుడను నాగేంద్రుని పాన్పుగా క్షీరసాగరమున పవళించి యుంటాడు. దేదీప్యమైన తేజస్సుతో ప్రజ్వరిల్లుతుంటాడు. ఆయన యెక్కడికి పోవాలన్నా గరుత్మంతునిపై పోతుంటాడు. ఆయన "కమనీయం" (మనోహరము) గా వుంటాడు. ఆయన పరమ్ అపదేశం (మోక్షమునకు స్థానమై యున్నాడు). మోక్షమును అనుగ్రహించునదీ ఆయనయే. అసురులకు భయంకరుడైన ఆ శ్రీహరిని భజించెదను గాక!

శ్రీమన్నారాయణుడు రామావతారమున లంకను హరించినాడు. ఆయన లక్ష్మీపతి. పద్మమున బుట్టిన బ్రహ్మదేవునిచేతను, భవుడైన (శుభంకరుడైన) శంకరుని చేతను కీర్తించబడెడి వాడే శ్రీహరి. శ్రీవేంకటేశ్వరుడైన ఆ మహానుభావుడు వేదనిలయుడు, శుభప్రదమైన అనేక చిహ్నాములు కలిగినవాడు, సమస్త లోకములు తనలో నిండిన వాడు. అట్టి తిరుమలాధీశుని భజించెదనుగాక!

**5-13**

## మున్నుడి

అహోబల నరసింహ స్వామి సేవలో అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యులవారు చెప్పిన మధురాతి మధురమైన కీర్తన ఇది. "నిర్మలుడవైన నరసింహా! నీకువేదములే నివాస స్థానములు. సంగీతనాదము అంటే మక్కువగల నీవు సకలలోకేశ్వరుడవు. అట్టి నీకు నమోవాకములు" అంటున్నారు. గోవిందుడైన ఈయన గుణాగుణ రహితుడట. నీ రూపానికి పరిమితి చెప్పలేం కాబట్టి త్రివిక్రమాకృతిలో విజృంభించుచున్నావు అంటున్నారు. తన తండ్రి అన్నమయ్య వలెనే, వేంకటగిరి వాసుడే అహోబల అర్చావతారం అని నమ్మిన వాడీ పెద తిరుమల. సర్వమునీవే... అంటున్నారు.

**కం॥ వేదములే నీవాసము**
**నాదప్రియ! సకల లోకనాథ! నమస్తే**
**ఆదరముగ నరసింహుని**
**పాదుగ పెదతిరుమలయ్య పనివడి కొలిచెన్**

**పాదుగ = నిలకడగా**

**రాగం : మధ్యమావతి**

వేదములే నీనివాసమట విమలనారసింహ
నాదప్రియా సకలలోకపతి నమో నమో నరసింహా ॥వేద॥

ఘోరపాతక నిరుహరణ కుటిలదైత్యదమన
నారాయణ రమాధి నాయక నగధర నరసింహా
నీరూపము ఇంత అంతయని నిజము తెలియరాదు
ఈరీతి త్రివిక్రమాకృతి నేచితి నరసింహా ॥వేద॥





గోవింద గుణాగుణ రహిత కోటి సూర్యతేజ
శ్రీవల్లభ పురాణ పురుష శిఖనఖ నరసింహ
దేవా మిము బ్రహ్మాదులకును తెలియనలవి కాదు
భావించగ ప్రహ్లాదు నెదుట పరగితి నరసింహా ॥వేద॥

దాసపరికర సులభ తపన చంద్రనేత్ర
వాసవ సురముఖ మునిసేవిత వందిత నరసింహా
భాసురముగ శ్రీవేంకటగిరిని పాయని దైవమ వటుగాన
ఓసరకిపుడు ఏగితి విట్ల అహోబల నరసింహా ॥వేద॥

**భావామృతం :**

నిర్మలుడవైన ఓ అహోబల నరసింహా! నీ నివాస స్థానములు వేదములే. నీవు సంగీతనాదమున ఎక్కువ ప్రీతి కలిగినవాడవు. సకలలోకాలకు భర్తవు. అట్టి నీకు నా నమోవాకములు.

ఓ ప్రభూ! నీవు ఘోరమైన పాపములను రూపుమాపెదవు. నీవు దుర్బుద్ధినున్న రాక్షసాంతకుడవు, నారాయణుడవు, లక్ష్మీపతివి, గోవర్ధనధరుడవు. ఆనాటి నీ త్రివిక్రమ రూపానికి ఆద్యంతములు లేవు. అట్లు విజృంభించితివి (ఏచితివి) కనుక నీ నిజమైన రూపము తెలియనసాధ్యముగా నున్నది.

ఓ దేవా! నీవే గోవిందుడవు. నీవు గుణాగుణరహితుడవు. (గుణము, అగుణము రెండూ నీకు లేవు). నీ తేజస్సు కోటి సూర్యులకు మించినది. నీవు శ్రీదేవికి వల్లభుడవు (భర్తవు). నీవు పురాణపురుషుడవు. (అనాది పురుషుడవు). శిరస్సున కేశపాశము, వ్రేళ్ళకు వాడిగల గోళ్ళున్నవాడవు. స్వామీ! మీరేమిటో బ్రహ్మాది దేవతలకే అంతుపట్టదు. నీ భక్తుడైన ప్రహ్లాదుడొక్కడే నిన్ను భావించగలిగాడు. ఎందుకంటే నీవు వానికి ప్రసన్నుడవై వాని ఎదుట నిలిచితివి కదా! అట్టి నరసింహా! నీకు వందనములు.

ఓ దాసపరికర సులభ! (దాసుల సమూహములకు సులభంగా లభించువాడవు అయిన దేవా!) నీవు తపన చంద్ర నేత్రుడవు (సూర్యచంద్రులు నేత్రములుగా గలవాడవు). ఇంద్రాది సురప్రముఖులు, మునీశ్వరులు అర్చించి సేవించెడివాడవు. వెలుగొందుతూ ఎన్నడూ శ్రీవేంకటాద్రిని వదలని దైవానివి. అందుచేత నీవే వోసరక (తొలగిపోకుండా), ఇప్పుడు ఏగితివిట్ల (ఇట్లు ఊరేగుచున్నావు).

**5-14**

## మున్నుడి

చక్కటి తత్త్వ బోధన చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఒక ధనికుని ఆశ్రయించి బ్రతికితే తిండికి, బట్టకు లోటు వుండకపోవచ్చును, కాని ఆ కొలువు క్షణభంగురమే. వానికి కోపం వచ్చినా... ఈ బంటు పని సరిగా లేకపోయినా ఆ బంటు జీవితం హుళక్కియే. శ్రీకాంతుని సేవకుల కొలిస్తే, కీటకం తుమ్మెదగా మారినట్లు వాడే కులంవాడైనా అధికుడే అవుతాడు. ఒకరాజుగారి ఆజ్ఞ వాని కొలువులో వాళ్ళే పాటిస్తారు. ఏదేశం నాణాలు ఆదేశంలోనే చెల్లుతాయి. కానీ శ్రీపతి ముద్రలు ధరిస్తే వారికి చెల్లకపోవటమంటూ వుంటుందా?

**చం॥ పరులను గొల్చి జీవితము బంగరు పంటగ చేయుకంటె ఆ**
**సిరివరుదాసులై బ్రతికి చేకొనుటంతములేని భాగ్యముల్**
**వరమగు జన్మధన్యమగు ప్రాప్తిలు మోక్షము అన్నమయ్యనెన్**
**ధర వారులెవ్వరైన ఇటు ధర్మము నేర్పిరె వేంకటేశ్వరా!!**

**రాగం : బేగడ**

పరుల సేవలు చేసి బ్రతికేరటా
సిరివరు దాసులు సిరులందు టరుదా ॥పరుల॥

కోరివొక నరుని గొలిచిన వారలు
ధీరులై సలిగెల దిరిగేరట
కూరిమి బ్రహ్మాండ కోటులేలెడివాని-
వారలింతట జనవరులౌ టరుదా ॥పరుల॥

చేకొన్న తుమ్మిద చేపడ్డ కీటము-
లాకడు తుమ్మిదలయ్యీనటు
శ్రీకాంతుని పాదసేవకులగు వార-
లేకులజులయినా నెక్కుడౌ టరుదా ॥పరుల॥





ధరణీశునాజ్ఞల తమదేశములందు
సిరుల నాణెపు ముద్ర చెల్లీనట
తిరువేంకటాద్రి శ్రీదేవుని ముద్రలు
ధరియింపగా నింతట చెల్లుటరుదా ॥పరుల॥

## భావామృతం

అయ్యో!! ఏమిటీ విపరీతం? ఈ మానవులు ఇతరులను సేవించి బ్రతుకుతున్నారుట. శ్రీపతి దాసులైన వారికి 'సిరి' కొరత వుండదట.

కోరికలు దీరుటకు పరులను గొలిచెడివారు ధైర్యంగా ఆశ్రయిస్తూ తిరుగగలుగుతున్నారు. అటువంటప్పుడు కోట్లాది బ్రహ్మాండములను యేలెడి వానియొక్క జనులు, సర్వశ్రేష్ఠులవటం అరుదా? ఎన్నటికీ కాదు. వారు ఎప్పుడూ సర్వశ్రేష్టులే.

శ్రీహరి దాసులయితే ఇంకొక మంచి జరుగుతుంది. కీటకములు తుమ్మెదల ననుకరించి, పూలచుట్టూ భ్రమించి... భ్రమించి చివరికి భ్రమరములు, అనగా తుమ్మెదలయిపోతాయి. అదేవిధంగా శ్రీకాంతుని పాదసేవకులతో, జీవితం గడిపేవారు ఏ కులమున జన్మించిన వారలైనా, సర్వాధికులు కాకపోవటం అంటూ వుంటుందా? యెన్నటికీ వుండదు.

అంతెందుకు, ఇది అందరికీ తెలిసిన విషయమే కదా! ఒకరాజుగారి ఆజ్ఞలు వానిదేశంలో పాటించబడతాయి. ఏ దేశంలో ముద్రించబడిన నాణెములు ఆ దేశంలో మాత్రమే చెలామణి అవుతాయి. కాని తిరువేంకటాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని ముద్రలు ధరించినవారికి ఇంతటా... (ఈ సృష్టిలో) చెల్లుబడికాకపోవటం అంటూ వుంటుందా? ఒక్కనాటికీ వుండదు.

**5-15**

## మున్నుడి

ఓ తిరుమల నాయకా! నీవీ అలమేల్మంగను యెంత మన్నించావయ్యా! ఇప్పుడామె నీపై అంతకంతకు మించిన ప్రేమపారవశ్యంలో మునిగిపోతున్నది... అంటున్నారు. అన్నమాచార్యులవారు. తనని రంజింపచేసి అలసిన జవరాలికి జగన్నాథుడు సైతం సేదతీర్చి 'సేవలు' చేసి పరవశింపచేశాడట. ఆ పరవశానందమే బ్రహ్మజ్ఞానులు తహతహలాడే బ్రహ్మానందం. స్వామిచేత సేవలు చేయించుకొన్న జగన్మాత ఆయన వలపు తలచుకొని మరీ మరీ భరించలేని తాపవశురాలవుతున్నదట. అన్నమయ్య 'కత్తి' యే సుమా!

**కం॥ ఎంతగ మన్నించితివీ**
**ఇంతినిదే నీవు తిరుమలేశా! వినుమా**
**ఎంతో ప్రేమల నలరెను**
**అంతకునంతకును మించి అన్నయ్యనెబో**

**రాగం : సుమనేశ రంజని**

ఎంత మన్నించితో యీ యింతినిదే నీవు
అంతకంతకు ప్రేమ నలరీ నిపుదు ॥ఎంత॥

పడతి నాట్య శ్రాంతి బవళించి తొల్లి నీ-
తొడలపై నీవు తలదువ్వగాను
కడలేని యటువంటి కళలుదలచే కదా
విడువని వియోగమున వేగీనిపుదు ॥ఎంత॥

ఒన రగుచ భారమున నొరగి యీమలుగలపై
నెనసి నీ వాకు మడిచియ్యగాను
పడతి నేడటువంటి వలపు దలచేకదా
ఘనమైన తాపమున కాగీనిపుదు ॥ఎంత॥





సిరులు(ల) నీ మోముపై జెక్కులొయ్యన జేర్చి
యరమోడ్చి కనురెప్పలలమి యలమి
తిరువేంకటాచలాధిపుడ నిను గూడియే
పరవశానంద సంపద తేలెనిపుదు ॥ఎంత॥

## భావామృతం

ఓ ప్రభూ! ఈ దేవిని యెంత మన్నించితివయ్యా! నీపై ఆమెకు అంతకంతకు ప్రేమపెరిగిపోతున్నది. ఇప్పుడామె నీ అనురాగం తలచి తలచి తపించి పోవుచున్నది. నీ ప్రేమలో తలమునకలవుతున్నది.

తొల్లితానుచేసిన నాట్యమువలన ఆమె అలిసిపోయి విశ్రాంతికోసం నీ తొడపై బవ్వళించినది. నీవు కరుణతో ఆమె తల ప్రేమగా దువ్వినావు. అటువంటి అనంతమైన నీ శృంగార కళలను తలచిన కొలది ఇప్పుడామె విరహాగ్నిలో వేగిపోవుచున్నది.

స్వామీ! స్వకుచ భారంబున ఈమె 'అలుగలపై నెగసిన' (నలిగిపోతుంటే) శ్రమదీరుటకు తమలపాకు మడిచి స్వయంగా ఆమె నోటికందించినావు. అటువంటి నీ వలపును తలచి తలచి నేడామె గొప్పతాపమున కాగిపోవుచున్నది. ఇప్పుడామె బాధ వర్ణనాతీతము.

సిరులొలుకు నీ ముఖముపై తన చెక్కిళ్ళను ఒయ్యన (మెల్లగ) ఆనించి, అరమోడ్చిన కనురెప్పలను అలమి అలమి (అదిమి అదిమి) ఆ తల్లి పరవశించినది. తిరుమలాధీశుడవైన శ్రీవేంకటేశ్వరా! నీ కలయిక కలిగించిన పరవశానంద కందళిత హృదయారవిందయై ఆమె బ్రహ్మానందమును పొందిన ఇందిరయైనది. ఎంత మన్నించితివయ్యా!

## 5-16

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని రథోత్సవాన్ని కన్నులపండువగా వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనకి ప్రతిపదార్థం చెప్పగల పాండిత్యము నాకులేదు. పైగా కొండొకచో అచ్చు పొరబాట్లు కూడా వుండివుండవచ్చు. ఏది ఏమయినా, ఇందిర ఇందీవరశ్యాముల రథం వెంట పోవటం కంటే వైభవం మరొకటుంటుందా? సందడిచేయు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. దిక్కుల్ని సాధించిన దేవదేవునే దిక్కని మ్రొక్కండి. స్వామి రథంవెంట నడిచి తరించండి. ఎందుకంటే... ఇది మామూలు రథం కాదు. ఎట్లాంటిదో-చదవండి.

**ఆ.వె॥ ఇట్టివరములిత్తు రిందిరయును హరి**
**అన్నమయ్యపాడె నద్భుతముగ**
**సందడించెదిశలు సాధించెనని బల్కె**
**హరి రథంబు బారె అరయుడనెను**

**రాగం : దేశాళం**

ఇందిరయు దానుగూడి యిట్టివరాలొసగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీ నిదివో ॥ఇందిరయు॥

వేదములే గుఱ్ఱములు విష్ణుని రథమునకు
వాదపు శాస్త్రములే తీవుపు పగ్గాలు
పాదగు పంచభూతాలే పరగు బండికండ్లు
ఆడిగొని మనోవీధులందు నేగీ నిదివో ॥ఇందిరయు॥

జీవులెల్లా సారథులు శ్రీ విభుని తేరునకు
కావించు నెజ్జిలు పడిగల గుంపులు
భావించ దన ప్రకృతి పట్టపు సింహాసనము
వేవేలు సంపదలతో వెలసీ నే డిదివో ॥ఇందిరయు॥





చందురుడు రవియును సరుస బైడి కుండలు
చెందిన పుణ్యములెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశు డలమేలు మంగ దాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో ॥ఇందిరయు॥

## భావామృతం

ఓ ప్రజలారా! శ్రీవేంకటేశ్వరుని దివ్యరథము తిరువీధులలో యేగుచున్నది. ఆ రథములో ఇందిరాదేవితో వూరేగుచున్న శ్రీకాంతుడు తాను ఆమెతోగూడి ఇట్టే వరముల నిస్తున్నాడు. జనం గుంపులు గుంపులుగా ఆ వరాలకోసం యెగబడుతున్నారు. దిక్కులన్నీ సందడిగా వున్నాయి. ఆ దేవదేవుడు దిక్కులన్నీ సాధించినవాడు కావున దిక్కులు నిండేట్లు జనం వచ్చారు ఇదిగో...

ఈ విష్ణుమూర్తి రథానికి నాలుగు వేదములు నాలుగు గుఱ్ఱముల రూపములో నున్నవి. తర్కము మొదలై ఆరు శాస్త్రములే ఈ రథమును గుంజుటకుపయోగించిన త్రాళ్ళు. పంచభూతములని పిలువబడే భూమి, ఆకాశము, నీరు, తేజస్సు, గాలి - ఈ రథములో బండికండ్లు (నిలువుగా, అడ్డముగా వేసిన దూలములు. నడిపించుకొని పోవుచున్న ఈ రథము భక్తుల మనోవీధులగుండా ప్రయాణించుచున్నది. అదిగో తరించండి.

ఈ శ్రీరమణుని రథములో సమస్త జీవకోటీ సారథులే. ఆ జీవులు చేయు యజ్ఞ యాగములు రథములో అంచెలవలె కట్టిన మెట్లు. ప్రకృతియే ఈ దేవదేవుని రథమున అమర్చబడిన సింహాసనము. అనంతమైన సంపదలతో నేడు ఈ స్వామి రథముపై ఇదే వెలసియున్నాడు. చూచి తరించండి.

ఈ రథములోని బంగారు కుండలు (బిందెలు) స్వయంగా ఆ సూర్యచంద్రులే అనిపిస్తున్నది. ఈ రథములోని అలంకరణలన్నీ జీవులు చేసికొన్న సమస్త పుణ్యములు. అందమైన శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగ జంట, కందువల మెరయుచు (సామర్థ్యముతో ప్రకాశించుచూ) ఇదిగో... మనలనందరినీ కరుణిస్తున్నారు. మీరూ ఈ రథోత్సవంలో పాల్గొని తరించండి.

5-17

## మున్నుడి

పాలసంద్రమున పవ్వళించిన శేషతల్పశాయిని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. క్షీరసాగర శయనుడవై బాయని (మమ్మల్ని విడువని), నీల మేఘశ్యాముడవైన శ్రీమన్నారాయణుడవు, యిపుడు (ఈవేళ) మా యెదుట వున్నది నీవా? (నీవేనా?) అంటున్నారు. అరవిరి మోమున నల్లన నవ్వెడి నిరతమూర్తి నీవేనా అంటున్నారు. అంటే.. సగము విరిసిన మొగ్గవంటి ముఖమున లేత నవ్వులు ప్రదర్శించుచూ మిక్కిలి ఆసక్తి కలిగించు మూర్తి, అని అర్థం. తెలుగు తేలిక అన్న తెలివి తక్కువ తెల్లముఖం ఎవడో తెలుసుకోవాలనుంది నాకు...

**ఉ॥ పాలసముద్ర మందెపుడు పాన్పుగ శేషని జేసికొన్న ఆ**
**నీలిమవర్ణుడౌ హరియు నీవట, దివ్యమునీంద్రవందితా!**
**భూలలనామణిన్ సిరిని పొందుగ కూడిన వేంకటేశ్వరా!**
**మేలుగ అన్నమయ్య తను మించిన ప్రజ్ఞతొ జెప్పెకీర్తనన్**

**రాగం : షణ్ముఖప్రియ**

పాలజలనిధిలో బాయని
నీలివర్ణుడవట నీవా యిపుడు ॥పాల॥

వెదచల్లు మణుల వేయి పడగలను
చెదరని మెరుగుల శేషునిపై
మృదువు బరపుగా మెల్లనె పొరలుచు
నిదుర వోదువట నీవా యిపుడు ॥పాల॥

పరమ మునీంద్రులు పద్మభవాదులు
ఇరువంకల నుతియించగను
అరవిరి మోమున నల్లన నవ్వెడి
నిరత (తి) మూర్తివట నీవా యిపుడు ॥పాల॥





పగటున సిరియును పరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకగను
తగు వేంకటగిరి దనరుచు జెలగెడి
నిగమమూర్తివట నీవా యిపుడు ॥పాల॥

**భావామృతం :**

విడువక పాలసముద్రమున నున్న నీలమేఘశ్యాముడవైన శ్రీమన్నారాయణుడవు నీవేనా ప్రభూ! ఇప్పుడు (నిన్ను కీర్తించెదను).

నీవు ఆదిశేషునిపై పవ్వళించినపుడు, వేయి పడగలు గల ఆ శేషుని పడగలపైనున్న దివ్యమణులు చెదిరిపోని కాంతులను వెదజల్ల సాగినవి. మెత్తని పరపువలెనున్న ఆదిశేషునిపై మెల్లగా పొర్లుచు నిదురకుపక్రమించు వాడవు నీవేనా ప్రభూ! ఇప్పుడు (నిన్ను సన్నుతించెదను).

పరమయోగీశ్వరులు, మునీంద్రులు, బ్రహ్మాది దేవతలు నీవు నిదుర మేలుకొనునప్పుడు నీకు అటూ, ఇటూ నిలుచుని నిన్ను కీర్తించుచుందురు. సగము విరిసిన మొగ్గవంటి ముఖమున లేత నవ్వులు ప్రదర్శించుచూ నిరతమూర్తివి (మిక్కిలి ఆసక్తి కలిగించుమూర్తి) వైన దేవదేవుడవు నీవేనా? ఇప్పుడు (నిన్ను ధ్యానించెదము).

ప్రభూ! పగటున (లావణ్యముతో) సిరియును (లక్ష్మీదేవియును) మరియు పరగిన (ప్రసిద్ధిజెందిన) ధరణియు (భూదేవియు)ను, బిగువుచు (గట్టిగ) నడుపులు పిసుకగ (నీ పాదములను ఒత్తుచుండగా) తగినట్టి వేంకటాద్రిపై శోభించుచున్న ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వేదములు సన్నుతించెడి వేదపురుషుడవు. ఇప్పుడు కరుణతో నాబోటి దీనులను కాపాడుచున్న మహానుభావుడవు నీవేనా? ధన్యులము తండ్రీ!

## 5-18

## మున్నుడి

అన్నమాచార్యులవారీ కీర్తనలో హరికర్పించనిదేదియైనా వ్యర్థమేనంటున్నారు. నేటి మన తెలుగు భాషలో ఆనాటి 'నుడికారం' లేదనిపిస్తున్నది. "అంతరంగమెల్ల శ్రీహరికి అర్పించకుంటే"... అని నేడు మనం అంటున్నాం. ఆనాడు అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే... అనేవారు. "భావించి తాదేవుడైతే ప్రత్యక్షమౌనా".. అంటే "దేవుడైతే ప్రత్యక్షం కాడా?" అని అర్థం చెప్పుకోకూడదు. శ్రీవేంకటేశ్వరుడే దేవుడని భావించి శరణంటే ప్రత్యక్షమవుతాడు కదా!... అని అర్థం.

**చం॥ అనిశము అంతరంగమును అర్పణజేయుచు మెప్పుపొందుచున్**
**మనమున నిల్వగా హరిని మాన్యతగల్గును, లేక వీడునా**
**మనుజుని వింతయౌ విధుల బంధములన్నియు 'పిప్పి' జేయురా**
**విను, ఫలముండబోదనెను విజ్ఞత దెల్పుచు అన్నమార్యుడున్**

**రాగం : హుసేని**

అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే
వింత వింత విధముల వీడునా బంధములు ॥అంత॥

మనుజుడై ఫలమేది మరి జ్ఞాని యౌదాక
తనువెత్తి ఫలమేది దయగలుగుదాక
ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాక
పనిమాలి ముదిసితే పాసెనా భవము ॥అంత॥

చదివియు ఫలమేది శాంతము కలుగుదాక
పెదవెత్తి ఫలమేమి ప్రియమాడు దాక
మది గల్గి ఫలమేది మాధవుదలచుదాక
యెదుట తాను రాజైతే ఏలెనా పరము ॥అంత॥





పావనుడై ఫలమేది భక్తి కలిగిన దాక
జీవించి ఫలమేది చింత దీరుదాక
వేవేల ఫలమేది వేంకటేశుగన్నదాక
భావించి తా దేవుడైతే ప్రత్యక్షమౌనా ॥అంత॥

**భావామృతం :**

మన అంతరంగమును (మనస్సును మరియు హృదయమును) శ్రీహరికి ఒప్పించకుంటే... (అర్పించకుంటే), వింత వింత విధముల (అనేకరకములైన వింత పద్ధతులలో పీడించు) బంధములు వీడునా? (అనుబంధాలు వదిలిపెడతాయా?)

జ్ఞానము కలిగేదాక మనిషిగా యెంతకాలం బ్రతికినా లాభమేముంది? దయకలిగి బ్రతుకకుంటే... తనువెత్తి (శరీరం పొంది) లాభమేమిటి? దానధర్మాలు చేయనివాడు యెంత ధనవంతుడైతే వుపయోగమేమి? "పనిమాలి ముదిసితే పాసెనా భవము" (వ్యర్థంగా వయసొచ్చినంతమాత్రాన సంసారపు యావ నశిస్తుందా?) ఏనాటికీ నశించదు.

శాంతగుణము కలిగి ప్రశాంత చిత్తుడు కానివాడు ఎంత చదివిన వాడైనా వ్యర్థుడే కదా! మధురంగా మాట్లాడలేనివాడు పెదవి విప్పకుండా వుంటే నయంకదా! మాధవుని మనస్సులో ప్రతిష్ఠించుకోలేని వానికి మనస్సు వుండి మాత్రం ప్రయోజనమేమిటి? "యెదుట తాను రాజైతే యేలెనా పరము?" (జీవిత కాలంలో ఒకదేశానికి రాజైనంతమాత్రాన పరము (మోక్షమును) సాధించగలడా?) ఎన్నటికీ సాధించలేడు.

భక్తిలేనివాడు ఎంత పవిత్రంగా వుండీ ప్రయోజనముంటుందా? అనుక్షణం ప్రతిదానికీ చింతిస్తూ జీవించేవాడి దుఃఖం కాలిబూడిదయినాపోదు (చితిలోకి పోయినా చింతపోదు). శ్రీవేంకటేశ్వరుని చూసేదాకా దేనివలనా ప్రయోజనంలేదు. దానికి ఒక్కటే బహుతేలికి మార్గమున్నది... స్వామిని భావనలో నిలిపి "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ"... అని భావించితే ప్రత్యక్షం కాకుండా వుంటాడా? ఎన్నటికీ వుండడు.

## 5-19

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తనకొక ప్రత్యేకత వున్నది. ఇది ఏడుకొండలవానిని సన్నుతించే కీర్తన కాదు. బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా జరుపుటకు వచ్చిన బ్రహ్మాదిదేవతలను పేరు పేరునా పిలిచి శ్రీవేంకటేశ్వరుడు ఈ ఉత్సవాలలో మీరంతా బాగా అలసిపోయారు. నాకు చాలా ఆనందం కలిగించారు. ఇక మీరంతా వెళ్ళి వచ్చే యేడాది ఉత్సవాలకు ఉత్సాహంగా రండి. ఎక్కువ దూరం పోకండి. ఇట్టే తిరిగి మళ్ళీ వేంకటాద్రికి రండి. దిక్పాలులారా! నారదాది మునులారా! బ్రాహ్మణోత్తములారా! దేశ పరిపాలకులారా! నన్ను సేవించుకోవటానికి వచ్చే ఏడాది తిరిగిరండి... అంటున్నాడు శ్రీనివాసుడు... భలే.

**ఆ.వె.॥ పోయిరండు మీరు భోగీంద్ర వరులార!**
**మరలిరండు మీరు 'మరుసటేడు'**
**పేరు పేరు జెప్పి పిలిచెను అన్నయ్య**
**సురుల, మునుల, వసుధసురులనెల్ల.**

**రాగం : ఆనందభైరవి**

భోగీంద్రులను మీరు పోయిరండు
వేగన మీదటి విభవాలకు ॥భోగీంద్ర॥

హరుడ పోయిరా అజుడ నీవును పోయి
తిరిగిరా మీదటి తిరుణాళ్ళకు
సురులు మునులును భూసురలు పోయిరండు
అరవి(ము)రి నిన్నాళ్ళు బడతిరి ॥భోగీంద్రు॥

జముడ పోయిరా శశియు నీవును పోయి
సుముఖుడవై రా సురులగూడి
గుములై దిక్పతులు దిక్కులకు పోయిరండు
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి ॥భోగీంద్రు॥





నారద సనక సనందనాదులు
భూరి విభవముల పోయి రండు
దూరముగా పోకిట్టె తొరలి వేంకటగిరి
చేరి నన్నిట్లనే సేవించుడీ ॥భోగీంద్రు॥

**భావామృతం**

భోగములనుభవించుటకు అలవడిన ఓ మహామహులారా! మీరంతా పోయి, మీదటి విభవాలకు (వచ్చే ఏడాది జరుగబోయే బ్రహ్మోత్సవాలకు) వేగాన తిరిగిరండి (మీకోసం ఎదురు చూస్తుంటాను).

ఓ శంకరా! కైలాసం నుండి శ్రమతీసికొని వచ్చావు. ఓ పరమేష్టీ! (బ్రహ్మ!) నీవు బ్రహ్మోత్సవాలను జటిపి యెంతో శ్రమపడ్డావు. మీరు వచ్చే తిరునాళ్ళకు తప్పక రావాలి. దేవతలారా! మునులారా! బ్రాహ్మణోత్తములారా! ఇన్నాళ్ళూ, అరమురి (కలతపడి) అలసిపోయారు. కనుక ఇప్పటికి పోయిరండి. (ఇక్కడ 'అరవిరి' అని వున్నది. బహుశా అది 'అరమురి' అయి వుంటుంది. 'అరవిరి' అంటే సగం వికసించిన మొగ్గ అని అర్థం).

ఓ యమధర్మరాజా! తమది క్షణం తీరికలేని బాధ్యత. ఓ చంద్రుడా! నీవి అంతులేని బాధ్యతలు. మళ్ళీ దేవతలందరితో కలసి సుముఖులై (నవ్వులొలికే మొగములతో) రండి. గములై (పయనించువారై) దిక్పాలకులారా! మీ మీ దిక్కులకు మీరుపోయి రండి. ఇన్నాళ్ళూ ప్రమదాన (సంతోషముతో) వున్నారు. అయినా ఎంతో అలిసిపోయారు. మీరంతా పోయి మరలిరండు.

ఓ నారదమహర్షీ! సనక సనందనాది మునివరులారా! గొప్ప ఉత్సవాలకు మళ్ళీ వచ్చేయేడాది తప్పక తిరిగిరండి. ఎంతోదూరం పోతే మీకు తిరిగి రావటానికి శ్రమ అవుతుంది, కనుక యెక్కువ దూరం పోకండి. తొరలి (మళ్ళీ) వేంకటగిరి చేరి నన్ను ఇట్లాగే సేవించండి. జన్మ సార్థకం చేసికోండి.

## మున్నుడి 5-20

అద్భుతమైన శరణాగతి కీర్తన అన్నమాచార్యులవారు వినిపిస్తున్నారు. నేను జీవుణ్ణి నీవు దేవుడవు. నేను హీనుణ్ణి నీవు సర్వాధికుడవు. నాకేమీ చేతకాదు నీవు పరిపూర్ణుడవు. నేను నీ దాసుణ్ణి కాబట్టి నా తప్పులు నీవు క్షమించకపోతే ఎవరు క్షమిస్తారు? నీవు 'ఈశు' లేని శ్రీవేంకటేశుడివి, అందుకని నన్ను కరుణించక నీకు తప్పదు.

**సీ॥ పరిపూర్ణుడవు నీవు పాపిహీనుడ నేను**
**అధికుడవీవయ్య! అధముడేను**
**దండము బెడుదునే తప్పుకాయుము ప్రభూ!**
**అండగోరుదునేను అండ నీవు**
**శరణు కోరుట నాది కరుణజూపుట నీది**
**విరుల జల్లుట నాది వరము నీది**
**దాసుడనుట నాది చూసి యేలుట నీది**
**ఆసలు తీర్చేటి అయ్య వీవు**

**ఆ.వె॥ సేవజేతు నీకు శ్రీవేంకటేశ్వరా!**
**గైకొనుమిదె నన్ను కావుమయ్య!**
**ఏమి సేయగలను ఇంతకంటే నేను**
**హరిని గొలిచి వేడె అన్నమయ్య**

**రాగం : గుండక్రియ**

నేనేమి జేయగలేను - నీవు పరిపూర్ణుడవు
హీనుడ నే నధికుడ వ- న్నిటా నీవు ॥నేనేమి॥

దండము వెట్టుట నాది- తప్పు లో గొనుట నీది
నిండి నీ వెప్పుడు దయా-నిధివి గాన
అండ జేరుకొంట నాది - అందుకు నూ కొంట నీది
దండియైన దేవదేవో-త్తముడవు గాన ॥నేనేమి॥





శరణుచొచ్చుట నాది - సరుగ గాచుట నీది
పరమపురుష శ్రీ -పతివి నీవు
విరులు చల్లుట నాది - వేవే లిచ్చుట నీది
పొరి నీవు భక్తసుల - భుడ వటుగాన ॥నేనేమి॥

దాసుడ ననుట నాది - తప్పక యేలుట నీది
ఆసదీర్చే వరదుడ-వటుగాన
నీ సేవ యొక్కటి నాది - నిచ్చలు గైకొంటనీది
యీసులేని శ్రీవేంక-టేశుడవు గాన ॥నేనేమి॥

**భావామృతం**

ఓ దేవదోత్తమా! నేను 'బక్కప్రాణిని'. నీవు పరిపూర్ణతగల మహానుభావుడవు. నేను హీనుడను. నీవు అన్నిటిలోను అధికుడవు. నేను నిన్ను శరణు వేడుటకంటె ఏమిచేయగలను? నాకేం చేతనవుతుంది ప్రభూ!

నీకు దండము పెట్టి వేడుకోవటం నాపని, నాతప్పులను లోగొని (మనస్సులో పెట్టుకొని) క్షమించటం నీపని. నీవు నిండైన దయాసాగరుడవు కదా! నీ అండలో చేరుకొని నిశ్చింతగా వుండటం నావంతు. అందుకు ఊకొని (సమ్మతించి) యుండుట నీవంతు. ఎందుకంటే నీవు దేవదేవుళ్ళందరిలోన సర్వోన్నతుడవు. నీవుగాక నాకు దిక్కు యెక్కడుంది?

ఓ ప్రభూ! నిన్ను శరణు వేడుట నాపని. నన్ను సరిగ్గా రక్షించుట నీపని. ఎందుకంటే నీవు శ్రీపతివి. లక్ష్మీదేవి నీవు వూకొట్టనిదే మమ్ము కరుణిస్తుందా?నీవు పరమపురుషుడవు శరణాగతవత్సలుడవు. నీకు పూలతో పూజించుట నాపని. నాకోరికలు తీర్చుట నీపని. ఎందుకంటే... నీవు భక్తసులభుడవు. నేను నీ భక్తుణ్ణి సరిపోయింది కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దాసుణ్ణి తండ్రీ! అని వేడుకొనుట నా కర్తవ్యం. వీడు నా దాసుడు కదా! అని నన్ను పాలించుట నీ కర్తవ్యం ఎందుకంటే మా ఆశలను దీర్చి వరములిచ్చే దైవం నీవే కదా! నీ సేవ ఒక్కటే నాకు తెలిసింది. నిచ్చలు (నిత్యమూ) నన్ను స్వీకరించుట నీ బాధ్యత అయిపోయింది. ఎందుకంటే నీవు 'ఈశు' (ఈర్ష్య) లేని వేంకటేశుడివి కదా!

## 5-21

### మున్నుడి

అలమేలుమంగపతి కొలువుదీరియున్నాడు. అదిగో అని వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. పదివేల విధములైన (అనేకమైన), పారుపత్తెములు జేయుచున్నాడట. అంటే అధికారములను చెలాయించుచున్నాడని అర్థం. శృంగారంగా (సొంపుగా) దేవతలంతా సేవిస్తున్నారట. వెన్నెలపూలదండలు వేశారట స్వామికి. “దండిమీరగ నిపుడు -దైవరాయడు” అని వుంటే ‘ప్రాస’ సరిపోతుంది. శృంగారమైనట్టి వేంకటేశ్వరుడట. ఈ ఒక్క చరణానికే యెంతైనా వివరణ ఇవ్వవచ్చును. స్వామి అనంతుడుకదా! చూడండి. ఆయన కొలువుయెలా వుంటుందో...

**మ॥ అదిగో ఆయలమేలు మంగపతి తానందంబుగా గొల్వునన్**
**పదివేలౌవిధముల్ చెలంగ విడిదై పాలించెరా లోకముల్**
**ఇదిగో చెప్పెను అన్నమయ్య కవితన్ ఈ సొంపు వీక్షించుడీ**
**ముదితల్ ఇద్దరు కూడి శ్రీరమణునిన్ మోహంబులన్ ముంచగా.**

**రాగం : దేశాక్షి**

అదిగో కొలువై యున్నాడవీ - అలమేలు మంగపతి
పదివేల విధములను పారుపత్తెము జేయుచు ॥అదిగో॥

రంగమండపములో - రత్న సింహాసనముపై
అంగనామణులతో - అమరవేంచేసి
బంగారు పావడలు - పసరించి యిరుగడల
శృంగారముగ సురలు - సేవశాయగను ॥అదిగో॥

వెండిబైడి గుదియలను - వేత్రహస్తలు పొగడ
నిండు వెన్నెల పూల - దండలమర
హుండిగను కానుకల - నొసర లక్కలు జేయ
దండి మీరగ నిపుడు - దే(దై)వరాయడు చెలగి ॥అదిగో॥





అంగరంగ వైభవముల - రంగుగా చేకొనుచు
మంగళహారతుల-మహిమ వెలసి
శృంగారమైనట్టి మా వేంకటాధిపు
డంగనలు కొలువుగా ని(న)పుడు వేంచేసి ॥అదిగో॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో కొలువుదీరివున్న శ్రీపతిని, అలమేలుమంగమ్మ మనోహరుని దర్శించండి. ఆయన లోకపాలకుడు. సామ, దాన, భేద, దండోపాయములతో ‘పారుపత్తెము’ (అధికారము) చెలాయిస్తున్నాడు.

స్వామి యెలావున్నాడో చూడండి. రంగమండపములో (సభామండపము) రత్నాల సింహాసనము మీద కూర్చున్నాడట. ఇరుప్రక్కలా భార్యామణులైన శ్రీదేవి, భూదేవి వున్నారట. అట్లా వేంచేస్తున్నాడట. ఆ వనితామణులు బంగారు వస్త్రములను ధరించి శోభిస్తున్నారట. వారిని సమస్తదేవతలు శృంగారముగా (సొంపుగా) సేవిస్తున్నారట.

ఆయన కావలి వారు అంతమంది ప్రజలను అదుపు చేయవలెనంటే బెత్తం ఝళిపించక తప్పదు కదా! వారు వెండి మరియు బంగారు గుదియలను (నాలుగు మూరలు పొడవున్న దండమును) ధరించి వారిని అదుపులో వుంచుతున్నారట. స్వామికి ఆయన ఇద్దరు సతులకు వెన్నెల పూలదండలు వేశారట. “హుండిగను కానుకల నొసర లక్కలు జేయ” (హుండీలో వచ్చిన కానుకలను అధికారులు లెక్కలు వేసి, సరిజూసుకొంటున్నారట. ఆ విధముగా దైవరాయడు (దేవాదిదేవుడు) దండిమీరగ (గొప్పతనంతో) ఇప్పుడు కొలువుదీరియున్నాడు.

అటువంటి వేంకటేశ్వరునికి, ఆయన పట్టపురాణులకు మంగళహారతుల నిస్తున్నారు. రంగుగా (శోభస్కరంగా) అంగరంగవైభవములతో మా వేంకటరమణుడు ఇప్పుడు ఆ అంగనలతో (భామలతో) కొలువుదీరి విచ్చేయుచున్నాడు. అనంతమైన మహిమలు కల ఆ శృంగార పురుషుని చూచి తరించండి. ఇంతకంటే అదృష్టం దొరుకుతుందా?

## మున్నడి 5-22

అహోబలనృశింహుని భీకరాకారాన్ని వర్ణిస్తూ కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. నృసింహుడు అరికుల దమనుడట. (రాక్షసాంతకుడు). ''మహామహిమలను మలసీవాడె'' అంటున్నారు. గొప్ప మహిమలతో తిరుగాడుతున్నాడట. ఆయన మీసాలు అదిరి పడుతున్నాయట. “అతిసిత నఖములు” అంటే మిక్కిలి తెల్లటి గోళ్ళు. ఆయన తన మెడలో వేసికొనిన నగలు సందడి చేస్తున్నాయట అంటే చప్పుడు చేస్తున్నాయట. ఇటువంటి వర్ణన 'నభూతో నభవిష్యతి' అంటే మీకేమన్నా సందేహమా? తిరుమలలో వున్నాయనే... ఈయన అంటున్నారు.

**ఆ.వె॥ తానహోబలమున దమనుడై అరికులం**
**బణచి మహిమ జూపె నతడు మలసి**
**కాచె దీనజనుల, కనుల గట్టినయట్లు**
**అతని సొబగు జెప్పె నన్నమయ్య.**

**మలసి = తిరుగాడు**

**రాగం : బిలహరి**

అహోబలేశ్వరు డరికుల దమనుడు
మహామహిమలను మలసీ వాడె ॥అహోబల॥

కదలు కన్నులును కరాళ వదనము
గుడి గొను భయదపు కోరలును
అదరు మీసములు నలరగ నవ్వుచు
వుదుటుతోడ గొలువున్నాడు వాడె ॥అహోబల॥

అతిసిత నఖములు ననంత భుజములు
వితత పరాక్రమ వేషమును
అతుల దీర్ఘ జిహ్వాయు గడుమెరయగ
మితిలేని కరుణ మెరసీ వాడే ॥అహోబల॥





సందడి సొమ్ములు శంఖచక్రములు
పొందుగ దివిజులు పొగడగను
యిందిరను దొండపై నిడి శ్రీవేంకట-
మందు నిందు గడు నలరీ వాడే ॥అహోబల॥

**భావామృతం :**

ఈ అహోబలమున వెలసిన నృసింహుడు అరికుల దమనుడు (శత్రువులైన రాక్షసులను అణచువాడు). గొప్ప మహిమలతో వాడే, మలసీ (తిరుగాడుచున్నాడు). ఆ మహానుభావుడెలావున్నాడో చూడండి.

ఆయన కన్నులు అతి వేగముగా అటునిటు కదలుచున్నవి. కరాళ వదనము-ఆయన ముఖము భయమును కలిగించుచున్నది. ఆయన కోరలను చూస్తుంటే భయం గుడిగొంటున్నది. (క్రమ్ముకొని వస్తోంది). ఆయన నవ్వుతుంటే, ఆయన మీసములు అదిరి పడుతున్నాయి. అట్టి ఆ స్వామి, ఉదటుతో (గర్వముతో) కొలువై వున్నాడు. ఆయనను సేవించండి.

ఆ నరసింహునికి అతిసిత నఖములు (మిక్కిలి తెల్లగా వున్నగోళ్లు), అనంత భుజములు... (ఆయనకు లెక్కలేనన్ని చేతులు). ఆయన వేషము చూస్తుంటే వితత పరాక్రమంగా వున్నది, (ఆయన పరాక్రమము అతిశయించియున్నది). ఎంతో పొడవైన ఆయన జిహ్వ (నాలుక) కడు మెరయగా, ఇతడు అంతులేని కరుణామూర్తియే మనం భయపడవలసిన పనియే లేదు అనిపించుచున్నది. వెంటనే ఈయన శరణుపొందండి.

ఇక ఈ దేవదేవుడు తన శరీరంపై ధరించిన సొమ్ములు (ఆభరణములు) తీవ్రమైన కదలికల వల్ల సందడి (చప్పుడు) చేయుచున్నవి. శోభలొలుకు శంఖచక్రములన చేబూనిన ఈ స్వామిని దివిజులు (దేవతలు) కీర్తించుచున్నారు. ఆయన ఇందిరను (ఆదిలక్ష్మిని) తన తొడపై కూర్చుండబెట్టుకొని యున్నాడు. ఈ నృసింహుడే శ్రీవేంకటాద్రిపైనున్న శ్రీవేంకటేశ్వరుడు. “అందు నిందు కడు నలరీవాడే...” (అక్కడా ఇక్కడా కూడా ఎంతో గొప్పగా వాడే శోభిల్లుచున్నాడు). మరి ఇంకా ఎందుకు ఆలస్యం ఆయనను ఆశ్రయించండి.

5-23

## మున్నుడి

కడపజిల్లా కడప తాలూకాలోని చిన్న దాసరిపల్లె సమీపాన లోయలో వేయినూతులు (బావులు) గల ప్రదేశమునకు 'వోనూతులకోన' అనియు 'వోగునూతులకోన' అనియు పేర్లుగల ప్రదేశమున్నది. అచట నరసింహస్వామి ఆరాధింపబడుచున్నాడు. ఆయన దేవేరి ఆదిలక్ష్మి. ఆ దేవిని వుద్దేశించి అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఎదురుగా వున్నప్పుడే నీకు ప్రథమకోపము ఎందుకమ్మా? ఆయనేమో పకపక నవ్వుతూనే తన పంతం చూపించుకొంటున్నాడు, అని అమ్మవారి తరపున మాట్లాడి సలహాలిస్తున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ "మొకమెదుటనె ముంగోపము**
**ఇకనేలనె ఆదిలక్ష్మి!" హితవు తెలుపుచున్**
**పకపక నగవు నృసింహుని**
**నిక గూడుము అన్నమయ్య ఇందిరకనియెన్**

**రాగం : రామక్రియ**

మొకమొక మెదుటనె ముంగోప మికనేల
పక పక నగుతానె పంత మిచ్చె నాతడు ॥మొకమొక॥

ఆతడె నీ వున్న చోటి కంగనల నంపగాను
యీతల దల వంచేవు యేలమ్మ నీవు
కాతరిం చంతట బోక ఘనుడు దానె వచ్చె
చేతులార నీవె సేవ సేయవమ్మ యిపుడు ॥మొకమొక॥

కదు మోహములె నీకు గప్ప మాతడు వెట్టగ
యెడమాటల దిట్టించే వేలమ్మ నీవు
తడవి మీ రాతని తరుణులు దొబ్బిరట
గొడవలు దీర వేడుకోవమ్మ పతిని ॥మొకమొక॥





ఆయములు సోక నాత డాన లెల్ల బెట్టుకోగా
యీ యెడ నవ్వులు నవ్వే వే మమ్మ నీవు
వోయమ్మ శ్రీవేంకటేశు డోగునూతలలో గూడె
నీ యిచ్చ నాత డున్నాడు నీవు మెచ్చ రాదా ॥మొకమొక॥

**భావామృతం :**

అమ్మా! ఆదిలక్ష్మీ నీవు నృసింహుని దేవేరివి, ఇంకనీకు మొగము మొగము ఎదురుగానున్నప్పుడు ముంగోపము (ముందు + కోపము) ఎందుకమ్మా? ఒకప్రక్క నీవు కోపంతో సతమవుతుంటే, ఆయన పకపక నవ్వుతూనే బెట్టు సరిగా పంతమున నున్నాడు.

అంతటి నృసింహుడు దిగివచ్చి నీదగ్గరకు చెలికత్తెలను సర్దిచెప్పటానికి పంపించగానే నీవు తలవంచి ఆయన చెప్పినవన్నీ అంగీకరిస్తావు. ఎందుకు తల్లీ! ఘనుడైన స్వామి తనంతట తానే లొంగిపోయి నీవద్దకు వచ్చాడు. సంతోషంతో నీ చేతులారా ఆయనకు సేవచేసికొనవమ్మా!

నీ కోపం తగ్గించుటకు స్వామి, నీకు కట్టే కప్పము ఏమిటో చూశావా తల్లీ! కదు మోహములే (నీపై అంతులేని అనురాగమే). అటువంటి స్వామిని, యెడమాటలతో (పెడసరి మాటలతో) తిట్టించేవేలమ్మా? తడవిమీర (ఆలస్యమైనదని), తరుణులు (నీ చెలికత్తెలు) అతని (నృసింహుని) దొబ్బిరట (గెంటివేశారట). ఇది తగదు తల్లీ! నీ పతిని గొడవలన్నీ దీరునట్లు వేడుకొనవమ్మా! ఆయన దయామయుడు నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు.

అంతటి గంభీర రౌద్ర నృసింహమూర్తి జరిగిన ఆలస్యానికి చింతిస్తూ ఇకముందు అలా జరుగదని ఎన్నో 'ఆనలెల్లబెట్టు' (ఒట్లు ఎన్నో పెట్టుకొని) వేడుకొంటుంటే, నీకు నవ్వు ఆగక పకపకమని యీయెడ (ఇప్పుడే) నవ్వుతావు. ఎందుకు తల్లీ? ఓ జగజ్జననీ! తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుడే ఇక్కడ ఈ "వోగునూతల కోన" లో "నీ ఇచ్చనాత డున్నాడు" (నీ ఇష్టప్రకారమే ఆయన నీపై అనురక్తుడైయున్నాడు). ఇందుకు నీవు ఆయన్ను మెచ్చరాదా తల్లీ!

## 5-24

### మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి జ్ఞానబోధను చేస్తున్నారు. వినండి. జీవుడనే మంచి మరకాడు (మంచి నావికుడు) వున్నాడట. వాడు మంచివాడే కాని స్త్రీల మానము అనే "కరపట్నాలలో" (ఓడరేవులలో) దిగాడట. అదీ, మంతనాన (రహస్యంగా) జరిపాడట. అంతే... ఇంకేముంది? సంసారసాగరంలో తిరుగులాడాడట. దేహం అనే ఓడమీద ప్రయాణం చేస్తూ, పాపపుణ్యాలనే సరుకులు నింపుకొని, ఒడ్డు చేరాడట. వ్యాపారం కోసం తిరుగుతూనే వున్నాడట. వాడు జీవించివున్నంత కాలం శ్రీవేంకటేశ్వరుని కృప కలిగేదాక ఆ 'యావ' తప్పదు.

**ఉ॥ లేమల మానముల్ యనెడి రేవులలో దిగె చాటు మాటుగా**
**కాముకుడైన 'జీవుడ'ను గద్దరి నావికుడన్నమయ్యనెన్**
**ప్రేమను మాయలో దగిలి వేదనజెందెను భ్రాంతి జిక్కుచున్**
**పామరుడై చరించి, తుది మాధవునెంచుచు పొందె సద్గతిన్**

**లేమలు= స్త్రీలు**

**రాగం : రామక్రియ**

కాంతల మానమనేటి - కరపట్నాలకు దిగె
మంతనాన జీవుడనే - మంచి మరకాడు ॥కాంతల॥

అరిది సంసారమనే - యంబుధిలోన దిరిగి
ఉరుగతి దేహపు- టోడమీద
సరిబాపపుణ్యముల - సరకులు నించుకొని
దరిజేరె జీవుడనే - తల మరకాడు ॥కాంతల॥

కడలేని నిటూర్పు-గాలి విసరగాను
జడియు గోరికలనే- చాపలెత్తి
అడి బరువుగ మాయ- అందు నిండా నించుకొని
యెడతాకె జీవుడనే-యీ మరకాడు ॥కాంతల॥





అలర శ్రీవేంకటేశు-డనియేటి మాలిమి
నలుదిక్కులకు నోడ - నడపగాను
ములిగె ధర్మార్థ కామ - మోక్షధనము గడించి
పలుమారు జీవుడనే - బలు మరకాడ ॥కాంతల॥

### భావామృతం :

ఓ నరులారా! జీవుడనే ఒక 'మరకాడు' (నావికుడు) వున్నాడు. వాడు స్వతహాగా మంచివాడే. కాని కాంతల మానము (స్త్రీలయక్క మానము) అనే "కరపట్నాలలో" (ఓడరేవులలో) మంతనాన (రహస్యంగా) దిగినాడు. (ఇకవాడి తిప్పలు ఏమి చెప్పగలము?)

అరిది (అలవిగాని) సంసారము అనే మహాసాగరంలో దేహము అనే ఓడమీద, ఉరుగతి దిరిగాడు (శ్రేష్ఠమైన విధంగా ప్రయాణించాడు). ఆ ఓడలో పాపపుణ్యాలనే సరియైన సరుకులను నింపుకొన్నాడు. ఆవిధంగా జీవుడు అనే ఆ తల మరకాడు (మంచి నావికుడు) దరిజేరె (ఒడ్డుకు చేరుకొనినాడు).

అంతులేని నిట్టూర్పులనే గాలి విసరసాగింది. జడియు (చలింపజేయు) కోరికలనే తెఱచాప లెత్తబడినవి. ఆ విపరీతమైన గాలి అడి (అధికముగా) బరువైన మాయను దాంట్లో (తెఱచాపలో) నిండా నింపింది. ఆ విధంగా జీవుడనే ఆ నావికుడు, యెడతాకె (తను చేరవలసిన స్థానమును చేరాడు). ఆవిధంగా నౌకా ప్రయాణాలు (సంసార తాపత్రయాలు) జరుగుతూనే వున్నాయి.

అయితే, ఒకనాడు, శ్రీవేంకటేశ్వరుడనేటటువంటి మాలిమి (ఓడనడిపె సరంగు, లేక, వాత్సల్యము కలవాడు) ఆ ఓడను నలుదిక్కులకు నడపగా ధర్మము, అర్థము, కామము అనే రకరకములైన ధనములను (సంపదలను) గడించి మాటిమాటికీ జీవుడనే ఆ నావికుడు అంత్యమున మోక్షము అనే సిరిని గడించి, తరించాడు.

**5-25**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ప్రతిభ కళ్ళకు కట్టినట్లు చూపే దశావతార వర్ణన కీర్తన నొకటి వినండి. పొడుపు కథలవలె గూఢార్థముతో కొనసాగే ప్రశ్నల ప్రహేళిక. ఎవ్వడో తెలియదు కానీ వాడు చాలా చాలా దూరంగా వున్నా నిరంతరం మన తలపులలోనే (ఆలోచనల్లోనే వుంటాడట). ఎవరబ్బా? 'వడిగిందుపడు' సేవకుడుగాడు, అంటే... చటుక్కున అధముడివలె అణిగి మణిగి వుంటాడు, కాని యెవ్వరికీ సేవకుడు కాడట. యెవ్వరో మరి? "తగు గాపు బనులు నెంతయు దెల్లతనము" - అంటే? మాబోటి వారికి 'పొడుపే' అర్థంకాదు. 'విడుపు' గురించి చెప్పేదేముంది?

**చం॥ కనుడిది ఎవ్వడో యెరుకకాదుర దవ్వున వుండికూడ తాన్**
**అనువుగ నిండియుండు మన అందరి దొడ్డ తలంపులందునన్**
**వినుమని అన్నమయ్య ఇక విష్ణుని ఆ యవతార లీలలన్**
**గొనకొని చెప్పగా మురిసి గోప్యము "విప్పగ" జూతు శ్రీహరీ!**

### రాగం : రామక్రియ

ఎవ్వడో గాని యెరుక రాదు కదు
దవ్వులనే వుండు తలపులో నుండు ॥ఎవ్వడో॥

ఎడయవు తన రెక్కలెగసి పోలేదు
కదుదాగుగాని దొంగయు గాడు
వడిగిందు పడును సేవకుడును గాడు
వెడగు గోళ్ళు వెంచు విటుడును కాడు ॥ఎవ్వడో॥

మిగులా బొట్టివాడు మింటికిని బొదవు
జగడాలు తపసి వేషములును
మగువకై పోరాడు మరి విరక్తుడును
తగు గాపు బనులు నెంతయు దెల్లతనము ॥ఎవ్వడో॥





తరుణుల వలపించు తగిలి పైకొనడు
తురగముదోలు రౌతును గాడు
తిరువేంకటాద్రిపై దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీ ఘనుడు ॥ఎవ్వడో॥

### భావామృతం :

ఎవ్వరో తెలియదు కానీ, కదు దవ్వులనే (చాలదూరంగానే) వున్నా... తలపులలోనే వుండును (మన మనస్సులోనే వుంటాడు).

"ఎడయవు తన రెక్కలెగసిపోలేదు"... (ఎడబాయని రెక్కలున్నా పాపం ఎగిరిపోలేడు... ఎవ్వరు? చేప... అంటే మత్స్యావతారం). "కదుదాగు గాని దొంగయు కాడు"... (ఎప్పుడూ ముడుచుకొని దాగికొని వుంటాడు. అంత మాత్రాన దొంగ అనుకోకండి... ఎవ్వరు? తాబేలు... అంటే కూర్మావతారం). "వడి గిందుపడును సేవకుడుకాడు"...(చటుక్కున అధముడివలె అణిగిమణిగి వుంటాడు కానీ సేవకుడు కాదు... మరియెవరు? ఇంకెవరు వరాహము). "వెడగు గోళ్లను పెంచు విటుడు కాడు" (వికారంగా గోళ్లను పెంచుకొని వుంటాడు కాని విటుడు మాత్రం కాదు...యెవ్వరో? నరసింహుడు)

"మిగుల బొట్టివాడు మింటికిని బొదవు"... అంటే (ఎంతో పొట్టివాడు కానీ ఆకాశాన్ని మించిపోయాడు... యెవ్వరు? వామనుడు). "జగడాలు తపసి వేషములు" (వేషమేమో బ్రాహ్మణునిది, చేసేదేమో పోట్లాట... యెవరు? ఇంకెవరు పరశురాముడు). "మగువకై పోరాడు మరి విరక్తుడును".. అంటే (భార్యకోసం యుద్ధం చేశాడు. కాని జీవితమంతా భార్యలేకుండా విరక్తితోటే బ్రతికాడు యెవరబ్బా? మన శ్రీరామచంద్రుడే). "తగుగాపు బనులు నెంతయు దెల్లతనము"... అంటే (తనకు తగిన విధంగానే) సువులను కాసిన ('తెల్లని' గొల్ల కాపరి) యెవరు? బలరాముడు. తెల్లనివాడు అంటే అమాయకుడని కూడా...)

"తరుణుల వలపించు తగిలిపై కొనడు"... (స్త్రీలను మోహింప చేయగలడు కాని కాంతలపై వ్యామోహము లేనివాడు... యెవ్వరు? బుద్ధ భగవానుడు). గుఱ్ఱమును తోలును కాని రౌతుకాడు... (యెవరై వుంటారు? ఇంకెవరు కల్కి భగవానుడు). ఈ ఘనుడు పరమునొసగు పరమమూర్తియై, ఎప్పుడూ తిరువేంకటాచలముపై తిరుగుతుంటాడు... యెవరయ్యా ఆయన? ఏమో... ఆంగ్లభాషలో No money for guessing అంటారు. మీరు తలబద్దలు కొట్టుకొని చెప్పినా... పైసా కూడా ఇవ్వనని తెలుగులో అర్థం.

## 5-26

## మున్నుడి

భయానక రస ప్రధానంగా సాగిపోయే అన్నమాచార్యులవారి కీర్తన వినండి. "బాపు దైవమా! మా పాలి భవమా! తీపురాకాసి నెత్తురు దీం దోం దోం దోందోం దోం అని" మొదలుపెట్టారు కీర్తన. "బాబోయ్! దేవుడా! మాకున్న సత్తా (బలమా)! తీపురాకాసి (యాతనలు పెట్టే రాక్షసుల) నెత్తురు దీందోందోందోం (అని చిందించి వేయుచున్నావు) అని పల్లవికి అర్థం చెప్పుకోవచ్చును. అదీ దాదాపుగా శివమునెత్తిన అన్నమయ్య భక్తి పారవశ్యంలో, శ్రీవేంకటేశుడే కాలనేమి, మహోదరుడు, మురాసురుడు, హిరణ్యకశిపుడు వంటి రాక్షసుల నెత్తురు త్రాగిన అరి భయంకరుడని అంటున్నారు.

**తే॥ బాపు! మా పాలిదైవమా! తీపు దనుజు**
**దోగు నెత్తుట దీందోము దోం అనుచు**
**శివమునెత్తెను అన్నయ్య శ్రీనివాస!**
**భక్తి పారవశ్యంబదే "మమ్మ! మమ్మ!"**

**రాగం : మాళవి**

బాపు దైవమా మాపాలి భవమా
తీపు రాకాసి నెత్తురు దీం దోందోం దోందోం దోందోం ॥బాపు॥

కాలనేమి పునుకిది కంచువలె లెస్సవాగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త
కాలమెల్ల మా భూతగణమెల్ల వీడె కాచె
నేలబడి నేడును ధీంధీం ధీం ధీం ధీం ధీం ధీం ॥బాపు॥

పనిగొని మానక పచ్చి నెత్తురెప్పుడును
తెగి కొనుదానె తిత్తి తిత్తి తిత్తితి
తగు మహోదరు వీపు దణదణమని వాగీ
బిగియించరే తోలు భింభిం భింభిం భింభింభిం ॥బాపు॥





మురదనుజుని పెద్ద మొదలి యెముక దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు
తిరువేంకట గిరిదేవుడు గెలిచిన స-
మరమునను మమ్మ మమ్మ మమ్మ మమ్మమ ॥బాపు॥

**భావామృతం :**

బాపు! దైవమా! మాపాలి భవమా!

(బాబోయ్! దేవుడోయ్! మాకున్న బలమా!) తీపురాకాసి నెత్తురు (యాతన పెట్టే రాక్షసుల నెత్తుటిలో) దీందోందోం దోందోం దోందోం అని పొర్లాడుము.

ఇదిగో నీ చేతిలో వున్నది కాలనేమి అనే రాక్షసుని 'పుర్రె'. అది కంచు మ్రోగినట్లు ఎంతలెస్సగా (బాగుగా) శబ్దం చేస్తున్నదో చూడు. ఆ కరాళనృత్యానికి తగ్గట్లు తాళం వేయండి, తత్త తత తత్తత తత్తతా. సర్వకాలయందు మా భూతగణములకు రక్షించు దిక్కు వీడే ( శ్రీనివాసుడు). నేడును నేలమీద సాష్టాంగపడి వేడుకోండి. ధీంధీంధీం ధీంధీంధీం అని ధీరత్వంతో కాపాడి ఆదుకొంటాడు.

ఆనాడు హిరణ్యకశిపుని పచ్చినెత్తురు మానక (వదిలి పెట్టకుండా) పనిగొని (పనివేళా) తానె తెగికొను (ఆయనే తెగించి త్రాగివేశాడు). అప్పుడు ఎంత వింత శబ్దాలు వచ్చాయో... తిత్తి తిత్తి తిత్తితి. అడ్డమొచ్చిన మహోదరుడు వంటి రాక్షసుల వీపులన్నీ దణదణమని డోళ్లలాగా మ్రోగాయి. ఆ'డోళ్లు' సరిగ్గా మ్రోగటం లేదులా వుంది. వాటి తోలు బిగువుగా బిగించండి. ఇప్పుడు కొట్టిచూడండి. ఆ అదీ భిం భిం భిం భిం భిం అని సరైన ధ్వని వస్తున్నది.

ముర అనేపేరుగల రాక్షసుని ఈ శ్రీహరి చంపిన సంగతి తెలుసుకదా! వాడి మొదలి యెముక (కాలి ఎముక) చాలా పెద్దది. అదిగో అక్కడ పడివున్న ఆ ఎముక తీసికొని తురులూదరే (అతిశయించి వూదండి). తుత్తు తుత్తు తుత్తు తూ. ఈ మాయదారి రాక్షసులందరినీ గెలిచిన వాడు వేరెవరో కాదు. మన తిరువేంకటేశ్వరుడే. ఆ సమరములన్నిటిలో గెలిచినది ఆ స్వామియే. మమ్మ! మమ్మ! మమ్మ! (వరేవా!... వరేవా!... వరేవా! అనే ప్రశంస)

## మున్నుడి 5-27

భజన వలె సాగే అన్నమాచార్యుల వారి కీర్తన ఇది. ముత్యపు చిప్పలో మూయబడిన ముత్యమువంటివాడు ముకుందుడు. కేశవుడు ''తొట్టి'' కరిరాజవరదుడు. బహుశా అది 'తొట్ట' అయివుంటుంది. 'తొట్ట' అంటే దుండగీడు అని అర్థం. నేను "పదస్థుడ" నన్నారు. అంటే ఏ నిఘంటువులోను అర్థం దొరకలేదు. జన్మలనెత్తుతు దిక్కు తెలియక తిరిగే వాడిని... అని నేను భావించాను.

**సీ॥ కేశవ! గోవింద! కృష్ణ! నారాయణ!**
**మూసిన ముత్తెమా! మ్రొక్కెదమిక**
**నెమ్మి చక్రాయుధా! నీవు గలవు గాన**
**పమ్మి మాకికపైన భయమదేల?**
**పుట్టించువాడవు భూరమణుడవీవు**
**యెంచ 'పదస్థుడ' యేను దేవ!**
**గొల్లల గురుడవు గోవిందరాజువు**
**నిరతము గొలుతుము నిన్ను మేము**

**ఆ.వె॥ పరము నిహము మాకు బలువుగా కలిగెను**
**స్థిరము వరము నీవె శ్రీనివాస!**
**అన్నమయ్య కీర్తనత్యద్భుతము ప్రభూ!**
**భజనవోలె పాడె పరమపురుష!**

**రాగం : మోహన**

కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూసిన ముత్తెము వలె మ్రొక్కేము నీకు ॥కేశవ॥

నెమ్మి చక్రాయుధుడవు నీవు గలవటు గాన
పమ్మి మాకు నెన్నడును భయమేలేదు
యిమ్మల లక్ష్మీపతివి యేలికవైతివి గాన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు ॥కేశవ॥





పుట్టించిన వాడవు భూధవుడ వటుగాన
దట్టముగ నెంచగ పదస్థుడ నేను
తొట్టి(ట్ట) కరిరాజ వరదుడ నీవే దిక్కుగాన
గట్టిగా నా కోరిక లిక్కడ ఫలియించెను ॥కేశవ॥

గురువవు గొల్లలకు గోవిందరాజువు గాన
నిరంతరము పాడి నిండెను మాకు
చిరంతన దేవుడవు శ్రీవేంకటేశ్వర నీవు
పరము నిహము మాకు బలువుగా కలిగె ॥కేశవ॥

**భావామృతం :**

ఓ కేశవా! నారాయణా! శ్రీకృష్ణా! గోవిందా! ముకుందా! నీవు మూసిన ముత్తెము వంటివాడవు. నిన్ను భావించ గలిగిన వారికే నీవు వున్నావు. హిరణ్యకశిపునివలె లేవు అనే వారికి లేవు. ఇది ముత్యపు చిప్ప అనుకునే వాడికి 'చిప్పే' మిగులుతుంది. నీకు మ్రొక్కెదము ప్రభూ!

నెమ్మి (క్షేమము నొసగు) చక్రము ఆయుధముగా గలవాడనే నీవు. కావున మాకు ఇక ఎన్నటికీ 'పమ్మి భయం' (అతిశయించన భయము) యెందుకు? లేనేలేదు. ఇమ్మల (విరివియైన) లక్ష్మీపతివి నీవు మా ఏలికవై యుండగా మాకు సమ్మతి సర్వసంపదలు (న్యాయబద్ధమైన అన్ని వైభవములు వున్నాయి. మాకు బెంగ యెందుకు?

ప్రభూ! నీవు భూరమణుడవు. కన (చూడబోతే) మాకు పుట్టుక నిచ్చిన వాడవూ నీవే. దట్టముగా నెంచగ (బాగుగా ఆలోచిస్తే...) నేనేమో 'పదస్థుడను' (పథికుడను) నాకు దారి చూపించే దిక్కునీవే. నీవేమో 'తొట్టకరిరాజ' వరదుడవు. (దుండగీడు వలె పొగరుబట్టిన గజేంద్రుని కూడా నీవే తప్ప నితఃపరంబెరుగ, దీనుడ... అని వేడుకుంటే, సిరికిన్ జెప్పక వెళ్లి రక్షించావు). అటువంటి నిన్ను శరణన్నాను కాబట్టి... ఇక్కడ నా కోరికలు గట్టిగా ఫలిస్తాయి. నాకు దిగులెందుకు?

స్వామీ! నీవు శ్రీకృష్ణునిగా గొల్లవారందరికీ గురుడవైతివి. కావున నీవు గోవిందరాజువే. మరి మాకేల చింత? మాకు నిరంతరము పాడి సమృద్ధిగా వుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేవుడవు. నీవు చిరంతనుడవు (పురాతనమైన వాడవు). మాకు జీవనకాలంలో ఇహమును, మరణించాక పరమును కూడ నీవే. నీవు మాకు బలువుగా కలిగితివి. (పెద్ద దిక్కువలె వుంటివి).

**5-28**

## మున్నుడి

చక్కటి సంస్కృత కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది శ్రీరామచంద్రమూర్తిని సన్నుతిస్తూ చెప్పిన కీర్తన. కొన్నిచోట్ల ప్రతిపదార్థంగా వివరించాను. ఒకప్రక్క శ్రీరాముడిని కీర్తిస్తూనే వేంకటేశ్వరుని లీల అయిన భృగుమహర్షి ప్రసక్తి తీసికొని రావటం రుక్మిణీదేవిని వీక్షించేవాడని అనటం ఆయనే చిరంతనుడనటం ఒక్క ఆచార్యులవారికే చెల్లింది. భక్తి పారవశ్యంలో సర్వము తిరుమలేశుడే ఆయనకు.

**ఆ.వె॥ సిరులనిచ్చువాడు స్థిరము అయినవాడు**
**కౌశిక సవనంబు గాచువాడు**
**తిరుమలేశుడైన దేవుడే అతడనె**
**అన్నమయ్య యెంచి అమరవాణి**

**రాగం : ముఖారి**

శ్రీ శోఽయం సుస్థిరోఽయం
కౌశిక మఖ రక్షకోఽయం ॥శీశోఽయం॥

నిగమనిధి నిర్మలోఽయం
జగన్మోహన సతీపతి(తిః)
విగత భయోఽయం విజయ సఖోఽయం
భృగు మునినా సంప్రీతోఽయం ॥శ్రీశోఽయం॥

సకల పతి శ్శాశ్వతోఽయం
శుకముఖ మునిజన సులభోఽయం
ప్రకట బహుళ శోభనాధికోఽయం
వికచ రుక్మిణీ వీక్షణోఽయం



భావయామి వేంకటేశం

సరసోఽయం పరిసరప్రియోఽయం
తిరువేంకటాద్రి పోఽయం
చిరంతనోఽయం చిదాత్మకోఽయం
శరణాగతవత్సలోఽయం ॥శ్రీశోఽయం॥

**భావామృతం :**

అయం (ఇతడు) శ్రీ (ఐశ్వర్యము) స(మంగళము) ఇచ్చువాడు. అయం (ఇతడు) సుస్థిరత్వము నిచ్చువాడు. ఇతడు విశ్వామిత్రుని యాగ సంరక్షణ చేసినవాడు.

"నిగమనిధి నిర్మలోఽయం" (వేద నిధులైన ఉపనిషత్తులలో వివరింపబడిన నిర్మలమూర్తి ఇతడే). జగన్మోహినియైన సీతాదేవి భార్యగా గలిగిన భర్త ఇతడే. సర్వులకు భయమును నివారించిన అభయ ప్రదాత ఇతడే. ఈ శ్రీరామచంద్రుడే, శ్రీహరివలె భృగు మహర్షిచేత సంతోషపెట్టబడినవాడై యున్నాడు. (భృగు మహర్షి తనను తన్ని అవమానించినా, దానివలన తను భూమిపై శ్రీవేంకటేశ్వరుడై అవతరిస్తే లోక కళ్యాణం జరుగుతుందిలే అని ఆనందపడ్డాడట స్వామి).

ఇతడు జగత్పతియైన శాశ్వతుడు. శుకమహర్షివంటి భాగవతోత్తములైన మునులకు సులభంగా సాధింపదగినవాడు. అనేక రకములైన మంగళములను అధికముగా అనుగ్రహించు వాడు ఈతడు. "వికచరుక్మిణీ వీక్షణోఽయం" (చెదరిన ముంగురులు గల రుక్మిణీ దేవి చేత బాగుగా తిలకించబడిన వాడు ఈతడు).

"సరసోఽయం" (ఇతడు బ్రహ్మ పదార్థము అయినవాడు). తనచుట్టూ వున్న అందరికీ ఇష్టుడైన వాడు ఈతడు. తిరువేంకటగిరికి అధిపతియైన శ్రీవేంకటేశ్వరుడును ఇతడే. ఈయనే చిరంతనుడు (శాశ్వతుడు). చిదాత్మ స్వరూపుడు కూడ ఈతడే. శరణన్నవారికి దిక్కువలె వాత్సల్యముతో అనుగ్రహించు 'అండ' ఈతడు అనిగ్రహించి శరణు వేడండి.

**5-29**

## మున్నుడి

వైరాగ్యంతో లంపటాలవంటి 'పొందు'లను నిరసిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఛీఛీ అన్నీ నాటకాలేనని పేరుపేరునా, భ్రమలో, యవ్వన మదములో హెచ్చిన గర్వంతో చేసిన పనులను, కలిగిన భావాలను ఛీకొడుతున్నారు. "బచ్చుర పణములోని బచ్చెన చీచీ" అంటే ఏ నిఘంటువులోనూ తిన్నని అర్థము దొరకలేదు. 'బచ్చు' అంటే, కోమటి వ్యాపారి 'పణము' అంటే ధనము. కాబట్టి 'బచ్చెన' అంటే నేటికాలంలోని 'వడ్డీ' అని భావించాను. చిట్టచివరిగా 'వీడెగా మీ బారము' అనే మాటలో 'మీ' బదులు 'మా' వుంటే బాగుండేది అని భావిస్తున్నాను.

**తరలము॥ నయము గానివి పొందులన్నియు నాటకంబని కొట్టె 'ఛీ'**
**లయము తప్పని జన్మలన్నియు లంపటంబని కొట్టె 'ఛీ'**
**వయసు పోయిన వంతహెచ్చును వాంఛపోదని కొట్టె 'ఛీ'**
**జయము నిచ్చెడి శ్రీహరే గతి చాటి 'అన్నయ' చెప్పెరా.**

**రాగం : పాడి**

ఏటికి నెవ్వరి పొందు యిస్సిరో చీచీ
నాటకములాల చీచీ నమ్మితిగా మిమ్మును ॥ఏటికి॥

జవ్వన మదమ చీచీ చక్కదనమరో చీచీ
రవ్వైన రాజస గర్వమరో చీచీ
కొవ్విన మదమ చీచీ కూరిమి యాసరో చీచీ
నవ్వుల దేహమ చీచీ నమ్మితిగా మిమ్మును చీచీ ॥ఏటికి॥

ముచ్చట మమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ
బచ్చుర పణములోని బచ్చన చీచీ
తెచ్చుకోలు తాలిముల దిట్టతనమరో చీచీ
పుచ్చిన పోకరో చీచీ పోయగా మీ కాలము ॥ఏటికి॥





సిరుల చీకటి చీచీ సిలుగు సంపద చీచీ
వర విభవమ చీచీ వాసిరో చీచీ
కరుణించె దిరువేంకటగిరిపతి నన్ను
విరసవర్తన చీచీ వీడెగా మీ భారము ॥ఏటికి॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఎవ్వరి పొందు (స్నేహం) అయినా (చివరికి బాధించేదే). అది ఏటికి (ఎందుకు?) ఛీఛీ శుద్ధ దండుగ. నాటకములవంటి మిమ్మల్ని అందరినీ, ఇంతకాలము నమ్మి చెడ్డాను. ఛీఛీ

ఓ యవ్వనమదమా! నీవే శాశ్వతం అనుకొన్నానే ఛీఛీ. ఓ నా అందమా! నిన్ను చూసి గర్వించానే ఛీఛీ. ఓ రాజసగర్వమా! (రాచఠీవి వలన వచ్చిన అహంకారమా) నీ కఠినత్వం తగనిది. ఛీఛీ కొవ్విన మదమా! ఛీఛీ నీవలన యెంత చెడిపోయాను!! ప్రేమవలన కలిగిన ఆశలారా! ఛీఛీ! నవ్వుల దేహమా! (సుఖము నిచ్చే శరీరమా!) ఛీఛీ నీదీ ఒకసుఖమేనా? మిమ్మల్నందరినీ ఇంతకాలం యెంత నమ్మాను!! ఛీఛీ ఎంత మోసపోయాను!!

ఓ ముచ్చట మమతా! (కోరికలను పెంచే మమకారమా!) ఛీఛీ! యెంత బాధించారు!! ఓ ముచ్చు మురిపెమా! (దొంగవంటి సంతోషమా!) ఛీఛీ నిన్ను నమ్మవచ్చునా? కోమటి వ్యాపారి వద్ద తెచ్చిన ధనమునకు కట్టవలసిన పైకమా (వడ్డీ)! ఛీఛీ సర్వనాశనం చేస్తావు కదటే? "తెచ్చుకోలుతాలిముల" (తెచ్చిపెట్టుకొన్న ధైర్యం వల కలిగే) దిట్ట తనమరో (దర్పమా!) ఛీ ఛీ! నీ వలన నాకు నష్టమే కానీ లాభం లేదు. మీరు పుచ్చిన పోకచెక్కవంటివారు. ఛీఛీ! వ్యర్థులు.

సిరిసంపదవల్ల కళ్ళు బైర్లుకమ్మి చీకట్లు కమ్ముకొంటాయి. ఛీఛీ! యెంత అహంభావం వస్తుంది!! దానివలన 'సిలుగు' (ఉపద్రవం) తప్పదు. ఛీ ఛీ ఆ సంపదయెందుకు? ఓ వైభవమా! ఓ కీర్తీ! ఇప్పటికి శ్రీవేంకటేశ్వరుని దయకలిగి ఆ స్వామి నన్ను కరుణించాడు. వీడెగా మీబారము (ఇక మీ భారం వదలిపోయింది). ఓ విరసవర్తనమా! (ద్వేషము ప్రదర్శించె నా బలహీనతా!) ఛీఛీ! దూరంగా పో.....

**5-30**

## మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆనాడు జనబాహుళ్యానికి ఈ కీర్తన అర్థం అయిందో లేదో నాకు తెలియదు కాని, నేడు నా బోటి సామాన్యునికి ఈ కీర్తన వివరంగా అర్థమవుతుందంటే నాకు నమ్మకం లేదు. పండితుల విషయం నేను ప్రస్తావించటం లేదు. శృంగారాన్ని బూతు అనుకొనే రోజుల్లో జీవిస్తున్నాం కాబట్టి, ఈ కీర్తన యొక్క భావామృతం సాధ్యమైనంత గోప్యంగా వివరించాను. పుట్టేటప్పుడు బట్టలేదు, గిట్టినప్పుడు బట్టరాదు. బట్టపరుల కోసమే కదా! అందుకనే, శృంగారం కనపడీకనపడనట్లు కనబడితేనే జనరంజకంగా వుంటుంది.

**చం॥ జడియుచు యవ్వనంపు ధృతి జవ్వని పువ్వుల పాన్పు మీద తాన్**
**తడబడి నిద్రలేమి పరితాపము జెందెను వింతచేష్టలన్**
**ముడిపడి వేంకటాద్రిపతి ముంగిట నిల్వగ వేడ్క కూడెరా**
**విడువక అన్నమయ్య చెవివిందుగ చెప్పెను మేటికీర్తనన్.**

**రాగం : సారమతి**

జవ్వనంపు మదమున జడిసేటి తరుణి
పువ్వుల పానుపు మీద పొరలీ చూడరే ॥జవ్వనం॥

ముత్తేల కంకణాల మురిసేటి కరము
చిత్తగించు చెలినేడు చెక్కు మీదను
కొత్తనెత్తావి విరుల కొమరైన తురుము
వత్తుల నెరులతోడ వదలీ చూడరే ॥జవ్వనం॥

పయెద్య వెలి మించు పగటైన గుబ్బలు
ముయ్యరాని పెనుతాపమున కాగీని
వొయ్యారపు రచనలతో వొరపైన చూపులు
వొయ్యనె కన్నుల నీట వులికీ చూడరే ॥జవ్వనం॥





కప్పురపు తావితోడ కరగేటి తనువు
వొప్పైన కస్తూరిచేత నొరపైనది
యిప్పుడిట్టె తిరువేంకటేశు కూడియాయింతి
చెప్పరాని వేడుకల చెలగీచూడరే ॥జవ్వనం॥

**భావామృతం :**

ఓ చెలులారా! ఈ యువతి జవ్వనంపు మదమున (యౌవనగర్వంతో) జడిసేటి స్త్రీ (చలించిపోవుచున్న భామిని). ఈమె తన పూలపాన్పుపై నిద్రలేమిచే, పొరలీచూడరే (పొర్లుతున్నదో చూడండమ్మా!)

ఈమె చేతులు ముత్యాల కంకణాలతో మురిసిపోతూ (గర్వంతో) వున్నాయి. ఆ చేతులను తన చెక్కిళ్ళపై ఆనించి, ఆమె తనకొప్పులో నూతనంగా గుబాళించు పుష్పములను ధరించియున్నది. ఆ కొప్పులోని కొన్నికురులు వత్తుగా వుండటం వల్ల వదలీ (వీడి పోయినవి). ఓ భామినులారా! చూడండి ఈమె ఎంత మనోహరంగా వున్నదో.

పయ్యెదనుంచి వెలవడయత్నించు గబ్బిగుబ్బలు ఈమె విపరీతమైన ప్రణయతాపమున మఱగుచున్నదని స్ఫురింపజేయుచున్నవి. ఈమె ఒయ్యారము రూపంగా నిర్మితమైనట్లున్నది. తిన్నగా చూచుచున్న ఈమె చూపులు నిశితమై కన్నుల నీరు చిమ్ముచున్నవి. అందుచే ఈమె భీతహరిణేక్షణయైనది. ఓ చెలులారా! ఈమె ఎంత మనోహరంగా వున్నదో చూడరే!

ఓ భామినులారా! ఈమె శరీరం కర్పూర ధూళి వలన చక్కటి తావితోడ (పరిమళతో) కరిగిపోవుచున్నది. మంచి కస్తూరి చేత ఈమె గుబాళించుచున్నది. అవన్నీ అట్లావుండగా, ఇప్పుడు ఈ ఇంతి జగన్నాథుడైన శ్రీవేంకటేశ్వరుని ఇట్టే కూడుట చేత చెప్పలేని సంతోషంతో మురిసిపోతోంది. చూడండ్రా! ఆమె అదృష్టం.

## 5-31

## మున్నుడి

అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు చెప్పిన అద్భుతమైన కీర్తన నాస్వాదించండి. మతము, వ్రతము, కర్మకాండ ఇవన్నీ దేనికి? భగవంతుని ఒక పద్ధతితో ఆరాధించటానికే గదా! వీటన్నిటికీ ప్రాణం వలె ఆధారమైనదేమిటి? హరి భక్తి, హరి శరణాగతి, హరిదాస్యం. హరినామ సంకీర్తనం. అవిలేనివాడు ఈ శాస్త్రాలూ, వేదాలు, పురాణాలూ అన్నీ నిరుపయోగమేనంటున్నారు. అలాగే నేనూ నా జీవితంలో నేర్చిన సత్యం కూడా ఇదే. ఈ నాటి 'యువకులు' కలలుకనే 'చదువులు' ఆనాగే చదివాను. కాని అవన్నీ 'శుద్ధదండగ' అని 'ఎడమచేతితో' అన్నం తినవలసి వచ్చిన రోజున గ్రహించాను.

**కం॥ నాకు మతం బిదె వ్రతమిదె**

**ఈ కర్మలనొల్ల నేను ఇక దలతు హరిన్**

**మాకితని శరణమే గతి**

**ఈకడ పెదతిరుమలయ్య ఇంపుగ తెలిపెన్.**

**రాగం : మోహన కళ్యాణి**

ఇదియె నాకు మతము ఇది వ్రతము
వుదుటుల కర్మము వొల్లనింకను ॥ఇదియే॥

నిపుణత హరి నే నిను శరణనుటే
తపములు జపములు ధర్మములు
నెపమున సకలము నీవే చేకొను
వుపమల పుణ్యము లొల్లనే యింకను ॥ఇదియే॥

హరి నీ దాసుడ ననుకొనుటే నా
పరమును ఇహమును భాగ్యమును





ధర నీ మాయల తప్పు తెరువులను
వొరగీ సుకృతము లొల్లనే యంకను ॥ఇదియే॥

నారాయణ నీనామము దలచుట
సారపు చదువులు శాస్త్రములు
ఈ రీతి శ్రీవేంకటేశ నిన్ను గొలిచితి
వూరక ఇతరము లొల్ల నే యంకను ॥ఇదియే॥

**భావామృతం :**

ఓ నరులారా! నాకు ఇదియే (హరిభక్తి) మతము. ఇదియే నాకు వ్రతము కూడ. నేను ఉదుటుల కర్మలు (డాంబికంగా చేసే కర్మకాండను) ఇంక ఒల్లను (ఒప్పుకోను). నాకు అవన్నీ వ్యర్థమైనవే.

ఓ శ్రీహరీ! నైపుణ్యంతో నేను నిన్ను 'శరణు మహాప్రభో!' అన్నాను. అదే నాకు తపస్సు, జపము, ధర్మము. వాటన్నిటిలోనూ ఎదోఒక నెపము దోషము కనిపిస్తుంది. కావున ఏదో విధంగా కరుణించి నీవే నన్ను స్వీకరించావి. ఇకపై నేను ఉపమలు (ఇతర ఉపాయాలు). పుణ్యకార్యముల తతంగములను ఒల్లను. ఇంక నాకు సర్వస్వం నీ శరణాగతియే.

ఓ దేవదేవా! నేను నీ దాసుడను. నీ దాసుడ ననుకోవటమే నాకు ఇహము (ఈ లోకంలో సాధించాల్సింది), పరము (మరణించాక పైలోకాల్లో సాధించాల్సింది) భాగ్యము (లౌకికమైన సిరిసంపదలు). ఈ ప్రపంచమంతా నీమాయయే. దాన్ని తప్పుకోవాలనే మార్గాలు ఏవేవో శుభకార్యాలు నీకు జరిపించడం (కళ్యాణం చేయించటం వంటివి) కాదు. తృప్తి కోసం వాటి ననుసరించటం నిరుపయోగం. వాటి వల్ల 'ఒరిగే'దేమీవుండదు. ఇంక నేను ఆ మార్గాలను ఒల్లనుగాక ఒల్లను.

ఓ శ్రీమన్నారాయణుడా! నీ నామ సంకీర్తనమే నాకు సారపు చదువు (శ్రేష్ఠమైన విద్య), శాస్త్రము (ఆరుశాస్త్రములను అభ్యంసించుట). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ విధంగా నిన్ను ఆరాధిస్తాను. ఊరకనే ఏవేవో ఇతర మార్గాలను ఒప్పనుగాక ఒప్పను. నీవొక్కడివి నాకుంటే చాలు. ఇంకేమీ ఒద్దంటే ....ఒద్దు.

**5-32**

## మున్నుడి

అనన్య భక్తి ఒక్కటుంటే చాలు మానవజన్మ చరితార్ధమవుతుందంటున్నారు అన్నమాచార్యులవారు. మనందరి బ్రతుకులు, మనకష్టాలు కన్నీళ్ళు యెరిగినవాడు శ్రీహరి ఒక్కడే. అటువంటి హరిగురించి యెరుగుట మేలుకదా! అంటున్నారు. అనంతకోటి బ్రహ్మాండాలున్న ఈ విశ్వంలో యెంతమంది బ్రహ్మలు రాలేదు, పోలేదు. వాళ్లనే ఎవ్వరూ గుర్తుపెట్టుకోరు. పురుగుల్లాంటి మనుష్యుల్ని తలవను కూడా తలవరు. తపములు, కర్మకాండలు... ఇవన్నీ నిరుపయోగం. ఏడుకొండలవాడిని వేడుకోండి. అది చాలు ఆయనే చూసుకుంటాడు.

**చం॥ ఎరుగును శ్రీహరే అవని యెల్లరి పాట్లను జీవితంబులన్**
**ఎరుగుట మేలు కాదె హరి నెల్లరు? జెప్పెను అన్నమార్యుడున్**
**మరచిరి తొంటి బ్రహ్మలను మానవ కీటములన్ స్మరింతురే!!**
**మొరలిడి వేంకటేశ్వరుని మ్రొక్కుడు వీడుచు కర్మమార్గముల్**

**రాగం : హంసధ్వని**

హరియే యెరుగును అందరి బ్రతుకులు
యిరవై యీతని యెరుగుటే మేలు ॥హరియే॥

వెనకటి బ్రహ్మలు వేవేల సంఖ్యలు
యెనసి బ్రహ్మాండము లేలిరట
పెనగొనివారల పేరులు మరచిరి
మనుజ కీటకముల మరెవ్వడెరుగు ॥హరియే॥

ఆస దొల్లి మునులనంత కోట్లు
చేసిరి తపములు సేనలుగా
యే సిరులందిరి యెరుగ రెవ్వరును
వేసపునరులకు విధి యేదో ॥హరియే॥





కల వనేకములు కర్మమార్గములు
పలు దేవత లిటు పాటించిరి
బలిమి శ్రీవేంకటపతికి మొరయిడి
వెలసిరి తుదనిదె వెర విందరికి ॥హరియే॥

**భావామృతం :**

ఓ మానవులారా! శ్రీమన్నారాయణుడైన హరికి మాత్రమే మనందరి బ్రతుకుల గురించి స్పష్టంగా తెలుసు. ఆశ్రయించి ఆయనను యెరుగుటే మేలుకాని అన్యములైన మార్గములు నిరుపయోగం కదా!

అనంతమైన ఈ బ్రహ్మాండమును కొన్నికోట్ల కోట్లు సంవత్సరాలనుంచి అనేకమంది బ్రహ్మలు పరిపాలించారు. నేడు, వారిలో ఒక్కడి పేరైనా ఏ ఒక్కడన్నా 'స్మరిస్తున్నాడా'? ఇక కీటము (కీటకము) ల వంటి మనుష్యుల్ని యెవడన్నా గుర్తుపెట్టుకొంటాడా? అసంభవం.

ముక్తిపొందాలనే ఆశతో, పూర్వం కోట్లాది మునులు దండువలె (సేనలుగా) తపములను ఆచరించారు. వాళ్లకి యే సిరిసంపదలు దక్కాయి? మరి, దొంగవేషాలు వేసే మనిషి గురించి చెప్పేదేముంది? వీళ్లకి దక్కబోయే భాగ్యం యెవ్వడెరుగును?

అనేక శాస్త్రములు, వేదములు మనకు యజ్ఞయాగముల వంటి యెన్నెన్నో కర్మమార్గములను నిర్దేశించాయి. ఎంతోమంది దేవతలు కూడా వాటి నవలంభించి వెలసిరి. (దేవేంద్రులు కూడా అయ్యారు). వాళ్లల్లో ఒక్కడికీ ముక్తి దక్కలేదు. వాళ్ల పుణ్యం అయిపోగానే మళ్లీ నీచమైన మనిషి జన్మ యెత్తవలసిందే. మరి ఇక ఆ తిప్పలెందుకు? ఈ జన్మలోనే... శ్రీవేంకటేశ్వరునికి మొరపెట్టుకొని బలం కూడగట్టుకొని శరణుజొచ్చి ఆయనను, వదలక వుంటే చాలుకదా! 'తుదనిదె వెరవిందరికి' (చివరికి అదంరి దారీ ఇదే...)

## 5-33

## మున్నుడి

దేవదేవునికి శ్రీదేవికి పెండ్లి జరుగుతోంది. అన్నమాచార్యులవారి ఆనందం అవధులను దాటింది. చక్కటి పెండ్లిపాట వినిపిస్తున్నారు. దైవాంశ సంభూతులైన అన్నమయ్య కళ్లకు స్వామివారి పెళ్లికి వచ్చిన ఆహ్వానితులైన సమస్త దేవతలు, మునులు కనిపిస్తున్నారు. (మనబోటి అల్పుల కంత అదృష్టం ఎలాగోలేదు, కనీసం కీర్తన విని తెలుసుకొందాం). అప్సరసల నాట్యం కనిపిస్తున్నది. సుదర్శన చక్రం కనిపిస్తోంది. పెండ్లి 'చవికె' కళ్లకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. 'కోనేటిదండ' తిరువీధుల్లో ఊరేగే వధూవరులను కనులారా చూచి తరించండి.

**ఉ॥ ఆడిరి దేవకామినులు అల్లదె మ్రోగెను దేవదుందుభుల్**
**వేడుక దేవుడే కొలను వెంబడి ఆ తిరువీధి నేగెరో**
**పాడెను అన్నమయ్య తను పారవశంబున మేటి కీర్తనల్**
**జోడగు పెండ్లిపాట ఇది సొంపుగ దీనిని ఆలపించరో.**

### రాగం : సాళంగ

దేవకామినులాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుడు కోనేటి దండ దిరువీధి మెరసే ॥దేవ॥

యెత్తిరి గరుడ ధ్వజ మిందిరాపతి పెండ్లికి
యిత్తల సురలు మునులిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చెనదె కప్పురవిడేము
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుడు ॥దేవ॥

కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టె పేరటాండ్లు నేడిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్టలై తిరువాముడి ఘనులు వాడేరు ॥దేవ॥





వెలయ భాష్యకారులు విందు చెప్పె బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీవేంకటేశుడలమేలుమంగగూడె
వెలసేరు పెండ్లి చవికెలోన నదిగో ॥దేవ॥

### భావామృతం :

దేవదుందుభులు మ్రోగుతున్నాయి. (గంధర్వులు చక్కటి గీతముల నాలపిస్తున్నారు). ఆ పాటలకు తగ్గట్లు దేవకామినులు (దేవతాస్త్రీలు) నృత్యములు చేస్తున్నారు. దేవదేవుడు కోనేటి దండ (దగ్గర) పవిత్రమైన తిరుమలవీధులలో శ్రీదేవితో ఊరేగుచున్నాడు. చూచి తరించండి.

లక్ష్మీవల్లభుని పెండ్లి సందర్భంగా గరుడధ్వజమును ఎత్తినారు. అదిగో చూడండి. ఇత్తల (ఇక్కడకు) సమస్త మునులు, సురులు రాండ్రా! రండి. స్వామికి అప్తుడు, సేనాధిపతి అయిన 'విష్వక్సేనుడు' హత్తి (గజారూఢుడైవచ్చి) కర్పూర తాంబూలము అందించాడు. దాసాంజనేయుడు సంతోషంగా యాగశాల చేరుకొన్నాడు. (మీ మనోనేత్రంతో వారిని దర్శించి నమస్కరించండి).

కమలాపతియైన స్వామి పెండ్లికోసం 'కలువడాలు' కట్టినారు. పేరంటానికి వచ్చే ముత్తైదువులంతా వేగంగా కదలి రాండ్రా, రండి. (ఇంతమంది జనంలో రక్షణ ఉంటుందా అని భయపడకండి). గిరగిరా తిరిగి క్షణంలో మెడ ఖండించగల సుదర్శన చక్రం, మించి (అతిశయించి) రక్షణగా వున్నది. ఇంకేం భయం? ఘనులైన వైష్ణవులు భక్తితో 'నమ్మాళ్వారు' రచించిన 'తిరువాముడి' లోని పాశురములను కట్టలై (గుంపులు గుంపులుగా) పాడుచున్నారు.

భాష్యకారులు (వ్యాఖ్యానం చేయువారు అంటే నేటి భాషలో చెప్పాలంటే 'అనౌన్సర్' అన్నమాట) విందు చెప్పేరు. (భోజనాలకు రాండ్రా... అని పిలుస్తున్నారు). బువ్వాలవారు (భోజనాలు చేసేవాళ్లు) నెమ్మదిగా రండి. నెలవై, ఇక్కడ కావలసినంత చోటుంది. తోసుకోకండి. అలమి (కౌగలించి) శ్రీవేంకటేశ్వరుడు, అలమేలుమంగ అని ప్రసిద్ధి జెందిన తనదేవేరిని కూడినాడు. అదిగో మిమ్మల్ని ఆశీర్వదించటానికి ఇప్పుడు, చవికెలోన (కళ్యాణ మండపంలో) వెలసినారు. వారికి అంజలి ఘటించి మీ జన్మ తరింప చేసికోండి.

## 5-34

## మున్నుడి

జగజ్జనని అలమేల్మంగ సౌందర్యాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు "స్వామీ! ఈ విలాసములు, ఈ చక్కదనము ఈమెకే తగును. ఒక్కసారి భావించి ఆమె అంగాంగ శోభనాకళింపుజేసికోవయ్యా!" అంటున్నారు. మంచి పాండిత్యమున్నవారికి తేలికగా అర్థమయ్యే ఈ కీర్తన నేటి యువతరానికి కష్టసాధ్యమే. అయినా 'సాధనవలన పనులు సమకూరుధరలోన' అన్నారు పెద్దలు. శృంగారము మోతాదు మించకుండా జాగ్రత్తపడటం. విజ్ఞులు గమనించే వుంటారు.

**ఆ.వె॥ ఈ విలాసములును ఈ చక్కదనములు**
**యెంచి చూడతగును ఇంతికిపుడు**
**యెనసె నీదు 'లలన' ఇన్ని సింగారాల**
**అన్నమయ్య పాడె హరి మురియగ.**

**రాగం : కళ్యాణి**

ఈ విలాసంబులును ఈ చక్కదనములును
భావించి చూడ నీపడతికే తగును ॥ఈ విలాసము॥

నళనాక్షి చెక్కులివి నవ్వు వెన్నెల పొలము
విలుసాముగరిడీ బొమ్మలకు నొసలు
పలుకు జిలుకకు మోవి పంజెరపు దండెంబు
నలికుంతలముల కాణాచి పెనుగొప్పు ॥ఈ విలాసము॥

గురు కుచము లివియే సిగ్గులకు బుట్టిన ఇండ్లు
సరసముల కిరవు హస్తముల కదలు
సురతి విభవముల దాపురమున నెయ్యపు బిరుదు
కరుల యానముల నిలుకడ వనము తొడలు ॥ఈ విలాసము॥





అన్నువగు నడుము గుట్టనెడి సింహపు నెలవు
తిన్నని మొగము కళలు దేరు తెంకి
మన్నించి యేలితివి మరిగి శ్రీవేంకటేశ
ఇన్ని సింగారముల నెనసె నీ లలన ॥ఈ విలాసము॥

**భావామృతం :**

ఓ తిరుమలనాయకా! ఈ పడతి (యువతి) యొక్క విలాసములు (ప్రియుని సందర్శించగా స్త్రీలో కలుగు శృంగార రూప చేష్టా విశేషములు), చక్కదనము ఈమెకే తగియున్నవి. భావించి చూస్తే) ఈ అలమేలుమంగ కొక్కదానికే ఇవి తగును స్వామీ!

ఈ పద్మనయని యొక్క చెక్కిళ్లు, వెన్నెలవంటి నవ్వులు పండించు పొలములు. ఆమె కనుబొమ్మలు విల్లులవలె చక్కగా వంగియున్నవి. ఆమె నుదురు సాముగరిడి అభ్యసించు రంగము వలె ప్రస్ఫుటముగా వున్నది. మాటలు నేర్చిన చిలుక పంజరంలో దండెము మీద (అడ్డంగా అమర్చిన కొయ్యబద్ద) ఎఱ్ఱటి దొండపండుని తింటుంది. ఈ దేవి క్రింది పెదవి ఆచిలుకకిచ్చిన దొండపండు వలెనున్నది. ఈమె పెద్దకొప్పు నల్లని కేశములకు సుస్థిరస్థానమన్నట్లున్నది.

ఈ దేవి ఘన ఉరోజములు సిగ్గుల పుట్టిళ్లు. ఈమె చేతుల కదలికలు సరసపు చేష్టలకు నెలవులు. సురతము ఈమెకందించిన వైభవమే. శూరునకొసగిన ఇంపైన బిరుదమువలె జూపట్టు చున్నది. ఈమె ఊరువులు గజగమనమునకు ఆవాసములైన వనములు (స్థానములు). (ఇంతకంటే వివరణము అనవసరం అని నా భావన).

స్వామీ! అన్నువగు (అల్పమైన) ఈమె నడుము కొండగుహలో దాగిన సింగమును స్ఫురింపజేయుచున్నది. తిన్నని (మనోజ్ఞమైన) ఈమె వదనము కళలు దేరిన తెంకి (సుస్థానము). ఈ అలమేల్మంగను కరుణించి నీ దానిగా చేసికొంటివి. అందుచేత ఈ యువతి ఇన్ని వైభములను యెనసినది (పొందినది), అనగా నీ హృదయాన్ని చేరుకొన్నది. నీ దేవేరియైనది.

**5-35**

## మున్నుడి

బ్రహ్మోత్సవములు జరుగుతున్నాయి. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు, సూర్యప్రభ వాహనంమీద వూరేగుతున్నాడు. కోటి సూర్యుల తేజోమూర్తి స్వామి. చంద్రముఖియైన అందాలరాశి అలమేల్మంగ, ఆయన జోడై సూర్యప్రభ వాహనంలో భక్తుల మనస్సులను పులకరింపచేస్తున్నది. అన్నమాచార్యులవారు "ఇట్లాంటి విపరీతములు" వినను కూడ లేదు. ఎట్లాంటి ఉపమానాలైనా మీ దగ్గరనే వున్నాయి అని మెచ్చుకొంటున్నారు అన్నమయ్య. రేయింబవళ్ల వలె విడరాని జంట వారిది. కాంతుల కళల కలయిక అది... ఆహా! ఏమికీర్తన!!!

**కం॥ విపరీతము లివి వినుమా**
**వుపమలు మీవొద్ద కలిగె వున్నతముగ నీ**
**విపుడీ సూర్యప్రభలో**
**అపరంజౌ లలన గలియ, అన్నయ్యనెరా.**

**రాగం : నాగ గాంధారి**

విపరీతము లివి వినరాదు
వుపమ లెల్ల మీ వొద్దనె కలిగె ॥విపరీత॥

వువిద వదన చంద్రోదయ వేళను
రవియగు సూర్యప్రభ నీవేగగ
యివల నవల మీ యిద్దరి వలననే
దివమును రాతిరి దెలియగ గలిగె ॥విపరీత॥

అంగన తురుము మహర్నిశి వేళను
రంగగు సూర్యప్రభ నీవేగగ
సంగడి వెలుగును సరిజీకటియును
చెంగట మీయందే చెప్పగ గలిగె ॥విపరీత॥





కాంతమోవి చుక్కల నిండువేళ
రంతుల సూర్యప్రభ నీవేగగ
యింతట శ్రీవేంకటేశ్వర మీ యందే
కాంతులు గళలును గలయుట గలిగె ॥విపరీత॥

**భావామృతం :**

ఇవి (బ్రహ్మోత్సవములలోని ఈ వూరేగింపులు) విపరీతములు (అసామాన్యమైనవి). వీని వైభవమునకు సాటియైన వానిని గూర్చి వినరాదు (వినుట జరుగదు). ఎట్లాంటి ఉపమానములైనను మీ దగ్గరనే వున్నాయి. (అంటే మీకు మరొక పోలికలేదు అని అర్థం).

స్వామీ! ఆ భామిని వదనము అనెడి చంద్రుడు ఉదయించుచున్నవేళ సూర్యప్రభ వాహనముపై రవియగు (సూర్యభగవానని వంటి) నీవు వెళ్లుచుండగా, ఇవల అవల (ఇక్కడ భూమిమీద అక్కడ ఆకాశంలోను) మీ ఇద్దరి వలననే రేయింబవళ్ళు కలిగినవా అనిపించుచున్నది.

ప్రభూ! ఆ అలవేల్మంగమ్మ ఘనమైన 'కొప్పు' గొప్పనిశిరేయిని తలపించుచున్నది. ఈవేళ రంగులీను సూర్యప్రభ వాహనంపై నీవు పోవుచుండగా, సంగడి వెలుగు (జతకట్టుటకు వచ్చిన వెలుతురుతో) సరిజీకటియును (సమవుజ్జీ అయిన చీకటియును) ఎదురుగా మీయందే ఆ చీకటి వెలుగులున్నట్లు అనిపించుచున్నది.

దేవదేవా! కాంతమోవి "చుక్కలు నిండువేళ" (ఈ రాత్రిపూట) చుక్కలవలె మిలమిల మెరయుచుండగా రంతుల (క్రీడవలె) సూర్యప్రభవాహనముపై నీవు వూరేగుచుంటివి. ఇప్పుడు ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరిలోనే కాంతులు, కళలు కలసిపోవుట జరిగినది. మిమ్మల్ని చూచువారిదే కదా! మహత్ భాగ్యమంటే.

## 5-36

## మున్నుడి

చక్కటి తత్త్వ బోధచేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇహలోకంలో (ఇహము) బంధాలను వదలించి, తెగకొట్టుకొనేదాకా పరమునకు (మోక్షమునకు) తెరవు లేనేలేదు (మార్గములేదు). పగ, ద్వేషం వంటి మనో వైకల్యాలను విడనాడక భవము (ప్రాపంచిక చింతన, చింతనవల్ల జనన మరణాలు) పోదు (తప్పదు). ఎప్పటికైనా అంతే. శ్రీవేంకటేశ్వరుడు దయచూచిన ఆయన దాసులకి మాత్రం ఈ తిప్పలుండవు. అప్పటికప్పుడే వాళ్లకి వైకుంఠం దక్కుతుందట. చెబుతున్నది శ్రీహరి 'నందక ఖడ్గం' కాబట్టి దీనికి తిరుగులేదు.

**ఆ.వె॥ తెగక పరమునకును తెరవు లేనేలేదు**
**పగను విడువకుండ భవము పోదు**
**తత్త్వబోధ చేసె తా నన్నమార్యుండు**
**ఏడుకొండలయ్య కదు మురియగ.**

**రాగం : లలితపంచమా**

తెగక పరమునకు తెరవులేదు
పగయెల్లా విడువక భవమూ పోదు ॥తెగక॥

కన్నుల యెదుటనున్న కాంచనముపై మమత
వున్నంత దడవు మోక్ష మొనగూడదు
అన్నము తోడి రుచుల యలమట గలదాకా
పన్నిన సుజ్ఞానము పదిలము గాదు ॥తెగక॥

పక్కనున్న కాంతల భ్రమగల కాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపు సంసారవిధి నున్నంత దడవు
నిక్కి పరమధర్మము నిలుకడ కాదు ॥తెగక॥





చిత్తము లోపలి పలు చింతలు మానిన దాకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశు దేలిన దాసులకైతే
హత్తి వైకుంతపదవి అప్పుడే కలదు ॥తెగక॥

**భావామృతం :**

ఓ నరులారా! తెగక (ఇహలోకంలో బంధాలను తెగకొట్టుకోకుండా) పరమునకు (మోక్షమునకు) తెరవులేదు (దారిలేదు). అదే విధంగా పగ ద్వేషం వంటి మానసిక వైకల్యాలను విడిచి పెట్టకుండా, భవమూ (చావు పుట్టుకలతో కూడిన సంసార తాపత్రయము కూడా) పోదు.

మన కళ్ళ ఎదుటనే మిలమిల మెరిసే బంగారంపై మమత వున్నంత తడవు (వ్యామోహం ఉన్నంత దాకా) మోక్షం ప్రాప్తించదు. అన్నం కేవలం బ్రతుకుటకు తినాలి. కాని రుచులకోసం అలమట (చింత) వున్నంతవరకు పన్నిన సుజ్ఞానము (కలిగిన చక్కటి జ్ఞానము) పదిలము కాదు (జాగ్రత్తగా స్థిరపడదు). కాబట్టి తిండిపై యావ వదలిపెట్టక జ్ఞానప్రాప్తి ఎలా సాధ్యపడుతుంది?

మన ప్రక్కనే వున్న స్త్రీలపై భ్రమ వున్నంతకాలం శ్రీహరిపై భక్తి మెరయలేదు. సదాహరిని గాక వారినే కాంక్షించి వెంపర్లాడాను. వెక్కసమైన (అధికమైన) సంసార తాపత్రయం వున్నంతవరకు ఉన్నతమైన ధర్మచింతనపై ధ్యాస నిలువదు. జీవితాంతం ధర్మమార్గం వదలి తనకి అనుకూలమైన మార్గంలోనే వుంటాడు.

ఆ విధంగా తన చిత్తములో అనవసరమైన చింత మాననంత దాకా బలంగా వైరాగ్యం సమకూడదు. ఇంత కథవున్నది. అన్నంతో మొదలై మన్నులో కలిసేదాకా చింత, ఆశ, రాగద్వేషాలు పోనేపోవు. దానివల్ల జన్మల చక్రభ్రమణం తప్పదు. ఇత్తల (ఈలోకంలో) శ్రీవేంకటేశ్వరుడు అనుగ్రహించిన ఆయన దాసులకైతే అప్పటికప్పుడే హత్తి (కూడి) వైకుంఠపదవి (వైకుంఠప్రాప్తి) కలుగుతుంది.

**5-37**

## మున్నుడి

మధురాతి మధురమైన శ్రీరామనామ సంకీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు గీర్వాణిలో ఆనందరస సిద్ధిని కలిగించే కీర్తన ఇది. శ్రీరాముడు రావణాసురవైరి, కాని శ్రీరామునికి వైరిభావం లేదు. ఆయన దుష్టశిక్షణ కోసమే వాణ్ణి సంహరించాడు. నీలజీమూత సన్నిభుడట. భూలల నాధిపుడట. పరమనారాయణుడట. శంకరార్చిత జనక చాప దళనుడట. లాలిత విభీషణుడట. వేరెవ్వరూ రామచంద్రునికి ఇట్లా కీర్తించలేదు "తాలాహి నగహరం" అంటే ఏమిటో చెప్పగలరా? ప్రయత్నించండి...

**తే॥ దేవదేవా! భజింతు ప్రభావ! దివ్య!**
**వైరి రావణు దునుమాడిన రఘురామ!**
**తేనెలూరెను వినవయ్య! తిరుమలేశ!**
**అద్భుతంబుగ పాడిరి అన్నమయ్య.**

**రాగం : హిందోళ**

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘు పుంగవం ॥దేవదేవం॥

రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజాను బాహుం నీలాబ్జకాయం
రాజారి కోదండ రాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం ॥దేవదేవం॥

నీలజీమూత సన్నిభ శరీరం ఘన వి-
శాల వక్షం విమల జలజనాభం
తాలాహి నగ హరం ధర్మ సంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం ॥దేవదేవం॥





పంకజాసన వినుత పరమనారాయణం
శంకరార్జిత జనక చాప దళనం
లంకా విశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం ॥దేవ దేవం॥

**భావామృతం :**

దేవదేవుడైన ఓ శ్రీరామచంద్రా! దివ్యమైన ప్రభావము కల వాడివి. రఘుపుంగవుడివి. (రఘువంశమున జన్మించిన శ్రేష్ఠుడవు). రావణాసుర వైరివి. (రావణునికి శత్రువుడవు). అట్టి నిన్ను భజించెదను.

తండ్రీ! నీవు రాజవరశేఖరుడవు (శ్రేష్టమైన రాజుల కెల్ల ఉన్నతుడవు). రఘువంశమునకు సుధాకరుడవు (చందమామవు). ఆజానుబాహుడవు (మోకాళ్లను తాకు చేతులు కలవాడవు). నీలాబ్జ కాయుడవు (నల్లని తామర పూవు వర్ణమున్న శరీరం కలవాడవు). దుష్టశిక్షణ అనే రాజదీక్షతో (విశిష్టమైన దీక్షతో) ఎప్పుడూ కోదండమనే వింటిని ధరించియున్న గురుడవు (రక్షకుడవు). రాజీవలోచనుడవు (పద్మనేత్రుడవు). అట్టి శ్రీరామచంద్రా! నీకు నమస్కరించెదను.

శ్రీరామా! నీవు నీలజీమాత సన్నిభ (నల్లని మేఘము వలె మెరియు) శరీరం కలవాడవు. ఘనమైన విశాల వక్ష స్థలము కలవాడవు . పద్మనాభుడైన శ్రీహరివి. "తాలాహి నగహరుడవు" (ఇక్కడ 'నగ"తాల'కు అన్వయించుకొని 'తాలనగము'అంటే 'తాటిచెట్టు' అని 'అహి' అంటే 'సర్పము' కాబట్టి 'తాలాహి నగహరుడు' అంటే తాటి చెట్టు రూపంతో వున్న అసురుని సర్పము రూపంలో వున్న అసురుని హరించినచో బలరాముడై ధర్మ సంస్థాపనకు అవతరించినవాడవు. భూకాంతాకాంతుడవు. (చక్రవర్తివి అని కూడా చెప్పవచ్చును). భోగిశయనం (నాగేంద్రుడైన ఆదిశేషునిపై పవ్వళించియుండే ఆదిమూర్తివి).

ప్రభూ! నీవు పంకజాసన వినుత పరమ నారాయణుడవు (బ్రహ్మచే కీర్తింపబడు శ్రీమన్నారాయణుడవు). శంకరార్చిత, జనక చాపదళనం (అని విడదీసి అర్ధం చెప్పుకోవాలి.) శంకరునిచే అర్చించబడువాడవు, జనకుని వద్దనున్న శివధనస్సును భేదించినవాడవు. లంకను దహించినవాడవు. లాలితవిభీషణం (విభీషణుని బుజ్జగించిన వాడవు). సాధువిబుధ వినుతుడవు (సాధువులైన బుద్ధిమంతులచే కీర్తింపబడువాడవు). శ్రీవేంకటేశ్వరుడవు నీవే.ఓ మహానుభావా! నీకు నమస్కరించెదను.

## 5-38

## మున్నుడి

నేటి 'కడప' జిల్లా కడప తాలూకాకు చేరిన "నందిమండలము"నకు దక్షిణమున 'పాలకొండ' పర్వతమందలి 'కోన'లో చక్కని 'యూటలు' గల ప్రదేశమున్నది. ఇది చాల పవిత్ర ప్రదేశముగా నెంచబడుచున్నది. అచట చెన్నరాయని దేవాలయము వొకటి కలదు. చెన్నరాయుని కీర్తించుచు, అన్నమాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తన ఇది. ఓ కోన చెన్నకేశవా! నేనొకటి చేస్తే నీవొకటి చేస్తావు. ఇంకనైనా నీ గుణములను మానవు. ఆనపెట్టు కోవటం నీ ప్రత్యేకత. మమ్మల్నీ ఆనలతోనే రక్షించు"....

**కం॥ "నేనొకటి సేయగా, నువు**
**మానక సేసేవు వొకటి మానవుగుణముల్**
**'కోన'లొ చెన్నా! నెలకొని**
**ఆనల బ్రోచేవు మమ్ము" అన్నయ్యనెరా.**

**రాగం : పాడి**

నేనొకటి సేయగాను నీవొకటి సేసేవు
కోనచెన్న రాయడ నీ గుణ మింక మానవు ॥నేనొకటి॥

పక్కన నే నీతోడ పకపక నగగాను
తెక్కుల నీ వైతే నేల తిట్ట వచ్చేవూ
మొక్కలము విడిచి నే ముచ్చటలాడుకోగాను
వెక్కసపు వెంగమని వేరె తలచేవూ ॥నేనొకటి॥

తనివోక నే నిన్ను తప్ప కిట్టి చూడగాను
తనువు చూచుక నీకే తలవంచేవు
అనుమానము లేదని ఆన నీపై బెట్టగాను
పెనచి నీ వామాట పేరడి బెట్టేవూ ॥నేనొకటి॥





కందువ లంటుచు నిన్ను కాగిట నించగాను
పొందుల నుప్పు వేసి పొత్తు గూడేవూ
అందపు శ్రీవెంకటేశ అట్టె కోన చెన్నడవై
ముందు వెనకా గూడి మోహము చల్లేవూ ॥నేనొకటి॥

**భావామృతం :**

ఓ కోన చెన్నకేశవా! నేను వొకటి చేస్తే ప్రతిగా నీ వొకటి చేయుచున్నావు. ఇకనైనా నీ యొక్క యీ గుణములను మానుకోవు. (ఇక ఎట్లాస్వామీ?)

నేను నీతో ఒక పక్కన పకపకా నవ్వితే నీవు నన్ను తెక్కులితో (యౌవన గర్వంతో) ఏల తిట్టవచ్చేవు ప్రభూ! సరే నీకు కోపము వచ్చిందేమోనని మొక్కలము (కపటము) విడిచిపెట్టి నేను నీతో మాట్లాడితే, నీవేమో వెక్కసపు వెంగెమున (అధికమైన వ్యంగ్యముతో) అన్యథా భావిస్తావు. చెన్నకేశవా! నీతో గొప్పచిక్కు వచ్చిందయ్యా.

తనివోక (తృప్తి దీరక) నేను నిన్ను తిలకించగా, నీవు ఈకెకు (ఈమెకు) తలవంచేవు (లొంగిపోయెదవు). కానీ నీపై ఏ అనుమానమూలేదని నీపై ఒట్టు పెట్టుకొంటే నన్ను పెనవేసికొని నీవా మాటను మఱచి నన్ను మన్నింతువు. ఓ చెన్నకేశవా! నీ ఆంతర్యం నాకు అవగతం కాక తికమక పడుచున్నాను.

కందువలంటుచు నిన్ను కౌగిటనించగా (చమత్కారమును చూపించుచు నిన్ను నా కౌగిట నింపుకొనగా) నీ పొందుతో ఉప్పువేసి పొత్తుగూడేవు (ఆవిరి కుడుములా వుడికించి నన్ను సంగమించేవు). అందగాడివైన శ్రీవేంకటేశ్వరా! నీవే కోనలో చెన్నకేశవుడవై ఇరువైపులనుండి నన్ను మోహమున ముంచెదవు.

## 5-39

## మున్నుడి

దేవతల దగ్గరవుండే కల్పవృక్షం, చింతామణి, కామధేనువు నరులకిచ్చినా నిరుపయోగమే అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎందుకంటే పరమాత్మమాయలో జిక్కి పాపం వాడు మోసపోతున్నాడు. విమోహితుడై కాసు (అరదమ్మిడీ) విలువ చేయని పనికి అనేక తిప్పలు పడుతున్నాడు. కాని జగద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించటం లేదు. కామంతో గుడ్డివాడై, సుఖాల ఎండమావుల వెంట తిరుగుతూ జన్మల వైకుంఠపాళిలో నిచ్చెనలెక్కతూనే వున్నాడు, పాములకి చిక్కుతూనేవున్నాడు.

**ఉ॥ మోసపు మాయలన్ బలు విమోహితుడై చెడిపోయె ప్రాణి తాన్**
**గాసిబడెన్ అహో!! అవని కాతర జెందెను అన్నమయ్యనెన్**
**కాసుకుగానిదౌ పనికి కష్టము వద్దని బుద్ధిజెప్పెరా**
**ఈసు నెరుంగరాని జగదీశ్వరు జేరుదు వేంకటేశ్వరున్.**

**రాగం :ముఖారి**

మోసమున మాయా విమోహితుడైపోయి
కాసుసేయని పనికి గాసిపడె ప్రాణి ॥మోసము॥

కన్నులనియెడి మహాకల్పభూజములివి
తన్నుపుణ్యుని చేయతగిలి వచ్చినవి
వున్నతోన్నత బుద్ధినొసగూర్ప కది దేవి
కన్నచోటికి బఱపి గాసిపడె ప్రాణి ॥మోసము॥

చిత్తమని యెడిమహా చింతామణి దనకు
తొత్తువలె వలసి తను తోడు తేగలది
హత్తించి హరి మీద నలరింపకది వృథా
తిత్తిలో సుఖమునకు తిరిచెనీ ప్రాణి ॥మోసము॥





కామతత్త్వం బనెడి కామధేనువు తనకు
వేమారు కోరికల వెల్లిగొలిపెడిది
ఈమేను తిరువేంకటేశుజేరకపోయి
కామాంధుడై మిగుల గతిమాలె ప్రాణి ॥మోసము॥

**భావామృతం :**

ప్రాణి అని వ్యవహరింపబడుతున్న జీవుడు తానూ నిజానికి పరమాత్ముడే. వాడు అంతర్యామి. కాని పరమాత్ముని మాయలో విమోహితుడై మోసపోతున్నాడు. కాసుకు కూడా కొరగాని పనికి వ్యధజెందుతున్నాడు. పరమాత్మ వాడిపై దయతో యెన్నో ఇచ్చినా వినియోగించుకోలేక పోతున్నాడు.

స్వామి వాడికి 'కన్నులు'అనే మహా కల్పవృక్షములను ఇచ్చాడు వాడిని పుణ్యాత్ముని చేయటానికి వాడికవి వచ్చాయి. వాటికి సద్బుద్ధిని జతచేసి ఉన్నతమైన స్థితికి చేర్చకుండా దేహియైన జీవుణ్ణి అవి యెక్కణ్ణించి పుట్టాడో దానికే తగులుకొనేట్లు చేసినందువల్ల ఎంతో కష్టపడుతున్నాడు. ఎంత మోసపోతున్నాడు!!

ఆ దేవదేవుడు ఈ ప్రాణికి 'చిత్తము' అని పిలువబడే గొప్ప చింతామణి వంటి దివ్యమణినిచ్చాడు. అది నీ తోడుండే... నీతొత్తు (బానిస) రా నాయనా! దాన్ని హరిభక్తికి హత్తించు (కలిగించు), అంటే.. అలా చేయక వృధాగా 'తిత్తిలో సుఖమునకు' (గాలి తిత్తిలో వుండే క్షణికమైన గాలి వలె క్షణికమైన సుఖము కోసం), ఈ ప్రాణి వెంపర్లాడుతున్నాడు. ఎంత వింత!!

ఏ పూజచేయాలన్నా, యజ్ఞయాగాదులు చేయాలన్నా ప్రాణికి దేహం ఆవశ్యకమే. దీనికి కామతత్త్వం అనే కామధేనువు తోడిచ్చినందువల్ల వేలాది కోర్కెల పరంపర కలుగుతున్నది. ఈ దేహాన్ని తిరువేంకటేశ్వరుని వద్ద చేర్చుటకు ఆ కోరికలను అనుసంధానం చేయాలి. దానివల్ల ముక్తిని పొందాలి. అంతేకాని ఈ ప్రాణి మిక్కిలి కామాంధుడై గతి తప్పి వ్యవహరిస్తే ఆ కామధేనువు తోడున్నా లాభంలేదు కదా!

**4-40**

## మున్నుడి

నాకు అత్యంత ప్రీతిపాత్రమైన పది అన్నమాచార్యులవారి కీర్తనలు చెప్పమని అంటే ఈ కీర్తనని చెప్పక తప్పదు. కరుణరసప్రధారమైన ఈ అద్భుత శరణాగతిలో రాళ్ళను సైతం కరిగించగల ఆర్ద్రతవుంది. శ్రీవేంకటేశ్వరుని పై భక్తిగల ప్రతి ఒక్కరూ తన్మయత్వంతో పరవశించు ఈ కీర్తనను తోడిరాగంలో ఆనందించని వారుండరు. "సాకారరూపాం నీకే శరణుజొచ్చితిని" అంటున్నారు. పరమాత్ముడు నిరాకార నిరంజనుడు. నిర్గుణుడు. జీవుల కర్మఫలప్రదాత. ఇదే నిజం. కాని సాకారుడుగా ధ్యానించేది మన మనస్సు ఆయన పై నిలువటానికి, పూజలన్నీ మన తృప్తికే. ఆయనకు భక్తుల అనన్య భక్తి మాత్రమే.. కావాలి నిరాకారునిగా కూడా...

**కం॥ ఆలింపు మాది పురుషా!**
**పాలింపుము శరణ మిమ్ము ప్రార్ధించి రహో!**
**జాలిగ వేడిరి అన్నయ**
**లీలాసాకారమూర్తి రిపుదమను హరిన్.**

**రాగం : తోడి**

ఆలించు పాలించు ఆదిమపురుషా
జావిదీర నీకే శరణుజొచ్చితిని ॥ఆలించు॥

గతినీవె మతినీవె కర్తవు భర్తవు నీవె
పతివినీవె ఏ పట్టున మాకు
ఇతరము లెవ్వరున్నారెంచి చూడ నిను బోల
చతురడా నిన్నునే శరణు జొచ్చితిని ॥ఆలించు॥

జననీ జనకులు శరణము నీవె
వునికి మనికి నీవె వుపమ నీవె
మనసిచ్చి నీవె మన్నించుకొంటేను
చనవి మనవి నీకే శరణుజొచ్చితిని ॥ఆలించు॥





లోక సాక్షివి నీవె లోకబంధుడు నీవె
ఈకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీ కంటె మరిలేరు నిఖిలమంతయు గావ
సాకారరూప నీకే శరణు జొచ్చితిని ॥ఆలించు॥

**భావామృతం :**

ఓ ఆదిమపురుషా! (ఆదిమూర్తీ!) నాపై జాలి చూపించి నాకు శరణు ప్రసాదించుము తండ్రీ! నీకే శరణన్నాను. నా మొరలను ఆలింపుము. నన్ను దయతో పరిపాలింపుము.

ప్రభూ! గతినీవే (నీవే దిక్కు), మతినీవె (మా మేధాశక్తి కూడ నీవే), మా భర్తవు నీవే, మా కర్తవు (మేము చేస్తున్నట్లు కనుపించినా ఇవన్నీ మా చేతచేయించే అసలు కర్తవు) నీవే. ఈ సమయంలో మా పతివి (నాథుడవు అంటే యజమానివి) నీవే. నిన్ను పోలిన 'స్వామి' వేరెవ్వరున్నారు నాకు? సాటిలేని చతురుడవు (నేర్పరివి) యైన నీకునేను శరణువేడాను. నన్ను అనుగ్రహింపుము తండ్రీ!

ఓ దేవదేవా! మాకు శరణమిచ్చే తల్లీతండ్రీ కూడ నీవే. మా ఉనికి (ఉండటానికి కారణం అంటే ఈ రూపంలో వుండటానికి), మనికి (ప్రాణంతో వుండటానికి కారణమూ) నీవే. మా 'ఉపమ' (ఉపాయము) కూడ నీవే నీవు నీమనస్సులో నాకు స్థానమిచ్చి మన్నించకపోతే నాకు వేరే ఆధారం యేది? నా చనవి నీవే (నా అధికారమూ నీపైనే చెల్లుతుంది). నామనవి (విన్నపాలూ) నీకే. అందుకే నీవే శరణంటున్నాను.

ఓ సర్వేశ్వరా! ఈ లోకమునకు సాక్షీభూతుడవు నీవే. దీనికి పరమ ఆప్తబంధువు నీవే. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు, ఇక్కడగాని, ఈ లోకమంతా వెదకి చూచినా గాని నీ కంటె మరెవ్వరూ నాకు దిక్కులేరు. సాకారరూపునిగా పెద్దపెద్ద నామాలతో వున్న నీ మూర్తిని ధ్యానిస్తూ నిన్ను శరణు వేడుకొంటున్నాను. ఈ దీనునికి దయతో శరణమును అనుగ్రహింపుము తండ్రీ!

**5-41**

## మున్నుడి

'మూలము' అంటే వేరు, ఆధారము అని అర్థాలున్నాయి. 'అన్నిటి కాధారమైన ఆదిపురుషుడీతడని' అన్నమాచార్యులవారు వేరొక సంకీర్తనలో శ్రీహరిని కీర్తించారు. కావున ఈ 'మూలము'నకు ఆధారమనే చెప్పుకొందాం. అందరు వేల్పులకు ఈ వెన్నుడే వేల్పు. ఈయనపైన యెవ్వరూ లేరు. ఈయనే 'యెగువలోకపతి' అంటున్నారు. 'ముంచిన' అంటే యెవరినో దివాలా యెత్తించాడని కాదు, 'పూర్వకాలం వాడయిన' అని అర్థం. 'ఆదికి ననాది' అని ఇదివరలో కీర్తించారు అన్నమయ్య. యెనలేని దైవమీ శ్రీవేంకటేశ్వరుడే నంటున్నారు.

**కం॥ అన్నిటికి మూలమితడే**
**వెన్నుని తలదన్నువాని విన్నావట రా?**
**అన్నియు వేంకటనాథుడె**
**అన్నయ్యనె కీర్తనంబు అద్భుతము హరీ!**

**రాగం : పూర్వి కళ్యాణి**

అన్నిటికి మూలం బితడు
వెన్నుని కంటెను వేల్పులు లేరు ॥అన్నిటికి॥

పంచభూతముల ప్రపంచ మూలము
ముంచిన బ్రహ్మకు మూలము
పొంచిన జీవుల పుట్టుగు మూలము
యెంచగ దైవము ఇతడే కాడా ॥అన్నిటికి॥

వెనుకొని పొగడేటి వేదాల మూలము
మునుల తలపులకు మూలము
ఘన యజ్ఞాదుల కర్మపు మూలము
యెనలేని దైవమితడే కాడా ॥అన్నిటికి॥





అగపడి సురులకు నమృత మూలము
ముగ్గురు మూర్తులకు మూలము
నగు శ్రీవేంకటనాథుడే మూలము
యెగువలోకపతి యితడే కాడా ॥అన్నిటికి॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ శ్రీమన్నారాయణుడే అన్నిటికీ మూలము (ఆధారము). ఈ వెన్నుని (శ్రీహరి) కంటే ఇతరములైన దేవత లెవరున్నారు? లేనే లేరు.

ఈ ప్రపంచమంతా 'భూమి, నీరు, వాయువు, వేడిమి, శూన్యము' అనే పాంచ భౌతికమైనదే. ఆ పంచభూతములే ఈ ప్రపంచానికి మూలము, అనిపించినా వాటికి మూలమైన శ్రీహరియే అసలు మూలము. ఆయనే ముంచిన బ్రహ్మకు (పూర్వకాలంవాడయిన చతుర్ముఖ బ్రహ్మకు) ఆధారము. పొంచిన జీవులకు (ఎక్కడో తెలియనిచోట మరుగునవున్న జీవాత్మలకు) పుట్టుకకు ఆధారమీ మహానుభావుడే. మరి, యెంచగ (తలచవలసిన) దైవం ఇతడు కాడా? ఇంకొక రెవరు?

వెనుకొని (విలువ తెలుసుకొని) వేదములన్నియు కీర్తించెడి మూలపురుషుడితడే. మునులందరు భావించెడి మూలపురుషుడు కూడ ఈయనే. ఘనమైన యజ్ఞయాగములకు కర్మఫల ప్రదాత అయిన 'యజ్ఞమూర్తి' ఈ మూలపురుషుడే. ఈతడు అగణితుడైన దైవము కాకపోతే ఇంకొకరెవరు?

ఆనాడు సాగరమథనం సమయంలో మోహిని రూపంలో అగపడి దేవతలకు అమృత మిప్పించిన ఆధారభూతుడీ చిరునవ్వులు చిందిస్తున్న శ్రీవేంకటేశ్వరుడే. ఈయనే ముగ్గురు మూర్తులకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పిలువబడే త్రిమూర్తులకు) మూల పురుషుడు. యెగువలోకపతి (ఊర్ధ్వలోకములైన ఏడు లోకములకు) ఈ ఏడు కొండలవాడే నాథుడు కాడా? ఇంకెవరున్నారు?

**5-42**

## మున్నుడి

సుప్రసిద్ధము, మధురాతి మధురమైన అన్నమాచార్యులవారి "వైరాగ్య కీర్తన" నాస్వాదించండి. అమృతపు వర్షంలో తడిసినట్లుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మాయవల్ల జీవితం 'జుర్రు' కొందామనే భ్రమలో ఏవేవో అడియాసలతో సంతోషమే పరమావధిగా బ్రతికాను. ఆ నవ్వులే నిత్యమూ వుంటాయని చంచలమనస్కుడనై భామినుల పరిష్వంగ సుఖంకోసం పరితపించాను. వేయి నామముల వేల్పువయిన నిన్ను మఱిచాను. పాత జన్మపాపం ఇంకా తీరనేలేదు... ఈ జన్మపాపం సంగతేమిటి? ఓ అయ్యా! నీవే దిక్కు. నన్ను రక్షించు అంటున్నారు.

**చం॥ నగవులు నిక్కమా? కనుము నమ్మకు వాటిని అన్నమయ్యనెన్**
**వొగి నడియాసలన్ బడకు, వొద్దనె సత్యము తేల్చి చెప్పెరా**
**తగునిక వేంకటేశ్వరుని దారిని చెంచల మేలరా? యనెన్**
**అగజనుతున్ హరిన్ గొలిచి అద్భుత కీర్తన మెంచి చెప్పెరా.**

**అగజనుతున్ = పార్వతీదేవిని స్తుతించు**

**రాగం : యమన్ కళ్యాణ్**

నగవులు నిజమని నమ్మేదా
వొగి నడియాసలు వొద్దనవే ॥నగవులు॥

తొల్లిటి కర్మము దొంతుల నుండగ
చెల్లబో యిక చేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుడా
వొల్లనొల్లనిక వొద్దనవే ॥నగవులు॥

పోయిన జన్మము పొరుగుల నుండగ
ఛీయనక యిందు చెలగేదా
వేయి నామములు వెన్నుడ మాయలు
వోయయ్య యిక వొద్దనవే ॥నగవులు॥





నలి నీ నామము నాలిక నుండగ
తలకొని యితరము తలచేదా
బలు శ్రీవేంకటపతి నిన్ను గొలిచి
వొలుకు చెంచలము లొద్దనవే ॥నగవులు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! ఈ నగవులు (సంతోషం) నిజమని (శాశ్వతమని) నమ్మమంటావా? 'ఒగి నడియాసలు' (ఒగిన్ + అడియాసలు = క్రమంగా జరుగుతాయిలే అనుకునే ఆశలు) వొద్దనవే (నాకు అవసరం లేదు అనలేకున్నానే... ఏమిటయ్యా! నీమాయ ప్రభూ! నాకు 'తొల్లిటి కర్మల దొంతర' (పూర్వం జన్మలనుంచీ చేసిన కర్మఫలమే గుట్టలు గుట్టలుంది). చెల్లబో (అమ్మయ్యో!!) యిక చేసేదా (ఇంకా కర్మలు చేసేదా?) సమస్త లోకములను పాలించు ఓ సర్వేశ్వరా! వొల్లనొల్లను (నేను ఒప్పుకోనే ఒప్పుకోను) నాకు ఒద్దంటే వద్దు.

స్వామీ! నేను పోయిన జన్మలో చేసిన పాపముల గుట్ట నా పొరుగునే (నా సమీపముననే) వున్నది. ఛీ యని అసహ్యంతో వుండక, ఇంకా ఇప్పుడు కూడా ఉత్సాహంతో కొత్త పాపాలు చేయమంటావా? వేయి నామములతో నిత్యమూ కీర్తింపబడే ఓ శ్రీహరీ! ఓ అయ్యా! ఇంక నీ మాయలు వొద్దనవే. (చాలు అని అనవేమయ్యా! ఇంకా నన్ను ఏడిపించడం న్యాయమేనా?)

(నలి అంటే రోగము, లేక, నలిగినది అని అర్థం కానీ కొంతమంది 'యోగ్యమైనది' అనే అర్థంలో ఉపయోగించారు ఈ పదాన్ని) ఓ శ్రీ వేంకటేశ్వరా! యోగ్యమైన నీ నామము నా నాలుక చివర వుండగా తలకొని (కావాలని యత్నించి) ఇతరములైన వాటిగురించి తలచుకోనా? ఒద్దు. నిన్నే ఆరాధిస్తాను. నాలో ఒలికిపోతున్న చెంచలము (చిందుతున్న చపలత్వమును, భ్రమలను, బలహీనతలను) వొద్దనవే (కాదని నివారించరాదా?) నన్ను అనుగ్రహించరాదా? నాపై జాలిలేదా?

## 5-43

## మున్నుడి

మన కత్యంత ఆప్తులను 'దొంగ' అని ముద్దుగా పిలవడం కద్దు. అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ ఇదిగో వీడు వింతదొంగ. వేడిపాలలో వెన్న ఉన్నట్లు, ఉన్నా కనబడక, వెరజిన (జారుకొనునట్టి) దొంగ అంటూ శ్రీహరి దశావతార వైభవమును వర్ణిస్తున్నారు. ఆయన నిరుపయోగంగా ఒక్క మాటకూడ వాడరు. అనడానికి "తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ" అనే వాక్యమే సాక్ష్యం. హిరణ్యకశిపుడు బ్రహ్మనుండి పగలుగాని రాత్రిగాని తను చచ్చిపోకూడదని వరం పొందినట్లు తెలిసి నృసింహుడై సంధ్యా సమయంలో సంహరించి, తిరిగి తిరిగి వాడి అనుచరులను కూడా చంపాడు. అట్లాంటి దొంగట...

**ఉ॥ వింతలు గొల్పుదొంగయని విష్ణునుతించెను అన్నమయ్య, నే**
**నింత చమత్కృతిన్ కనను యెవ్వని కైతను, వేంకటేశ్వరా!**
**పంతముతోడ నీవపుడు పాయక దాల్చు దశావతారముల్**
**దొంతిగ జెప్పె నర్మముగ దూరుట కాదిది కీర్తనంబహో!!**

**రాగం : భైరవి**

వీడివో యిదె వింతదొంగ
వేడిపాలు వెన్న వెరజిన దొంగ ॥వీడివో॥

వెలయ నీట జొప్పు వేసేటి దొంగ
తలగొన నీకు దాగుదొంగ
తలకక నేల దవ్వేటి దొంగ
తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ ॥వీడివో॥

అదుగు కిందలోక మడచేటి దొంగ
అదరి తల్లికినైన నలుగు దొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలకాసెతో నుండు దొంగ ॥వీడివో॥





మోస మింతుల జేయు మునిముచ్చుదొంగ
రాసి కెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరి మీద
మూసిన ముత్యమై ముదమందు దొంగ ॥వీడివో॥

**భావామృతం :**

ఇదిగో వీడేకదా! వింతదొంగ. ఈ దొంగ, కాచిన వేడిపాలలో వెన్నవున్నట్లు, వున్నా కనబడని వెరజిన దొంగ (జారుకొనే దొంగ). వీడిన పట్టుకోవటం ఎవరివల్ల అవుతుంది?

ఈయన "వెలయ నీట జొప్పు వేసేటి దొంగ" (ప్రసిద్ధి చెందిన నీటిలో తన జాడ కనబరచిన దొంగ... అంటే మత్స్యావతారము). ఈయన "తలగొన నీకు దాగు దొంగ" (తలకొనన్+ఈకు దాగిన దొంగ... అంటే యత్నించి నీటిలో దాగికొన్న దొంగ తాబేలు... అనగా కూర్మావతారము). ఈయన "తలకక నేలద్రవ్వేటి దొంగ". (హిరణ్యాక్షుడు పాతాళంలో వున్నాడని నేలను తవ్వుకొంటూ పాతాళలోకం వెళ్లి వాడిని చంపిన దొంగ... అనగా వరాహావతారము). "తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ" హిరణ్యకశిపుని వరం తెలిసి సంధ్యాసమయంలో తిరిగి చంపిన దొంగ.. నరసింహావతారం.

ఈయన "అడుగు కిందలోకమడచేటి దొంగ" (తన పాదము క్రింద లోకమంతా అణిచి కొలిచిన దొంగ... అనగా వామనావతారం). ఈయన "తల్లికి నైన నలుగు దొంగ" (తల్లికోసం వ్యథ చెందిన దొంగ.. అంటే పరశురాముడు). ఈయన "అడవిలో నెలవైయున్న దొంగ" అరణ్యవాసం చేసిన దొంగ... అంటే శ్రీరామచంద్రుడు). ఈయన "తొడరి నీలకాసెతో నుండు దొంగ" (ఎదిరించు స్వభావము గలిగినవాడై నల్లని వస్త్రములు ధరించు దొంగ... అనగా బలరాముడు).

ఈయన "మోసమింతుల జేయు మునిముచ్చుదొంగ" (త్రిపురాసురుల భార్యలను మోసం చేసిన కపట ముని అయిన దొంగ... అంటే బుద్ధావతారము). ఈయన "రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ" (రాసి అంటే కుప్ప అనే అర్థం. కాని అన్నమయ్య ఇక్కడ ప్రసిద్ధి చెందిన అనే అర్థంతో వాడినట్లు నాకు అనిపించింది... ప్రసిద్ధి చెందిన గుఱ్ఱము కలిగిన దొంగ... కల్కి అవతారము). ఈయన "వేసాల కిటువచ్చి వేంకటగిరి మీద, మూసిన ముత్యమై ముదమందు దొంగ" (అన్ని అవతారములను ధరించుటకు భూమిమీదకు వచ్చి, వేంకటాద్రి మీద ముత్యపు చిప్పలో దాగిన ముత్యంవంటి నిత్య సంతోషియైన దొంగ... అంటే ఇంకెవరు మన ఏడుకొండలవాడే...)

## 5-44

### మున్నుడి

అచ్చతెలుగు మాటలు వాడిన అన్నమాచార్యులవారి ఆధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. నేటి కాలంలోని తెలుగువారికి అగమ్య గోచరంగా వున్నా... ఒక్కసారి అర్థంచేసికొంటే మనస్సు ప్రశాంతత పొందుతుంది. సముద్రాల లక్ష్మణయ్యగారు వంటి పెద్దలు మాత్రమే ఇటువంటి కీర్తనలను వివరించగలరు. గోనెలె కొత్తలు అంటే... ఈ శరీరాలు మాత్రమే కొత్తవి. కోడెలెప్పటివి? అంటే... వీటిలో వుండే ఆత్మలు ఏనాటివి? ఇన్నాళ్ళు అజ్ఞానంలో వున్న అది ఒక్కసారికే జ్ఞాని అవుతుందా? ఒక్కసారి నానపెడితే... ఇనుము మెత్తబడి పోతుందా?

**తే॥ గోనె లెల్లను కొత్తలు, కోడెలెపుడు**
**పాతవేనని అన్నయ్య పాడినాడు**
**నాన్చిలోహంబు నీటిలో నయము మీర**
**మెత్తబరచంగ వచ్చునే!! వేంకటేశ!**

**రాగం : బౌళి**

గోనెలె కొత్తలు - కోడె లెప్పటివి
నానిన లోహము - నయ మయ్యీనా ॥గోనె॥

మున్నిటి జగమే - మున్నిటి లోకమె
యెన్నగ బుట్టుగు - లివె వేరు
నన్ను నెవ్వరు - న్నతి బోధించిన
నిన్న నేటనే - నే నెటిగేనా ॥గోనె॥

చిత్తము నాటిదె - చింతలు నాటివె
యిత్తల భోగము - లివి వేరు
సత్తగు శాస్త్రము - చాయ చూపినా
కొత్తగ నేనిక - గుణి నయ్యేనా ॥గోనె॥





జీవాంతరాత్ముడు - శ్రీవేంకటేశుడె
యీవల భావన - లివెవేరు
ధావతి కర్మము - తప్ప దీసినా
దైవము గావక - తలగీనా ॥గోనె॥

**భావామృతం :**

ఈ శరీరాలు (గోనెలు) మాత్రమే కొత్తవి. కాని వీటిలో వున్న కోడెలు (ఆత్మలు) యేనాటివి? ఎప్పటివో.. చాలా పాతవి. దాని సహజగుణం అజ్ఞానం. ఎన్నేళ్లయినా లోహానికి (ఇనుముకి) నానిపోయినా గట్టితనంపోయి నయమవుతుందా? ఈ ఆత్మకూ అంతే. దీనికి అజ్ఞానం పోదు.

ఈ జగత్తు పాతదే, ఈ లోకమూ పాతదే. చూస్తే... వీటిలో జీవుల పుట్టుకలు మాత్రమే కొత్తవి. అజ్ఞానం మాత్రం అలాగే వుంది. నాకు ఉన్నతమైన తత్త్వం ఒకటి రెండు జన్మలకే వచ్చేస్తుందా? జ్ఞానినైపోతానా? పరమాత్మ నెరుగగలనా?

నా చిత్తము యెన్నో జన్మలనుంచి వచ్చిన వాసనలను పేర్చిపెట్టుకొనివున్నది. దీనికెన్నో పాత చింతలు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త భోగములను పొందుతున్నాననుకొంటుంది. సత్త్వ స్వరూప శాస్త్ర జ్ఞానం యెంత నేర్పినా ఇక కొత్తగా గుణవంతుడను కాగలనా? ఎంత అజ్ఞానం పోగొట్టుకోవాలని చూచినా పాత మాయరోగం పోతుందా?

మరి తరుణోపాయమేమిటి? మనలో అంతరాత్మ రూపుడై శ్రీవేంకటేశ్వరుడు వున్నాడు. ఆయన ఈ ఆత్మలన్నింటికీ అనాది. ఈ జీవాత్మలు భావాలు మాత్రమే వేరు వేరుగా భ్రమలలో పెట్టి, ధావతి కర్మలు (దుందుడుకు కర్మలు) అలవాటుచేసి అజ్ఞానం జీవుణ్ణి తప్పుదోవలలో నడుపుతుంటుంది. ఒక్కసారి ఆ స్వామికి ఈ జీవుడిపై అనుగ్రహం కలిగితే వీడు బాగుపడతాడు. ఆ దైవానికి తప్ప ఆ పని ఇంకెవరివల్ల అవుతుంది?

**5-45**

## మున్నుడి

హరినామ వైశిష్ట్యాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. దేవతలు మునులు శోధనచేసి కనుక్కొన్నారట దాని మహాత్మ్యాన్ని. ఆ శ్రీహరినామం ఇప్పటిదా? అదతీ ఆదికిన్ అనాదియైనది (అత్యంత పురాతనమైన) దంటున్నారు. "సకల పుణ్యఫలములకు సార విహారము" అంటున్నారు. (సర్వపుణ్యముల ఫలములు ఫలించెడి తోట... అని అర్థం). ఏ ఫలము పెద్దదో, ఏది చిన్నదో, ఏది రుచిగలదో ఏది రుచిలేనిదో ఆయన తప్ప ఎవరు చెప్పగలరు? శ్రీహరినామము నాశ్రయించిన వారిలో కుటిలత్వము అంటే వంకరబుద్ధి వుండదట.

**ఆ.వె॥సురులు మౌనులున్ను సోదించి రిద్దియే**
**అకుటిలంబలు యనిరి అన్నమయ్య**
**ఆదికిని అనాది హరినామమొక్కటే**
**మేటి కీర్తనంబు వేంకటేశ!**

**రాగం: లలిత**

సోదించి రిదియే సురలును మునులును
ఆదికి ననాది హరినామం ॥సోదించి॥

అరిది వేదశాస్త్రార్థ సంగ్రహము
అరయగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరి భయంకరము హరినామం ॥సోదించి॥

సకల పుణ్యఫల సార విహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది శ్రీహరినామం ॥సోదించి॥





కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యెందును శ్రీవేంకటేశ్వరు కరుణకు
నందుకోలైన హరినామం ॥సోదించి॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ శ్రీమన్నారాయణుని హరి... హరి... అని కీర్తించండి. ఈ హరినామం ఇప్పటిదికాదు. ఇది అనాది అని పిలువబడిన ప్రతిదానికంటే... ఆది (మొదలు) అయినది. ఈ విషయాన్ని దేవతలు, మునులు పరిశోధించి, మరీ కనుక్కున్నారు.

ఈ శ్రీహరినామం, అరిది వేద శాస్త్రముల (దుర్లభమైన చతుర్వేదములు, షట్ శాస్త్రముల) సంగ్రహము (సారము). పరిశీలించగా ఇదొక్కటే ఇట్టి విశిష్టత కలిగియున్నది. ఈ శ్రీహరినామము పాప నిర్మూలకము. పుట్టుక అనెడి దుఃఖమును నివారించునది. దీనిని నమ్మిన వారికి శత్రువుల పీడ లేకుండ చేయునది. మరి శ్రీహరీ... అని ఆ దేవదేవుని నామమును యెందుకు ఆశ్రయించరు?

ఈ శ్రీహరి నామము అకలంకము (ఏ నిందాలేనిది). సర్వపుణ్యములు (అనగా గత జన్మలో మనం చేసినకొనిన పుణ్యములు ఈ జన్మలో చేసికొనిన పుణ్యములు, ఇంకొకరి ద్వారా సంక్రమించిన పుణ్యములు) ఫలించెడి సారవిహారము (పండ్లతోట). ఈ శ్రీహరినామము అకుటిలము (ఏమాత్రము వంకర బుద్ధి లేనిది). ప్రకటము (అందరికీ తెలియునట్లు ప్రకటించబడినది). ఇది సులువైనది. ఎంతో పునీతమైనది.

ఓ ప్రజలారా! ఈ శ్రీహరినామమే అందరికీ కైవల్యపదము (ముక్తి మార్గము నొసగునది). ఇది కందువ సదరము (కందువన్... చదరము అనగా సామర్థ్యమున ఏ మాత్రము కొఱతలేనిది). శ్రీ వేంకటేశ్వరుని కరుణకు యెందును (ఎక్కడనైన) అందుకోలై (అతి సమీపముగా వున్నదై) ఈ హరినామము సర్వులను ఉద్ధరించుచున్నది.

**5-46**

## మున్నుడి

ఇదివరలో 'సింగారమూరితి'... అనే అన్నమాచార్య కీర్తనలో, నేను 'సాసముఖ' అంటే హంసరూపి అనగా ఆత్మారాముని రూపుడైన పరమాత్మగా భావించి భావామృతం వివరించాను. ఈ రోజున 'సాసముఖ' అన్నదానికి అనేక అర్థాలు పెద్దలు భావించారని తెలిసి నేను ఇంకొంచెం ఆలోచించి 'సాసముఖ' అంటే 'సారసముఖ' అంటే పద్మముఖుడు అయి వుంటుందని నిశ్చయించుకొన్నాను.

**సీ॥ లలిత గోవిందుడు లక్ష్మి మండపమందు**
**వలరాజుతో కూడి వచ్చినాడు**
**వెల్లగొడుగు బట్టె చల్లని చంద్రుండు**
**పవనుండు విసరెను పట్టి సురటి**
**పుష్పాల పూజించె పూని వసంతుడు**
**భ్రమరాలు ఝుమ్మని పాడె మురిసి**
**సంగడి చిలుకలు చదివెను పద్యాలు**
**కోయిలలును పాడె గొంతు విప్పి**

**తే॥ ఈ వసంత పౌర్ణమినాడు ఈ విభవము**
**వొప్ప సేవింతుమని "సాసముఖుని" గొలిచె**
**అన్నమార్యుడు కీర్తనమాలపించి**
**వేంకటేశ్వర! 'మితిమీరి' వేడె నిన్ను.**

**రాగం : వరాళి**

వరుసతో సాసముఖా వసంత పూర్ణిమ నేడు
సిరుల యీ విభవాలు సేవించరో ॥వరుసతో॥

లలితపు గోవిందుడు లక్ష్మీమండపమందున్న
వలరాజదివో కొలువుగ వచ్చెను
వెలి జంద్రుడు తోడనే వెల్ల గొడ(డు) గట్టువట్టె
సులభాన బవనుడు సురటి విసరెను ॥వరుసతో॥





పొందుగా వసంతుడు పువ్వుల బూజించవచ్చె
కందువతో దుమ్మిదలు గానము సేసె
సందడించి చిలుకలు చదువ జొచ్చె పద్యాలు
గొందినే కట్టిగవారై కోవిలలుగ్గడించె ॥వరుసతో॥

రతిదేవి మొదలైన రమణులు నాట్లమాడి
రతి వసంతమాడె మేఘావళి యెల్ల
తతి శ్రీవేంకటగిరి దాపుకొని యిందునందూ
మితిమీరగా మొక్కేరు మెరసి దేవతలు ॥వరుసతో॥

**భావామృతం :**

ఓ సాసముఖా! (సారసముఖా! లేక పద్మముఖా!) వరుసతో నేడు వసంతపూర్ణమి (క్రమముగా వచ్చిన వసంత పౌర్ణమి) ఈ విభవాల (వైభవములను) సిరుల సేవించరో (శోభాయమానంగా జరుపుడు).

అదిగో లక్ష్మీమండపమున, లలితపు గోవిందుడు (అందమైన వేంకటేశ్వరుడు). ఆ కొలువునకు 'వలరాజు' (మన్మథుడు) విచ్చేసినాడు. బయట, చంద్రుడు తెల్లటి గొడుగును పట్టి నిలిచియున్నాడు. స్వామికి వాయుదేవుడు సురటి (వింజామర) తో వీచుచున్నాడు. ఆ వైభవమును తిలకించండి.

అదిగో ఇంద్రుని కుమారుడైన వసంతుడు, స్వామిని పుష్పములతో పూజించుచున్నాడు. తుమ్మెదలు కందువతో (చమత్కారముగా) ఝుమ్మని గానము చేయుచున్నవి. చిలుకలు ఏవేవో పద్యాలు పాడుతూ సందడి చేయుచున్నవి. కోవిలలు (గండు కోయిలలు) గొందినే (మూలమూలల్లో) కట్టిగవారై (కట్టడి చేయువారై) ఆజ్ఞాపించుచూ ఉగ్గడించెను (చక్కటి ధ్వనులు చేసెను).

అదిగో రతీదేవి మొదలైన రమణులు రమణీయంగా నాట్యము చేయుచున్నారు. మేఘముల పంక్తి అనేక వర్ణములలో నయనానందకరముగా రతి వసంతము (రమణీయమైన వసంతమును) ఆడెను... (నేటి భాషలో, హోలీ ఆడినవి). ఈ కన్నుల పండుగను చూచి శ్రీవేంకటగిరి వద్దకు వచ్చి, ఇక్కడా-అక్కడా అనేక చోట్ల దేవతలంతా గుమిగూడి, తతితో (గుంపుగా) మితిమీరినవారై మెరసి మొక్కేరు (దేదీప్యమానంగా మ్రొక్కుతున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! వారితో బాటు నాబోటి దీనులను కూడ సంతుష్ట మనస్కుడవై అనుగ్రహించు తండ్రీ!

5-47

## మున్నుడి

హరిహరులకు అభేదం సూచిస్తున్నారు అన్నమాచార్యులవారు. సృష్టి స్థితి లయలు నిర్వహించే మూడు రూపాలూ పరమాత్మునివే. ఆయా పనులు చేస్తున్నప్పుడు ఆ పరమాత్మనే మూడు వేర్వేరు పేర్లతో పిలుస్తున్నాము. కాని అన్నీ ఆయనే. ఆయా చేతలవలననే ఆయనకు ఆయాపేర్లు వచ్చాయి అంతే. పూతనాంతకుడైన శ్రీకృష్ణుడు ఇతనే. బ్రహ్మాండములను కడుపులోదాచుకొన్న పరమాత్మ ఇతడే. దేవ దేవోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు, అచ్యుతుడు, అభవుడు ఇలా సహస్రనామములున్న ఈయనను తప్పక కొనియాడాలంటున్నారు.

**మత్తకోకిల :**

**ఈతడే హరుడెంచగా అజుడీతడే అనె అన్నయున్**
**చేతలీతని వెన్నరాదని జెప్పె కీర్తన మెప్పుగా**
**ప్రీతితో తిరువేంకటేశుని వేయినోళ్ళ నుతించెరా**
**పూతనాంతకు మ్రొక్కుడీ యనె బూమెకాడనె శ్రీహరిన్**

***బూమెకాడు = మాయలు చేయువాడు**

**రాగం : బిలహరి**

ఈతడే హరుడు యీతడే యజుడు
ఈతనికి నీ చేతలెంత ఘనమటుగాన ॥ఈతడే॥

కడుపెక్కు బ్రహ్మాండ కటకములు సుడివడిన
కడుపులో నిడుకొన్న ఘనుడు
వెడలి పూతకి చంటి విషము తాగిన యంత
వడిదనకు నేమాయ వట్టి బూమెలు గాక ॥ఈతడే॥





ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు-
డుల్లసిల్లుచు నీతడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుడవని నిన్ను పరిణమింతురు గాన ॥ఈతడే॥

తిరువేంకటేశ్వరుడు దేవదేవోత్తముడు
పరిపూర్ణుడచ్యుతుడభవుడు
శరణాగతుల రక్షసేయువాడనుమాట
గురుతుగా తలపోసి కొనియాడగా వలసె ॥ఈతడే॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఈ సత్యం తెలుసుకోండి. ఈతడే (ఈ శ్రీవేంకటేశ్వరుడే) శివుడు. ఈయనే బ్రహ్మదేవుడు. ఈతనికిన్, ఈ చేతలే (పనులే) ఎంతగొప్పవో అట్లే ఆయన ఘనముగా అట్లు పిలువబడుచున్నాడు. అంతెగాక వేరుకాదు.

ఈ ఘనుడు కోట్లాది బ్రహ్మాండములను తన కడుపులో వుంచుకొనినాడు. ఇట్టి సకల జగదీశ్వరుడు పూతన చనుబాలలోని విషము తాగితే ఏమవుతుంది? వట్టి బూమెలు గాక (వుత్త మాయాజాలం కాకపోతే... ఇంకేమిటి?)

సృష్టి అంతా జలరాశిలో, మునిగిపోయినపుడు ఈతడు ఉల్లసిల్లుచుంటాడు (నిర్వికార నిరంజనుడై వుంటాడు. దోగాడుకుంటూ పోయి చిన్న పాపాయిగా (బాలకృష్ణునిగా) రెండు పెద్ద మద్దిచెట్లను చటుక్కున విఱిచిన నీవు అమిత బలాఢ్యుడవు అని పరిగణించక యెట్లుండగలము? అందుకే నీవు జగజ్జెట్టివి.

ఈ తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు దేవదేవులందరిలోను సర్వశ్రేష్ఠుడు. ఈయన పరిపూర్ణుడు (ఏ కొదవాలేనివాడు). ఈయన 'చ్యుతి' (నాశనము) లేని అచ్యుతుడు. ఈయన అభవుడు (పుట్టుకే లేనివాడు). ఈయన శరణాగత రక్షకుడు అనే మాటను తలచుకొంటు జీవించుచూ ఈయననే ధ్యానించవలెను. అదియే ముక్తిమార్గము.

## 5-48

### మున్నుడి

రేపల్లెలో కొంటె కృష్ణుడు గొల్ల భామలతో జరిపిన చిలిపి అల్లరిని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'కదిసి ఇందరివి గైకొనవయ్యా' అంటున్నారు అంటే... 'దగ్గరకు వచ్చి ఇవన్నీ వినవయ్యా' అని అర్థం. పాండిత్యంతో అన్నమయ్య వాడిన తెలుగు సంధులవల్ల నేటికాలంలో అవగాహనకి ఇబ్బంది కూడా కలుగుతుంటుంది. "అదె చిగురు గేదగుల వెనక నుండి నినువేసెనట"... అంటే 'కుబ్జ గేదెల' గురించి అన్నమయ్య చెప్పటం లేదు. లేతపచ్చని మొగలి పూలగురించి చెబుతున్నారు. ఒక గోపిక వెనక నుండి కృష్ణుడిపై మొగలిపూలువేసి వులికి పడేట్లుచేసిందన్నమాట.

**కం : ఇదివో సుద్దులు వినుడీ**
**ముదముగ రేపల్లె కతలు మురిపించుననెన్**
**కదిసివి గైకొనుమయ్యా!**
**వదలకుమనె అన్నమయ్య వారిజనాభున్.**

**రాగం : మోహన**

ఇదివో సుద్దులు ఈ రేపల్లెను
కదిసి ఇందరివి గైకొనవయ్య ॥ఇదివో॥

పలచని రెప్పల పగటులు నెరపుచు
సొలసి నిన్నొకటె చూచెనట
తళుకుల గోళ్ళదండె మీటి యిదె
పలికి నిన్నొకతె పాడెనట ॥ఇదివో॥

చనవులు నెరపుచు సన్న చేయుచును
ననుపున నొక్కతె నవ్వెనట
చెనకి యొక్కతె అదె చిగురు గేదగుల
వెనక నుండి నిను వేసెనట ॥ఇదివో॥





అదన నీవు నన్ను అలమి పట్టంగా
కొదలి యొక్కతె కనిగొణిగెనట
ఎదురనె శ్రీవేంకటే యొకతె నీ
చెదరిన అలుకలు చెరిగెనట ॥ఇదివో॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ రేపల్లెలో జరిగిన 'కథలన్నీ' చెబుతాను. అవన్నీ ఆ నాడు చిలిపి కృష్ణయ్యగా నీవు చేసినవే. ఈ గోపికలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క కథ వుంది. వీటిని వినవయ్యా తండ్రీ!

స్వామీ! ఒక గోపిక సన్నని తన కనురెప్పలను సగటున నెరపుచు (లావణ్యము ప్రదర్శించుచూ), సొలసి (విసుగుతో... బహుశా నీవు రాలేదని...) నీకేసి చూసిందట. ఇంకొక గోపిక తళతళ మెఱయు తన గోళ్ళతో, ఇదే విధంగా దండెమీటి (వీణను మ్రోగించి) మధురంగా పాడినదట. ఆమెకూడా నీవెప్పుడు వస్తావా అని యెదురు చూచుచునే వున్నది.

ప్రభూ! నీతో చనవున్న ఇంకొక గోపిక సన్నలు చేయుచు (ఏవేవో సైగలు చేస్తూ) ననుపున (అనురాగంతో) నిన్ను చూసి నవ్వినదట. ఇంకొక గోపిక నిన్ను తాకునట్లు లేతపచ్చని మొగలిపూలు వెనకనుండి నీపై వేసి నీవు వులికి పడునట్లు చేయుచున్నది.

స్వామీ! సమయం చూచి నీవు నన్ను అలమి పట్టంగా (ఆక్రమించి కౌగలించగా) ఒక్కతె కొదలి (ఒక గోపిక రెచ్చిపోయి మనవి తిట్టుకొంటున్నట్లు ఏదేదో గొణిగింది). ఓ తిరుమలాధీశా! నాకంటే ధైర్యంగల ఇంకొకతె నా యెదురుగానే చెదరిని నీ ముంగురులను (అలుకలను) ప్రేమగా చెరిగేనట (చెదరగొట్టిందట). యెంత తెంపరితనం!!!

## 5-49

### మున్నుడి

అహోబలంలో నరసింహస్వామి వారి కళ్యాణం శ్రీలక్ష్మి అమ్మవారితో జరుగుతున్నది. మనబోటి సామాన్యుల కంటికి కనిపించకపోయినా అన్నమాచార్యులవారి జ్ఞాన నేత్రాలకి ఆ వైభవం దృగ్గోచరమైనది. చక్కటి కీర్తన చెబుతున్నారు. ఓ వనితల్లారా! చూడండి, ఆడండి, పాడండి. ఓ బాటసారులారా! మీరంతా వీధులలో మూగిరండి. పన్నిద్దరు (పన్నెండుమంది) ఆళ్వారులు స్వామిని కొలుస్తున్నారు చూడండి అంటున్నారు. ఈయనే కళ్యాణముల వేది (విద్వాంసుడు) యైన శ్రీవేంకటేశ్వరుడు కూడ. అన్నమయ్య భావనలకంతే లేదు.

**ఉ॥ అంగనలార! పాడుడిటు ఆడరె చూడరె యీ నృసింహునిన్**
**ముంగిట జేరి తెర్వరులు మూగుచు వీధులనుండరమ్మ! ఆ**
**చెంగట నాళువార్లు నదె చేరిరిగా పదిరెండుమంది, యీ**
**సంగతి దెల్పు కీర్తనము చక్కగ పాడెను అన్నమార్యుడున్.**

**రాగం : ఖరహరప్రియ**

ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుక పరుషలెల్ల వీధి నుండరమ్మ ॥ఆడరమ్మ॥

అల్లదివో ఓగునూతల ఔభళేశు పెద్దకోన
వెల్లిపాల నీటిజాలు వెడలే సోన
చల్లని మాకుల నీడ సంగడి మేడలవాడు
ఎల్లగాగ నరసింహు డేగీ నింతితోడ ॥ఆడరమ్మ॥

సింగారపు మండపాల సింహాల మునిమందలు
అంగపు తెల్లగోపురము అదె మిన్నంద
చెంగట నాళువార్లు చేరి పన్నిద్దరు గొల్వ
సంగతి తా కొలువిచ్చీ జయనరసింహము ॥ఆడరమ్మ॥





కందువ శ్రీవేంకటేశు కళ్యాణముల వేది
అందమై భూమికెల్ల ఆదికినాది
మందల పాలకొండ మలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుడు ॥ఆడరమ్మ॥

**భావామృతం :**

ఓ వనితల్లారా! మీరంతా ఆడండమ్మా! పాడండి. ఈ వైభవం చూడండమ్మా! వేడుక తిలకించుటకు వచ్చిన పరుషులెల్లా (బాటసారులందరు) వీధిలో నుండి వీక్షించండి.

అదిగదిగో ఓగునూతలలోనున్న అహోబలేశ్వరుని పెద్దకోన (లోయ). అదిగో "వెల్లిపాల నీటిజాలు వెడలే సోన" (హోరుమని ప్రవహించే జలపాతం యొక్క జల్లు) అదిగో చల్లని వృక్షముల నీడలో "సంగడి మేడలవాడు" (జంటగా నున్న సౌధములలో వుండే స్వామి). అదిగో తన పొలిమేరదాటి నరసింహుడు, తనదేవేరితో వూరేగి వస్తున్నారు.

అదిగో అలంకరించబడిన మండపాలలో జంట సింహాలున్న సింహాసనం. అదో అందమైన తెల్లని గోపురం. అది ఆకాశాన్ని తాకుతున్నట్లుంది. దాని ముందర, పన్నిద్దరు (పన్నెండుమంది) ఆళ్వారులు చేరి స్వామిని కీర్తిస్తున్నారు భక్తితో సేవిస్తున్నారు. ఈ జయ నరసింహుడు సంగతి (ప్రేమ)తో భక్తులకు తాను దర్శన మొసగుచున్నాడు. తిలకించి మీ జన్మ చరితార్థం చేసికోండి.

ఇదే సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరుని కళ్యాణవేదికగా భావించండి. అందమైన ఆయన "కళ్యాణముల వేది" (పెళ్లిళ్ళకు పేరు మోసినవాడు). ఆయన మరెవరో కాదు ఈయనే (ఈ నృసింహుడే). ఈయనే ఈ భూమిమీద "ఆదికి ననాది" (సృష్టికే ఆదిదేవుడు). పాలకొండ సమీపముననున్న మెట్ట ప్రదేశమున, విందగు దాసులతో (తనను సేవించుటకు వచ్చిన దాసభక్తులతో) ఈ దేవుడు విహరించుచున్నాడు. ఈయనను సేవించి తరించండి.

## 5-50

## మున్నుడి

శ్రీదేవికి శ్రీవేంకటేశ్వరునికి తెప్పోత్సవం జరుగుతోంది. ఆ కోనేటి మహాత్మ్యాన్ని వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. దీని ఆకారము శ్రీమన్నారాయణుని వైకుంఠనగరము యొక్క వాకిలి వలెనున్నదంటున్నారు. ఈ కోనేటి చుట్టూ వున్న వృక్షములన్నీ తపస్సమాధిలో వున్న మునీశ్వరులని కీర్తిస్తున్నారు. "దీకొని నీ తీర్థమాడితిమి కావుమమ్మా" అంటున్నారు.

**కం॥ తెప్పల కోనేటమ్మా!**
**ఎప్పుడు తేల్చేవు హరిని ఈ శ్రీరమణిన్**
**ఇప్పుడు మ్రొక్కెను అన్నయ**
**అప్పునిదీ లోకమాతయని కీర్తించెన్.**

**రాగం : హిందోళం**

దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥దేవునికి॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదె నీదరులు
నిర్మలపు నీజలము నిండు సప్త సాగరాలు
కూర్మము నీ లోతువో కోనేరమ్మా ॥దేవునికి॥

తగిన గంగాది తీర్థములు నీకడళ్ళు
జగతి దేవతలు నీ జలజంతువులు
గగనపు పుణ్యలోకాలు నీ దరిమేడలు
మొగినీ చుట్టుమాకులు మునులోయమ్మా ॥దేవునికి॥





వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీవేంకటేశుడే నీవునికి
దీకొని నీ తీర్థ మాడితిమి కావుమమ్మా ॥దేవునికి॥

**భావామృతం :**

దేవదేవుడు, శ్రీదేవి తెప్పోత్సవం జరుపుకొనే ఓ కోనేటి తల్లీ! నీవు లోకములను పావనము చేయుదానివమ్మా! నీకు వేల కొలది వందనములు సమర్పించుకొనుచున్నాము. (నీమహిమను నేను ఎంతయని వర్ణించను?)

ఓ కోనేటమ్మా! ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములు నీ శోభలుగా రూపొందినవి. అర్మిలి (అపేక్షతో చదివే) నాలుగు వేదములు నీ నాలుగు తీరములు (ఒడ్లు). నిర్మలములైన నీ నీరు, సప్తసముద్రములలోని నీరు ఒక్క చోటచేరినంత ప్రశస్తమైనవి. గంభీరమైన నీ లోతు మంధర పర్వతమును తేల్చిన ఆది కూర్మము వంటిది.

ఓ కోనేటమ్మా! నీ కడళ్ళు (అలలు) గంగమొదలైన పవిత్ర నదులవంటివి. (అనేక అలలు వస్తుంటాయి కాబట్టి, ఒక్కొక్క అల ఒక్కొక్కనది అని అన్నమయ్య భావన అయి వుండవచ్చును). నీలో వున్న జలజంతువులన్నియు యక్ష, కిన్నెర, కింపురుషాది దేవతలు. నింగిలో నున్న ఊర్ధ్వలోకములన్నియు మాకు కనబడవు కానీ, నీ ఒడ్డున వున్న పలురకములైన ఎత్తయిన మేడలన్నీ ఆ పుణ్యలోకములే అనిపించుచున్నది. నీ చుట్టూ వున్న మొగిమాకులు (మొత్తం చెట్లు అన్నియూ) వేరెవరో కాదు స్వామికోసం అకుంఠిత దీక్షతో తపస్సమాధిలో వున్న మునీశ్వరులు.

ఓ కోనేటి తల్లీ! నీ ఆకారము నాకు శ్రీమన్నారాయణుని వైకుంఠమును తలపించుచున్నది. నీయందు తీర్థస్నానముతో పొందే పుణ్యములు నీ జీవ భావము. (నీవు కేవలం నీళ్ళుకాదు, ప్రాణమున్న తల్లివి అనే నా భావన). శ్రీవేంకటేశ్వరుడే నీ వునికి (స్థానము). ఓ కోనేటమ్మా మేము దీకొని (నిర్భయంగా) నీలో తీర్థస్నానమాచరించితిమి. మమ్మల్ని కావుమమ్మా!

**5-51**

## మున్నుడి

మూడు అద్భుతమైన ఉపమానములతో శ్రీవేంకటేశ్వరుని అభిషేకానంతర అలంకరణను వర్ణిస్తున్నారు, అన్నమాచార్యులవారు. ఇతని రూపము ఇన్నింటికీ (ఈ ఉపమానములకు) మూలము అంటున్నారు. ఎన్నగ ఉపమానములకు ఈ రూపము, ఇరవైనట్లుండె (స్థానమైనట్లున్నది) అంటున్నారు. అలమేల్మంగమ్మతో కలసి ఈ స్వామి దండిగా సొమ్ములు (ఆభరణాలు) ధరించగా అంతా తళతళలాడే పసుపు పచ్చరంగయి, అది గోపికల పరిష్వంగములలో వారి కుచకుంభములపై నున్న పసుపు స్వామి ఛాతికంటినదా అన్నట్లుందట. ఆహా!!

**చం॥ కనుగొన వీని రూపమది కాగలదిన్నిటి మూల మందుచే**
**అనుపమ మైన రీతి యిది అన్నిటికిన్ ఇరవైన దంచనెన్**
**గొనకొని గొల్ల కన్నియల గుబ్బల పై పసుపంటిసొమ్ములై**
**చెనకెను వేంకటేశుకని చెప్పెనసాధ్యుడు అన్నమార్యుడున్.**

**రాగం : సామంతం**

ఇన్నిటికి మూలము యీతనిరూపు
యెన్నగ నుపమలకు నిరవైనట్లుండె ॥ఇన్నిటి॥

కమలనాభునికి కప్పురకాపు మేన
సముచితముగ బైపై చాతినప్పుడు
అమృతము దచ్చేవేళ నట్టే మేనదుంపుర్లు
తమితోడ నిండుకొని దట్టమైనట్లుండె ॥ఇన్నిటి॥

దైవ శిఖామణికి తట్టుపుణుగు మేనను
చేవమీర నించి సేవసేసేయప్పుడు
వేవేలుగా యమునలో వేమారు నీదులాడగా
కావిరి కాళిమ నిండా గప్పినయట్లుండె ॥ఇన్నిటి॥





అలమేలుమంగతోడ నట్టే శ్రీవేంకటపతి-
కెలమితో సొమ్మువెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడగా గుబ్బలమీద
గలపసపెల్లా వచ్చి కమ్ముకొన్నట్లుండె ॥ఇన్నిటి॥

**భావామృతం :**

ఓ జనులారా! ఈ దేవదేవుని రూపమే ఇన్నింటికి (ఈ కథలన్నింటికి) మూలము (ఆధారము) అయివున్నది. ఈ ఉపమలన్నింటికి (నేను చెప్పబోవు ఉపమానము లన్నింటికీ) ఈతని రూపమే ఇరవైయున్నది (స్థానమై యున్నది).

పద్మనాభుడైన ఈ స్వామికి 'కర్పూరకాపడము' ఆయన వంటిపై పైన సముచ్చితముగా (మిక్కిలి పొడవుగా) మెత్తినప్పుడు, అది ఎట్లా వుందంటే... అమృతము కొరకు పాలసముద్రమును దచ్చి (చిలికి) నప్పుడు, ఆ పాల తుంపర్లు (చిందిన బిందువులు) తమితో (త్వరత్వరగా) అంటుకొని నిండిపోయి దట్టంగా అయిపోయిందా అన్నట్లుంది.

దేవతలందరికీ అధినాథుడైన ఈయన శరీరంపై 'తట్టుపుణుగు' (పునుగుపిల్లినుంచి వెలివడు నల్లని సుగంధ ద్రవ్యము) చేతనయినంత అద్ది సేవించుసమయమున అదెట్లా వున్నదంటే... వేవేలుగా (అనేకమారులు) యమునానదిలో ఈదులాడినందువల్ల, అసలే నల్లటివానికి ఆ యమునానది నల్లని నీళ్లు, నల్లదనమును పెంచాయా అన్నట్లుంది.

నేడు ఆ కృష్ణయ్యే శ్రీవేంకటేశ్వరుడై తన దేవేరి అలమేలుమంగతో ఎలమితో (సంతోషంగా) యెంచి సొమ్ములువెట్టి (ఎంచిన ఆభరణములన్నింటిని అలంకరించుకొని యున్నప్పుడు). ఆ పచ్చని తళతళలు ఎట్లావున్నాయంటే... నాడు తమ ఛాతులపై దట్టంగా పసుపు రాసికొనిన గోపికలను బిగియార సందిటజేర్చినందున ఆ పసుపు నల్లనయ్య ఛాతికంటుకొని పచ్చగా మెరుస్తూ కమ్ముకొని వున్నదా అనిపిస్తున్నది. (నాకింతకన్నా వివరించే శక్తిలేదు తండ్రీ! క్షమించు).

5-52

## మున్నుడి

పెదతిరుమలయ్య వినిపిస్తున్న మధురమైన భజన నాస్వాదించండి. అవటానికి సంస్కృత భాషలోని కీర్తన అయినప్పటికి ఇందులో అర్థంకాని మాటలు బహుస్వల్పం. కాకపోతే, ఒక విశేషణం ఎందుకు వాడబడిందో గ్రహించాలంటే... మరీ అనుకున్నంత తేలికకాదు. ఉదాహరణకి 'నందనిజనందం' అనే పదము గమనించండి. దాని అర్థం, నందుని స్వంత పుత్రుడు అనికాదు... నిజనందనుడు ఏ విధంగా తండ్రికి ఆనందం కలిగిస్తాడో, నందగోపునికి అట్లు ఆనందం కలిగించినవాడని అర్థం.

**కం॥ జనకుని సరియగు తనయుడు**
**మన పెదతిరుమల రచించె మధుర భజనమున్**
**వినుడిది గీర్వాణములో**
**తనివారగ కొలిచినాడు ధరణీధరునిన్.**
***తనివారగ = తనివితీర**

**రాగం: హంసధ్వని**

వందేహం జగద్వల్లభం దుర్లభం
మందరధరం గురుం మాధవం భూధరం ॥వందే॥

నరహరిం మురహరం నారాయణం పరం
హరి మచ్యుతం ఘన విహంగవాహం
పురుషోత్తమం పరం పుండరీకేక్షణం
కరుణాభరణం కలయామి శరణం ॥వందే॥

నందనిజనందనం నందకగదాధరం
యిందిరానాథ మరవిందనాభం
యిందు రవిలోచనం హితదాసవరదం, ము
కుందం యదుకులం గోపగోవిందం ॥వందే॥





రామనామం యజ్ఞరక్షణం లక్షణం
వామనం కామినం వాసుదేవం
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం
శ్యామలం కోమలం శాంతమూర్తిం ॥వందే॥

**భావామృతం :**

జగత్పతియైన ఓ శ్రీవేంకటేశ్వరా! బహుకష్టము చేతకాని లభించని నీవు మందర పర్వతమును కూర్మరూపుడవై ధరించినవాడవు. మాకందరికీ గురుపుంగుడవు. మాధవుడవు (లక్ష్మీదేవి పతివి). భూధరం వరాహమూర్తివై భూకాంతను చేపట్టినవాడవు. నేను (అట్టినీకు) నమస్కరించు చున్నాను.

ఓ ప్రభూ! నీవు నృసింహుడవు. ముర అనుదైత్యుని నిర్జించిన వాడవు. దురితములను నివారించు నారాయణుడవు, శ్రీహరివి, చ్యుతి (నాశనము) లేని అచ్యుతుడవు. గొప్ప పక్షిమీద (గరుత్మంతునిపై) విహరించువాడవు, పురుషోత్తముడవు, పరం (మోక్షము నొసగువాడవు). పుండరీకములు (పద్మముల) వంటి కన్నులు కలవాడవు. కరుణయే ఆభరణముగాకల నీకు నేను శరణు నర్థించుచున్నాను.

ఓ దేవదేవా! నీవు నందగోపుని నీ కన్నతండ్రివలె గౌరవించిన వాడవు. నందకము అను ఖడ్గమును, కౌమోదకి అను గదను ధరించినవాడవు. ఇందిరాదేవికి (లక్ష్మీదేవికి) నాథుడవు. పద్మనాభుడవు. స్వామీ! నీవు సూర్యచంద్రులు నేత్రములుగా కల విశ్వరూపుడవు. నీదాసులకి హితవైన వరముల ననుగ్రహించువాడవు. పద్మము హస్తమున గల ముకుందుడవు. యాదవకులమునకు గొప్పనిధివి. గోపకులను గోవులను దీక్షగా రక్షించినవాడవు.

ఓ మహానుభావా! నీవు శ్రీరామ నామమును ధరించినప్పుడు విశ్వామిత్రుని యజ్ఞమును రక్షించితివి. నీవు సులక్షణ శోభితుడవు. నీవు బలిచక్రవర్తి నణచుటకు, వామనుడవైతివి. అమృతమును అసురులనుండి తప్పించుటకు మోహిని వైతివి. వసుదేవసుతుడవై వాసుదేవుడవైతివి. కోమలము, శ్యామలము (నల్లని) వాడవైన నీవు శాంతమూర్తివి, శ్రీవేంకటేశ్వరుడవు. తండ్రీ! నీవు సర్వసంపదలకు నిలయుడవు.

5-53

## మున్నుడి

అలమేల్మంగమ్మ సుందర రూపాన్ని అందచందాలను వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. తనవంటి మీద జవ్వాది అనే సుగంధ ద్రవ్యం మెత్తుకొన్నదట. ఆమె తన యౌవనాన్నే... జన్నెవట్టినదట. 'జన్నెవట్టు' అంటే దేవతల ప్రీతికోసం త్యజించటం. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కోసం ఆమె త్యాగంచేసినదేమిటి... తన యౌవనాన్ని త్యాగం చేసిందట. చిత్తజుడైన మన్మథునే లెక్కసేయనిదట. (మరి... వాని తల్లికదా!) స్వామి కమ్మని కౌగిట కలశు(సు)న్నదట. ఇట్లా, ఎవరు కీర్తించగలరు... ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

**ఆ.వె॥ జవ్వనమున ఈమె జన్నెవట్టిన దనె**
**అన్నమయ్య భాష అంత సులువె?**
**చాన తనదు మేన జవ్వాది మెత్తిన**
**దనెను తిరుమలయ్య మనము మురియ.**

**రాగం : శంకరాభరణం**

జవ్వాది మెత్తినది తన
జవ్వనమే జన్నె వట్టినది ॥జవ్వాది॥

ముద్దుల మాటలది చెక్కు-
టద్దముల కాంతినలరినది
గద్దరి చూపులది తన-
వొద్ది (ద్ద) చెలియ మీద నొరగున్నది ॥జవ్వాది॥

పుత్తడి బోలినది తన
చిత్తము నీ సొమ్ము చేసినది
గుత్తపు గుబ్బలది అల
చిత్తజుని లెక్క సేయనిది ॥జవ్వాది॥





ఎమ్మెలు యెఱగనిది తన
కెమ్మోవి చిరునవ్వు కెరలున్నది
కమ్ముకొనగ వెంకటరాయా నీ
కమ్మని కౌగిట కలశున్నది ॥జవ్వాది॥

### భావామృతం

ఓ జగన్నాథా! ఈ అలమేల్మంగ సొగసు చూడతరమా? ఈమె తన శరీరంపై సుగంధమును వెదజల్లు జవ్వాది (జవ్వాతి అను పిల్లినుంచి వెలువడు సుగంధ ద్రవ్యము) మెత్తుకొనినది. దేవతల ప్రీతికోసం అందరూ ఏవేవో త్యజిస్తుంటారు. దానిని 'జన్నె పట్టుట' అంటారు. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కోసం ఈమె తన జవ్వనాన్నే (యౌవనమే) త్యజించిందట.

ఈమె మాట్లాడేమాటలు ముద్దులొలుకుతుంటాయి. ఈమె చెక్కిళ్ళు అద్దములవలె తళతళలాడుతుంటాయి. ఈమె చూపులు గద్దించినట్లు (నీ చిలిపితనం నిరోధించుటకు) వుంటాయి. ఆమె తన వొద్దనున్న తన చెలికత్తియపై ఒరిగి (ఆనుకొని) యున్నది.

ఈమె మేని రంగు సువర్ణపు రంగు అవుటచేత ఈమె పుత్తడి (బంగారమును) బోలియున్నది. ఈమె తన మనస్సును నీ సొమ్ము (కైవశం) చేసినది. ఈమె గుత్తపు గుబ్బలది (బిగువు పొంకముల తరుణి). అల (ఆనాటి) మన్మథుని సైతము లెక్కసేయని సౌందర్యవతి. (నిజానికి ఆ మన్మథుని కన్నతల్లి ఈమేకదా!)

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె ఎమ్మెలు ఎరుగనిది. (ఎమ్మె అంటే విలాసము... కానీ ఇక్కడ వగలు తెలియనిది అనే భావనలో ఈ పదం వాడివుంటారు). ఈమె తన కెమ్మోవి (కెంపు వర్ణముగల పెదవుల) ని చిరునవ్వుల కెరలున్నది (ఒలుకుచున్నది). ఓ వేంకటరాయా! నీవామె నాక్రమించగా... నీ మధుర పరిష్వంగములో ఈ దేవి కటిగిపోయినది. మిమ్మల్ని కీర్తించిన మా జన్మతరించినది తండ్రీ!

**5-54**

## మున్నుడి

అన్నమాచార్యులవారు యెంత స్థిరచిత్తుడో చూడండి. రకరకములైన దేవతలనారాధించేవారిని విమర్శించకుండా అయ్యా! మీ దేవుళ్ళంతా గొప్పవాళ్లే... వున్నది. అద్వైతమే 'అంతర్యామి' చీమకైనా, సిద్ధయోగికైనా ఒక్కడే. అందరూ పుట్టేది, చచ్చేది ఒక్కలాగానే. ఈ చావు పుట్టుకలు తప్పాలంటే... ముక్తి పొందాల్సిందే. ఏ దేవతని కొలిచినా కోరేదదే. కానీ జిహ్వకో రుచి పుఱ్ఱెకో బుద్ధి అన్నారు పెద్దలు. ఏంచేస్తాం? నా అంత సోమరిపోతు నేనే. నాకు అంతమందిని కొలిచే శక్తి లేదు. నాకు ఈ తిరుమలయ్య చాలును అంటున్నారు.

**ఉ॥ ఏమనవచ్చు గొందరికి ఇంపగు తీపులు పుల్లనౌ రుచుల్**
**తామటులే భజించెదరు తప్పక నమ్మిన ఇష్టదేవతన్**
**సోమరినైన నేను బహుసొంపుగ కొల్తును అన్నమయ్యనెన్**
**ఆ మహనీయుడే తిరుమలయ్యని చెప్పెను నమ్మకంబుగా**

**రాగం : సామంతం**

ఏమనవచ్చును గొందరి – కింపౌ బులుసులు దీపులు
సోమరితనమున నిన్నిట – జొరదీ నా తలపు ॥ఏమన॥

పదిలంబుగ సర్వాత్మక – భావము దలచిన పిమ్మట
ముదమున నెవ్వరి జూచిన – మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీ – వల్లభుడున్నా డుండిన
హృదయము చంచలమిన్నిట – నెనయదు నా మనసు ॥ఏమన॥

ఎక్కడ జూచిన బ్రాణుల – కిన్నియు నాచారములే
చిక్కక యిన్నియు గైకొని – చేయకపోరాదు
మక్కువ నిన్నియు శ్రీహరి – మతములె కానీ అయినా
ఒక్కటియే చాలును నా – కొడబడ వితరములు ॥ఏమన॥





ఏరీతుల నటు చూచిన – నిందరు బలుదైవములే
కూరిమి నందరి నటువలె – గొలువక పోరాదు,
ధారుణి వేంకటపతి చే – తలు ఇవియైనా గాని
కోరిక నాకితడే మరి – కొర కొర లిన్నియును ॥ఏమన॥

**భావామృతం :**

ఈ ప్రపంచంలో మానవుల పోకడల గురించి ఏమని చెప్పగలము? కొందరికి తీపి తినటం ఇష్టం. కొందరికి పులుసులు ఇష్టం. 'లోకోభిన్నరుచిః' అన్నారు. రకరకాల దేవతలనారాధించేవారు కొందరైతే, మానవుల్నే కొందరు దేవుళ్ళుగా ఆరాధిస్తున్నారు. నేనేం చెప్పగలను? నావంటి బద్ధకస్తుడు లేడు. అందుకని నా మనస్సుకి ఇవన్నీ పట్టవు. (నాకు అందరు దేవుళ్ళు వద్దు).

అందరిలో అంతర్యామి హరియేనని తెలియును. కావున ఏ ప్రాణిని చూచినా జాగ్రత్తగా మ్రొక్కవలసినదే. సర్వం విష్ణుమయం. నిజమే... కానీ నా మనస్సు మహాచంచలమైనది. అంతమంది దేవుళ్లను నేను సమదృష్టితో చూడలేకున్నాను. అందుచేత నేను ఆ పరమాత్మునికి తప్ప ఇంకెవరికీ నమస్కరించలేను. (నాతిప్పలు నన్ను పడనివ్వండి).

ఎక్కడ జూచినా సృష్టిలో ప్రాణులన్నీ ఏవేవో ఆచారాలను పాటిస్తూనే వున్నాయి. తపములు, జపములు, యజ్ఞములు, భజనలు... ఒకటేమిటి? లెక్కలేనన్ని ఉపాయాలున్నాయి. వీటన్నిటినీ ఆచరించవలసినదే. అన్నీ శ్రీహరికి ప్రీతిపాత్రములైన మతములే అయినప్పటికీ ఆ దేవదేవుని శరణాగతి తప్ప నా కితరములేవియును గిట్టవు. నాకు అదొక్కటే చాలును. (నాదారిన నన్ను వదిలేయండి).

ఏ రీతిగా పరిశీలించినా ఇందరు దేవతలూ గొప్ప గొప్పవాళ్ళే. కాదనలేను. కావున అందరినీ ప్రేమగా ఆరాధించవలసిందే. ఈ లోకంలో వీటన్నిటినీ నియమించినది శ్రీ వేంకటేశ్వరుడే. నిజమే. నాకుమాత్రం ఈయనను సేవించాలన్న దొక్కటే కోరిక. ఇతరములన్నీ కొరకొరలే (అయిష్టములే). (నన్ను ఆ ఏడుకొండలవాడికే వదలిపెట్టండి).

## 5-55

## మున్నుడి

అన్నమాచార్యుల వారి హరి దశావతార వివరణ కీర్తన ఇది. ప్రతి కీర్తనలోను ఏదో క్రొత్తదనాన్ని ప్రతిపాదించడం ఆచార్యుల ప్రత్యేకత. పొడవైన శేషగిరి అంటే ఎత్తైన శేషాద్రి అని. పెద్దబోయనాయుడు అంటే? నాయడు అంటే 'నాయకుడు' అని అర్థం. బోయనాయడు అంటే ప్రధాన జాలరి అని అర్థం. మరి ఈ జాలరికి చిక్కిన చేపలే సమస్త జీవులు. 'పంచగాలవేలముల' అంటే వంచనలలో శిఖరమువంటివాడు అని భావించాను."వెలయమోటున నుండే వేట బోయనాయడు" అంటే నరసింహుడు. కాని మోటున అంటే ఇదమిద్ధంగా తెలియదు. స్తంభము అని భావించాలి.

**ఆ.వె॥ బోయనాయుడితడు పొడవైన శేషాద్రి**
**నున్న హరి యితడనె నన్నమయ్య**
**విడువరాని వాడు వేంకటేశుండని**
**హరి దశావతార పరిధి దెలిపె.**

**రాగం : బౌళి**

పొడవైన శేషగిరి బోయనాయడు
విడువ కిందరిగాచు వెడబోయనాయడు ॥పొడవైన॥

పొలసి మీసాల పెద్ద బోయనాయడు
మలిగి వీపున గట్టే మంకు బోయనాయడు
పొలమురాజై తిరిగే బోయనాయడు
వెలయ మోటున నుండే వేట బోయనాయడు ॥పొడవైన॥

పొట్టి పొట్టి యడుగుల బోయనాయడు యెందు
బుట్టు పగ సాధించే బోయనాయడు
బొట్టుల మెకమునేసే బోయనాయడు
పట్టపు నెమలి చుంగ బలుయనాయడు ॥పొడవైన॥





పొంచి శిగ్గెగ్గెఱగని బోయనాయడు
మించి రాలమీద దాటే మెండు బోయనాయడు
అంచెల శ్రీవేంకటేశుడనే బోయనాయడు
పంచగాలవేలముల బలుబోయనాయడు ॥పొడవైన॥

**భావామృతం :**

ఈతడే పొడవైన (ఎత్తైన) శేషాద్రిపైనున్న 'బోయనాయడు' (జాలరి నాయకుడు). ఈయన విడువక అందరినీ కాచు (రక్షించు), వెడ బోయనాయడు (వికారంగా ఉండే బోయనాయడు). వికారం అంటే అసహ్యం అని అర్థం చెప్పుకోకూడదు. ఒక ఆకారంలేని అని భావము.

ఈయన 'పెద్ద పొలుసులు మీసాలు వున్న బోయనాయడు' (మత్స్యావతారము). ఈయన వీపున మలగి (కొండను) కట్టుకొన్న బోయనాయడు (మందర పర్వతాన్ని మోసిన కూర్మావతారం). ఈయన పొలమురాజై (అడవిపందివలె) తిరిగే బోయనాయడు (వరాహావతారం). ఈయన వెలయ మోటుననుండే వేట బోయనాయడు (స్తంభమునుండి వెలసిన వేటాడు బోయనాయడు) అనగా నరసింహావతారం.

ఈ బోయనాయడు పొట్టి పొట్టి అడుగులవాడు (చిన్ని చిన్ని పాదాలు వున్న... త్రివిక్రముడు అంటే వామనావతారం). ఈయన ఎందు (ఎక్కడెక్కడో) బుట్టుపగ (పుట్టుకతో వచ్చిన పగ) సాధించిన బోయనాయడు (పరశురామావతారము). ఈయన బొట్టుల మెకము నేసే బోయనాయడు. (బంగారు శరీరంపై వెండిచుక్కలున్న లేడిని చంపిన బోయనాయడు... అంటే రామావతారం). ఈయన పెద్ద నెమలి పింఛములను అలంకరించిన బోయనాయడు. (బలరాముడు కావచ్చు శ్రీకృష్ణుడు కావచ్చు). వారిలో నిజానికి ఎవరైనా ఒక్కటే.

ఈయన, పొంచి శిగ్గెగ్గెరగని బోయనాయుడు. (సమయం చూచి సిగ్గు ఎగ్గులేకుండా త్రిపురాసురుల భార్యల మానముల నపహరించిన బోయనాయడు. అనగా బుద్ధావతారం). ఈయన మించిరాలమీద దాటే మెండు బోయనాయడు. (మించిన కొండలు అనగా తిరుమల మీదనున్నఘనమైన బోయనాయడు....అని నాభావన ఏడుకొండల వాని అవతారము). అంచెల (ఈ వరుసక్రమములో శ్రీవేంకటేశుడైన బోయనాయడు, పంచగాలవేలముల బలుబోయనాయుడు. అనగా శ్రీవేంకటేశ్వరుని ప్రక్కనున్న బలమైన కాలఖడ్గమును ధరించిన బలమైన బోయనాయడు, అనగా రాబోవు కల్కి అవతారము.

**5-56**

## మున్నుడి

అనాదిగా వైష్ణవులకు అన్యమతస్థులకు మధ్య వైషమ్యాలు తలయెత్తి స్పర్థలు పెరుగుతూనే వున్నాయి. శివకేశవులిద్దరూ, పరమాత్ముని వివిధ రూపాలని ఇద్దరికీ ఏ బేధమూలేదని, నిజమైన వైష్ణవునికి సర్వమూ విష్ణువేనని చెబుతున్నారు. అన్నమాచార్యులవారు. విశ్వరచన అంతా విష్ణు సంకల్పంతోనే నడుస్తున్నది. ఆయన ప్రభావమే ఈ విశ్వమంతా. అతి చంచలమైన ఆత్మ కలిగించే ఎన్నో చిత్తగతుల వల్ల భ్రాంతి పొంది ఇతర దేవతలను సేవిస్తున్నామేకాని, ఎవరిని కొలిచినా చివరికి చేరదీసి మోక్షం ఇచ్చేవాడు శ్రీవేంకటేశ్వరుడే అంటున్నారు.

**తే॥ వైష్ణవులుగాని వారలు వసుధ గలరె?**
**విష్ణుమూర్తి ప్రభావమే విశ్వమంత**
**చంచలంబైన ఆత్మ తెప్పించు భ్రాంతి**
**అన్నమార్యుడే జెప్పెను హరిని గొలిచి**

**రాగం : ధన్యాసి**

వైష్ణవులు గాని వారలెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీ విశ్వమంతయు గాన ॥వైష్ణవు॥

అంతయు విష్ణుమయంబట మరి దేవ-
తాంతరములు గలవననేలా
భ్రాంతి బొంది యీ భావము భావించి-
నంతనే పుణ్యులవుట దప్పదుగాన ॥వైష్ణవు॥

యెవ్వరి గొలిచిన నేమి గొరత మరి
యెవ్వరి దలచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరి రూపుగాని వా-
రెవ్వరు లేరని యెరుక దోచిన జాలు ॥వైష్ణవు॥





అతి చంచలంబైన యాతుమగలిగించు-
కతమున బహుచిత్త గతులై
యితరుల గొలిచిన యెడయక యనాథ-
పతి తిరువేంకటపతి చేకొనుగాక ॥వైష్ణవు॥

## భావామృతం

ఓ నరులారా! ఈ ప్రపంచంలో వైష్ణవులు కాని వారలెవ్వరూ లేరు. ఎందుకంటే... ఈ విశ్వమంతయూ విష్ణు ప్రభావముచేతనే కలిగినది కదా!

సరియే... అంతయు విష్ణుమయము అని భావించితే.. దేవతల మధ్య ఆంతర్యం కలదని అనుకోవడం యెందువలన జరుగుతున్నది? భ్రాంతి బొంది ఇట్లు జరుగుచున్నది. ఈ భావము తెలిసినంతనే తప్పక పుణ్యం కలుగుతుంది. ఇది తప్పదు. కావున సర్వమూ విష్ణుమయమేననే భావం స్థిరపడుతుంది.

ఇంకొక సంగతి ఎవరిని ఆరాధిస్తే, ఏమన్నా తేడా వుంటుందా? వుండదు. ఏ లోపమన్నా కలుగుతుందా? కలుగదు. ఎవ్వరిని (ఏ దైవమును) తలుచుకొన్నా ఏమి బేధము వుంటుంది? అక్కడా, ఇక్కడా (ఏ లోకంలోనైనా) శ్రీహరి రూపుకాని వారలెవ్వరూ లేరు. ఈ ఒక్క విషయం మనస్సులో పెట్టుకొని ప్రవర్తిస్తే చాలు. అంతా మంచే జరుగుతుంది.

అసలిదంతా యెందుకు జరుగుతున్నది? సర్వం విష్ణుమయం అనే భావన కలుగక, యెందరో దేవతలనెందుకు కొలుస్తున్నారు? జీవులలో వున్న 'ఆత్మ' మిక్కిలి చంచల స్వభావం కలది. తను పరమాత్మయేననే అద్వైత భావన మఱచి, భ్రాంతికి లోనై నేను వేరు నీవు వేరు అని భావించి నాది నీది అనే భ్రమకు లోనైనందువలన ఎన్నెన్నో చిత్తగతులు (మనస్సుపోకడలు) కలుగుతున్నాయి. అందువల్ల నీకంటే త్వరగా, నీకంటే ఎక్కువ, నీకంటే చాలాకాలం వుండే సత్ఫలితం కావాలని నేను వేరే ఇంకొక దేవతనారాధిస్తున్నాను. అంటే... ఆ దేవతలనెవరిని కొలిచినా తిరువేంకటేశ్వరుని కొలిచినట్లేనని గ్రహించండి. చివరికి అందరినీ ఆదుకొనేవాడు ఆ ఏడుకొండలవాడే. ఇదే నిజం సుమా!

**5-57**

## మున్నుడి

కడప జిల్లా, జమ్మలమడుగు తాలూకాలో కుందేరు నది యొడ్డున పెద్దముడియము అనుగ్రామమున్నది. దీనికి పడమటి దిక్కున పురాతనమైన పాటి దిబ్బ కలదు. అచట ప్రాచీనమైన కొన్ని దేవాలయములున్నవి. వాటిలో ఒకటి శ్రీనరసింహస్వామి దేవాలయము. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో ముడియము నరసింహస్వామిని కీర్తిస్తున్నారు. శృంగార కీర్తన నృసింహునిపై ఇట్లా చెప్పగలుగుట ఒక్క అన్నమయ్యకే సాధ్యమేమో అని నా అభిప్రాయం. అమ్మవారు నృసింహునితో చెక్కు జెక్కు గదియించి నీతితో నీమెడ సొమ్మై నెలకొన్నది" అంటున్నారు.

**చం॥ ముడియము నారసింహుడవు ముచ్చటలాడవదేటి కామెతో**
**తొడపయినుంచు కొంటివిగ, తోయజవాసిని నన్నమయ్యనెన్**
**మెడగల సొమ్ము నీకెయగు మించిన వేంకటశైలమందునన్**
**యెడయదు నిన్ను నీ జయము ఇందిర తానసె కీర్తనంబునన్.**

**రాగం : సాళంగనాట**

జయ మాయ నీకు నాపె సరసములూ
నయగారి ముడియము నారసింహా ॥జయ॥

మోము చూచి నీతోడ ముచ్చట లాడ వలసి
కోమలి నీతొడమీద గూచున్నది
ఆముకొని అట్టె మాటలాడవయ్య ఆపెతో
నామాట విని యిట్టె నారసింహా ॥జయ॥

మన్నన నీయలుకల మంకు దెలుప వలసి
చన్ను లురమున బెట్టి సత మైనది
చెన్నుడ వాపె చనవు చెల్లించ వయ్య యిట్టె
నిన్నడిగేదింకా నేమి నారసింహా ॥జయ॥





చేతుల నిన్ను నలమి చెక్కుజెక్కు గదియించి
నీతితో నీమెడ సొమ్మై నెలకొన్నది
యీతల శ్రీవేంకటాద్రి నెనసితి వాపెతోడ
నా తలపు లీడేరించి నారసింహా ॥జయ॥

### భావామృతం

ఓ ముడియము నారసింహ దేవా! నీకు ఆపె(ఆమె) (శ్రీలక్ష్మి) యొక్క సరసోక్తులు, జయమాయె (జయమును కలిగించుచున్నవి). ఆమె నయగారి (మృదుభాషిణి) అవుటవలన నీకు అన్నివిధములా తగియున్నది.

చిరునవ్వులొలికించు నీముఖమును చూచి ఆ కోమలాంగే నీతో ముచ్చటలాడవలెనని నీతొడమీద కూర్చున్నది. అందుకు ఆముకొని (గర్వముతో) త్వరగా ఆమెతో మాట్లాడవయ్యా! ఓ నారసింహా! ఇప్పుడు నామాట వినవయ్యా! (ఈ అవకాశం వదలిపెట్టకు).

హిరణ్యకశిపుని వధ తరువాత అంతులేని నీ కోపమును గౌరవించి ఆమె నీ మంకు దెలుపవలసి (నీ మొండితనమును తేల్చివేయుటకు) తన కుచములను నీ వక్షమున కానించి కూర్చొని సతమైనది (శాశ్వతురాలైనది). చెన్నుడవు (సుందరమూర్తివే, ఆమె చనవు (కోరిక) చెల్లించవయ్యా! (తీర్చవయ్యా!) ఇంకా నిన్నడిగేదేమిటి? ఓ నారసింహా! నీకు ఆమె కోరిక తీర్చక తప్పదు స్వామీ!

ఆ శ్రీలక్ష్మి నిన్ను తన చేతులను జూచి అలమి (ఆలింగనం చేసికొని) నీ చెక్కిలికి తన బుగ్గలను గదియించి (దగ్గరగా జేర్చి), నీతితో (పొందికగా) నీ మెడలోని ఆభరణమువలె స్థిరపడినది. ఓ తిరుమలేశా! శ్రీవేంకటేశ్వరా! యీతల (ఇక్కడా) నీవే యెనసితివి (వర్ధిల్లుచుంటివి). నా తలపులు (భావనలు) ఈడేరించి (నెరవేర్చి) ఈ ముడియము నరసింహుడవై స్థిరపడితివి.

## 5-58

## మున్నుడి

తన తాతగారైన అన్నమాచార్యులవారిపై ఆయన మనుమడు చినతిరుమలయ్య చెప్పిన చక్కటి సంకీర్తన ఇది. అప్పుడు అంటే తండ్రి. జగతికే తండ్రి శ్రీ వేంకటేశ్వరుడు. అన్నమయ్య ఆయన వరప్రసాది. అప్పసము అంటే శాశ్వతము. మాకే శాశ్వతంగా అన్నమయ్య కలిగినాడు అని అంటున్నారు. శ్రీమన్నారాయణుని మనస్సులో ప్రతిష్ఠించుకొన్న అన్నమయ్య నిత్యమూ బ్రహ్మానందులైన, సనకసందనాది మునులంటివాడు అంటున్నారు. ఆయన రచించిన వేలాది సంకీర్తనలే ఆయన సామర్థ్య చిహ్నాలైన జెండాలుగా రెపరెపలాడుతున్నాయంటున్నారు.

**కం॥ అప్పని వరప్రసాదిగ**
**అప్పసమై మాకు కలిగె అన్నయ్యనెరా**
**ఇప్పుడు చిన తిరుమల తాన్**
**గొప్పగ కీర్తించె తాత కోవిదుడగుటన్.**

**రాగం : తిలంగ్**

అప్పని వరప్రసాది అన్నమయ్య
అప్పసము మాకే కలడన్నమయ్య ॥అప్పని॥

అంతటికి ఏలికైన ఆదినారాయణు తన
అంతరంగాన నిలిపిన అన్నమయ్య
సంతసాన చెలువొందే సనక సనందనాదు-
లంతటివాడు తాళ్లపాక అన్నమయ్య ॥అప్పని॥

బిరుదు టెక్కెములుగా పెక్కు సంకీర్తనములు
హరిమీద విన్నవించె నన్నమయ్య
విరివిగలిగినట్టి వేదముల అర్థమెల్ల
అరసి తెలిపినాడు అన్నమయ్య ॥అప్పని॥





అందమైన రామానుజాచార్య మతమును
అందుకొని నిలిచినాడు అన్నమయ్య
విందువలె మాకును శ్రీవేంకటనాథునినిచ్చె
అందరిలో తాళ్లపాక అన్నమయ్య. ॥అప్పని॥

**భావామృతం :**

అన్నమాచార్యులవారు అప్పని వరప్రసాది (మనందరి తండ్రియైన శ్రీహరి వరముగా జన్మించినవాడు). మాకే (తాళ్లపాక వంశస్థులకు) అప్పసము కలడు (శాశ్వతముగా కలిగినాడు). అన్నమయ్య మా భాగ్యం.

సమస్తమునకు ఏలిక (ప్రభువు) అయిన ఆదినారాయణుని తన మనస్సులోనే ప్రతిష్ఠించుకొని అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరునికే తన జీవితం అంకితము చేసినాడు. మన తాళ్లపాక అన్నమయ్య. (చెలువు అంటే అందము, కానీ చెలవు అంటే ఒప్పు అని అర్థం). కాబట్టి నిత్యసంతోషంతో ఒప్పునటువంటి సనకసందనాది మునులంతటి వాడు మన అన్నమయ్య (అని అర్థం).

అన్నమయ్య, బిరుదు టెక్కెములుగా (సామర్థ్య చిహ్నములైన జెండాలుగా) అనేక సంకీర్తనలు కలవాడు. ఆ కీర్తనలను ఆయన భూపతులైన రాజులపై చెప్పలేదు. కేవలం శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరునిపైననే చెప్పారు. జగత్ప్రసిద్ధములైన వేదములసారముగా దర్శించి వేలాది సంకీర్తనలను తెలిపినవాడు తాళ్లపాక అన్నమయ్య.

మనోజ్ఞమూర్తియైన రామానుజాచార్యులవారి విశిష్టాద్వైతమతమును స్వీకరించి అన్నమాచార్యులవారై అన్నమయ్య విఖ్యాత చెందినాడు. ఆయన వంశస్థులమైన మాకు కూడా గొప్ప విందువలె శ్రీవేంకటేశ్వరుని అందించినారు. ఈ తాళ్లపాక అన్నమాచార్యులవారు అందరిలోను మా కీర్తిని నిలబెట్టినారు.

## మున్నుడి 5-59

అద్భుతమైన పెండ్లిపాటను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆ కమలనేత్రుని పెండ్లికి గరుడధ్వజం లేచింది. పరుషలు (చిత్రవర్ణములు కల వస్త్రములను ధరించినవారు). అదిగో వచ్చారు. వారు స్వామిని పైపై (సామర్థ్యముతో) సేవించుచున్నారు. దేవతలంతా పాల్గొన్న ఈ పెండ్లిని దర్శించండి. మీ మనోనేత్రంతో.

**సీ॥ గరుడధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి**
**పరుషలు వచ్చిరి బరుపసేవ**
**భారతి గిరిజలు పాడిరి సోబాను**
**ఆడిరి రంభాది అచ్చరలును**
**కురిసె పువ్వుల వాన కుప్పలై ధరలోన**
**దేవదుందుభులెల్ల దివిని మ్రోగె**
**వేసిరి కాన్కలన్ వేల కొప్పెరలలో**
**పోసిరక్షింతలన్ పుణ్యసతులు**

**ఆ.వె॥ వేంకటాద్రిపైన వెట్టిరి సేసలన్**
**రమణు పెండ్లివేళ రమణితోడ**
**కొలువు ఇచ్చిరనెను కూరిమి నన్నయ్య**
**సురులు భువికి జేరి మురియు వేళ**

**రాగం : రామక్రియ**

గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి
పరుష లదివో వచ్చె బైపై సేవించను ॥గరుడ॥

పాడిరి సోబాను నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాది అచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరుడ॥

కురిసె బువ్వుల వాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మ్రోతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥





వేసిరి కానుకలెల్ల వేవేల కొప్పెరల
పోసి రదె తలంబ్రాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుడలమేలుమంగ దాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి ॥గరుడ॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి, అలమేలు మంగమ్మకు కళ్యాణం కన్నుల పండువగా జరుగుతోంది. ఆ కమలనేత్రుని పెండ్లి సందర్భంగా అదిగో గరుడధ్వజమునెత్తారు చూడండి. అదిగో "పైపై" సేవించను (శక్తికొలది సేవించుటకు) పరుషలు (చిత్రవర్ణములు కల వస్త్రములను ధరించిన ప్రజలు) వచ్చుచున్నారు.

అదిగో సరస్వతీదేవి, పార్వతీదేవి మధురముగా గొంతెత్తి సోబాను (పెండ్లిపాటను) పాడుచున్నారు. రంభ మొదలైన అప్సరసలు అదిగో కన్నులపండువగా ఆడిరి (నర్తించుచున్నారు). దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రిమీద, వేడుకలు జరుపుటకు శ్రీవేంకటేశ్వరుని పెండ్లికి వస్తున్నారు. (మీ మనోనేత్రంతో దర్శించి వారందరికి మ్రొక్కండి).

అదిగో ఎందుచూచినా కుప్పలై (గుట్టలు గుట్టలుగా) పువ్వులవాన కురియుచున్నది. స్వర్గంలో దేవదుందుభులు మొరసె (మ్రోగుచున్నవి). ఆ శబ్దములనన్నింటినీ చెవులకింపుగా వినండి (మనబోటి అల్పులకు వినపడవు అయినా భావించండి). శ్రీవేంకటాద్రి మీద సంపదలన్నీ పెంటలై బెరసినవి (కుప్పలు తెప్పలుగా కలిగినవి). దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని పెండ్లికి తిరమై మించినది (స్థిరముగా ఆ సంపద వృద్ధి చెందుచునే యున్నది).

అదిగో వేవేల కొప్పెరలలో (అనేకములైన హుండీలలో) కానుకలెల్ల వేసిరి (భక్తులు కానుకలను వేసారు). వధూవరులు తలంబ్రాలు పోసుకుంటున్నారు). పుణ్యస్త్రీలు అక్షతలను చల్లుచున్నారు. అటువంటి సింగారపు పెండ్లికి (మంగళప్రదమైన కళ్యాణమునకు) విచ్చేయండి. (ఏనాటి పుణ్యమో మీరూ దర్శించగలిగారు కనుక పరవశించి వధూవరులకు నమస్కరించండి). శ్రీవేంకటేశ్వరుడు తనదేవి అలమేలు మంగమ్మతో మిమ్మల్ని కరుణిస్తాడు.

**5-60**

## మున్నుడి

ఒకానొక విజయదశమినాడు శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, శ్రీవేంకటేశునిగా ఆయన విజయపరంపరలను నుతించారు అన్నమాచార్యులవారు ఆ విజయాలకోసం ఆయన వేసిన అమ్ములపై (బాణములపై) కీర్తన చెప్పారు. ఆలకించండి. ఆ తిరుమలేశుడే విజయుని సఖుడు. రుక్మిణిని చేపట్టిన విజయకృష్ణుడు అంటున్నారు. దశకంఠుని పది శిరస్సుల ఖండించిన ఆదిదేవుడు ఈయనే అంటున్నారు. ఇందిరాదేవిని గూడి పంతమున అమ్ముివేసి సర్వులను రక్షించు విష్ణు దేవుడు కూడా ఈయనే అని కీర్తిస్తున్నారు.

**మ॥ వినుడా వేంకటనాథుడెత్తి వడిగా వేసెన్, భళా!! అమ్ములన్**
**ఘనమాయెన్ విజయాలు పార్థ సఖుకున్ గావించె కళ్యాణముల్**
**దునిమెన్ ఆ దశకంఠుకున్న శిరముల్ తొల్లింటనా లంకలో,**
**కొనియెన్ రుక్మిణి దెచ్చి ద్వాపరమునన్ గోవిందు డన్నయ్యనెన్.**

**రాగం : షణ్ముఖప్రియ**

విజయపు టమ్ము వేసె వేంకటేశుడు
విజయుని సఖుడు యీ వేదమూరితి ॥విజయ॥

పాటితెంచి దశకంఠు పది శిరసులమీద
ఆటికి నమ్మువేసె నాదిదేవుడు
ఆటిడి సేనలతోడ నంబుధి మీద వేసె
వేటొక యమ్ము దొడిగి విష్ణుదేవుడు ॥విజయ॥

చాలుగ నేడు దాళ్ల సర్వము నొక్కటిగాగ
ఆలములో నమ్మువేసె నఖిలేశుడు
ఆలించి రుక్మిణి బెండ్లి యాడునాడు వైరులపై
జాలియమ్ము వేసెను విజయకృష్ణుడు ॥విజయ॥





భజన నిందిరగూడి పంతమున నమ్మువేసె
విజయదశమిని శ్రీవేంకటేశుడు
సుజనుల దేవతల సొరిది నిందరిగాచు
విజయము చేకొనె విష్ణుదేవుడు ॥విజయ॥

**భావామృతం :**

శ్రీవేంకటేశ్వరుడు విజయపుటమ్ము (విజయమును కలిగించెడి బాణమును) వేసినాడు. వేదమూర్తియైన ఈ దేవదేవుడు విజయునికి (అర్జునునికి) సఖుడు (మంచి స్నేహితుడు)

అతి శీఘ్రముగా పోయి, రావణాసురుని పదిశిరస్సులను ఖండించుటకు ఆదిదేవుడైన నారాయణుని మానవాకృతియైన శ్రీరామచంద్రుడు, వాని ఆటికి (నాశనమునకు) అమ్మువేసెను (బాణమును వేసినాడు). ఆటిడి సేనలతో (వ్యర్థమైన వానరసేనతో) అంబుధిని దాటుటకు సముద్రునిపై వేటొక అమ్ము వేయుటకు శరమును సంధించినాడు. ఆయన స్వయంగా విష్ణుమూర్తియే కదా!

చాలుగ (వరుసగా) "సర్వము నేడు తాళ్లు" (అన్నీ, ఏడు తాటిచెట్లను) ఒక్కటిగా (ఒకేసారి) ఆలములోనమ్ము వేసె (శత్రు సంహారమునకు ఉపయోగించు బాణమును ఆ సర్వలోకనాథుడు వేసినాడు). ద్వాపరయుగంలో, ఆలించి (తన విన్నపమును విని) రుక్మిణీదేవిని తెచ్చుకొని పెండ్లియాడుటకు ఆ దేవదేవుడే శ్రీకృష్ణమూర్తిగా సిద్ధపడినాడు. ఆరోజున తన వైరులపై (శత్రువులైన రుక్మి మొదలైన వారిపై) జాలియమ్ము వేసినాడు (చాలియమ్ము... ధారగా బాణములను వేసినాడు). వారందరిని ఓడించి విజయకృష్ణుడైనాడు.

నేడు, ఈ విజయదశమినాడు తనదేవేరి ఇందిరాదేవితో కూడిన ఈ శ్రీవేంకటేశ్వరుడు, పంతమున (పట్టుదలతో) భజన అను అమ్మువేసినాడు. సొరిది (వరుసగా) సుజనులను, దేవతలను, వీరందరిని గాచుటకు వేసిన ఆ అమ్ము(బాణము) వారందరికీ గుచ్చుకొని అందరూ ఆయన భక్తులైనారు. ఆ విష్ణుదేవుడు ఈవిధముగా కలియుగంలో కూడ విజయము చేకొనినాడు.

**5-61**

## మున్నుడి

చాలా తేలికగా అర్థమైపోతుంది అనుకొని, ఆ తరువాత మనం పొరబడ్డా మనిపించే కీర్తన ఇది. అన్నమాచార్యులవారి అద్భుత సృష్టి. వైరాగ్యం తత్త్వ చింతన ప్రతిపాదించే ఈ కీర్తనలో తన కాలమంతా గాలి తిరుగుళ్లతోనే సరిపోయిందని, తాలిమికి (క్షమకు) ఏమాత్రము సమయంలేకుండా గడిచిపోయింది. ఎన్నో చెత్త ఆలోచనలతో, వ్యాపకాలతో కాలం వృధా అయిపోయింది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీమీద ధ్యాసే లేకపోయింది. నన్ను క్షమించు ప్రభూ! నన్ను నీవాడిని చేసికో...

**కం॥ గాలిని పడినే పోయా**
**కాలంబున నంతులేక ఘనుడైన హరీ!**
**తాలిమికి ప్రొద్దు లేదనె**
**మాలావుగ అన్నమయ్య మాటను వినుడీ.**

**రాగం : కన్నడగౌళ**

గాలినే పోయ గలకాలము
తాలిమికి గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

అడుసు చొరనే పట్టె నటునిటు గాళ్లు
గడుగుకొననే పట్టె గలకాలము
ఒడవికి జీవుని కొడయైన హరి
దడవగా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

కలచి చింతనే పట్టె గడవ నించగ బట్టె
కలుష దేహపు బాధ గలకాలము
తలపోసి తనపాలి దైవమైన హరి
దలచగా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥





శిరసు ముదువ బట్టె చిక్కుదియ్యగ బట్టె
గరిమల గపటాల గలకాలము
తిరువేంకటగిరి దేవుడైన హరి
దరిచేరా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

**భావామృతం :**

ప్రభూ! కలకాలము (కాలమంతా) నేను గాలినే పోయా (వ్యర్థంగా గాలికి తిరిగాను). తాలిమికి (క్షమకు) కొంతయును బొద్దులేదు (ఏమాత్రమూ సమయం లేదు...) అనగాలి క్షమ అనేది యెరుగక నాకాలము నంతయును గడిపితిని.

నా కాళ్లు, అడుసుచొరనే పట్టె గలకాలము (కాలమంతా బురదలోనే నడిచాయి). వాటిని (కడుగు కొనుటయే జరిగినది). కానీ, ఒడలికి జీవునికి ఒడయైన హరిన్ (శరీరానికి, జీవాత్మునికి స్వామియైన నారాయణుని) తడవగా (తలచుటకు) ఏమాత్రము సమయము లేకపోయింది. ఎంత దౌర్భాగ్యుడను!!

ప్రభూ! కలచి చిందనేపట్టెన్ (నింపిన నీరు చింది పోతూనే వున్నది). కడవనించగ బట్టె (కుండను నింపుతూనే వున్నాను). కలకాలము కలుషదేహపు బాధ (కాలుష్యంతో నిండిన దేహము యొక్క బాధ నిత్యమైనది). ఈ దేహపు అవసరాలు చూడటానికే కాలమంతా గడచిపోతోంది. తనపాలిదైవమైన హరిని గురించి తలపోసి (ఆలోచించి) తలచగా (ధ్యానించుటకు) ఏమాత్రమూ సమయము లేకపోయింది). ఎంత దురదృష్టం!!

ప్రభూ! ప్రతిదాంట్లోనూ, శిరసు ముడువగ బట్టె (తలదూర్చవలసి వచ్చింది). చిక్కుదియ్యబట్టె (దానివల్ల కలిగిన చీకాకులను వదిలించుకోవలసి వచ్చింది). గరిమల గపటాల (మధ్యలో వంచనలతోనే) కలకాలము గడచిపోయింది. తిరువేంకట గిరిదేవుడైన హరిన్(శ్రీవేంకటేశ్వరుని) దరిచేర (ఆశ్రయించుటకు) కొంతయును బొద్దులేదు (ఏమాత్రమూ సమయము లేనేలేదు). ఎంత మందభాగ్యుడను!!

**5-62**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి జ్ఞానబోధను చేస్తున్నారు. ఆలకించండి. "ఓ దేవదేవా! నిన్ను పూర్తిగా నమ్మి నిశ్చలమైన మనస్సుతో నీదాసునిగా వున్నాను. ఇంకా నాకు వేరే ఇతర ఉపాయము లెందుకు" అని అంటున్నారు. భక్తి అంటే వంద టెంకాయలు కొట్టి అభిషేకాలు అన్యమనస్కంగా చేయించి, హుండీలో 'నల్లధనం' వేయడం కాదని మనందరికీ తెలుసు. కాని భక్తులనుంచి స్వామి ఏమి కోరుతున్నాడనేది నిస్సందేహంగా తెలియదు. ఇది చదివితే కొంత తెలుస్తుందని నా నమ్మకం.

**మత్తకోకిల:**

**నిన్ను నమ్మితి నిల్చుకొంటిని నిశ్చలంబుగ నా మదిన్**
**ఉన్నవాడను నీదు మీదనె ఉన్నతంబగు నమ్మికన్**
**అన్నమయ్యనె వేరుపాయము అంతకంటెను లేదురా**
**వెన్నుడా! వెరపేల నాకిక వేల్పువై తమరుండగా.**

**రాగం : కన్నడగౌళ**

నిన్ను నమ్మి విశ్వాసము - నీపై నిలుపుకొని
ఉన్నవాడనిక వేరే - ఉపాయమేమిటికి ॥నిన్ను॥

గతియై రక్షింతువో - కాక రక్షించవో యని
మతిలోని సంశయము - మఱి విడిచి
యితరులచే ముందర - నిక నెట్లౌదునో యని
వెతతోడ దలచేటి - వెఱపెల్లా విడిచి ॥నిన్ను॥

తిరమైన నీ మహిమ - తెలిసే వాడననే
గరువము తోడి వుద్యో-గము విడచి
వెరవున నీరూపు - వెదకి కానలే ననే
గరిమ నలపు నాస్తి - కత్వమును విడిచి ॥నిన్ను॥





ధ్రువమైన నా చేతకు - తోడుదెచ్చుకొనే ననే
అవల నన్నులమీది - యాస విడిచి
వివరించలమేల్మంగ - విభుడ శ్రీవేంకటేశ
తవిలితి నీ పుణ్యమం తయు నీకు విడిచి ॥నిన్ను॥

**భావామృతం**

ఓ దేవదేవా! నిన్నే నమ్ముకొని నా నిశ్చలమైన నమ్మకాన్ని నీపైననే నిలిపివున్నాను. నాకు వేరే ఇతర వుపాయాలు యెందుకయ్యా! నన్ను తరింపచేయటానికి అది చాలును.

నీవు నాకు గతివై కాపాడుతావో కాపాడవో అనే కుశంకలను నా మనస్సునుండి తొలగించుకొన్నాను. నీపై నిశ్చలమైన నమ్మకం వుంచుకొన్నాను. ఇతరుల వలన నాకు ఇకముందు ఏమి అపకారాలు జరుగుతాయో అని నాకు ఇంకా భయమెందుకు? ఆ వెఱపునంతా విడిచిపెట్టి నిన్నే నమ్ముకొని నిశ్చింతగా వున్నాను.

స్థిరమైన నీ మహిమ నాకు తెలిసిపోయిందని మిక్కిలి గర్వంతో వున్న నా వుద్యోగము (ప్రయత్నము) విడిచిపెట్టాను. నీ రూపమును వెరవున (ఉపాయంతో) వెదకి ప్రయోజనం లేదనీ నిన్ను కనుగొనలేనని తెలిసి అలిసిపోయాను. ఆ అలపు గరిమ(ప్రభావం) వలన కొంత నాస్తికత్వం కూడా నన్ను ఆవహించింది. కానీ నీదయవలన దాంట్లోంచి బయటపడి నీపైన పరిపూర్ణ విశ్వాసమును పునః ప్రతిష్ఠించుకొన్నాను. నీపైన అచంచల విశ్వాసంతో వున్నాను.

ధ్రువమైన (స్థిరమైన) నా చేతకు (నిన్ను సేవించే ప్రయత్నములకు) తోడుదెచ్చుకొనేననే ఆసలు (ఇతరుల సహాయము, తోడ్పాటు వుంటాయి అనే ఆశలను) విడనాడితిని. అవల (అటుతర్వాత) ఆ భ్రమలన్నీ తొలగించుకొన్నాను. మా అమ్మ అలమేల్మంగకు నాథుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నేనే వుద్ధరించుకోవాలని కృత నిశ్చయుడనయ్యాను. నేనింతవరకు ఏదన్నా పుణ్యం సంపాదించి వుంటే... అదంతా నీకే సమర్పిస్తున్నాను. నా బాధ్యత అంతా ఇక నీదే. నన్నేం చేసినా నీ ఇష్టం.

**5-63**

## మున్నుడి

అన్నమయ్య సుపుత్రుడైన పెదతిరుమలాచార్యులవారు చెప్పిన మనోహరమైన మేలుకొలుపు కీర్తన ఇది. నాకత్యంత ప్రీతిపాత్రమైన ఈ కీర్తన మదనగోపాలస్వామిమీద ఆచార్యులవారు చెప్పారు. శృంగారకీర్తనలు చెప్పటంలో తన తండ్రికి తగిన కొడుకనిపించారు. కొలనిలో జలకములాడే గోపీరమణుల కుచగిరులపై నిరతి (మిక్కిలి ఆసక్తితో) వాలిన నల్లని మేఘమా అని సంబోధిస్తున్నారు. మరి మదనగోపాలుడు కదా! తనతండ్రి బాణీలోనే, ఈ స్వామియే తిరుమలలోని మన వేంకన్న అంటున్నారు.

**ఆ.వె॥మేటి మదనగోప! మేలుకో శృంగార-**
**రాయ అనుచు పొగిడె రమ్యముగను**
**మేలుకోవె మాకు మించు నిధానమా!**
**పెద తిరుమలాలపించె వినుడు.**

**రాగం : మలయమారుతం**

మేలుకో శృంగారరాయ మేటి మదన గోపాల
మేలుకోవె నాపాలి మించిన నిధానమా ॥మేలుకో॥

సందడించే గోపికల జవ్వన వనములోన
కందువ దిరిగే మదగజమవు
యిందుముఖి సత్యభామ హృదయపద్మములోని
గంధము మరిగినట్టి గండుతుమ్మెదా ॥మేలుకో॥

గతిగూడి రుక్మిణి కౌగిటి పంజరములో
రతిముద్దు గులికేటి రాచిలుకా
సతులు పదారువేల జంట కన్ను కలువలకు
ఇతవై పొడమిన నా యిందు బింబమా ॥మేలుకో॥





వరుస కొలనిలోని వారి చన్నుకొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరి నురమున మోచి శ్రీవేంకటాద్రి మీద
గరిమ వరాలిచ్చే కల్పతరువా ॥మేలుకో॥

**భావామృతం :**

మేటి (అధిపుడైన) మదనగోపాలా! మేలుకో ప్రభూ! ఓ శృంగారరాయా! మేలుకొనుము తండ్రీ! నీవు నాకే చెందిన శ్రేష్ఠమైన విధానమవు (నిధానము అంటే భూమిలో పాతిపెట్టి దాచివుంచిన ధనము... నేటికాలంలో ఫిక్సెడ్ డిపాజిట్ అన్నమాట)

నీవు అతిశయించిన గోపికల యౌవన వనములలో స్వేచ్ఛా విహారము చేయు మదకరీంద్రము వంటివాడవు. చంద్రవదనయైన సత్యభామ యొక్క హృదయ కమలములోని మకరందము నాస్వాదించు మగ తుమ్మెదవు నీవే ప్రభూ! అట్టి నీవు మేలుకొని మమ్మల్ని ఆదుకో.

ఓ దేవదేవా! నీవు రుక్మిణీదేవి కౌగిలి పంజరంలో ఉపాయముతో కావాలనే చిక్కిన రామచిలుకవు. మనోజ్ఞమైన శృంగారమును వెదచల్లు నీవు ఇప్పుడు మేలుకో ప్రభూ! పదియారువేలమంది రాచకన్నెలు వరించగా వారిని సతులుగా స్వీకరించి, కలువలవంటి వారికన్నులను వికసింపచేయు చందమామ నీవే తండ్రీ! ఆ కలువలకు, ఇతవై పొడమితివి (వారి హితుడవై పొడజూపితివి).

ఆనాడు రేపల్లెలో కొలనులో జలకములాడు గోపికల స్తనగిరులపై నిరతితో (మిక్కిలి ఆసక్తితో) కమ్మిన నల్లని మేఘము నీవే ప్రభూ! ఈనాడు శ్రీవేంకటాద్రి మీద శ్రీదేవిని నీ యెదపై మోయుచూ శ్రీవేంకటేశ్వరుడవై, గరిమ వరాలిచ్చే (గొప్ప వరములిచ్చే) కల్పవృక్షము నీవే నయ్యా! ఏవరం కోరితే ఆ వరం ఇస్తావు (కాకపోతే... ఏమి కోరుకోవాలో అది కోరుకోనట్టి మూర్ఖులము మాత్రం మేమే)

**5-64**

## మున్నుడి

జగన్నాథునికి జగన్మాతకు వసంతోత్సవం జరుగుతున్నది. అమ్మవారి పక్షాన జేరి ఆమెను ప్రోత్సహిస్తున్నారు అన్నమాచార్యులవారు. సంతోష సాగరంలో తేలిపోతున్న ఆ అలివేణికి పులకరింతలు, మొలకలెత్తి పున్నమి శోభతో చిగురించినట్లున్నది. నీపతితో వసంతము ఆడవే తల్లీ! అంటున్నారు. శృంగారకీర్తన అయినందువల్ల సాధ్యమైనంత నర్మగర్భంగానే వివరణ ఇవ్వటం జరిగింది. ఆలోచించినకొద్దీ అన్నమయ్య భావవైశిష్ట్యం అర్థమవుతుంది. శ్రీపతికూడా చిరునవ్వులు చిందిస్తాడు.

**చం॥ పులకలు మొల్కలై పొడమె పున్నమితోడుత కూడెనే యనెన్**
**అలికులవేణి! నీపతితొ ఆడవె వేడుకతో వసంతమున్**
**చెలువముతోడనీ పగిది చెప్పెను శ్రీసతి కన్నమార్యుడున్**
**తలపగ మేటి కీర్తనము తన్మయుడై విను, వేంకటేశుడున్**

*** అలికులవేణి=తుమ్మెదల గుంపువంటి వెంట్రుకలుగల స్త్రీ**

**రాగం : వసంత**

పులకల మొలకల పున్నమితోడనె కూడె
అలివేణి నీ పతితో ఆడవే వసంతము ॥పులకల॥

మాటలు తేనెలు వారె మక్కువలు చిగురించె
మూటలకొద్దీ నవ్వులు మొగ్గ లెత్తెను
వాటపు జవ్వనానకు వసంతకాలమువచ్చె
ఆటదానవు పతితో ఆడవే వసంతము ॥పులకల॥

చెమట రసములూరె సిగ్గులు పూవక పూచె
తిమురు తరి తీపుల తేనెలుబ్బెను
క్రమమున తమకము గద్దియు మదనుండెక్కె
అమర నీపతితోడ ఆడవే వసంతము ॥పులకల॥





కడుగోరి తాకులు కాయము కాయలు గాచె
బడినే కెమ్మోవిని పండు పండెను
ఎడలేక శ్రీవేంకటేశుడిట్టె నిన్ను గూడె
అదరి నీపతితోనె ఆడవె వసంతము ॥పులకల॥

**భావామృతం :**

ఓ అలివేణీ! (తుమ్మెదలవంటి నల్లని ముంగురులు కలదానా!) నీకు ఆనందాతిరేకమున తనువు పులకరించి, మొలకలెత్తి పున్నమి శోభను వెలువరిస్తున్నది. దేవీ! నీవు నీపతితో ఈవేళ వసంతములాడవమ్మా!

ఈ వసంతోత్సవమున నీవు ఆయనతో మాటలాడుతుంటే తేనెలు జాలువారుతున్నాయి. నీ అనురాగము చిగురించుచున్నది. నీ నవ్వులు మూటలకెత్తిన మొగ్గలైనాయి. వాటమైన నీ యౌవనమునకు వసంతశోభ ఆవరించింది. నీవు ఆటదానవు (మంచి నర్తకివి). అటువంటి నీవు నీ విభునితో వసంతము లాడవే తల్లీ!

దేవీ! నీ స్వేదము రసములూరినట్లున్నది. నీ సిగ్గులు పూచీపూయని మొగ్గలైనవి. తిమురుతరి (అలసటతో ఒళ్లు విరుచుకొంటున్నప్పుడు) మధుర మకరందములు ఉబికినవి. తన్మయత్వపు గద్దియను (సింహాసనమును) తనువులేని కందర్పుడు అధిరోహించెను. అటువంటివేళ, నీపతితో వసంతములాడి ద్విగుణీకృతమైన ఆనందంతో దీప్తించవమ్మా!

దేవీ! చిలిపివాడైన నీ స్వామి నఖక్షతములతో నీ కాయము కాయలు కాచిందమ్మా! బడినే (ఆ తరువాత) కెంపువంటి నీ మోవి పండిన పండువలె జూపట్టినది. అవిశ్రాంతుడైన ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను సునాయాసంగా కూడినాడు. అదరి (త్వరపడి) నీ మనోవల్లభునితో వసంతము లాడవే తల్లీ! మీకు యెనలేని ఆనందం కలుగుటయే గాక ఆ శోభను, భావించిన మా జన్మలు కూడ తరించినవమ్మా!

**5-65**

## మున్నుడి

ఇతడు అంటే మన కన్నులయెదుట నున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు. అన్ని వైభవములుకల అతడు (పరమాత్మ). అతను నిరాకార, నిరంజన, నిర్గుణ పరబ్రహ్మ. ఇతడు సాకార, భక్తవత్సల, సకల సద్గుణాభరణుడు. ఇతడు సమవర్తి, కానీ ధర్మవర్తనుల యెడ పక్షపాతి. ఆది, అంతము, పుట్టుక లేనివాడే... కాని అదితి, కౌసల్య, దేవకి మొదలైన వారు ఇతని తల్లులే. ధనమే కావాలనుకొనే అజ్ఞానులకు ధనమే ఇస్తాడు. ఇవ్వాళ ఉండి రేపు పోయే ఈ సిరి వద్దు ముక్తి కావాలి తండ్రీ! అంటే... అదీ ఇస్తాడు. అతడే ఇతడు. అంటున్నారు అన్నమాచార్యులవారు.

**ఉ॥ ఈతడె వేయి నేత్రముల యేలిక, వైభవముల్ అనంతముల్**
**ఈతడె ఆది అంతములు నెన్నగదోపని పద్మనాభుడున్**
**ఈతడె ద్రుంపు నాభవము, యేలెను యాదవ గోగణంబులన్**
**ఈతడె వేంకటేశ్వరుడు ఇచ్చును ముక్తిని అన్నమయ్యనెన్**

**రాగం : రీతిగౌళ**

అన్ని విభవముల అతడితడు
కన్నులు వేవేలు గల ఘనుడితడు ॥అన్ని॥

వేదాంత కోట్ల విభుడితడు
నాదబ్రహ్మపు నడుమితడు
ఆదినంత్యములకు అరుదితడు
శ్రీదేవుడు సరసిజ నాభుడితడు ॥అన్ని॥

భవములణచు యదుపతి ఇతడు
భువనములన్నిటికి పొడవితడు
దివికి దివమైన తిరమితడు
పవన సుతునేలిన పతి ఇతడు ॥అన్ని॥





గరుడని మీదటి ఘనుడితడు
సిరులిందరికి నిచ్చే చెలువితడు
తిరువేంకట నగము దేవుడితడు
పరమపదమునకు ప్రభువితడు ॥అన్ని॥

**భావామృతం :**

ఓ జనులారా! అన్ని వైభవములు కల అతడే (పరమాత్మ) ఇతడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు). కన్నులు వేవేల కల ఘనుడు (సహస్రాక్షుడని వేదములు కీర్తించే మహానుభావుడు... ఈయనే సుమా!!)

కోట్లాది వేదాంతులకు ఈయన "విభుడు" (సర్వవ్యాపకుడైన పరబ్రహ్మ). మననోటిద్వారా ధ్వని పుట్టించు 'నాదబ్రహ్మ', మన అంతర్యామీ ఇతడే. ఈయనకు ఆది (మొదలు) లేదు. అలాగే అంతము(నాశనము) కూడాలేదు. అందుకే ఈయన "అరుదు" (అపూర్వుడు). ఈయనే పద్మనాభుడైన శ్రీమన్నారాయణుడు.

ఈయనే ద్వాపరయుగమున యదువంశమున జన్మించి శ్రీకృష్ణుడై, భవము నణచాడు. (ప్రాప్తించు పాప ఫలమును నిర్మూలించినాడు... ముక్తి నిచ్చాడు). చతుర్దశ భువనాలకు ఈతడే పొడవు (రూపము). వాటికి రూపము నొసగినవాడు ఈయనే. ఇతడు "దివికి దివమైన తిరము" (స్వర్గానికే స్థిరమైన స్వర్గం..అంటే స్వర్గంకంటే స్థిర మైన వైకుంఠ ప్రదాత). ఎంతోమంది దానినొసగినాడు. పవనసుతుడైన హనుమంతుని యేలిన కోసలనాధుడు శ్రీరామచంద్రుడు కూడ ఇతడే.

ఇతడే గరుడగమనుడైన శ్రీహరి. అందరికీ సిరిసంపదల నొసగే చెలువు (హితుడు) ఈ స్వామియే. ఇతడే శ్రీవేంకటాద్రిపై నెలకొనిన దేవదేవుడు. పరమపదము (మోక్షము) నియ్యగల ప్రభువు ఇతడే సుమా!!

**5-66**

## మున్నుడి

క్లిష్టమైన సంస్కృత కీర్తన నందిస్తున్నారు అన్నమాచార్యులవారు. శంకర చంద్ర పవన్ గారి సహకారంతో దీనికి భావామృతం వివరించ గలిగాను. జనన మరణాలు గల మానవ దేహ పంజరంలో చిక్కుబడిన జీవుడు జ్ఞానమెట్లు పొందగలడు? విష్ణు సంకీర్తనపై మక్కువ యెలా పెంచుకోగలడు? కుటిలత్వమూ, వేశ్యాలోలత్వమూ ఎట్లు వదలగలడు? జంతువులాగా జీవించుట వదిలిపెట్టి శ్రీవేంకటేశ్వరుని ఎట్లు భజించగలడు? ఆయన దయలేక అది అయ్యే పనికాదు.

**కం॥ జనన మరణములు గలిగిన**
**జనులకు జ్ఞానంబు మించి సమకూడుటయున్**
**కనుగొనె నెవ్వడు ధరణిని-**
**ననువుగ? మన అన్నమయ్య హరిదెలియరనెన్.**

**రాగం : ముఖారి**

మా దృశానాం భవామయ దేహినాం
యీదృశం జ్ఞానమితి యేః పి న వదంతి ॥మాదృశా॥

వా చా మగోచరం వాంఛా సర్వత్ర
నీచకృత్యై రేవ నిబిడీ కృతా
కేచిదపి వా విష్ణు కీర్తనం ప్రీత్యా
సూచయంతో వా శ్రోతుం న సంతి ॥మాదృశా॥

కుటిల దుర్బోధనం కూ (కు) హకం సర్వత్ర
విటువిడంబన మేవ వేద్యధీతం
పటువిమల మార్గ సంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే న సంతి ॥మాదృశా॥





దురితమిద మేవ జంతూనాం సర్వత్ర
విరస కృత్యై రేవ విశదీకృతం
పరమాత్మానం భవ్య వేంకటానామ-
గిరివరం భజయితుం కేవా న సంతి ॥మాదృశా॥

**భావామృతం :**

జనన మరణములుగల మావంటి దేహాలకు జ్ఞానమనునది ఈవిధముగా వుంటుందని ఏ ఒక్కరును చెప్పుట జరుగలేదు. (ఇక మేము అజ్ఞానులమై యుండుటలో వింత ఏమి వున్నది?

ఈ లోకమంతయును మాటలకందనిది. ఇది కామప్రేరేపితమైనది. ఇది నీచకార్యములతో నిండిపోయియున్నది. కాని, అట్లుండరాదని నాకెవ్వరూ సూచించలేదు. విష్ణునామ సంకీర్తన గురించి విన్నవారు కూడా నాకు తటస్థపడలేదు. (ఇక నేను ఎంత దురదృష్టవంతుడను!!)

ఛీ ఛీ – అంతయునూ కుటిలత్వమే. అంతయును దుర్బోధనమే. అంతయునూ అజ్ఞానమే. వేశ్యాలోలత్వముతో అందరూ కాలము గడుపుతున్నట్లు తెలియుచున్నది. ఇట్టి గడ్డుకాలము గడుపుచున్న దౌర్భాగ్యులకు, పటిష్టమైన మరియు శుభప్రదమైన "పరసుఖము" లభిస్తుందా? ఆ మార్గాన్ని సంఘటితము చేయగల వారెవ్వరు? అట్టి మార్గదర్శకులు నాకు కనబడుట లేదే. ఎంత విచారకరము!!

జంతువుల వలె జీవించుచూ, పాపకర్మల నొనరించుచూ బ్రతుకుతున్న నిస్సారమైన మానవుల అకృత్యములతో లోకమెల్ల విస్తరించియున్నది. పరమాత్మ స్వరూపుడైన శ్రీవేంకటాచలాధిపుని భజించువారే కనబడుటలేదు. (ఇకవీరు జన్మజన్మల విషవలయంనుంచి ఎట్లు బయటపడగలరు?)

## 5-67

## మున్నుడి

చిన్నారి బాలకృష్ణుని వర్ణిస్తున్నారన్నమాచార్యులవారు. ఆ బాలుని మోహము ముద్దులు ముంచెత్తుతున్నదట. కొంటెకృష్ణుడు అని అందరూ భావించే ఆ స్వామి నిద్దపు కూరిమినించుతాడట. (ఆయన ప్రేమ... గొప్ప స్నేహ భావాన్ని నింపిన ప్రేమట). ఈ బాలుడే పరమపురుషుడు, గీతాచార్యుడు. నాడు ఈతడే త్రివిక్రముడై "నేలకు నింగికి మరీ పొడవైనాడు" (భూనభాంతరములను నిండిపోయాడు). తానే నేడు వేంకటాచలపతియై మేలిమి (బంగారం వంటి వన్నెగల) చేతలతో పురుషోత్తముడై మించిపోయాడట.

**ఆ.వె॥ ముద్దులెల్ల ముంచె మోమున యీతండు**
**నిద్దమైన కూర్మినించి మించు,**
**బాలకృష్ణుమీద పాడెరా అన్నయ్య**
**"కూర్మి" కృష్ణుడాయె కొండలయ్య**

***నిద్దమైన=స్నేహముగల**

**రాగం : మోహన**

ముద్దులు మోమున ముంచగను
నిద్దపు కూరిమి నించీని ॥ముద్దుల॥

మొలచిరుగంటలు మువ్వలు గజ్జెలు
గలగలమనగా కదలగను
ఎలనవ్వులతో ఈతడు వచ్చి
జలజపు చేతులు చాచీని ॥ముద్దుల॥

అచ్చపు గుచ్చుముత్యాలహారములు
పచ్చల చంద్రాభరణములు
తచ్చిన చేతు(త)ల తానై దైవమని
అచ్చట నిచ్చట ఆడీని ॥ముద్దుల॥





బాలుడు కృష్ణుడు పరమపురుషుడు
నేలకు నింగికి నెరి పొడవై
చాల వేంకటాచల పతితానై
మేలిమి చేతల మించీని ॥ముద్దుల॥

**భావామృతం :**

సమ్మోహనకరుడైన ఈ బాలకృష్ణుని మొగము ముద్దులు నింపుకొన్నది. ఈ బాలుడు నిద్దపు కూరిమి (స్నేహపాత్రమైన ప్రేమను) నింపిన దేవదేవుడు.

ఈతని మొలకు (నడుమునకు) చిన్ని గంటలు కట్టారు. ఈతని కదలికలను ఆ గంటలు తెలుపుతాయి. ఇతను కాళ్ళు కదిలిస్తే, కాలిగజ్జెలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. ఇతడు 'ఎలనవ్వుల'తో (చిరు నగవుతో) ఇక్కడకు వచ్చి తన 'జలజపు చేతులు' (పద్మములవంటి చేతులను) చాచియున్నాడు. వీనిని చేతులతో ఎత్తుకొని తరించండి.

'అచ్చపు ముత్యాలు' (స్వచ్ఛమైన ముత్యములు) గుచ్చిన హారములను ఈ చిన్నారి ధరించినాడు. పచ్చల చంద్రాభరణములు (మరకతములు పొదిగిన చంద్రహారములను) ధరించియున్నాడు. తచ్చిన చేతల (నవ్వు తెప్పించే చేష్టలతో) ఇక్కడ ఆడిన ఇతడే, అక్కడ (యుద్ధభూమిలో) తానే దేవదేవుడని నిరూపించాడు.

ఇతడు బాలుడని, కృష్ణుడని (నల్లపిల్లవాడు అని భ్రమపడకండి). ఈయన పరమపురుషుడు (పరమాత్ముడు) ఆనాడు నేలకు నింగికీ పొడవైన (భూమండలమే కాక ఊర్ధ్వ లోకాలు కూడా చీమదూరే సందుకూడా లేకుండా నిండి) వున్నాడు (వామనావతారంలో). నేడు చాల వేంకటాచలపతియై (గొప్ప వేంకటేశ్వరుడై) మేలిమి చేతలమించియున్నాడు (బంగారం వంటి మహిమలు చూపిస్తున్నాడు).

## 5-68

## మున్నుడి

శ్రవణపేయమైన ఈ కీర్తనలో అన్నమాచార్యుల వారు శ్రీరామచంద్రమూర్తిని సన్నుతిస్తున్నారు. గీర్వాణిలో వున్నా ఈ కీర్తన చాలా తేలికగా అర్థమవుతుంది, యెందుకంటే ఇది రఘుకుల తిలకుని సన్నుతి. ఈ సీతారమణుడు ధవళాబ్జ నయనుడట (తెల్లతామరలవంటి కన్నులుగలవాడట). అనిలజవరదుడట (హనుమంతుని అనుగ్రహించిన వాడట). ఈయనే తిరుమలలో శ్రీ వేంకటేశుడై సాటిలేని ఉదార స్వభావంతో గంభీరముగా భక్తుల మానసావనిలో విహరించుచున్నాడు.

**తే॥ "దేవదేవోత్తమా! నమో దివిజవంద్య!**
**రావణదమనా! శ్రీరఘురామా!" యనుచు**
**వేంకటేశుడే జానకీ విభుడటంచు**
**అన్నమయ్య కీర్తించె నహల్యవరదు.**

**రాగం: యదుకుల కాంభోజి**

దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీరఘురామా ॥దేవ॥

రవికులాంబుధి సోమ రామలక్ష్మణాగ్రజ
భువిభరత శత్రుఘ్న పూర్వజ
సవన పాలక కౌసల్యానంద వర్ధన
ధవళాబ్జ నయన సీతారమణా ॥దేవ॥

దనుజ సంహారక దశరథనందన
జనక భూపాలక జామాత
వినమిత సుగ్రీవ విభీషణ సమేత
మునిజన వినుత సుముఖ సుచరిత్రా ॥దేవ॥





అనిలజ వరద అహల్యా శాపమోచన
సనకాది సేవిత చరణాంబుజ
ఘనతర శ్రీవేంకటగిరి నివాస
అనుపమోదార విహార గంభీరా ॥దేవ॥

**భావామృతం :**

ఓ దేవదేవోత్తమా! (దేవదేవులందరిలో అగ్రగణ్యా!) నీకు నమస్కరించుచున్నాను. రావణాసురుని వధించిన శ్రీరఘురామా! (నిన్ను సన్నుతించెదను గాక!)

ఓ ప్రభూ! నీవు రవికులాంబుధి సోముడవు. (సూర్యవంశమను సాగరమున వుద్భవించిన చంద్రుడవు). లక్ష్మణుని పెద్ద అన్నగారైన శ్రీరాముడవు. భూమిపై భరత, శత్రుఘ్నులకు ముందుపుట్టిన అగ్రజుడవు. విశ్వామిత్రుని సవనపాలకుడవు (యాగమును రక్షించిన వాడవు). కౌసల్యా గర్భమున పుట్టి ఆమె ఆనందమును వర్ధిల్ల జేసినవాడవు. తెల్ల తామరల వంటి కన్నులున్నవాడవు, జానకీ వల్లభుడవు. అట్టి నీకు వందనములు.

ఓ శ్రీరామచంద్రా! నీవు దానవాంతకుడవు, దశరథపుత్రుడవు. నీవు జనక రాజేంద్రుని అల్లుడవు, వినమిత (వినయంతో నమస్కరించుచున్న) సుగ్రీవుడు విభీషణుడు తోడైయున్నవాడవు. నీవు మునిజనులచేత కీర్తించబడుచున్నవాడవు, ప్రసన్నవదనుడవు, అకళంక చరిత్ర కలవాడవు. అట్టి నీకు నా నమస్కారములు.

ఓ రాజారామా! నీవు వాయునందనుడైన హనుమంతుని అనుగ్రహించిన వాడవు. గౌతమమహర్షి భార్య అహల్యకు శాపవిమోచనము చేసినవాడవు నీవే. సనక సనందనాది మునులు సేవించు పాదపద్మములు కలవాడవు నీవే. అత్యంత శ్రేష్ఠమైన శ్రీవేంకటగిరిపై నివసించు శ్రీవేంకటేశ్వరుడవు కూడ నీవే ప్రభూ! నీవు సాటిలేని ఉదార స్వభావం కలవాడవు. నీవు గంభీరముగా నీ భక్తుల మానసావనిలో విహరించుచున్నావు. అట్టి నీకు వినయముతో నమస్కరించుచున్నాను తండ్రీ!

## 5-69

### మున్నుడి

మంగాంబుధిలో వెలసిన ఆంజనేయస్వామిని చూచి పులకిత గాత్రుడై అన్నమాచార్యులవారు చేసిన అద్భుత సృష్టి, ఈ కీర్తన. ఇతడే (ఈ హనుమంతుడే, అతడు (శ్రీరాముడు) కాబోలు అంటున్నారు. పైకి చూడటానికి రాఘవుడు పరిమితే లేని ఏలిక (జగన్నాథుడు) మరియు హనుమంతుడు మేటి బంటవీ (సాటిలేని సేవకుడు). కానీ ఇద్దరూ ఒకటే. ఈయన శివుడు ఆయన శ్రీహరి. శివకేశవులొకటే కదా! ఇద్దరికీ యెన్ని పోలికలున్నాయో చూడండి. (ఇటువంటి కీర్తన ఒక్క అన్నమయ్యే చెప్పగలరు).

**కం॥ ఇతడే అతడా ఏమొకొ?**
**మితినెరుగని రాఘవుండు మేటి హనుమయున్**
**జతగూర్చె నిర్వురకు ఆ**
**కత వినుడీ అన్నమయ్య కవనములోనన్**

**రాగం : ఖమాస్**

ఇతడే యతడు గాబోలేలిక బండును నైరి
మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు ॥ఇతడే॥

జలధి బంధించి దాటె చలపట్టి రాముడు
అలరి వూరకే దాటె హనుమంతుడు
అలుకతో రావణుని యదటణచెనతడు
తలచి మైరావణుని దండించెనితడు ॥ఇతడే॥

కొండ వెల్లగించె దొల్లి గోవర్ధనుడతడు
కొండంత సంజీవి యెత్తె కోరి యితడు
గుండు గరచె నహల్య కొరకు సీతాపతి
గుండు గరగగపాడె కోరి యితడు ॥ఇతడే॥





అంజనాచలము మీద నతడు శ్రీవేంకటేశు-
డంజనీ తనయుడాయ అనిలజుడు
కంజాప్తకుల రామఘనుడు తానును దయా-
పుంజమాయ మంగాంబుధి హనుమంతుడు ॥ఇతడే॥

### భావామృతం :

మంగాంబుధిలో వెలసిన ఈ అంజనీ తనూజుడు, అతడు (శ్రీరామచంద్రుడు) కాబోయి. పైకి చూచుటకు ఏలిక (ప్రభువు) గా నౌకరు బంటుగా నింకొకరు కనిపించుచున్నారు. ఒకరు పరిమితిలేని రఘురాముడు, ఇంకొకరు సాటిలేని బంటుయైన హనుమంతుడు.

రామచంద్రుడు చలపట్టి (ఆగ్రహించి) జలధిని బంధించి దాటినాడు. కాని ఇతడు (ఈ వాయునందనుడు) అతిశయించి పెరిగిన దేహంతో వూరకే (ఒక్క దుముకుతో) అదే సాగరమును దాటినాడు. ఆ శ్రీరాముడు తన భార్య నపహరించాడని అలిగి రావణుని అదటును (తెంపరితనమును) అణచివేశాడు. ఏ ఉద్రేకమూ లేక, ఆలోచనతో మైరావణుని దండించినాడీ మారుతి.

శ్రీకృష్ణావతారమున, ఆ శ్రీరాముడే కొండను పెల్లగించి గోవర్ధనధారియై గోవులను గోపాలురను కాపాడినాడు. కొండను (సంజీవని పర్వతమును) పెల్లగించి తెచ్చి ఆయననే కాపాడినాడితడు. ఆ సీతాపతి అహల్య నుద్ధరించుటకు గుండు గరచెను (రాతిని తన పాదముతో తాకినాడు). ఈ ఆంజనేయుడు కోరి గుండు గరగగ (రాయి కరిగిపోవునట్లు) గానము చేసినాడు.

ఆయన అంజనాచలము మీద శ్రీవేంకటేశ్వరుడైనాడు. ఈ పవనపుత్రుడు అంజనీదేవి తనూజుడైనాడు. ఆ ఘనుడు కంజాప్త కులజుడు (పద్మప్రియుడైన సూర్యుని వంశస్థుడు). ఈయన దయాపుంజమైన (దయరాశియైన) హనుమంతుడై మంగాంబుధిలో వెలసి సరులను రక్షించుచున్నాడు.

## 5-70

## మున్నుడి

శరణాగతితో చేతులు జోడిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీహరీ!పైకొని (నీ పై భారంవేసి కొని ) నీవే నాచెదును పరిహరించాలి (విసర్జించాలి) అంటున్నారు. నాకుప్రజ్ఞలేదు, అజ్ఞానిని, అకృత్యములు చేయటంలో దిట్టను. వికృతమైన పనులు చేయటం నా స్వభావం. నేను మంచిని ఎఱుగను. కొంత ఎఱిగినా, ఆచరించను. ఒకవేళ ఆచరించినా, యధాలాపంగా మంచిని చేస్తానేమో కాని చిత్తశుద్ధితోచేయను. అయితే నా అదృష్టం కొద్దీ ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే మోక్షప్రదాతవనే మర్మం తెలుసుకొన్నాను. ఇక నీవే, నీవే, నీవే....నాకు దిక్కు.

**ఆ.వె॥ ప్రజ్ఞహీనుడైన పాపాల పుట్టను**
**చేయరాని పనుల జేతునెపుడు**
**శరణు నమ్మినాను తిరువేంకటేశ్వరా!**
**అన్నమయ్య ఆర్తి నెన్నతరమె?**

**రాగం : సింహేంద్ర మధ్యమం**

నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య
పైకొని శ్రీహరి నీవే పరిహరించవే ॥నీకే॥

విజ్ఞానములు కొన్ని విందునే నూరకే
సుజ్ఞానములు కొని చూతు నేనే పొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞహీనుడ నెంత పాపకర్మమో ॥నీకే॥

సుకృతము లొకమరి సొరిది నే బోధింతు
ప్రకృతి యొక్కొక్క వేళ భావింతునాత్మలో
అకృతములే నే ననిశము జేసేది
వికృతాచారుడ నింకా వికారమెంతో ॥నీకే॥





ధర్మమార్గము కొంత తలపున నెరిగితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరిగితి
నిర్మించి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలగాను
మర్మమెరిగితి నెట్లమన్నన గాచితివో ॥నీకే॥

**భావామృతం :**

(అద్భుతమైన శరణాగతి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య.)

ఓ శ్రీహరీ! నిన్నే నమ్మితిని తండ్రీ! నీకే శరణు అని మొక్కుతున్నాను. నీవే నాభారం తీసికొని నా దుర్గణములను రూపుమాపాలి. ఆ పరిహరించడం (విసర్జించటం) నావల్ల కావటం లేదు.

ప్రభూ! పెద్దల ద్వారా కొంత విజ్ఞానం (శాస్త్రములు బోధించు జ్ఞానము) వూరకే (యధాలాపంగా) నేను నేర్చాను. సుజ్ఞానము (సదాచారమ బోధించు జ్ఞానము) అన్నివేళలా ఆచరించాలని ప్రయత్నించాను. కాని అనిశము (నిత్యమూ) నేను అజ్ఞానులు దారిలోనే నడిచాను. ఎందుకంటే నేను ప్రజ్ఞాహీనుడను (బుద్ధిహీనుడను). అట్టి నేను యెంత పాపకర్మచేస్తానో యెవరు లెక్కకట్టగలరు?

ఓ దేవదేవా! ఒక్కొక్కసారి నేను సొరిది (వరుసగా) సుకృతము (పుణ్యము) గురించి బోధిస్తూవుంటాను. ఒక్కొక్కసారి ప్రకృతి (స్వభావము) వలన మంచీచెడు ఆచరించ బదుతున్నాయి అనుకొంటాను. అన్నీ తెలిసినవాడు అమావాస్యనాడు చచ్చినట్లు, నేను ఎప్పుడూ చేసేవి మాత్రం అకృత్యాలే (చేయరానిపనులే...) ఎంతోవికారములు కలుగుట చేత, నేను చేసేవన్నీ వికృతములైన పనులే. మరినాకు సద్గతి ఎలా వస్తుంది స్వామీ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నా తలపున (హృదయమున) కొంత ధర్మవర్తనను నేర్చుకొన్నాను. నిర్మలమైన చిత్తమే మోక్షమునకు ఆలయమని గ్రహించాను. మర్మమెరిగానాను. నన్ను ఏలెడి రక్షకుడవు సర్వమును నిర్మించి పరిపాలించు పాలకుడవని గ్రహించాను. తండ్రీ! నన్నెంత మన్నించావయ్యా!

## 5-71

## మున్నుడి

భక్తిపారవశ్యంతో శ్రీమన్నారాయణుని కీర్తిస్తున్న అన్నమాచార్యులవారిని వినండి."మేరతో" అంటే 'ఏర్పడినదై' అని అర్థం. "ఓ నారాయణుడా! నేను నమ్మిన నీ పాదమే నాకు కూడా దిక్కుగా యేర్పడినదై కలిగియున్నది-"అన్ని ఈ కీర్తన పల్లవికి అర్థం. దాదాపు ఇటువంటిదే 'నారాయణా నీ నామమె గతియిక అనే కీర్తనలోగడ వినివున్నాము. అదే భావావేశంతో చెప్పిన కీర్తన ఇది. కాని దేని రుచి దానిదే, అన్నమయ్య అనే వృక్షానికి ఎన్నో మధురఫలాలుకాచాయి. దేనిని తిన్నా మధురమే....

**కం॥ నారాయణ! నిను నమ్మితి**
**మేరతొ నీపాదమొకటె మించిన గతియౌ**
**తీరగ దురితపు పంకము**
**దారేదనె అన్నమయ్య తగు కీర్తనలో**

**రాగం : జయంత శ్రీ**

నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీ పాదమే గతి గలిగె ॥నారాయణ॥

చింతాజలధుల చిక్కిన దాటించ-
నంతట నీపాద మదె తేప
కాంతల మోహపు కట్లుదెంచగ
పంతపు నీ పాద పరశువు కలిగె ॥నారాయణ॥

అతి దురిత పంకమందిన కడుగగ
మితి నీ పాదమే మిన్నేరు
రతి కర్మజులు రాచిన నార్చక
వ్రతము నీ పాదమే వానయై(మై) నిలిచె ॥నారాయణ॥





జిగినజ్ఞానపు చీకటి వాయగ
తగు నీ పాద ముదయపు రవి
అగు శ్రీ వేంకటనాథ నన్నేలగ
మిగులగ నీ పాదమే శరణంబు ॥నారామణ॥

**భావామృతం :**

ఓ శ్రీమన్నారాయణుడా! నేను నిన్నునెర (పూర్తిగా) నమ్ముకొనియున్నాను. నాకు మేరతో (ఏర్పడినదై) నీ పాదమే దిక్కుగనున్నది.

నిన్ను నమ్ముకొనినవారు 'చింతాజలధి'లో (విచారము అనే సముద్రంలో) చిక్కుబడిపోతే నీ పాదమే తేప (తెప్ప) వలె వారిని దాటిస్తుంది. వారు స్త్రీ వ్యామోహంలో కట్టుబడిపోతే... పంతపు నీ నామమే (సాటిలేని నీ సంకీర్తనమే) ఆ కట్లు తెంచే పరశువు (గండ్రగొడ్డలియై) యున్నది అందుకనే నేను నీ పాదాన్నే నమ్ముకొన్నాను.

అత్యధికమైన పాపమను పంకము (బురద) అంటుకొంటే నీ పాదమే మితిమిన్నేరు (పరిమితిలేని ఆకాశగంగ). ఆ సురగంగ కంటే శ్రేష్ఠమైనది వేరే ఇంకేమి వుంటుంది? "కర్మజులు ఆర్చకవ్రతము రతిరాచినని నీ పాదమే వానయై (మై) గలిగె" (అని విడదీస్తే...ఈ వాక్యం అర్థమవుతుంది). కర్మజులు (కర్మకాండయందు ప్రీతిగలవారు, ఆర్చకవ్రతము రతి రాచినన్ (అర్చించు వ్రతముల యందు మక్కువతో చెఱచబడుతున్నప్పుడు), నీ పాదమే వానయై నిలిచె. (వానయై అనే మాట.. వానమై అయివుండాలి. ఎందుకంటే వానమై అంటే గతియై అని అర్థం. నీ పాదమే గతిగావున్నది అని భావము).

అజ్ఞానపు చీకటి 'జిగి వాయగ' (వెలుగును హరించుచున్నప్పుడు) నీ పాదమే 'దయపు రవియగున్' (దయామయుడైన సూర్యభగవానుడైనది). ఓ శ్రీవేంటేశ్వరా! నన్ను పరిపాలించి రక్షించుటకు నీ పాదమే అతిశ్రేష్టమైన శరణము తండ్రీ!

## మున్నుడి 5-72

వైరాగ్యంతో కూడిన చక్కని జ్ఞానబోధను చేస్తున్నారు అన్నమాచార్యులవారు. మానవులు శీతోష్ణముల ఉధృతిని తట్టుకోలేరు, సుఖదుఃఖాలకు చలించిపోతారు, కాని ఆత్మజ్ఞానం కలవారు మాత్రం ఈ ద్వంద్వములన్నియు దేహమునకు (బొందికి) సంబంధించినవే అని, దీంట్లో వుండే దేహికి (ఆత్మకు) వీటితో వేరేపని ఏమియు లేదని గ్రహించగలరు. అట్లు ఊహించగలరు. అట్లు ఊహించనేర్చినవారు మాత్రమే ఆ ద్వంద్వముల వైపరీత్యమును ఓర్చుకొని నిలువగలరు. అట్టి ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది? శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించి ఆ శ్రీహరిదాస్యం వలన విరక్తులై జ్ఞానులవుతారు అని అంటున్నారన్నమయ్య.

**కం॥ ఘన సంబంధము బొందికి**
**వినుమా ఆత్మకును లేదు వేరే పనియున్**
**కొనియోర్చి నిలుతు రిది విని**
**అనెనా అన్నయ్య తాను హరికి దెలుపుచున్.**

**రాగం : మలహరి**

దేహము సంబంధము-యివి దేహికి బనిలేదు
వూహించ నేర్చినవారలే- వోరుచుకుందురయ్యా ॥దేహము॥

విడువవు శీతోష్ణంబులు -విడువవు సుఖదుఃఖంబులు
వెడవెడ మరణభయంబులు- విడిచినయందాకా
ఉడుగవుకాంక్షలు మమతలు -నుద్యోగంబులు చింతలు
పొడవగు విరక్తి తనలో-బొడమి నయందాకా ॥దేహము॥

మానదు చిత్తవికారము-మానదు దుర్గుణ దోషము
మానదు భోగములన్నియు- మానినయందాకా
పోనీదు సేసిన దురితము-పోనీదు వ్రాతఫలంబును
పూనిన తన యజ్ఞానము- పోయినయందాకా ॥దేహము॥





తెగవటు భవబంధంబులు-తెగవెడయని గర్వంబులు
నిగిడిన యీ యాత్మజ్ఞానము- నీ విచ్చినయందాకా
జగదేక విభుడ శ్రీవేంకటేశ్వర -సర్వము నీయానతి కొలదే
తగులుచుండు నివి నిశ్చలముగ నీ-దాస్యము గలిగినయందాకా ॥దేహము॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ద్వంద్వములని పిలువబడే శీతోష్ణములు, సుఖదుఃఖముల వంటివి దేహాన్ని మాత్రమే చలింపజేయగలవు. ఈ దేహం నశించేది. కాని దీంట్లోవుండే దేహికి (ఆత్మకు) వీటితో పనిలేదు. ఈ ఆత్మ స్వరూపం వూహించగలిగిన వారు మాత్రం ఈ ద్వంద్వముల వైపరీత్యాన్ని ఓర్చుకొనగలుగుతారయ్యా!

శీతోష్ణములు, సుఖదుఃఖములు వంటి ద్వంద్వములు ప్రాణిని విడువవు. ఈ శరీరంవున్నంత కాలము, వెడవెడ మరణభయంబులు (మిక్కిలి తుచ్ఛమైన చావుభయం) విడువదు. దీనికున్న కోరికలు మమకారములు నశించవు. రకరకములైన వుద్యోగములు (ప్రయత్నములు), అవి నెరవేరక చింతలూ తప్పవు. తనలో 'పొడవగు' విరక్తి (గొప్పవైరాగ్యం) పొడమినదాక (కనబడువరకు) ఈ ద్వంద్వములు దేహికి తప్పవు.

భోగములన్నియు మాననంత వరకు, మనస్సుకుండే వికారముపోదు. దుర్గుణముల వలన కలుగు దోషములు పోనేపోవు. ఇక ఈ పాపములు చేసినందు వలన కలుగు పాపఫలం ఎలా పోతుంది? నుదుటవ్రాసిన ఆ వ్రాతఫలం పీడించక మానదు. తనను ఆవహించిన అజ్ఞానం పోయేదాక అనగా ఆత్మజ్ఞాని అయ్యేదాక ఈ పీడ తప్పదు.

అజ్ఞానం వలన భవబంధాలు (జన్మలలో సంసార బంధములు) కలుగుతున్నాయి. ఎడతెగని గర్వము కలిగి ఆత్మజ్ఞానం నశిస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! మాపై దయకలిగి నీవు మాకు ఆత్మజ్ఞానం ఇచ్చేదాక, మేము ఈ కర్మబంధాలలో చిక్కుకుపోయేవుంటాము. సర్వమూ నీఇచ్ఛప్రకారమే జరుగుతుందని తెలుసుకొనలేము. నీ అనుగ్రహం వలన నీ దాసులమై నీ దాస్యం వలన మాత్రమే మాకు విముక్తి కలుగుతుంది. ఇది నిశ్చయం తండ్రీ!

## మున్నుడి 5-73

అన్నమాచార్యులవారు చెప్పిన దశావతార కీర్తనలన్నీ పొదుపు కథల్లాగా 'బుర్ర' తొల్వగా (తొలిచేస్తుండగా) చాలా నిఘంటువులు (డిక్షనరీలు) వెతికిస్తాయి. కొన్ని కీర్తనలు దశావతారాలకీ ఈ కీర్తనకీ సంబంధమేమి టనిపిస్తాయి. ఉదాహరణకు ఈ కీర్తనలోని "విచ్చన విడినె తడువు విడచిపారెడిని"– అనే వాక్యాన్ని తీసికోండి. దీని అర్థమేమిటి? మీరు తెలుగు పండితులైతే యేమో గాని, నా బోటి సామాన్య 'తెలుగోడు' అయితే..వాడి 'గోడు' చెప్పలేం. విచ్చనవిడినె (సర్వస్వతంత్రుడై) తడువు విడిచి (ధరించిన చిన్న బట్టను ఊడదీసుకొని) పారెడిని (పారిపోయాడు).. ఈయన ఎవరు?...చదవండి.

**చం॥ కనుగొనలైతినివ్విధపు గద్దరి వర్ణన యెందునైన, నే**
**పెనచి నిఘంటువున్ తెలిచి పెక్కు తెరంగుల "బుర్రతొల్వగా"**
**మనుసుకు తట్టె భావ మది మాధవ! నీ అవతార వర్ణనల్**
**ఘనుడగు అన్నమయ్య తనుగట్టి ప్రహేళికవోలె చెప్పెరా!**

*** గద్దరి = దిట్టతనం కలది *ప్రహేళిక = చిక్కుప్రశ్న**

**రాగం : ఆహిరి**

ఎటువంటి బిడ్డండె యితడు
ఇటువంటి వయసుననె యిట్ల జేసీని ॥ఎటువంటి॥

నడుక కెటు నీటిలోననె యీదులాడీని
తడవి పట్టెదమనిన దాగిపోయీని
తడబడక నేలగుంతలు వోవ దవ్వీని
కడప మీదనె వుండి కదల దెప్పుడును ॥ఎటువంటి॥

కలిమిలే మెరుంగడిదె కలవెల్ల నడిగీని
చలమ రెవ్వరినైన జావ నడిచీని
అలయ కడవుల వెంట నాటలకే తిరిగీని
తొలగకిటు గిరులెక్కి దుముకులాడీని ॥ఎటువంటి॥

విచ్చన విడినె తడవు విడిచి పారెడిని
రచ్చలనె యింత గుబ్బము వంటి కొడుకు
దిచ్చరీడై యిట్లు దిరువేంకటేశ్వరుండు
నిచ్చ నిచ్చలును గడుబెచ్చు వెరిగీని ॥ఎటువంటి॥





**భావామృతం :**

(ఓ అమ్మలారా!) వీడు ఎటువంటి బిడ్డండె (పిల్లగాడే)! ఇటువంటి వయసుననె (ఇంత చిన్న వయస్సులోనే), యిట్ల జేసీని (ఇట్లాంటి పనులు చేసినాడే...వామ్మో!)

"నడుకకెటు నీటిలోననె యీదులాడీని "– (నడకరాక వీడు నీట్లో ఈతకొట్టాడు..ఎవరు? మత్స్యావతారము). "తడవి పట్టెదమనిన దాగిపోయీని"– (వెదకి పట్టుకొందామంటే కొండకింద దాగికొనినాడే... ఎవరు? కూర్మావతారం) "తడబడక నేల గుంతలు వోవ దవ్వీని" –(సంకోచించకుండా భూమినంతా పెద్దకందకంలా త్రవ్వినాడు.. ఎవరు? వరహావతారం) "కడప మీదనెవుండి కదలదెప్పుడును"–(గడప మీదనే కూర్చొని చలించక ఎప్పుడూ వుంటాడు.. ఎవరు? హిరణ్యకశిపుని ఇంటాబయటా కాక గడప మీదనే గోళ్ళతో చీల్చి రక్తం జుర్రి సంహరించిన నరసింహుడు.)

"కలిమిలేమెరుంగడిదె కలవెల్ల నడిగీని"– (ఈయనకి నీవు ధనికుడివా, బీదవాడివా అని పనిలేదు. నీ దగ్గరవున్న వన్నీ అడిగిలాక్కొంటాడు...ఎవరు? వామనమూర్తి!. "చలమరెవ్వరినైన జావనడిచీని"– (మాత్సర్యం కలవాడు కాబట్టి ఎవరినైనా సంహరిస్తాడు...ఎవరు? పరశురాముడు). "అలయ కడవుల వెంటనాటలకే తిరిగీని"–(ఈయన అలుపులేక అడవులన్నీ గాలించి తిరిగాడు. అదికూడా కేవలం ఆటలాగానే... ఈయన మంత్రించి ఒక్కగడ్డిపోచ వేస్తే, అది ఎటువంటి శత్రువునైన చంపగలదు.... ఎవరు?మన శ్రీరామచంద్రుడు. "తొలగకిటు గిరులెక్కిదుమికీని"– (వదలక ఇట్లా కొండలెక్కిదుమికి తిరిగాడు.. ఎవరు? శ్రీకృష్ణుడు. గోవర్ధనపర్వతం మీద తిరిగాడు కదా!

"విచ్చన విడిసె తడువు విడిచి పారెడిని"–(సర్వస్వతంత్రుడై ధరించిన చిన్నబట్టను ఊడదీసికొని పారిపోయాడు...ఎవరు? త్రిపురాసురుల భార్యల మానముల నపహరించువేళ దిగంబరుడైన బుద్ధభగవానుడు. "రచ్చలనె యింత గుబ్బము వంటి కొడుకు...ఎవరు? రచ్చలనె (గోష్ఠిలో) పాల్గొనే గుబ్బము వంటి కొడుకు... హయగ్రీవావతారము.ఇట్లు దిచ్చరీడై (ఎవర్నిబడితే వారిని అనుగ్రహించే) శ్రీవేంకటేశ్వరుడై "నిచ్చనిచ్చలును గడుబెచ్చువెరిగీని"– దినదినాభివృద్ధి చెందుతున్నాడు ఈ దేవదేవుడు.

## 4-74

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాలకించండి. ఇంత సరళమైన కీర్తనలో కూడా యెన్నో మెలికలున్నాయి. స్వామిని నానామహిమల నాటకుడు అన్నారు. నిజానికి నాటకుడు అంటే నర్తకుడు లేక నాటకములాడు వాడని అర్థం. అనేక మహిమలు గలవానిని 'నాటకుడు' అనటం వల్ల, అది 'నాయకు'డేమో అనిపించినప్పటికీ...నటన సూత్రధారిగానే వివరించాను. మా అందరికీ మా పాలిట ఇంటివేలుపై (ఇలవేల్పువలె) కలిగి పరిపాలిస్తున్న ఈ నరసింహుని చూచితిమి, అన్నారు. ఈయనే శ్రీవేంకట నిధియందును నిలిచె..అంటున్నారు.

**ఉ॥ కంటిమి కంటి మీతనిని కల్గెను మాకితడెంచి చూడ మా**
**ఇంటికి వేలుపై వెలసె యేలెను మమ్ముల అన్నమయ్యనెన్**
**మింటను దేవతల్ కొలుచు మేటి అహోబల నారసింహుడౌ**
**ఒంటిగ ఏడుకొండల మహోన్నతుడౌ తిరువేంకటేశుడున్**

**రాగం : కల్యాణి**

కంటికంటి మిదె కలిగె మా పాలిట
యింటి వేలుపై యేలీ వీడె ॥కంటి॥

శ్రీనరసింహుడు చిన్మయరూపుడు
నానా మహిమల నాటకుడు
దానవాంతకుడు దైవశిఖామణి
పూని యహోబల పురపతి వీడె ॥కంటి॥

పరమ పురుషుడు ప్రహ్లాదవరదుడు
హరిలోకోన్నతు డనంతుడు
దురిత విదారుడు దుష్ట భంజకుడు
సిరుల నహోబల శ్రీపతి వీడె ॥కంటి॥





చెలువుడు వరదుడు జీవాంతరాత్ముడు
నిలిచె శ్రీవేంకట నిధియందు
బలువుడు సులభుడు భక్తరక్షకుడు
లలి నహోబల విలాసుడు వీడే. ॥కంటి॥

**భావామృతం :**

ఓ జనులారా! ఇదే కంటిమి. మా పాలి ఇంటివేలుపై (మా యొక్క ఇలవేల్పు వలె) కలిగె (నిలిచాడు), వీడే (ఈయనే) యేలీ (మమ్మల్ని పరిపాలిస్తున్నాడు) అట్టి ఈ నృసింహుని కంటి (చూచితిమి).

ఈ శ్రీనరసింహుడు చిన్మయ (చిత్+మయ) రూపుడు...అనగా జ్ఞానస్వరూపుడు. నానామహిమల ప్రదర్శించు నాటకుడు (జగన్నాటక సూత్రధారియైన శ్రీమన్నారాయణుడు). ఈయన రాక్షస నిర్మూలనా దీక్షాదక్షుడు. దేవతలందరికీ శిఖామణి (తలమానికము) వలెనున్నాడు. వీడే పూని (కావాలని) అహోబలపురాధిపతియై ఇచ్చట అనుగ్రహించుచున్నాడు.

ఈ స్వామి పరమపురుషుడు. ప్రహ్లాదుని పరిరక్షించిన వాడు. ఈయనే లోకేశ్వరుడైన శ్రీహరి, అంత్యమునెరుగని అనంతుడు. దురితవిదూరుడు (పాపములను సమూలముగా నిర్మూలించువాడు). దుష్టులను భంజించువాడు (వధించువాడు). వీడే అహోబలమున సిరులనొసగే సిరి మగడు.

ఈ మహానుభావుని యెంతని కీర్తించగలము? ఈయన చెలువుడు(ప్రాయుడు... అనగా భక్త ప్రియుడు). ఈయన వరదుడు (వరప్రదాత). ఈయనే జీవులందరిలోను అంతరాత్మల వలె నెలకొనియున్నాడు. ఈ స్వామియే శ్రీవేంకటపర్వతమను నిధానములో కూడా వెలసినాడు. సులభుడు (సులభముగా అనుగ్రహించువాడు) భక్తసంరక్షకుడు. వీడే అహోబలమున లలి విలాసుడు (ఉత్సాహముతో వెలసియున్నాడు.

## 5-75

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణమహోత్సవములో పాలుపంచుకొంటున్న అన్నమాచార్యులవారు చెప్పిన పెళ్ళిపాట ఇది. భూకాంతునికి తలబాలో (తలంబ్రాలు). స్వామి, బహుదారారతుడట. అనేకమంది రమణులకు అనేకరకములైన ఆనందములను ప్రాప్తింపజేసినవాడని అర్థం. ఈ కీర్తనలో స్వామిని హేమవర్ణుడు (బంగారు ఛాయకలవాడు) అనుట, కళ్యాణం ఉత్సవ విగ్రహులకు జరుగుతుంది కనుక ఆ వర్ణన సరిపోయిందని నాభావన. ఈయన దినపెండ్లి గల తరుణులపతియట. అంటే భూదేవి శ్రీదేవి అనే భామినులనుపెళ్ళాడే “నిత్య పెళ్ళికొడుకు” అన్నమాట.

**కం॥ తలబాలు భూరమణునకు**
**తలబాలో పెక్కుసతుల తగు రతునకునున్**
**అలవోక జెప్పె నన్నయ**
**కొలువగు తిరుకొండలయ్య కూడ రమణులన్**

**రాగం : ఆహిరి**

ధారుణీపతికిని దలబాలో బహు
దారారతునకు దలబాలో ॥ధారుణీ॥

హేమవర్ణునకు నిందిరాపతికి
దామోదరునకు దలబాలో
సామజభయ రక్షకునకు దులసీ
ధామునకు హరికి దలబాలో ॥ధారుణీ॥

కలికి రుకిమిణికి గడు దమకించి
తలదైవమునకు దలబాలో
మలసి సత్యభామకు బతిపంకజ-
దళనేత్రునకును దలబాలో ॥ధారుణీ॥





తిరువేంకటమున దినపెండ్లిగల
తరుణుల పతికిని దలబాలో
యిరవుగ బాయక యిందిరనురమున
ధరిచు వా(హ)రికి దలబాలో ॥ధారుణీ॥

**భావామృతం :**

(‘తలబాలు’ అసలు స్వరూపం ‘తలంబ్రాలు’ (తలన్+ప్రాలు) అంటే పెళ్ళిలో వధూవరులు దోసిళ్ళతో ఒకరి తలపై నొకరు పోసికొను అక్షతలు. మనం ఈ రోజుల్లో ‘తలంబ్రాలు’ అంటున్నాం.) ధారుణీపతికిని (భూకాంతునికి) తలంబ్రాలు. బహుదారారతునకు (అనేకమంది వనితల ఆనందవర్ధనునికి) తలంబ్రాలు.

హేమ వర్ణునకు (బంగారు వర్ణముగల ఈ దేవదేవునికి), లక్ష్మీపతికి, దామోదరుడైన ఈ స్వామికి, తలబాలో (తలంబ్రాలో). సామజ భయరక్షకునకు (గజేంద్రుని భయమునుండి రక్షించిన శ్రీహరికి), తులసీధామునకు (తులసి మాలలు ధరించినవానికి), హరికిని (నారాయణునకు) తలంబ్రాలు.

రుక్మిణీదేవిని మిక్కుటముగా తమకించిన (త్వరపడు నట్లుచేసిన), తలదైవమునకు (దేవాదిదేవునకు) తలంబ్రాలు. మలసి (తపించి) సత్యభామను పరిణయమాడిన పద్మనయనునకు తలంబ్రాలు. (అక్కడ రుక్మిణీదేవి తపిస్తే ఇక్కడ సత్యభామ కోసం స్వామి తపించాడట. జగన్నాటక సూత్రధారి జరిపిన ఈ రెండూ లీలలే....ఆయన కోసం అందరూ తపిస్తారు కాని ఆయన భావాతీతుడు కదా!)

ఈ వేంకటాచలమున శ్రీవేంకటేశ్వరుడై “దినపెండ్లి” (నిత్యమూ పెండ్లాడు) గల, తరుణులపతికి (ఇద్దరు భామల ముద్దులమగనికి)తలంబ్రాలు. ఇరువుగ (నెలకొని) పాయక (వదలక) శ్రీలక్ష్మిని ఉరమున (హృదయమున) ధరించిన శ్రీహరికి తలంబ్రాలు. ఓ కళ్యాణచక్రవర్తీ! ఈ సంతోషసమయంలో నన్ను మరువకు తండ్రీ!

**5-76**

## మున్నుడి

కడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తున్నారు అన్నమచార్యులవారు. కడపరాయుడవై నెమ్మదిగా నన్ను కూడితివి. ఇదిగో (నా కలలు) నిజమాయె అని అంటున్నారు. తనని శ్రీవేంకటేశ్వరుని ప్రేయసిగా భావించుకొని ఈ సరసశృంగార కీర్తన చెబుతున్నారు. ఓ ప్రభూ! నీమాయలెల్లా మానవు. ఎప్పటికీ నీవు అంతే. నానిన నానునుపులు నవ్వించినప్పటికీ నీవు మానవు, అంటున్నారు. (నీరుగారిపోయిన నా అనురాగము నీకు నవ్వు తెప్పిస్తుందేమో కాని, నీవు మాత్రం నీ మాయలను మానుటలేదు...అని అర్థం).

**తే॥ మానవెప్పుడు నీదగు మాయలెల్ల**
**నాని నా ననుపులు నీకు నవ్వుదెచ్చు**
**కడపరాయునిగ తిరువేంకట విభుడిని**
**అన్నమార్యుడు కీర్తించెనద్భుతముగ**

**రాగం : పాడి**

మానవెప్పుడును నీమాయలెల్లాను
నానిన నా ననుపులు నవ్వించీ గాని ॥మాన॥

వాలుక రెప్పలు నీ పై వంచి నే నెంత లోచినా
తాలిమె చూపుదు గాక తత్తిరించేవా
వాలాయించి రాతి గుండెవాడ వౌత యెఱుగుదు
పాలు మాలిన నా యాస పాయ నీదు గాని ॥మాన॥

ఆయములు సోక మాటలాడి యంత కొసరిన
చాయకాడవె కాక సమ్మతించేవా
కాయకపు నీ సరిత గట్టిగా నేనెరుగుదు
పాయపు నా వేడుకలు పై కొలిపీ గాని ॥మాన॥





చిమ్ముచు నీ కౌగిటిలో చేతలెంత సేసినాను
కుమ్మరించి నాతోను నీ గుట్టు చెప్పేవా
కమ్మటి శ్రీవెంకటాద్రి కడపరాయడ వై
నెమ్మది గూడితి విదె నిజమాయ గాని ॥మాన॥

**భావామృతం :**

ఓ తిరుమల నాయకా! నీరు గారిపోతున్న నా ప్రేమ నీకు నవ్వు తెప్పిస్తున్నదేమో ప్రభూ! నీవు మాత్రం నన్ను నీమాయలతో భ్రమింపచేయుట మానలేదు.

నేను మీనముల వంటి నా కనురెప్పలను త్రిప్పి నీవైపు చూచిననూ నీవు తాలిమి చూపుదువు. (ఓర్పునే వహించుచున్నావు). కాక తత్తరించేవా (అంతేకాక నన్ను తొట్రుపడునట్లు చేయుదువు). నన్ను నిర్బంధింతువు. నీవు రాతిగుండె వాడివయ్యా! నీకు జాలిలేదు. అది నేనెరుగుదును. కాని నేనేమి చేయగలను? పాలు మాలిన నా ఆస (సోమరితనంతో కూడిన నా ఆశ) నన్ను విడిచిపెట్టదు.

నా స్థితి అట్లావుంటే....నీవు ఆయములు సోక మాటాలాడి (మర్మస్థానములంటి సంభాషింతువు). అంత కొసరిన చాయకాడవు (అతిగా కోర్కెలు పెంచిమాయమయ్యే మాయకాడవు). అట్లుగాక సమ్మతించి నన్ను చేరుదువా? నీ జీవన సరళి నేనెరుగనా? కాని నేనేంచేయగలను స్వామీ! నా పాయపు వేడుకలు పై కొలిపీ గాని (ప్రాయము వచ్చిన నా కుతూహలం అతిశయించుచున్నది కదా!)

నీ ఆలింగనమున త్వరపరచు నీసేత లెంత సేసినా నీ గుట్టు నేనెరుగగలనా? శ్రీవేంకటాద్రిపై వెలసిన ఓ మధురమూర్తీ! కడపలో నీవే కడపరాయడివై నెమ్మదితో కూడితివి. ఇదే నా కోర్కెలు నిజమాయెనయ్యా!

## మున్నుడి 5-77

తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామిపై అన్నమాచార్యులవారు చెప్పిన మధురమైన కీర్తన ఇది. వటపత్రశాయివై పొడచూపిన గోవిందరాజా! ఇట్టి రూపముతో కొలువై వున్నావా? అని కీర్తిస్తున్నారు. ఆయన కొంకక వరములిస్తాడట. సొరిది దాసుల కృపచూస్తాడట. ఒడికపు రాజసాన నొత్తిగిలినాడట. అర్థమైనట్లుండే అర్థంకాని మాటలెన్నున్నాయో!!

**సీ॥ కొలువౌచు తోపేవు గోవిందరాజ! ఆ**
**వటపత్రశాయివై వరలినావు**
**పడతులిద్దరిపైన పాదాలు చాచేవు**
**ఒడికంపు రాజసమొప్ప నీవు**
**నాభికమలములో నలువ నీకొడుకుండె**
**శేషశాయివినీకశేష సిరులు**
**పరగు దైత్యులమీద పాము విషము గుప్పి**
**దాసుల జూచేవు దయను నించి**

**తే॥ శంఖ చక్రాల కరములు చాచినావు**
**శిరసు క్రింద హస్తంబును చేర్చినావు**
**వేంకటాద్రి తిరుపతిలో వెలసినావు**
**అమృతంపు కీర్తన జేప్పె నన్నమయ్య.**

**రాగం : శంకరాభరణం**

అల వటపత్రశాయివైన రూపము ఇట్టిదని
కొలువై పొడచూపేవా గోవిందరాజా ॥అల॥

పడతులిద్దరి మీద పాదములు చాచుకొని
ఒడికపు రాజసాన నొత్తిగిలి
కడలేని నిజనాభి కమలమున బ్రహ్మను
కొడుకుగా కంటి విదె గోవిందరాజా ॥అల॥





సిరుల సొమ్ములతోడ శేషునిపై పవళించి
సొరిది దాసుల కృప జూచుకొంటాను
పరగు దైత్యుల మీద పాము విషములే నీవు
కురియించితివిగా గోవిందరాజా ॥అల॥

శంకు చక్రములతోడ చాచిన కరముతోడి
అంకెల శిరసుకింది హస్తముతోడ
తెంకిని శ్రీవేంకటాద్రి దిగువ తిరుపతిలో
కొంకక వరములిచ్చే గోవిందరాజా ॥అల॥

**భావామృతం :**

ఓ గోవిందరాజా! ఆనాడు వటపత్రశాయివై (మర్రియాకుపై నోటిలో కాలి బొటనవ్రేలు పెట్టుకొని చీకుచూ పవ్వళించిన) శిశువువలె నున్న రూపము ఇట్టిదేలే... అని ఇచ్చట పవ్వళించినట్లు కొలువు దీరి పొడచూపేవా (కనుపించుచున్నావా?)

స్వామీ! నీవు పడతులిద్దరిమీద (శ్రీదేవి, భూదేవి అను నీ ఇద్దరు భార్యలపై) నీ పాదములు చాచి వుంచి, వారిద్దరూ నీ పాదము లొత్తుచుండగా, ఒడికపు (మనోహరమైన) రాజసాన (రాజదర్పముతో), ఒత్తిగిలి పరుండి కనిపించుచున్నావా? అంతులేక నీ నాభినుంచి పుట్టిన తామర పుష్పములో జనించిన నీ పుత్రుడు బ్రహ్మదేవుని, ఇదిగో మేమూ దర్శించితిమి. ఓ గోవిందరాజా! మేము ధన్యులము తండ్రీ!

ప్రభూ! వైభవములొలుకు నీ నగలను అలంకరించుకొని నీవు ఆదిశేషునిపై నిద్రించుచుంటివి. అయినా నీ భృత్యులైన మమ్ము కృపతో ఒక కంటగమనిస్తూనే వున్నావు. పరగు (వీర విహారము చేయు) రాక్షసుల మీద పాము విషములే (ఆదిశేషుని గరళము) వర్షింపజేయుచుంటివయ్యా! ఓ గోవిందరాజా! మమ్ము రక్షించుట మఱువకు తండ్రీ!

ఓ దేవదేవా! చాచివుంచిన నీ చేతులలో శంఖ చక్రములు ఆయుధములై మెరయుచున్నవి. అంకెల (గురుతైన) నీ శిరస్సుక్రింద ఒక చేయినుంచికొని నిదురించుచుంటివి. శ్రీవేంకటాద్రి కింద తిరుపతిలో తెంకిని (స్థావరమై) నీవే మాత్రము కొంకక (వెనుదీయక) వరములిచ్చుచుంటివి. ఓ గోవిందరాజా! నిన్ను సేవించు మా జన్మధన్యమైనది తండ్రీ!

## 5-78

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని గడుసుగా ప్రశ్నిస్తున్నారు. నీ భక్తులంతా జ్ఞానులు, యోగులు, మునులు. వాళ్లని నీవెలాగూ రక్షిస్తావు. దానివల్ల నీకు ప్రత్యేకంగా ఒరిగేదేమిటి? నాబోటి 'అజ్ఞాన సామ్రాట్టు'ను, ఎన్నెన్నో నీచ జన్మలెత్తిన వాడిని, నీచాతి నీచుణ్ణి, ఐదు ఇంద్రియాలచే పరిపాలింపబడు గర్విష్ఠిని నీవెంత వెదకినా దొరుకుతాడా? నేనే లేకపోతే నీదయ ఎవరిపై చూపిస్తావు? నావల్లనే నీకు ఆర్తత్రాణ పరాయణుడవన్న బిరదూ వచ్చింది. నీవల్ల నాకు బ్రతుకు వచ్చింది. నావల్ల నీకు పుణ్యము వచ్చాయి. కాబట్టి మేలు ఇద్దరికీ కలిగింది సుమా! అంటున్నారు.

**తరలము :**

**వినుము నేనొకడన్ జగంబున వేంకటేశ్వర లేనిచో**
**ఘనుడ! నీదయ బొంద బాత్రుడు కాదుయెవ్వడు నిక్కమౌ**
**వెనుక మూర్ఖుడు నన్ను మించుచు విశ్వమందున లేడురా**
**కనుక నావలనన్ ప్రసిద్ధిని గాంచినావనె అన్నయున్**

**రాగం : బౌళి రామక్రియ**

నేనొక్కడ లేకుండితే - నీ కృపకు బాత్ర మేది
పూని నావల్లనే కీర్తి - బొందేవు నీవు ॥నేనొక్క॥

అతి మూఢులలోన - నగ్రేసరుడ నేను
ప్రతిలేని ఘనగర్వ - పర్వతమను
తతి బంచేంద్రియముల - ధనవంతుడను నేను
వెతకి నావంటివ ఆ (వా) ని - విడువగ జెల్లునా ॥నేనొక్క॥

మహిలో సంసారపు సా - మ్రాజ్యమేలే వాడ నేను
యిహమున గర్మవహి - కెక్కితి నేను
బహుయోని కూప సం-పద దేలే వాడ నేను
వహించుక నావంటి - వాని దేనోపేవా ॥నేనొక్క॥





భావించి నావంటి నీచు -బట్టి కాచినప్పుడుగా
యే వంక నీ కీర్తిగడు - నెంతురు భువి
నా వల్ల నీకు బుణ్యము - నీవల్లనే బ్రదుకుదు
శ్రీవేంకటేశుడ యింత - చేరె జుమ్మీ మేలు ॥నేనొక్క॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నేనే లేకపోతే నీదయ ఎవరి మీద చూపిస్తావు? నా ఒక్కడివల్లనే నీవు "ఆర్తత్రాణపరాయణుడు" అనే కీర్తిని పొందావు అవునా? కాదా?

నేను 'మూర్ఖాగ్రేసర చక్రవర్తి' అనే బిరుదాంకితుడను. పర్వతములంత గర్వం కలవాడిని. శ్రోత, త్వక్కు, చక్షు, జిహ్వ, ఘ్రాణ (చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, ముక్కు) అనే ఐదు గొప్ప సంపదలున్న ఘనుడిని. ఇంత గొప్ప అజ్ఞాని నీకు కాగడావేసికొని వెదకినా కనిపిస్తాడా? ఇటువంటివాడిని నన్ను వదిలిపెట్టుట నీకు తగునా? ఇక ఆలస్యం చేయక నా సంగతి చూడవయ్యా!

ఈ లోకంలో "సంసార సామ్రాజ్యాధిపతి"ని నేను. నావంటి ఏలిక (పరిపాలకుడు) మరి లేనే లేడు. నా కర్మలవల్ల (మంచివి కావు చెడ్డ కర్మలే) ఎనలేని పేరు సంపాదించాను. ఎన్నెన్నో మురికి యోనికూపాలలో జన్మించి అదే జీవితమనుకొని, ఆ వైభవం కోసమే తపించిపోయాను. నావంటి వాణ్ణి మరొక చోట తేనోపేవా (తేగలవా?) సాధ్యమేకాదు. ఇంకా ఆలోచిస్తావెందుకు? నాగురించి ఒక్కసారి ఆలోచించు ప్రభూ!

స్వామీ! జ్ఞానులను, యోగులను, మునులను, నీవెలాగూ రక్షిస్తూనే వుంటావు. అందులో యేమి గొప్ప వుంది? నావంటి నీచాతి నీచుణ్ణి వెదకి పట్టుకొని వాడిని రక్షిస్తే... అప్పుడు నీ కీర్తి ఇనుమడిస్తుంది. అప్పుడు అంతా నిన్ను 'దీనజనరక్షకుడు' అని పిలుస్తారు. నీకు కూడా ఎంతో పుణ్యం దక్కుతుంది. నేను నీవలన బ్రతికిపోతాను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది మనిద్దరికీ లాభసాటి బేరమే ప్రభూ! ఇంతమేలు చేరెన్ జుమ్మీ! (ఇంత మేలు మనిద్దరికీ కలిగింది సుమా!) అందుకని నా సంగతి చూడవయ్యా తండ్రీ!

**5-79**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఒక్కొక్కసారి కీర్తన పల్లవిలోనే "తీరని చిక్కులు" పెడుతుంటారు. 'ఓ దేవదేవా! వేదము కూడా తీర్చదు. వేరు వేరు అంశములను తెలిపే ఆరు శాస్త్రములూ తీర్చలేవు. ఏదీకూడా యిది తీర్చదు. నీమాయ అంటున్నారు. నీ మాయే ఒక చిక్కు అని ఆచార్యులవారి భావన కావచ్చు. మనవంటి 'చిన్న' వాళ్లకి అది చిక్కే-మరి. "తెమ్మలాయె నీ తీరని చిక్కు" - అంటే ఏమిటో? బహుశా అది 'తెమలాయె' కి రూపాంతరం అయివుంటుంది. తెమలాయె అంటే 'చలించి పోవునట్లు చేసేవి' - అని అర్థం. మరి ఆ శ్రీనివాసుని 'చిక్కు'లు మనల్ని ఏడిపించవూ?

**ఉ॥ వేదము దీర్చలేనిదిది వేరగు శాస్త్రములెట్లు దీర్చురా**
**యేదియు దీర్చదో తిరుమలేశ్వర నీదగు మాయ దెల్వగా**
**లేదుర దారి నీ శరణు రెప్పల నార్పెడి యంతలోననే**
**ఆదుకొనున్ విపన్నులగు యందరినో ప్రభు! అన్నమయ్యనెన్.**

**రాగం : శంకరాభరణం**

వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియు దీర్చదు యిది నీమాయ ॥వేదము॥

నీవల్ల బ్రదికిరి నిండు దేవతలు
నీవల్ల నసురులు నెఱి జెడిరి
ఆవల నిందరి కాత్మవు నీవు
చేవదీరె నీ చిక్కులే భువిని ॥వేదము॥

నెమ్మి బాండవుల నీవారంటివి
కమ్మర విడిచి కౌరవుల
యిమ్ముల నీ వావి యిద్దరి కొక్కటే
తెమ్ములాయ నీ తీరని చిక్కు ॥వేదము॥





జగమున నీదే స్వతంత్ర మెల్లా
నెగడిన జీవులు నీవారు
తగు శ్రీవేంకట దయివమవవు యిన్నియు
తెగి నీ దాసులు తెలిసిన చిక్కు ॥వేదము॥

**భావామృతం :**

ఓ మహానుభావా! ఇది(ఈ జగత్తంతా) నీ మాయయే తండ్రీ! ఇదొక గొప్ప చిక్కు ప్రశ్నలాంటిది. వేదము ఈ చిక్కుముడి విప్పలేదు. ఆరు శాస్త్రములూ ఆ చిక్కును వివరించలేవు. నీమాయ కల్పించే చిక్కునెవరూ సవరించలేరు. (నావల్ల ఏమవుతుందయ్యా?)

దేవతలందరూ నీవలననే బ్రతికిపోయారు. అసురులందరూ "నెఱిజెడిరి" (క్రమముగా నశించారు. ఒకరి తరువాత ఇంకొకరు నశించారు) అదట్లా వుంచి వాళ్లకీ వీళ్లకీ కూడా ఆత్మవు పరమాత్మవైన నీవే. ఈ ప్రపంచంలో నీవు కల్పించే చిక్కులే చేవదీరినవి (ధైర్యమును నిర్మూలిస్తాయి) ప్రభూ! (ఆచిక్కు విప్పటం నాకు సాధ్యమా?)

దేవా పాండవులను నెమ్మిన్ (ప్రేమతో) నీవారు అన్నావు. కమ్మర (క్రమ్మర = మరల) కౌరవులు కూడ అదే బంధుత్వం కలిగినవారే కదా! నీవావి (చుట్టరికం) ఇద్దరికీ ఒక్కటే. కానీ ఒకళ్లని అనేక విధాలుగా రక్షించావు. ఒకరిని చేయకూడని విధంగా అంతమొందించావు కదా! నీ చిక్కు తెమ్మలాయె (చలించి పోవునట్లు) చేయుచున్నది. (దీనిని తట్టుకోవడం నావల్ల అవుతుందా తండ్రీ!)

ప్రభూ! ఈ జగత్తులో కేవలం నీ స్వాతంత్ర్యమే చెల్లుబాటు అవుతుంది. నెగడి (వర్ధిల్లెడి) జీవులందరూ నీ బిడ్డలే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ జీవులందరికీ నీవే దేవుడవు. నీకు భృత్యులై తెగి(విరక్తులైన) నీ దాసులు మాత్రమే తెలిసిన చిక్కు (అర్థం చేసికొనగల చిక్కుముడి) ఈ నీ లీల. తగునట్లు నీలీల అర్థం చేసికొనగల శక్తి నాకున్నదా తండ్రీ! (అందుకే నిన్నే శరణు జొచ్చాను స్వామీ!)

**5-80**

## మున్నుడి

గోపాలకృష్ణుడు రేపల్లెలో చేసిన గోలని కీర్తిస్తున్నారు. అన్నమాచార్యులవారు ఆనాడు తన అల్లరితో అందర్నీ ముప్పు తిప్పలు పెట్టిన కృష్ణుడు "ఎచ్చట జూచిన నితడే" అంటున్నారు. అంటే అక్కడెక్కడో వున్న రేపల్లెలోనే కాదు ఇక్కడ (తిరుమలలో) కూడా వాడే. ఇక్కడ మచ్చికన్ (మోహముతో) ఈ అలమేల్మంగతో కూడి వెలసినాడు అంటున్నారు. ఉట్లను పగులగొట్టి, అల్లరి గొల్లలతో 'కోలలు' ఆడిన ఆ నంగనాచికి చక్కిలాలు, అదు(టు)కులు ఇష్టమట. నెఱవాదికాండ్ల, నురుగులు - వంటి మాటలు మన భాషలో మరుగునపడ్డాయి. నాబోటి వాడికి నిఘంటువున్నా కష్టంగానే వున్నది.

**మ॥ ఇతడే యెచ్చట జూచినన్ నిలిచెరా ఈకృష్ణుడే మంగకున్**
**సతికిన్ మచ్చికయై తగున్, వెలసెగా చక్కంగ గోవిందుడై**
**జతయై గొల్లల కొట్టె 'నుట్లు' భళిరా! జాణందు అన్నయ్యనెన్**
**వెతలన్ బెట్టెను గోపకన్నియల ఈ వేంకన్న నేమందురా?**

**రాగం : మిశ్ర బలహరి**

ఎచ్చట జూచిన నితడై కృష్ణుడు
మచ్చిక నలమేలు మంగతో వెలసీ ॥ఎచ్చట॥

కొట్టరో వుట్టులు గోపాల బాలులు
యిట్టె కృష్ణుని యెదుటను
పట్టరో వారలు పాలు నేతికిని
గట్టిగ జోరున కారీ నవిగో ॥ఎచ్చట॥

కూడరో మూకలు కోలల వారలు
వేడుక కృష్ణుని వెంటవెంట
ఆడుచు మెసగరో అడుకులు చక్కిలాలు
వాడల వాడల వరుసతోను ॥ఎచ్చట॥





నిక్కి తీసుకోరో నెఱవాది కాండ్లు
మక్కువ కృష్ణుని మఱగునకు
యెక్కరో శ్రీవేంకటేశు కొండమీద
పెక్కు నురుగులు పెరుగులు నవిగో ॥ఎచ్చట॥

### భావామృతం

ఓ ప్రజలారా! ఎచ్చటజూచినను ఇతనే (శ్రీవేంకటేశుడే) అయి శ్రీకృష్ణుడు, మచ్చికన్ (గాఢమైన అనురాగము) కలవాడై ఈ అలమేల్మంగతో వెలసి యున్నాడు. (వీనిని సేవించండి).

ఓ గోపాలబాలులారా! భయపడకండి. కృష్ణుని యెదుటను వుట్టులు (ఉట్లు), ఇట్లే కొట్టరో (తేలికగా పగులకొట్టండి). 'పట్టరో వారలు'.. (అంటే వారలు పట్టరో... అనగా ఆపోసన పట్టండి... అంటే ఎంగిలి చేసి వదలటం అన్నమాట). పాలు, నెయ్యి ఎంగిలి చేసి అన్నం తిని, త్రాగినంత త్రాగి పారేయండి. జోరుగా గట్టిగా (అధికముగా) ఆ పాలూ నేయూ కారిపోతున్నాయి. అదిగో చూడండి.

కోలల వారలు (కోలాటము ఆడే కుర్రవాళ్ళు) మూకలు కూడరో (ఒక గుంపులాగా రాండ్రా). శ్రీకృష్ణుని వెంట మీరంతా వస్తుంటే ఎంత వేడుకగా వున్నదో. వాడల వాడల (వీధులన్నిటిలోను) వరుసగా, ఆడుచూ (ఆడుకొంటూ) మీరంతా అడుకులు (అటుకులు) చక్కిలాలూ, మెసగరో (తినండ్రా).

మక్కువతో (ప్రేమగా) శ్రీకృష్ణుని మఱగునను (చాటున నిలిచికొని), నిక్కి (అతిశయించి) నెఱవాది కాండ్లు (నేర్పరితనంగల వారంతా) మక్కువ తీసుకొనరో (ఆశ్రయం తీసికొనండి). అంటే... శ్రీకృష్ణ పరమాత్మను ఆశ్రయించండి. మరినేడు కలియుగంలో ఉట్ల పండుగ తిరుమలలో, శ్రీవేంకటేశుని కొండమీద జరుగుతున్నది. మీరంతా ఆ కొండ యెక్కరో (ఎక్కండయ్యా!) అవిగో ఎన్నో పెరుగులూ, నురుగులూ (పేణీలు) వున్నాయి. ఇవి స్వామి ప్రసాదం, భక్తితో స్వీకరించండి.

## 5-81

## మున్నుడి

ఈ చిన్న సంస్కృత కీర్తనలో అన్నమాచార్యుల వారు ఎన్నో సందేహాలను వెలిబుచ్చుతున్నారు. "అసలు నేను చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి? అన్నీ అనుమానములే. నేను నిత్యశంకితుడనై నా శంకలకు సమాధానం లేని బుద్ధి జాడ్యమును పొందుచున్నాను" - అని అంటున్నారు. కరిరాజ వరదుడైన శ్రీవేంకటేశ్వరుడే నాకు దిక్కు. దేహాభిమానముతోను చంచల బుద్ధితోను నేను పీడించబడుచున్నాను. స్వామి శరణు కోరుచున్నాను, అంటున్నారు.

**ఆ.వె॥ శంకలన్ని నన్ను జాడ్యంబులై బట్టె**
**చేయుచుంటి నేమి, చేయుటేమి?**
**కరిని గాచినట్టి తిరువేంకటేశుడే**
**ఉన్న దిక్కు అనెను అన్నమయ్య**

**రాగం : శుద్ధవసంతం**

కిం కరిష్యామి కింకరోమి బహుళ-
శంకా సమాధాన జాడ్యం వహామి ॥కిం కరిష్యామి॥

నారాయణం జగన్నాథం త్రిలోకైక-
పారాయణం భక్తపావనం
దూరీ కరోమ్యహం దురిత దూరేణ సం-
సారసాగరమగ్న చంచలత్వేన ॥కిం కరిష్యామి॥

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ-
వరదం శరణాగతవత్సలం
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణభవదేహాభిమానం వహామి ॥కిం కరిష్యామి॥





## భావామృతం

"ఏమి చేయవలెను? ఏమి చేయుచున్నాను?" అను గొప్ప శంకకు సమాధానములేని బుద్ధిజాడ్యమును పొందుచున్నాను.

జగన్నాథుడైన నారాయణుని, ముల్లోకముల చేత పారాయణము చేయబడు వానిని భక్తులను పునీతులను చేయువానిని నేను నాకు దూరము చేసికొనుచున్నాను. ఏలననగా నేను దుర్మార్గముల చేతను, సంసార సాగర నిమగ్నమగు చంచలత్వము చేతను పీడించబడుచున్నాను కదా!

తిరువేంకటాచాలాధిపతిని, గజేంద్ర సంరక్షకుని, శరణాగతవత్సలుని, పరమపురుషుని, కృపయే ఆభరణముగా గలవానిని, నేను భజించకున్నాను. పైగా మరణమే సహజ లక్షణముగా గల నా ఈ దేహమునందు వల్లమాలిన అభిమానమును పొందియున్నాను. ఏమి చేయవలెను ప్రభూ!



## 5-82

### మున్నుడి

చమత్కారంతోను, ఆర్ద్రతతోను కవిత చెప్పటంలో పెద తిరుమలయ్య తన తండ్రి అన్నమాచార్యులవారికి సమవుజ్జీ అనిపిస్తారు. ఈయనకూడ శ్రీవేంకటేశ్వర మకుటంతోనే సంకీర్తనలు రచించటం వల్ల నాబోటి సామాన్యులు ఏ కీర్తన నెవరు చెప్పారో కూడ కనుక్కోలేరు. ఈ కీర్తనే ఒక చక్కని ఉదాహరణ. 'రామ రామ రామ రాజీవ లోచన' అంటే... పద్మదళనేత్రుడవై పరశురామ, శ్రీరామ, బలరామ రూపములలో దర్శనమిచ్చిన దేవా! అని అర్థం. నేదీము వంటి బంటున (బంటు+ అన), తేజమే నాది (నేను చిరుదీపాన్ని) నీకు బంటును... నా తేజము ఎంత... అదీ నీవిచ్చిందే.

**కం॥ పెద తిరుమలయ్య ఉద్ధతి**
**నిది చెప్పెను, దీమువంటి హితుడను బంటన్**
**పదిలముగ తిరుమలేశుడె**
**ముదముగ రామయ్యలున్న మురవైరి యనెన్**

**రాగం : కళ్యాణి**

రామ రామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటననే తేజమే నాది ॥రామ॥

వారధి దాటి మెప్పించ వాయుజుడనే గాను
సారె చవుల మెప్పించ శబరిగాను
బీరాన సీతనిచ్చి మెప్పించ జనకుండగాను
ఏరీతి మెప్పింతు నన్నెట్లా గాచేవో ॥రామ॥

ఘనమై మోచి మెప్పించ గరుడుడనే గాను
కొన కామసుఖమిచ్చు గోపిక గాను
వినుతించి మెప్పించ వేయినోళ్ళ బోగిగాను
నిన్నెట్లు మెప్పింతు నన్ను గాచే దెట్లా ॥రామ॥





నవ్వుచు పాడి మెప్పించ నారదుడ నేగాను
అవ్వల ప్రాణమీయ జటాయువు నేగాను
ఇవ్వల శ్రీవేంకటేశ యిటు నీకె శరణంటి
అవ్వల నా, తెరువిదే రక్షించే దెట్లా ॥రామ॥

### భావామృతం

ఓ ప్రభూ! పద్మదళనేత్రుడవైన నీవే రాముడవు (పరశురాముడవు), నీవే రాముడవు (శ్రీరాముడవు), నీవే రాముడవు (బలరాముడవు). అట్టి నీకు, నేను దీమువంటి బంటు అన (చిరు దీపము వంటి సేవకుడను), తేజమే నాది (ఆత్మజ్యోతి మాత్రమే నాది)

నేనెంత అల్పుడనో చెబుతాను విను. నిన్ను మహామహులు సేవించారు. వారితో పోలిస్తే నేనెంత తండ్రీ! సముద్రాన్ని దాటి నిన్ను మెప్పించుటకు పవనపుత్రుడైన హనుమను కాను. సారె చవుల (మాటిమాటికీ రుచులతో) మెప్పించుటకు శబరిని కాను. బీరాన (పరాక్రమంతో.. ధీరుడై అని ఇక్కడ భావము) సీతనిచ్చి మెప్పించుటకు జనక మహారాజును కాను. మరి నిన్ను ఏ విధముగా మెప్పించగలను? నీవు నన్నెట్లు రక్షించెదవో తెలియుట లేదు.

ఓ దేవదేవా! నిన్ను ఘనమై మోచి (గొప్పగా మోసి) మెప్పిద్దామంటే, గరుత్మంతుడికున్న బలం నాకేది? పోనీ కామ సుఖమిచ్చుకొన (రతి సుఖమిద్దామంటే) నేను బృందావనంలో గోపికను కాను. కృష్ణయ్యా! నిన్ను కీర్తించి పొగిడి మెప్పించుదామంటే భోగిని (ఆదిశేషుడిని) కాను. ఆయనకి వేయినోళ్ళు వున్నాయి. మరి నాకో? ఇకనేను నిన్నెట్లు మెప్పించగలను? నన్ను నీవెట్లా రక్షిస్తావు తండ్రీ!

స్వామీ! నిన్ను నవ్వుచూ (ఆనందంతో) పాడి (కీర్తించి) మెప్పిద్దామంటే నేను నారద మహర్షిని కాకపోతిని. ఆనాడు ప్రాణత్యాగం చేసి (సీతాదేవికోసం) నిన్ను మెప్పించిన జటాయువునన్నాకాదు. ఈనాడు ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను శరణుజొచ్చి యున్నాను. నా తెరువిదే.. (నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే...). ఇక నన్ను రక్షించేదెట్లా? నీ చిత్తము.. నా భాగ్యము తండ్రీ! నీవే నాకు దిక్కు.

## 5-83

## మున్నుడి

"ఓహో! డేండేం"... అంటూ చాటింపు వేస్తున్నారు అన్నమాచార్యులవారు. "డేండేం" చాటింపు వేసే వాయిద్యాల ధ్వని అన్నమాట. ఒగి (క్రమముగా నెరిగినచో..) బ్రహ్మమంటే ఇదే అని సాహసంతో వేదము చెబుతున్నది... చాటింపు వేస్తున్నది... అంటున్నారు.

భగవద్గీతలో పరమాత్మ వివరించిన పరము, అపరము, ప్రకృతి, జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యము, దేహాత్మ, క్షరము, అక్షరము, సాక్షి, సాత్వికము, కూటస్థుడు, సాక్షిపురుషుడు – వీటన్నింటి గురించి వివరించారీ కీర్తనలో. శ్రీపురుషోత్తముడే.. శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

**కం॥ ఆహా! బ్రహ్మము ఇదియని**
**సాహసమున శ్రుతులు పూని చాటెను వినుడీ**
**"ఓహో! డేండేం" అనెరా**
**శ్రీహరి నన్నయ్య కొలిచి చెప్పెను 'గీతన్'**

**రాగం : రామక్రియ**

ఓహో డేండేం వొగి బ్రహ్మ మిదియని
సాహసమున శ్రుతి చాటెడిని ॥ఓహో॥

పరమును నపరమును బ్రకృతియు ననగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుడును, అపరము జీవుడు
తిరమైన ప్రకృతియె దేహము ॥ఓహో॥

జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
పూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ,
జ్ఞానగమ్యమే సాధించు మనసు ॥ఓహో॥





క్షరము నక్షరమును సాక్షి పురుషుడని
సరవి దెలియుటే సాత్వికము
క్షరము ప్రపంచ, మక్షరము కూటస్థుడు
సిరిపురుషోత్తముడే శ్రీవేంకటేశుడు ॥ఓహో॥

## భావామృతం

ఓహో! (ప్రజ్ఞావంతులారా!) డేండేం అని (ధమ ధమయని డప్పు వాయించి) సాహసముతో చాటింపు వేసి, మరీ చెబుతున్నాను. ఒగి (క్రమముగా నెరిగిన) బ్రహ్మము అంటే... ఇదే సుమా!

'వివేకము' అని దేనినంటారో తెలియండి. పరము, అపరము మరియు ప్రకృతి అనే మూడింటి గురించి, వెరవున (ఉపాయముతో) తెలియుటయే "వివేకము". పరమునే దేవుడు అని అంటున్నాం. అపరమునే జీవుడు అంటున్నాం. ఆ రెంటికీ నాశనము లేదు. తిరమైన (స్థిరమైన) ప్రకృతియే దేహము రూపంలో కనబడుతున్నది. స్థూలంగా ఇది తెలిస్తే... చాలును.

పూని (వుద్యమించి) జ్ఞానము అని దేనినంటారో, జ్ఞేయము అంటే యేమిటో, జ్ఞాన గమ్యము అనగా నేమియో, గ్రహించుటే "యోగము" అని వ్యవహరిస్తారు. దేహములలో నివసించే దేహాత్మ జ్ఞానస్వరూపుడు. బాహ్య ప్రపంచంలో మూర్ఖునివలె కనిపించే వానియొక్క దేహాత్మ కూడా జ్ఞానస్వరూపుడే. జ్ఞేయము అనగా దేని గురించి తెలిసినచో ఇక తెలుసుకోవలసిన దేమియూ లేదో, అదియే. పరమాత్మనే జ్ఞేయము అంటారు. మనస్సును సాధించి అర్థం చేసికొనిన వాడు జ్ఞాన గమ్యమును చేరినట్లే.

ఇప్పుడు సాత్వికము అని దేనిని, పిలుస్తారో సరవి (క్రమముగా) ఆకళింపు చేసికొందాం. క్షరము, అక్షరము మరియు సాక్షి పురుషుడు అనే మూడింటి గురించి తెలుసుకొనుటయే సాత్వికము. మన కనులయెదుట వున్న ప్రపంచమే క్షరము. ఇది ఏదో ఒకనాడు నశించునదే. అక్షరుడు అనగా క్షయముగాని కూటస్థుడు. దేహంలో వుండియే నాటికీ నశించని వాడే అక్షరుడు. ఇక సాక్షిపురుషుడు ఎవరు? ఇంకెవరు... శ్రీ పురుషోత్తముడైన తిరువేంకటేశ్వరుడే. ఈయనేసాక్షి... రాగద్వేషాలకు అతీతుడు.

## 5-84

## మున్నుడి

వలపు, ప్రేమ అంటే యేమిటో నిజానికి "నేను ప్రేమిస్తున్నాన" నే యెంతమందికి తెలుసు? నూటికి తొంబది తొమ్మిది మందికి కామవాంఛకు, వలపునకు తేడా తెలియదు. అన్నమాచార్యులవారు "నిజమైన ప్రేమయే (భక్తులకు స్వామి మీద - వలచిన వారికి తాము వలచిన వారి మీద) సౌభాగ్యము. అదే వలపు. అదే సుఖమంటే. అదిగాక ఇంకొకటి యేదన్నా వున్నదా?" అని ప్రశ్నిస్తున్నారు. చిత్తములో తానే శ్రీహరిగా భావించి అన్ని విచారములను మరచి హత్తించి (పెనవేసికొని... అంటే అణువణువు ఆయనే తానయి వుండవలదా? అంటున్నారు.

**తే॥ ఏది సౌభాగ్యమదిగాక యేది వలపు?**
**ఏది సుఖమింక నిదిగాక యేమి గలదు?**
**చిత్తమున దానె శ్రీహరై చింత మఱచి**
**హత్తి యుండవలయుననె అన్నమయ్య.**

**రాగం : ప్రతిమాభేరి**

అదిగాక సౌభాగ్య మదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికి గలదా ॥అదిగాక॥

ప్రాణవల్లభుని బెడ బాసి మరుబాణములు
ప్రాణబాధలు నెగులు పడుటేటి వలపే
ప్రాణేశ్వరుడు దన్ను బాయ జూచిన యపుడు
ప్రాణంబు మేనిలో బాయంగ వలదా ॥అదిగాక॥

ఒద్దికై ప్రియునితో నొడుగూడి యుండినపు
డిద్దరై విహరించుటిది యేటి వలపే
పొద్దు వోకలకు తమ పొలయలుక కూటముల
బుద్ధిలో పరవశము పొందంగ వలదా ॥అదిగాక॥





చిత్తంబు లోపలను శ్రీవేంకటేశ్వరుని
హత్తించి వాడు దానయివుండవలదా
కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల
తత్తరము మున్నాడి తగులంగ వలదా ॥అదిగాక॥

**భావామృతం**

అదిగాక (స్వామిప్రేమ) సౌభాగ్యము ఇంకేదన్నా వుంటుందా? అదిగాక వలపు అనేదేదన్నా వున్నదా? అదిగాక సౌఖ్యం అనేది మరేదన్నా వున్నదా? అందరికీ అదే... శ్రీనివాసుని ప్రేమయే సర్వస్వం. ఇక ఆయనే ప్రాణవల్లభుడు (ప్రాణంవంటి భర్త) అయితే... ఇంకా ఏమి కావాలి?

ప్రాణవల్లభునిన్ వెడబాసి (ఎడబాటు పొంది) మన్మధుని పుష్పబాణములకు గురి అయి ప్రాణాంతకమైన వ్యధ జెందుతూ, నెగులు పడుట (దుఃఖించుట) అదేమి ప్రేమండీ? తన ప్రాణేశ్వరుడు తనను విడచిన తక్షణమే తన ప్రాణాలు గాలిలో కలిసి పోవద్దా? తన శరీరంలో ఇంకా ప్రాణం వుంటే... అదేమి ప్రేమ?

ఒద్దికై (అనుకూలవతియై) ప్రియునితో వున్నప్పుడు తాము 'ఇద్దరు' అనే భావనతో విహరించ వచ్చునా? అట్లా వుంటే అదేమి ప్రేమండీ? ప్రొద్దస్తమానం పైపైన ప్రణయకలహములతోను, బుద్ధిలో (మనస్సులో) పరవశత్వము పొందుతూ వుండవద్దా? ఆ విధంగా లేకపోతే... అదేమి ప్రేమ?

చిత్తంబులోపల (తన మనస్సులో) శ్రీవేంకటేశ్వరుని, వాడే తానయి హత్తించి (అణువణువూ ఆయనే తానయినట్లు పెనవేసుకొని) వుండవద్దా? నూతనమైన ఇటువంటి కొదలేని (అంతులేని) విషయములతో తగులంగ వలదా (ముందుగానే అమితమైన ఆసక్తి కలిగి యుండవద్దా?) అట్లుగానిచో ఇంకా ప్రేమయేమిటి?

**మున్నుడి** **5-85**

ఆకలితీరాలంటే అన్నం తినాలి. అంతేకాని గడ్డపార మింగితే కడుపు నిండుతుందా? భవము (ప్రాపంచిక యావ) తనను ఒడకమ్ము (విశేషముగా లొంగదీస్తుంది). అది ఒడ్డినది (చాచుకొని విస్తరించినది కదా!) ఇక ఉపాయమేమిటి? వేంకటేశ్వరుని శరణాగతి ఈ భవబంధాలను తొలగిస్తుంది - అంటున్నారు అన్నమాచార్యులవారు... అదీ సోదాహరణంగా - వినండి.

**సీ॥ ఒడ్డు భవము దన్ను ఒడకమ్ము గావించు**
**గడ్డపారాకలి నడ్డుకొనునె?**
**చిందుచు దూకెడి జింకలన్ బండికి**
**కట్టి సాగెదమన్న వట్టిమాట**
**మండు అగ్గిని దెచ్చి మసిపాత బిగియించి**
**ఇంట దాచెదమన్న యెట్టులగును?**
**విష సర్పమును దెచ్చి పెట్టి దిండుగ నిద్ర-**
**పోజూడ నణగుచు యుండగలదె?**

**తే॥ వెట్ట సంసార మియ్యది వేంకటేశ!**
**మనిషి చెప్పిన తీరున మాట వినునె**
**నిన్ను గొలువక కడతేరు టన్నకాదు**
**అన్నమార్యుడు బోధించె నద్భుతముగ.**

**రాగం : కాంబోది**

గడ్డపార మింగితే నాకలి దీరీనాయీ-
వొడ్డిన భవము దన్ను వొడ కమ్ముగాక ॥గడ్డ॥

చించుక మిన్నుల బారే చింకలను బండి గట్టి
వంచుకొనే మన్ననవి వసమయ్యీనా
యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు
పొంచి పొంచి వలపుల బొండబెట్టుగాక ॥గడ్డ॥





మంటమండే యగ్గి దెచ్చి మసిపాత మూటగట్టి
యింటిలోన దాచుకొన్న నితవయ్యీనా
దంట మమకార మిట్టె తన్నునేల సాగనిచ్చు
బంటుజేసి ఆసలనే పారదోసుగాక ॥గడ్డ॥

పట్టరాని విషముల పాము దెచ్చి తలకింద
బెట్టుకొన్నానది మందపిలి వుండీనా
వెట్ట సంసార మిది వేంకటేశు గొలువని
వట్టి మనుజుల పెడవాడ బెట్టుగాక ॥గడ్డ॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఎవడికన్నా ఆకలి తీరాలంటే, అన్నం తినాలి. అంతేకాని గడ్డపార నొకదాన్ని మింగితే ఆకలి తీరుతుందా? భవము (ప్రాపంచిక యావ) తనను ఒడకమ్ముగాక! (విశేషముగా లొంగదీస్తుంది కదా!) ఎందుకంటే అది ఒడ్డిన భవము (చాచుకొని విస్తరించియున్న భవము).

చించుక మిన్నుల బారే (విజృంభించి పైపైకి ఎగిరి పరుగులెత్తెడి) చింకలను (జింకలను) తీసికొనివచ్చి బండికి కట్టి పరిగెత్తించి మన వశములో వుంచుకొందామంటే... అది జరిగే పనియేనా? అంచనా వేయలేని ఇంద్రియాలు యెవ్వరికన్నా యేల చిక్కు (యెందుకు లొంగుతాయి?) పొంచి పొంచి (దాగి దాగీ) వలపులతో, బొండబెట్టుగాక! (పండబెట్టును కదా!)

భగభగమండే మంటను తీసికొని వచ్చి, మసిపట్టిన పాతగుడ్డలో కట్టి మన ఇంట్లో దాచి వుంచుకొందాం అంటే అది జరిగే పనియేనా? హితము కలుగుతుందా? దంట మమకారము (దిట్టమైన వ్యామోహము), తనను బంటును చేసి, ఆశల వెంట తరుముతుంది. అంతేకాని తనని యెందుకు కొనసాగనిస్తుంది?

అశక్యమైన విషమున్న సర్పమును తీసికొని వచ్చి దిండు క్రిందబెట్టుకొని పడుకొనవచ్చునా? అది వూరుకొని వుంటుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది వెట్ట సంసారము (తాపము కలిగించు ప్రపంచము). నిన్ను గొలువని వట్టి మనుజులను (సామాన్యులైన మనష్యులను), ఇది పెడవాయ బెట్టును (పెడచెవిని బెడుతుంది).

**5-86**

## మున్నుడి

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమాచార్యులవారు అలమేలుమంగ మిక్కిలి నేర్పరి అంటున్నారు. ఆవిడ వేంకటపతి శ్రీనివాసుని 'అక్కరలన్నీ' తీరుస్తుందట. కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ..." అన్నారు కదా! పెద్దలు. జగన్నాథుడైన భర్తను తన కనుసన్నలలో వుంచుకోవటం అంత తేలికయైన పనేమీ కాదు. ఆవిడ ఆయనను 'యిక్కువలంటి యంటి' మెచ్చుకొంటుందట..ఆయన క్షేమ సమాచారాలు మళ్ళీ మళ్ళీ అడిగి చాలా మెచ్చుకొంటూ మాట్లాడుతుందట. చెచ్చెర (అతి శీఘ్రంగా) సందిట దెందము కరిగిస్తుందట. తల్లి నేర్పని విద్య వుందా?

**ఉ॥ మిక్కిలి నేర్పరైన సతిమించిన ఈ అలమేలుమంగయున్**
**అక్కర దీర్చి వల్లభుని కచ్చముగా నురమెక్కె పేర్మితో**
**చక్కని కీర్తనంబు గొని జాను తెనుంగున జెప్పె అన్నయున్**
**నిక్కము వేంకటేశుడును నీరజవాసిని మెచ్చు దీనినిన్**

**రాగం : మధ్యమావతి**

మిక్కిలి నేర్పరి యలమేలు మంగ
అక్కర దీరిచి పతినలమేలుమంగ ॥మిక్కిలి॥

కన్నులనె నవ్వు నవ్వి కాంతుని తప్పక చూచి
మిన్నక మాటాడీ నలమేలుమంగ
సన్నలనే యాసరేచి జంకెన బొమ్మలు వంచి
అన్నువతో కొసరీని యలమేలుమంగ ॥మిక్కిలి॥

సారెకు చెక్కులు నొక్కి సరుసనె కూచుండి
మేరలు మీరీ నలమేలు మంగ
గారవించి విభునికి కప్పుర విడెమిచ్చి
యారతులెత్తీ నదె యలమేలుమంగ ॥మిక్కిలి॥





ఇచ్చకాలు సేసిసేసి యిక్కువలంటి యంటి
మెచ్చీ నతని నలమేలుమంగ
చెచ్చెర కౌగిట కూడి శ్రీవేంకటేశ్వరుని
అచ్చముగా నురమెక్కీ నలమేలు మంగ ॥మిక్కిలి॥

**భావామృతం :**

జగజ్జననియైన ఈ అలమేలుమంగ ఎంతో గొప్ప నేర్పరి (జాణ). ఈమె పతి 'అక్కరలన్నీ దీరిచినది' (తన భర్త అవసరములనన్నింటినీ తీర్చు స్వభావము కల జవరాలు).

ఆమె తన కన్నులతోనే నవ్వుతూ తన నాథుని తప్పక (అతిక్రమించక... వినయంగా) చూస్తుందట. మిన్నక (ఊరకనే.. బెట్టుసరి లేకుండా) మాట్లాడుతుందట. సైగలతోనే ఆశలు పురికొల్పుతుందట. జంకెన (బెదిరిస్తున్నట్లు) కనుబొమ్మలు ముడివేస్తుందట. స్వామిని అన్నువతో (ఆపేక్షతో) కసురుకొంటుందట. అంతటి గొప్ప నేర్పరి ఆ తల్లి.

మాటి మాటికీ సంభ్రమంతో తన చెక్కిళ్ళు నొక్కుకొంటుందట. అబ్బ! నా స్వామి ఎంత త్వరగా నన్ను చేరాడు అని పొంగిపోయి, మేరలు మీరి (తన బిడియం వదలివేసి), ఆయన ప్రక్కనే కూర్చుంటుందట, ఆ అలమేలుమంగ. స్వామి రాంగానే గౌరవంగా కర్పూర తాంబూలముతో తన భర్తను ఆహ్వానించి, హారతినిస్తుందట. (సంప్రదాయ బద్ధంగా గౌరవనీయులను అలా ఆహ్వానించాలి). అంతటి గొప్ప నేర్పరి, ఆ తల్లి.

ఇచ్చకాలు సేసిసేసి, (ప్రియవచనములను మరల మరల మాట్లాడి, క్షేమ సమాచారములడుగుతూ మరీ మరీ మెచ్చుకుంటుందట, ఆ అలమేలు మంగ. తరువాత ఆ శ్రీవేంకటేశ్వరుని చెచ్చెర కౌగిట (అతి శీఘ్రముగా కౌగలించి) ఆయన నలరించునట. దాని ఫలితంగానే అచ్చముగా (కేవలం తనకే అన్నట్లుగా) ఆయన "వురమెక్కీను" (వక్ష స్థలము నాక్రమించిందట). అంతటి గొప్పనేర్పరి ఈ అలమేలుమంగ తల్లి.

## మున్నుడి 5-87

'వివేకి' అంటే ఆధునికులు తలచునట్లు 'అనలైజ్' చేయగలిగినవాడే... కానీ ఇక్కడి అర్థం దేహమునకు ఆత్మకుగల తారతమ్యాన్ని 'అనలైజ్' చేయగల యోగి. వివేకులు ఎప్పుడూ 'తలపోసుకొంటూ' (ఆలోచనల్లో నిమగ్నమై) యుంటారు. వారు పరమయోగులు. పరమ వైష్ణవులు. వారి పద్ధతే అంత.. అంటున్నారు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు. వారి పద్ధతేమిటో చక్కగా వివరిస్తున్నారు. వారు శ్రీవేంకటేశ్వరునిపై తమ భారం వేసి వైష్ణవుల దయను పొంది అలరుచుంటారు, (సుఖంగా వుంటారు). ఈ కీర్తనలో విజ్ఞానము అంటే భగవంతుని తత్త్వము తెలుసుకొనే మార్గము అని అర్థం.

**తే॥ పరమ యోగీశ్వరులు మెచ్చు పద్ధతి యిది**
**ధర వివేకులు చింతించు తలపు నిదియె**
**తిరుమలేశునిపైననే భారముంచి**
**అలర, వైష్ణవ కృపయనె అన్నమయ్య**

**రాగం : ఖరహరప్రియ**

పరమయోగీశ్వరుల పద్ధతి ఇది
ధరణిలో వివేకులు తలపోసుకొనుట ॥పరమ॥

మొదల నాత్మజ్ఞానము తెలిసి పిమ్మట
హృదయములోని హరినెరుగుట
వుదుటైన ఇంద్రియాల నొడిసి వంచుకొనుట
గుడిగొన్న తనలో కోరికె లుడుగుట ॥పరమ॥

తన పుణ్య ఫలములు దైవము కొసగుట
పనివడి అతనిపై భక్తి సేసుట
తనివితో నిరంతర ధ్యానయోగపరుడౌట
మనసుతో ప్రకృతి సమ్మంధము మరచుట ॥పరమ॥





నడుమ నడుమ విజ్ఞానపు కథలు వినుట
చిడుముడినాచార్య సేవసేయుట
ఎడయక శ్రీవేంకటేశుపై భారము వేసి
కడువైష్ణవుల కృప కలిగి సుఖించుట ॥పరమ॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఈ లోకంలో పరమ యోగులు ప్రత్యేక పద్ధతి కలిగివుంటారు. వారు వివేకులు. బాగుగా విచారించి (ఆలోచించి), భగవత్‌తత్త్వము అర్థం చేసికొని, పరమ వైష్ణవుల దయను పొంది, నిశ్చింతగా వుంటారు.

మొదల (మొట్టమొదట) వారు ఆత్మజ్ఞానం తెలిసికొంటారు. ఆత్మ అయినదేదో, ఆత్మకానిది (అనాత్మ) ఏదో తెలిసికొంటారు. తరువాత శ్రీహరి తమ హృదయంలోనే వుంటాడని గ్రహించి ఆయనను వెదుకుటమాని, ఆయన ధ్యానంలో వుంటారు. ఆ పనికి అడ్డంకి అయిన తమ ఇంద్రియాల పొగరును అదుపులోవుంచి తమలో నిక్షిప్తమై వేదించే కోర్కెలను ఉడిగించుకొంటారు (నిర్మూలించుకొంటారు).

ఆ యోగులు తమ పుణ్యఫలాన్ని "కృష్ణార్పణం" అని భగవంతునికే అర్పిస్తారు. శ్రద్ధగా దేవునిపై భక్తి సేసుట (భక్తిమార్గంలో వుండి నిర్వహించుట) కూడ వారి పద్ధతియే. ఇష్టపూర్వకంగా, తృప్తిగా ఎప్పుడూ పరమాత్మ ధ్యానంలో (ధ్యాన యోగంలో) వుంటారు. వారి శరీరం ఈ ప్రకృతిలో వున్నప్పటికీ, మనస్సు మాత్రం ఈ ప్రకృతితో ఏ సమ్మంధమూ (సంబంధము) లేకుండా తమని తాము మరిచి రమిస్తుంటారు.

అయితే వారు జీవించియున్నారు కావున, మధ్యమధ్య ఈ ప్రపంచంతో సంబంధం పెట్టుకొనివున్నప్పుడు భగవత్తత్త్వం వివరించే కథలు వింటుంటారు. చిడుముడితో (అసలు చిడిముడి అంటే...తొట్రుబాటు అని అర్థం... ఇక్కడ సంభ్రమంతో అని అర్థం చేసికోవాలి). గురువుల సేవచేయుట వారి పద్ధతి. విడువక అంతా శ్రీవేంకటేశ్వరునిదే భారమని తమ కర్తవ్యం చేస్తుంటారు. పరమవైష్ణవుల అనుగ్రహం పొంది వారు నిత్యమూ సుఖముతోనే వుంటారు.

**5-88**

## మున్నుడి

అద్భుతమైన మేలుకొలుపు వినిపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. శ్రీమన్నారాయణుడైన ఆదిశేషతల్పశాయి యోగనిద్రపోతున్నాడు. శేషుడు బుసకొడుతున్నా ఆయన యోగనిద్రపాయుటయే (విడచుటే) లేదు. స్వామీ! త్వరగా మేల్కోనవయ్యా! అంటున్నారు. విరాట్పురుషుడైన ఆయనకు సూర్యచంద్రులే నేత్రములు. ఆయన కళ్ళుమూసుకొంటే లోకాలలో మిగిలేది చీకటియే కదా! అందుకే మెఱుగులు చల్లుచూ మేల్కొనవే... అంటున్నారు. రాగిరేకులపూ అన్నమయ్య ఈ కీర్తన వ్రాసినవారు అ, రల మధ్య ఆంతర్యం పట్టించుకొన్నట్లు.. లేదు.

**చం॥ తెరువక తెల్లనౌ కనుల తెల్లగవారదు సూర్యుడేడిరా?**
**మరియొక కన్ను చంద్రుడట మత్తిలు వెన్నెలరాదు, అందుచే**
**త్వరపడి శేషతల్పమిటు తాన్ బుసకొట్టెను మేలుకోవయా**
**తిరుమలనాయకా! యిపుడు తేల్చుము నిద్దుర అన్నమయ్యనెన్.**

**రాగం : భూపాళం**

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్రపాయును మేల్కొనవే ॥భోగి॥

కన్నులు దెరువక కమలబాంధవుడు
వెన్నెల రేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయమిదే
మిన్నక నీవిటు మేలుకొనవే ॥భోగి॥

తెల్లని కన్నులు దెరువక విరియగ
నొల్లక జలజము లున్న వివే
కల్ల నిదుర నిను గవియగ నియ్యక
మెల్ల నాయె నిట మేలుకొనవే ॥భోగి॥





తెరవగు(గ) రెప్పల దెల్ల వార వలె
తెరవక చీకటి దీర దిదే
తెరగు వేంకటాధిప నీ వెఱుగుదు
మెఱుగులు చల్లుచు మేలుకొనవే ॥భోగి॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీభోగిశయనమును (తల్పమైన ఆదిశేషుడు కూడా) బుసకొట్టెడిని (బుసకొట్టుచున్నాడు). నీవు యోగనిద్ర పోవుచున్నావు. దానిని పాయుము (విడిచి) మేలుకొనవే (నిద్రమేల్కొనవయ్యా!)

ప్రభూ! నీవు కన్నులు తెఱువనిచో నీ నేత్రములైన సూర్యచంద్రులెలా ద్యోతకమవుతారు? ఆ కమల మిత్రుడైన సూర్యుడు, వెన్నల రేణువు (రాజు అయిన) అయిన చంద్రుడు వెలయరు (వెలువడరు). అదిగో అరుణోదయమవుతున్నది (తెల్లవారుబోతున్నది) అన్నువ మలసీ (కొంచెము ప్రయత్నించి) నీ విటు (నీవు ఇప్పుడు) మిన్నక (ఊరకనే) మేల్కొనవయ్యా!

స్వామీ! నీ తెల్లని కన్నులు తెరువక పోతే జలజములు (పద్మములు, కలువలు విరియగ నొల్లవు (వికసించవు) సూర్యుడురాక పద్మములు చంద్రుడు రాక కలువలు వికసించలేవు కదా! నీ కల్ల నిదుర (దొంగనిద్ర) మెల్లనాయె(కంటికొలుకులకు వచ్చి చేరింది). అది నిన్ను కవియగ నిచ్చుటలేదు (నిన్ను వ్యాపించనియ్యదు... అనగా వ్యవహరించనియ్యదు). అందుకనే నిదురమేల్కొనవయ్యా!

దేవా! నీ రెప్పలు తెరువగ సూర్యదయమై తెల్లవారుతుంది అవి తెరువక (తెరిచియుంచక పోతే) చీకటి ఎలా తొలుగుతుంది? తెఱగు వేంకటాధిప (చక్కని వేంకటేశ్వరా!) నీవు సర్వము నెఱుగుదువు. మెఱుగులు చల్లుచు (కాంతులు విరజిమ్ముతూ) మేలుకోవయ్యా!

**5-89**

## మున్నుడి

మధురమైన భజన గీర్వాణిలో వినిపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. ఓ జగన్నాథా! త్వం ఏవ శరణం (నీవే దిక్కు) అంటున్నారు. కమలనాభా! నీకే శరణు. ఓ శ్రీనివాసా! అని ఆర్తితో ఆలపిస్తున్నారు. భక్తితో ఈ భజనపాడితే మన పాపాలు పటాపంచలవుతాయనే మాట పరమసత్యం "జంతుఘటకారక కరణ"- అంటే సృష్టిలోని జంతు సంఘములన్నింటి యొక్క ఉనికికీ మనికికీ కారణభూతుడైన వాడని అర్ధం. కుంజర వరదుడు అంటే గజేంద్రరక్షకుడు అని అర్ధం.

**ఆ.వె॥ నీవె శరణమయ్య! నీరజనాభ! మా**
**శరణమీవె సర్వజగతివంద్య!**
**భజనవోలె తెలిపె మా అన్నమార్యుండు**
**పరమపురుషుని దయ బడసె నతడు.**

**రాగం : ఆనందభైరవి**

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథ ॥త్వమేవ॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూ సురవల్లభ పురుషోత్తమ పీత-
కేశేయవసన జగన్నాథా ॥త్వమేవ॥

బలభద్రానుజ పరమపురుషదుగ్ధ-
జలధివిహార కుంజరవరద
సులభ సుభదాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా ॥త్వమేవ॥





వటపత్రశయన భువనపాలన జంతు-
ఘటకారక కరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం-
కటగిరినిలయ జగన్నాథా ॥త్వమేవ॥

**భావామృతం :**

ఓ కమలనాభా! శ్రీ జగన్నాథా! నిన్నే నేను శరణుజొచ్చి యున్నాను. నిన్నే శరణుజొచ్చాను ప్రభూ!

ఓ వాసుదేవా! శ్రీకృష్ణా! వామనమూర్తీ! ఓ నారసింహా! శ్రీవనితావల్లభా! పద్మనయనా! ధరణీనాథా! దేవనాథా! ఓ పురుషోత్తమా! పీతాంబరధారీ! జగన్నాథా! నిన్నే శరణుజొచ్చితిని.

ఓ బలరాముని తమ్ముడా! పరమపురుషా! క్షీరసాగరనివాసా! ఓ గజేంద్ర సంరక్షకా! సులభముగా అనుగ్రహించువాడా! శుభకరా! సుముఖా! దేవవల్లభా! నీవు కలిపురుషునిచే ప్రాప్తించు దోషములను నివారించువాడవు. ఓ జగన్నాథా నేను నిన్నే శరణుజొచ్చి యున్నాను.

ఓ వటపత్రశాయీ! (మఱ్ఱి ఆకుపై నిద్రించు దేవా!) జగదీశ్వరా! ఓ జంతుఘట కారక కరణా! (సృష్టిలోని జంతు సంఘములన్నింటియొక్క ఉనికికీ, మనికికీ కారణభూతుడైన వాడా!) శృంగార నాయకా! నిత్యమూ దిట్టమైన వైభవములతో శోభిల్లు ప్రభూ! పవిత్ర వేంకటగిరి నివాసా! ఓ జగన్నాథా! నేను నిన్నే శరణు జొచ్చియున్నాను, తండ్రీ!

## మున్నుడి 5-90

ఇదివరలో చాలా కీర్తనలలో అన్నిటికీ ఆదిమూలము శ్రీహరే అని చెప్పారు అన్నమాచార్యులవారు. "ఇందుగలడందులేడని సందేహము వలద"న్నారు పోతన. చరాచర సృష్టిలో అన్నీ పరమాత్మే అన్నది వేదము. ఆ సత్యాన్నే నొక్కి వక్కాణిస్తున్నారు ఇంకొకసారి అన్నమయ్య, అలవోకగా (సునాయాసంగా) తెలుపుతున్నారు. అనవరతము (ఎల్లప్పుడూ) నిన్ను కొలిచెదము స్వామీ! అంటున్నారు. గమి చంద్రాక్షా! అంటే సూర్యచంద్రులే నేత్రముగా కలవాడని. అంటే... ఆయన కంటబడకుండ ఏదిజరుగుతుంది? ప్రపంచంలో, సుఖం..సుఖం...సుఖం... అని సంసారసుఖం కోసం వెంపర్లాడే వారే, అంతా. అది కూడా శ్రీహరే...అంటున్నారు.

**కం॥ తలతుము నీవే దిక్కని**
**కలకాలము కావుమయ్య గమి చంద్రాక్ష!**
**కొలుతుము అనవరతము నిన్**
**అలవోకగ అన్నమయ్య హరి గీర్తించెన్.**

**రాగం: ధేనుక**

నీవే మాకు దిక్కు నిన్నేతలతుము
కావుము నేరమెంచక కరుణానిధీ ॥నీవే॥

నెట్టన సూర్యలోని నెలకొన్న తేజమా
గట్టిగా చంద్రునిలోని కాంతిపుంజమా
పుట్టిరక్షించే యజ్ఞపురుషుని ప్రకాశమా
వొట్టుక దేవతలలో నుండిన శక్తీ ॥నీవే॥

సిరులు మించినయట్టి జీవులలో ప్రాణమా
గరిమవేదములలో గల యర్థమా
పరమ పదమునందు పాదుకొన్నబ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా ॥నీవే॥





జగములో వెలసేటి సంసార సుఖమా
నిగిడిన మంత్రముల నిజమహిమా
మిగుల శ్రీ వేంకటాద్రి మీద నున్న దైవమా
ముగురు వేల్పులలోని మూలకందమా ॥నీవే॥

**భావామృతం :**

ఓ దేవదేవా! శరణు తండ్రీ! మాకు దిక్కు నీవే. ఎల్లవేళలా నిన్నే తలచుకొంటాం. ఓ కరుణానిధీ! మా నేరములనే, పరగణించి మమ్మల్ని వెలివేయకు ప్రభూ! మేము నీ బిడ్డలం. మమ్మల్ని నీవు కాక ఇంకెవరు రక్షిస్తారు? అన్నీ నీవే అయినప్పుడు ఇంకెవరినడుగ గలం?

మానెట్టనే (ఎదురుగా..అనివార్యంగా) వుండే సూర్యునిలోని అద్భుతకాంతి నీవే. చంద్రునిలోని దివ్యకాంతి పుంజము కూడా నీదే. యజ్ఞనారాయణునివలె ఆవిర్భవించి అందర్నీ రక్షించే ప్రకాశరూపా! దేవతలందరిలోనూ వున్న దివ్యశక్తులన్నీ నీనుంచేవారికి వచ్చాయి. (లేకపోతే వాయుదేవునికి ఈ ప్రభంజనం యెట్లా వస్తుంది?). అట్టి నీకే శరణు.

ప్రభూ! జీవులందరిలోను 'ప్రాణం' అన్ని వైభవాలనూమించినది. ఆ ప్రాణమే నీవు. వేదములన్నింటిలోని గొప్ప అర్థము ఏదైతేవున్నదో అదికూడా నీవే. పరమపదము ద్వారానే జీవికి జననమరణాల చక్రబంధంనుంచి విముక్తి లభిస్తుంది. ఆ పరమ పదం అనుగ్రహించగల పరబ్రహ్మ వేరెవ్వరూ కాదు.. నీవేనయ్యా! చరములు (గమనముగలవి), అచరములు (గమనములేని వృక్షములు మొదలైనవి), వీటన్నిటి ఆధారమైనవాడవు నీవే. అట్టి నీవే మాకు దిక్కు.

ఓ సర్వేశ్వరా! జగములో సంసారమే సుఖం అన్నట్లు భావించి ఆ సుఖం కోసమే తపించి పోతూ, దాని కోసమే కష్టనష్టాలు భరిస్తూ అంతాజీవిస్తారు. ఆ సుఖం ఏదైతే వున్నదో... అదీనీవే. మంత్రమునకు దివ్యమహిమ యెక్కడినుంచి వచ్చింది? నీనుంచే వచ్చింది. శ్రీవేంకటాద్రి పై వెలసిన దైవము ఇంకెవరు? నీవే..ప్రభూ! నీవే. ఆ ముగ్గురు దేవతలకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) మూలకందము (ఆదిమూలము) పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మ స్వరూపుడే తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు.

# 5-91

## మున్నుడి

కలశాపురంలో వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆనాడు కలశాపురం ప్రాంతంలో దట్టంగా చందన వృక్షాలు వుండివుంటాయి అని భావిస్తున్నాను. అలవాటు ప్రకారం అంజనీ తనయుడు శ్రీవేంకటేశ్వరుని బంటు అని కీర్తిస్తున్నారు. "లంకెల సుగ్రీవునికి లలిప్రధానివైతివి" అంటున్నారు. సుగ్రీవునికి లంకెల లలి ప్రధానివైనావు... అని చెప్పుకోవాలి. అంటే సుగ్రీవునికి బద్ధుడై ప్రియమైన ప్రధానమంత్రివైనావు అని అర్థం. అంకెలెల్ల నీకు చెల్లే... అంటే వశీకరణమొనర్చు చమత్కారములు నీకే తగినవి అని.

**చం॥ అలరెను అంజనీసుతుడు ఆ కలశాపురమందు దట్టమై**
**చలువగు చందనంపు తరుఛాయలలో హనుమంతరాయడై**
**కొలిచెడి భక్తసంఘముల కోరిక దీర్చె ప్రతాపశాలియై**
**విలువగు బంటు శ్రీపతికి వీరుడు ఈ కపి అన్నమయ్యనెన్**

**రాగం : హిందోళం**

కలశాపురముకాడ గంధపు మాకుల నీడ
అలరేవు మేలుమేలు హనుమంతరాయ ॥కలశా॥

సంజీవి కొండదెచ్చి సౌమిత్రి బ్రతికించితివి
భంజించితి వసురులను పలువురిని
కంజాతకుని రాఘవుని మెప్పించితివి
అంజనీతనయ ఓ హనుమంతరాయా ॥కలశా॥

లంక సాధించితివి బీరములెల్ల చూపితివి
గొంకక రాముని సీతను గూర్చితివి
లంకెల సుగ్రీవునికి లలి ప్రధానివైతివి
అంకెలెల్ల నీకు చెల్లె హనుమంతరాయ ॥కలశా॥





దిక్కులు గెలిచితివి దివిజపూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో వేంకటేశు బంటవైతివి
అక్కజపు మహిమల హనుమంతరాయ ॥కలశా॥

**భావామృతం :**

కలశాపురం దగ్గిర గంధపు వృక్షముల నీడలలో నీవు అలరుచున్నావు. ఓ హనుమంతరాయా! మేలు..మేలు తండ్రీ! మేలుమేలు.

అంజనీపుత్రుడైన ఓ హనుమంతరాయా! సంజీవిని పర్వతమును తీసికొనివచ్చి సుమిత్రా నందనుడైన లక్ష్మణుని ప్రాణములను కాపాడినవాడవు. పలువురు అసురులను మర్ధించిన వాడవు. కంజాతకుడు (పద్మసంభవుడైన బ్రహ్మదేవుని, రఘుకులనాయకుడైన శ్రీరామచంద్రుని మెప్పించిన వాడవయ్యా హనుమంతరాయా!

ఓ వాయునందనా! నీవు లంకలో అసాధ్యమైన విజయమును సాధించి గెలిచితివి. నీ వీరత్వమును చూపితివి. గొంకక శ్రీరాముని, సీతను కలిపితివి. సుగ్రీవునకు బద్ధుడవై ప్రియమైన ప్రధానమంత్రివైనావు. ఓ హనుమంతరాయా! వశీకరణ మొనర్చుచమత్కారములు నీకే తగునయ్యా!

ఓ రామదూతా! వాయుగమనుడవైన నీవు దిక్కులన్నీయు గెలిచితివి (మైరావణుని వధించుటకు మారుతి పాతాళమునకు పోయి గెలిచినాడు కదా!) దేవతలు కూడా నిన్ను కీర్తించిరి. ఎనలేని ప్రతాపముతో ప్రకాశించితివి. ఓ హనుమంతరాయా! నీవు ఇక్కవతో (మక్కువతో) శ్రీరాముని బంటువై ఆశ్చర్యము గొలుపు మహిమలను చూపించితివి. (నీ భక్తులకు రక్షయై నిలచితివి.

**5-92**

## మున్నుడి

చక్కటి జ్ఞానబోధ చేస్తున్న అన్నమాచార్యులవారిని ఆకర్ణించండి. శ్రీవైష్ణవులకు సర్వస్వం ఆ శ్రీహరియే కదా! అందుకే వారు ఎదురన్నదే లేక ఎట్లావారికి తోస్తే.. అట్లా వుంటారు. వారి గురువును, శ్రీవేంకటేశుని తప్ప వేరెవ్వరినీ లెక్కజేయరు. మదగజమునకు 'మట్టుమేర' (మితి) అనేది వుంటుందా? అంటున్నారు. ఉపమానాలు (ఉదాహరణలు) చెప్పటంలో అన్నమయ్యకు ఎవ్వరూ సాటికారు. ఈ కీర్తన ఈ సత్యాన్ని మరొక్కమారు నిరూపిస్తుంది. శ్రీవైష్ణవులనే పాపమూ ఏమీ చేయలేదంటున్నారు.

**ఆ.వె॥ ఎదురులేక నడతురెట్టైన వైష్ణవుల్**
**మదగజముల కేది మట్టుమేర?**
**వేంకటేశు శరణు వేడిన విరసంబు-**
**లసలు వుండవనెను అన్నమయ్య**

**రాగం : దేసాళం**

ఎదురులేక చరింతు - రెట్టైన శ్రీవైష్ణవులు
మదించి నేనుగులకు - మట్టుమేర వున్నదా ॥ఎదురు॥

భాగీరథిలోన-బాపమున్నదా పుణ్య
భోగపు వేదములలో - బొంకు లున్నవా
సాగరపు టమృతపు - చవిలో చేదున్నదా
ఆగతిహరిదాసుల - కపరాధ మున్నదా ॥ఎదురు॥

ఆకసములోన నెరు- సందున్నదా భూమి
జేకొని రవి యెదుట - జీకటున్నదా
యీకడ గామధేనువు - కియ్యరాని వున్నవా
కైకొన్న ప్రసన్నులను - గరిహించ నున్నదా ॥ఎదురు॥





హరినామ మంత్రములో - నౌగాములున్నవా
గురుకృప కలిగియు- గొరతున్నదా
సరవి శ్రీవేంకటేశు-శరణన్న వారికి
విరసంబు లందులో-వెదకగా గలదా ॥ఎదురు॥

**భావామృతం :**

శ్రీ వైష్ణవులు సర్వస్వతంత్రులు. వారు శ్రీహరిని, తమకు శ్రీహరినందించిన గురువులను తప్ప వేరెవ్వరినీ లెక్కసేయరు. ఎదురు బెదురులేక ఎట్లైనను నడుచుకుంటారు. మదగజములకు ఏ విధమైన 'మట్టుమేర' (మితి) వుండదుకదా! (మదపుటేనుగు మావటివానికొక్కనికే లొంగి వుంటుంది, అట్లే వైష్ణవులు తమ గురువుగారికి మాత్రమే లొంగి వుంటారు. ఎందుకంటే వారికి పాపమన్నదే... వుండదు).

గంగానదికి పాపమనేది వుంటుందా? పుణ్యము అనే వైభవాన్ని అందించే వేదములలో అబద్ధం అనేది వుంటుందా? క్షీరసాగరమునుంచి పుట్టిన అమృతములో చేదువుంటుందా? అదే విధంగా హరిదాసులైన వారికి అపరాధము (పాపము) అనేది వుండనే వుండదు.

ఆకాశములో నెరుసు, అందున్నదా? (అంటే-ఆకాశములో కళంకమున్నదా... అంటే ఉన్నతోన్నతమైన ఆకాశంలో దోషముంటుందా?) సూర్యుడు వుండే చోట చీకటికి చోటుంటుందా? అట్లే కామధేనువుకు ఇయ్యలేని దేదైనా వుంటుందా? కైకొన్న ప్రపన్నులకు (పూనుకొని శరణాగతిని పొందిన భక్తులకు) గర్వము అనేది వుంటుందా? ఉండనే.. వుండదు.

శ్రీహరి నామం పారాయణ చేసేవారికి ఔగాములు (ద్వంద్వములు.. మంచి, చెడు వంటివి) ఉన్నవా? గురువు యొక్క కృపపొందిన వారికి లోటు అనేది వుంటుందా? సరవి (క్రమముగా) శ్రీవేంకటేశ్వరుని శరణుపొందిన వారికి, ఆ శరణాగతిలో ఎంత వెదకినా 'విరసము' (రసములేనిది... అనగా సారములేనిది) ఏదన్నా వున్నదా? లేనే లేదు.

## 5-93

## మున్నుడి

శేషాచార్యులవారి వ్రాతప్రతి ద్వారా వెలుగులోకి వచ్చిన అన్నమాచార్య కీర్తన ఇది. మన దురదృష్టవశాన ఇందులో ఒక చరణము *లుప్తమైనది. దానిని పూరించే శక్తికూడ మనవంటి సామాన్యులకు లేదంటే అతిశయోక్తి కాదు. 'నిలువు చక్కని మేనుదండలు'... నిలువుగా నున్న చక్కని పుష్టిగల శరీరం - అని భావించాను. అంటుజూపులు అంటే, స్నేహపూరితమైన చూపులు. నిలువెత్తునా స్వామిని వర్ణిస్తున్న కీర్తన ఇది. లుప్తమైన చరణాన్ని పూరించే 'అర్హత' నాకు లేకపోయినా, నా ఆత్మతృప్తికి చేశాను... యెందుకంటే ఈ కీర్తనలో అమ్మవారి ప్రసక్తి లోపించిందనిపించింది.. నాకు దాసుని తప్పులు దండముతో సరి...కదా!.

**చం॥ నిలువుగ చక్కనైన హరి నీరజనాభుని మేను దండలున్**
**మొలకల అంటు జూపులును, మోమున నవ్వులు బూచు దేవునిన్**
**అలరిన శంఖచక్రములు హస్తములన్, వర రక్షణంబులన్**
**దొరవలె యిచ్చు స్వామి, మది దోపగ కంటిని అన్నమయ్యనెన్.**

**రాగం : రామక్రియ**

కంటి గంటి నిలువు చక్కని మేను దండలును
నంటు జూపులను జూచే నవ్వుమోము దేవుని ॥కంటి॥

కనకపు బాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరముపై కట్టు కటారి
మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు
ఒనర నాభికమల ముదరబంధనము ॥కంటి॥

గరిమ వరహస్త కటిహస్తములును
సరస నెత్తిన శంఖ చక్రహస్తములు
ఉరముపై కౌస్తుభ మొప్పుగు హారములు
[తరుణులెక్కిన యెద దనరు మాలలును]* ॥కంటి॥





కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు
కట్టాణి ముత్యాల సింగార నామము
నెట్టన శ్రీవేంకటేశ నీకు గర్ణపత్రములు
నట్టె సిరసు మీద నమరెకిరీటము ॥కంటి॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! నేను నిలువుగా నున్న చక్కని పుష్టిగల శరీరంతో శోభిల్లుచున్న స్వామిని కంటిని (చూచితిని). అంటుజూపులను (స్నేహపూరితమైన దృష్టిని) ప్రసరించుచున్న ప్రభువును కంటిని. ఆ దేవుడు నవ్వుల మోము జూపి మనలను ధన్యులను చేయుచున్నాడు.

ఈ స్వామి కనకపు (బంగారు) పాదములకు గజ్జెలు, అందియలు (కాలికి మువ్వల వంటివి) ధరించియున్నాడు. ఘనమైన పసుపు పచ్చని పట్టువస్త్రమును ధరించి దానిపై నడుమునకు కట్టుకొను కటారి (ఖడ్గము) ధరించియున్నాడు. ఈయనకు "ఒడ్డాణము" (నడుమునకు ధరించు పటకా... నేటికాలంలో బెల్టు) 'ఒనసినది' బిగించబడియున్నది. మొగపుల మొలనూలు (పైకి కనిపించు మొలత్రాడు) అదిగో. ఆయన నాభిలోనుండి పుట్టిన కమలము కూడ ఒనరియున్నది (ఒప్పుచున్నది). ఉదరబంధనము (పొట్టకు బిగించిన వస్త్రము) అందముగా కనిపించుచున్నది. ఏమి ఈ దివ్యమంగళ విగ్రహము!!

గరిమ మధ్యభాగంలో ఒకవైపు స్వామి వరద హస్తము ఒకవైపు నడుముపై అభయ హస్తము కనుపించుచున్నవి. సరసన్, ఎత్తిన శంఖచక్రములున్న హస్తములు కనుపించుచున్నవి. (ఎదురు రొమ్ముపై) హారములు, కౌస్తుభమణి మెఱయుచున్నవి. [తరుణులు అధిరోహించిన గుండెలమీద శోభిల్లు చున్న మాలలు (పుష్పమాలలు, తులసి మాలలు) నయనానందకరముగా నున్నవి] చూచినవారిదే భాగ్యము కదా!!

ఈ శ్రీవేంకటేశ్వరునికి కంఠమున 'కంటసరులు' (కంఠసరులు) కట్టిఉన్నవి. భుజములకు గొప్ప భుజకీర్తులు బిగించియున్నవి. కట్టాణి ముత్యాలు (ముత్యాలహారములు), సింగారించబడిన చక్కటి నామము (నుదుటి బొట్టు) యెంతో అందంగా మెరుస్తున్నాయి. ఓ ప్రభూ! నీకు కర్ణపత్రములు (చెవి దుద్దులు) నెట్టన (తప్పకుండా) ధరింపబడియున్నవి. అట్టె (అదేవిధముగా) నీ సిరసు (శిరస్సు) మీద కిరీటము అమరియున్నది. నిన్ను జూచి మా జన్మ తరించింది తండ్రీ!

**5-94**

## మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ చిన్నది ఎన్ని విద్యలు నేర్చుకొన్నది!! అని ఆశ్చర్యపోతున్నారు. ఓ ప్రభూ! నీవామెకు దగ్గరవగానే నిన్ను ఆకర్షించి, ఇట్టే (తేలికగా) తనవశం చేసికొనినది... అంటున్నారు. అద్దానికోసమామె చేసిన సమ్మోహన విద్య యేమిటో వివరిస్తున్నారు. కొన్ని మాటలు నిఘంటువుకి కూడ చిక్కక ఆచార్యులవారి భావన వూహించుట జరిగింది. కొన్ని సమయాల్లో మా 'పాండిత్యం ఇంతే ప్రభూ!' అనక తప్పదు. దాసుని తప్పులు దండముతో సరి అని పెద్దలేనాడో చెప్పారు కదా! గోప్యంగా వివరణకు క్షంతవ్యడను.

**కం॥ ఎంతగ నేరుచుకొన్నది**
**చెంతను యున్నట్టి నిన్ను చేకొననయ్యా!**
**పంతమున నీదు చిన్నది**
**ఇంతుల నెఱజాణ జెప్పెనిటు అన్నయయున్.**

**రాగం : శంకరాభరణం**

ఎంత నేరుచుకొన్నది ఈ చిన్నది
చెంతనుండే నిన్ను ఇట్టే చేకొన్నది ॥ఎంత॥

చిగురు పెదవి మీది చిన్నలు
సగము మాటల తోడి సన్నలు
నగియేటి సెలవుల నయములు
బిగిసేటి కౌగిట ప్రియములు ॥ఎంత॥

తనివోక చెలులతో తలపోతలు
ననుపులే పొద్దు మానని చేతలు
పనివడి నీ మీది పాటలు
మొనపి ఎప్పుడు నీతో మొగమాటలు ॥ఎంత॥





వద్ద నుండి పై జల్లీ వలపులు
అద్దుకొని రతిలోని అలపులు
నొద్దికై శ్రీవేంకటేశ్వర ఒనగూడితి వీకెను
కొద్దిమీరె బింకములు కూడిన పొంకములు ॥ఎంత॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ఈ చిన్నది (అలమేల్మంగమ్మ) ఇంతలో యెంత (యెన్ని విద్యలు) నేర్చుకొనినదయ్యా!! తనవద్దకు నీవు చేరగానే నిన్ను ఇట్టే (తేలికగా) చేకొనినది (తన వశము చేసికొనినది).

ఆమె లే చిగురు పెదవులపై గురుతులు, మర్మగర్భమైన మాటలతో మధ్య మధ్య సైగలు, నవ్వుతూనే నీపై పెత్తనం చూపిస్తూ చేసే ఆజ్ఞలు, బిగి కౌగిటి ప్రియములు వివరించుట కతీతముగ నున్నవి ప్రభూ!

తనివోక (తృప్తిదీరక) తన చెలులతో కూడా ఆమె నీగురించే తలపోతలు (ఆలోచనలు) చేయుచున్నది. నీపైననే ననుపులు (అనురాగము) యే సమయముననైనా మానని (వీడని) చేతలు (పనులను) చేస్తుంది. నీ మీద పనివేళా ఏవేవో చక్కటి పాటలు పాడుతుంది. నీ చెంతకూడా ఆమెకు మొగమాట మెక్కువ ఎప్పుడూ బెట్టసరి చూపునట్లే వుంటుంది. అందుకే.. ఆమె మనోజ్ఞమూర్తి స్వామీ!

ఓ దేవదేవా! ఆమె నీ దాపున నున్నప్పుడు నీపై వలపుల జల్లు కురిపిస్తుంది. అద్దుకొన్న సమాగమములలో ఆమె అలసిపోతుంది. ఈకెను (ఈమెను) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఒద్దికై (అనుకూలుడవై) ఒనగూడితివి. ఆమె బింకములన్నీ కొద్దిమీరి (అతిశయించి) నిను గూడినది. ఆ అందముల వర్ణింప నా తరమా ప్రభూ!

**5-95**

## మున్నుడి

తండ్రి అన్నమాచార్యులవారికి సమవుజ్జీ అయిన కొడుకు ఈ పెద తిరుమలాచార్యులు. ఈయన కూడ తండ్రివలెనే లెక్కకు మిక్కుటమైన సంకీర్తనలను శ్రీవేంకటేశ్వర మకుటంతో రచించి తరించాడు. ఈ కీర్తనలో పెద తిరుమల శ్రీవేంకటేశ్వరుని "ప్రభూ! ఇది (నీ మహిమ) అనంతము.... ఇది (నీమూర్తి) అద్భుతము... ఇది (నీ కథలు) ఆశ్చర్యకరము. ఓ సనాతనుడ! (ఆదికి ననాదియైన వాడా) నన్ను సరవి (క్రమముగా) రక్షించుమవయ్యా!" అంటున్నారు. ఈయనా వైష్ణవుడై ఆ మతప్రచారం చేసి తరించాడు. స్వామి యెవరెవరికి ఏమిటో వివరిస్తున్నారు.

**ఉ॥ ఈయది అద్భుతంబగును యెంతటి అచ్చెరవౌ అనంతమౌ**
**రాయడ! ఓ సనాతనుడ! రమ్మిక గానవు నన్ను, పిమ్మటన్**
**తోయజనాభు గొల్చితమితో పెద తిర్మల చెప్పె గీర్తనన్**
**నాయన మించిపోయె భళి! నా పలుకుల్ నిజమౌను నమ్ముడీ.**

**రాగం : అఠాణా**

అనంతమద్భుత మాశ్చర్యం బిది
సనాతనుడ నను సరవి గావవే ॥అనంత॥

బలిమి నసురులకు భయంకరుడవు
అలరి యమరులకు నానందకరుడవు
తలకొని ఋషులకు తపఃఫలదుడవు
పలు నీ మహిమలు పలుకగ వశమా ॥అనంత॥

అరయ వేదముల కాధారంబవు
పరగగ జీవుల ప్రాణనాథుడవు
పరమయోగులకు పరబ్రహ్మమవు
తిరముగ నీమూర్తి దెలియగ వశమా ॥అనంత॥





జగముల కెల్లను సర్వబంధుడవు
తగిలిన శ్రీకాంతకు నివాసమవు
జిగి శ్రీవైష్ణవులకు శ్రీవేంకటపతివి
తగు నీ కతలిని తలచగ వశమా ॥అనంత॥

## భావామృతం

సనాతనుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అనంతమైన (మహిమలు) కలవాడవు. నీవు అద్భుతమైన (మూర్తివి). నీ ఆశ్చర్యకరమైన కథలు తలచిన వారి జన్మ ధన్యము. ఒక్కమాటలో చెప్పాలంటే... ఇది అనంతమద్భుతమాశ్చర్యంబు... అందుచేత నన్ను రక్షించవయ్యా!

దేవా! నీవు ఎంతో బలవంతులైన అసురులకు కూడా భయంకరమైన వాడవు. వారిని వెదకి మరీ... సంహరించావు. అమరులైన (మరణంలేని) దేవతల కందరికీ ఆనందము నొసగువాడవు. తలకొని (పూనుకొని) మునులకు వారి తపస్సులకు తగిన ఫలితముల నొసగు పరమాత్మువు. అటువంటి నీ మహిమ యెట్టిదో పలుకుట నా వశమా! నీవు అనంతమైన మహిమలు కలవాడవు.

ప్రభూ! నీవు చూడబోతే, వేదములన్నింటికీ ఆధారభూతుడవు... (వేద రక్షకుడవు, వేద నుతుడవు, వేదవేద్యుడవు). జీవులందరికీ (చీమ అయినా తిమింగిలమైనా, తీతువు పిట్ట అయినా గండ భేరుండమైనా, అమ్మకడుపులో పెరుగుతున్న బిడ్డ అయినా పర్వతాకారుడైన రాక్షసుడైన ప్రాణనాథుడవు (ప్రాణం రూపంలో వున్న అంతర్యామివి) నీవే. పరమయోగులందరూ పరబ్రహ్మగా భావించి ఆరాధించేది నిన్నే. అట్టి నీ మూర్తి (స్వరూపం) ఇది... అని తిరముగ (స్థిరంగా) తెలుసుకోవటం, మా వల్ల అవుతుందా?

ఓ దేవదేవా! జగములకెల్ల (పదునాల్గు భువనాలకు) నీవు సర్వబంధుడవు. తగిలిన (నిన్ను వలచి వలపించుకొన్న) శ్రీకాంతకు (లక్ష్మీదేవికి) నివాసమవు (హృదయంలోనే నివాసమై వున్నవాడవు). శ్రీవైష్ణవులందరికీ నీవు శ్రీవేంకటేశ్వరుడవు. ఓ శ్రీమన్నారాయణా! నీ భాగవత కథలు ఆశ్చర్యకరమై విన్నవారిని పావనులను చేస్తాయి. ఆ కథల నన్నింటిని తలచి నీ ఘనత నెరుగుట నావల్ల అయ్యే పనేనా? అది నేను సాధించగలనా ప్రభూ!

## మున్నుడి 5-96

తిరుపతిలో నెలకొన్న శ్రీగోవిందరాజస్వామిపై చక్కటి సంకీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. గొల్లభామల గూడి నిరతితో సరసములాడి, అలసిపోయి (నిరతితో అంటే ఆసక్తితో) పవళించాడట. తనతోటి గోపాలకులతో కచ్చకాయలాడి (నేటికాలంలో గచ్చకాయలు... అంటున్నాం), గుదిగొని (బాగా) పడుకొన్నాడట. ఓ అమ్మాయిలారా! ఈ గోవిందుడు, యెమ్మెలకే (విలాసంగా) పవళించాడు... మీరు ఆయన పాదములు ఒత్తితే, అలసట తీరుతుంది... అంటున్నారు. పదియారువేలమంది రాచకన్నెలను ఒకేసారి చేపట్టి వాళ్లని లెక్కించుకొంటూ వారి గాఢపరిష్వంగంలో పవళించాడు... ఈ గోవిందుడే... కొండలపై శ్రీవేంకటేశ్వరుడట. ఇంకేం చెప్పను? పైగా నేడు శ్రీకృష్ణాష్టమి.

**మ॥ కనరో కొమ్మలు! నిద్దురించె నిదివో గారాల గోవిందుడున్**
**కొనిమీరిప్పుడు వొత్తుడీ నయముగా గోవిందు పాదంబులన్**
**అనె తా నన్న సత్కవీంద్రు దదివో ఆ కృష్ణమూర్తిన్ సదా**
**మన వేంకన్నను భావనంబు తెలిపెన్ మారాడగా శక్యమా!!**

**రాగం : హంసధ్వని**

కొమ్మలు పాదాలొత్తగా గోవిందుడు
యెమ్మెలకే పవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

సరిగా గొల్లెతలతో సరసాలాడి యలసి
నిరతితో బవళించె నేడు గోవిందుడు
అరసి బృందావనాన ఆవుల గాచి వచ్చి
ఇరవుగ బవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

కదిసి గోపాలులతో కచ్చకాయలాడి వచ్చి
గుదిగొన బవళించె గోవిందుడు
మొదల గోవర్ధనాద్రి మోపు మోచి వచ్చి నేడు
యెదుటనే పవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥





నించి శ్రీ వేంకటాద్రిని నిలిచిందు బవళించె
కొంచక తిరుపతిలో గోవిందుడు
అంచెల బదారువేల నలమి వారి వరుస
లెంచుకుంటా బవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

**భావామృతం:**

ఓ కొమ్మలూ (అమ్మాయిలూ)! ఈ గోవిందుని పాదము లొత్తండి, ఇదిగో ఈయన యెమ్మెలకే (విలాసంగా) పవ్వళించియున్నాడు. ఈయనను ప్రశాంతంగా నిదురపోనివ్వండి.

ఈయన జవ్వనులైన గొల్లభామలతో సరిగా (సమవుజ్జీగా), నిరతితో (ఆసక్తితో) సరసములాడి అలసిపోయి, పవళించినాడు. ఈయన బృందావనంలో అరసి (వెదకుచూ) ఆవులను కాచినందువల్ల, ఇరవుగ (నెలకొని) పవ్వళించి యున్నాడట. ఇదిగో ఈ గోవిందుని సేద తీరనివ్వండమ్మా!

ఈ గోవిందుడు తనతోటి గోపబాలకులతో కదిసి (సమానముగా) కచ్చకాయలు (చిన్న చిన్న రాళ్లతో ఆడే గచ్చకాయలు.. అనే ఆట) ఆడి అలసిపోయి గుదికొని (బాగుగా) పడుకొని నిద్రపోతున్నాడు. మొదల (ఇదివరకు) గోవర్ధన పర్వతం ఎత్తి దానిని మోసి మనల్నందర్నీ ఇంద్రుని రాళ్లవర్షంనుండి కాపాడి... నేడు అలసి మనయెదుటనే పవ్వళించి యున్నాడు. ఇదిగో ఈ గోవిందుని సేద తీరనివ్వండి.

కొంచక (ఏమాత్రమూ సంకోచించక) ఇక్కడ ఈ తిరుపతిలోని గోవిందుడే (గోవిందరాజ స్వామే) శ్రీ వేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుడై నిలిచి (ఎప్పుడూ కంటికి రెప్పలా భక్తులందరినీ, కాచీ, కాచీ... అలసిసొలసి) పవ్వళించి యున్నాడు, పాపం... మరి అలసినాడంటే అలసిపోడా? ఒక్కటికాదు, పదియారు వేలమంది రాచకన్నెలు, వలచి ఈయనను పరిణయమాడినారు. వారినందరినీ సమానంగా సంతోషపెట్టాలంటే మాటలా. ఎవరన్నా తప్పిపోయారేమో చూసుకోవద్దూ... అందుకే " అంచెలవారి వరుసలెంచుకొంటూ" (వరుసగా వారిని లెక్కించుకొంటూ) అలసి పవ్వళించి యున్నాడు. ఇదిగో ఈ గోవిందుని సేదతీరనివ్వండి.

## మున్నుడి 5-97

ఇదివరలో చాలాసార్లు చెప్పటం జరిగింది, అన్నమాచార్యులవారి కవిత యెంత ఛందోబద్ధమైనదంటే... అతితేలికగా ఈ కీర్తన నొక సీసపద్యంలా మార్చవచ్చును. గమనించండి మరి... ఓ మనసా!... భావములోన (అంతఃకరణలోను), బాహ్యమునందున (నోటితో వెలుపలికి కూడా) గోవిందా! గోవిందా! అని చెప్పుకో, తరిస్తావు... అంటున్నారు చక్కని భజన రూపంలో.

**సీ॥ భావంబు లోనైన బాహ్యంబులోనైన**
**గోవింద గోవింద కొలువుడనుచు**
**హరియవతారము లఖిలమంత్రములును**
**హరిలోని వేను బ్రహ్మాండములును**
**విష్ణుని మహిమలే విహిత కర్మంబులు**
**విష్ణునె పొగడెను వేదములును**
**అచ్యుతడీతడే ఆదియునంత్యంబు**
**అచ్యుతుడే అసురాంతకుండు**

**ఆ.వె॥ వేంకటేశ్వరుండె వెలసిన అచ్యుతు**
**డతడె హరిహరియనె అన్నమయ్య**
**ఏమి భజన జెప్పె ఈ జన్మకిది చాలు**
**భావమిటుల జెప్పు భాగ్యమబ్బె.**

**రాగం : శుద్ధ ధన్యాసి**

భావములోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా ॥భావము॥

హరియవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి యనవో మనసా ॥భావము॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥భావము॥





అచ్యుతుడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥భావము॥

**భావామృతం**

ఓ మనసా! భజన చేసేవారంతా బాహ్యంలో గోవిందా అని అంటూనే వుంటారు. అదొక్కటే చాలదు. భావములో కూడా, అంటే, మన అంతఃకరణములో కూడా గోవిందా అని తలుచుకొంటూ, నోటితో గోవిందా అనాలి. (అప్పుడే అది ఆ స్వామికి వినిపిస్తుంది. లేకపోతే నోరు నొప్పి పుడుతుంది... అంతే).

మనం ఎంతోమంది దేవతలకు మ్రొక్కుతుంటాం. వారంతా వేరెవరోకాదు... శ్రీహరి అవతారములే. ఈ పదునాల్గు భువనాలూ వేరుగా యెక్కడో లేవు. ఇవన్నీ ఆయన వుదరంలో (పొట్టలోనే) వున్నాయి. (మనమంతా పుట్టింది ఒకని నుంచే... పెరుగుతున్నది ఒకనిలోనే.. రేపు చచ్చాక పోయేదీ ఒకని దగ్గరకే... మరి మనలో మనం యెందుకు విభేదించుకొంటున్నాం? ఎంత మూర్ఖులం?) మనం రకరకాల మంత్రాలు గురువు ద్వారా ఉపదేశం పొంది పఠిస్తుంటాం. ఆ మంత్రాలన్నీ శ్రీహరి నామములే. మరి ఇంక నోరు తిరగని ఆ మంత్రాలను అపశబ్దాలు పలుకుతూ పలకటం దేనికి? హరి... హరి... హరి... అంటే చాలదా? ఓ వెఱ్ఱి మనసా! చాలును. హరి అను.

ఓ మనసా! మనం యజ్ఞయాగాది కర్మలు అనేకం యెంతో శ్రమపడి చేస్తాం. అవన్నీ వేదం నుంచే కదా! వెలుగులోకి వచ్చాయి. మరి ఆ నాలుగు వేదాలూ యెవరిని పొగడుతున్నాయి? విష్ణుని కీర్తిస్తున్నాయి. ఈ విశ్వానికంతటికీ ఆయనే అంతరాత్మ. అంతరాత్మ కనిపిస్తుందా? మరి కనబడని దేవుని యెందుకు వెదకుతావు? విష్ణువు అని భావించి వెదకి చూడు, యెక్కడనైనా ఆయనే కనిపిస్తున్నాడు. కాకపోతే, వెదకవలసిన వాడివి నీవే. అది నీ బాధ్యతే.

అచ్యుతుడంటే.. "చ్యుతి" (నాశనము) లేని వాడని అర్థం. ఆది (పుట్టుక), అంత్యము (మరణము) లేనివాడే అచ్యుతుడు. ఆయనే అసురాంతకుడు. మన మనస్సులో పుట్టి, మనసులో పెరిగే అసురుడే, అజ్ఞానం. ఆ అసురాంతకుడు యెవరు? అచ్యుతుడు. మరి ఆ అచ్యుతుడెవరు? ఏడుకొండలపై వెలసిన ఈ దేవదేవుడు, శ్రీవేంకటేశ్వరుడే. ఈయనే విష్ణువు. ఈయనే శ్రీహరి. ఆయననే, అచ్యుతా! శరణు తండ్రీ! అని భజించండి. ఆయనే చూసికొంటాడు.

**5-98**

## మున్నుడి

చాలా క్లిష్టమైన సంస్కృత కీర్తన నావిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. కీర్తన పల్లవిలో క్రియా వాచకమే లేకపోవటంచేత భావసమన్వయం బహుకష్టతరముగా వుందని, నాకు అనిపించింది. నా మిత్రుల సహకారంతో ఈ మాత్రం వివరించ గలిగానంటే.. అది ఆ వేంకటపతి కృపకాక ఇతరము కాదు. పెద్దలు సంస్కృతంలో నిష్ణాతులు నా యత్నంలోని లోపాలను మన్నిస్తారని నా ఆకాంక్ష. ఈ కీర్తన పల్లవి "మా వంటివారికి, అన్యులకు, ఆయా విషయముల యందు, ఆయా స్థలములలోనూ, ఇంకా..." అని వుంది. చరణాలతో సమన్వయం చేసికొంటే కాని ఒక కొలిక్కి రాదు..

**ఆ.వె॥ మాదు బోంట్లకున్న మరి అన్యులకునైన**
**వివిధ విషయములలొ వేరుచోట్ల**
**ఏది గతిగ గలదు? ఈ వేంకటేశుడే**
**ఉన్న దిక్కు అనెను అన్నమయ్య.**

**రాగం : పాడి**

అస్మ దాదీనాం అన్యేషాం
తస్మిన్ తస్మిన్ తత్ర చ పునశ్చ ॥అస్మదా॥

సతతాధ్యయన నిష్ఠాపరాణాం దృఢ-
వ్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా(కోవా) జగత్యాం పర-
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ ॥అస్మదా॥





మోహినామత్యంత ముష్కరాణాం గుణ-
గ్రాహిణాం భువనైక కఠినానాం
దేహ సంక్షాళన విదేశకోవా సదా
శ్రీహరి స్మరణ విశేషః పునశ్చ ॥అస్మదా॥

కింకుర్వాణ దుఃఖిత, జీవినాం
పంకిలమనోభయ భ్రాంతానాం
శంకాం నిరురుతి స్సరసా కా, శ్రీ-
వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ ॥అస్మదా॥

**భావామృతం**

మావంటి వారికీ, అన్యులకు... ఆయా విషయములలో, ఆయా స్థలములయందు... ఇంకా...

ఎల్లప్పుడూ అధ్యయనపు నిష్ఠాగరిష్టులకు, దృఢ చిత్తముగలవారికి, యతులకు, వనవాసులకు (వానప్రస్థ వాసులకు) స్మరించుటకు ఇక్కడే ( ఈ తిరుమలయే) గతి, ఇంకా జగత్తులో ఏముంది? ఇదే పరము. ఇంతకంటే విష్ణుసేవయేముంది?

మోహితులకు, అత్యంత దుర్మార్గులకు, సద్గుణులకు, లోకాలన్నింటిలో అజేయులైన వారికి, దేహాభిమానము యేమాత్రమూ లేని యోగులకు... సదా శ్రీహరి స్మరణయే విశేషించినది. ఇంకా...

ఏమి చేయాలో తెలియని దుఃఖభాజనుల విషయంలోనూ, మనస్సు పంకిలమై (మలినమై) భయావహులైన వారి విషయములలోనూ, ఏదిగతి అంటే... "అనుమాన సాగరమును" నివారించు మార్గమేమంటే, శ్రీవేంకటాచలపతికి విన్నవించుటయే... అదేగతి.

## ముస్నుడి 5-99

విజయనగరంలో నెలకొన్న వీరరాఘవునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. రామపట్టాభిషేక దృశ్యాన్ని కళ్లకు కట్టి వినిపిస్తున్నారు. "శిరస్సు మీద కూకటుల రాఘవు"డట. ఆయన అంటే చిన్న పిల్లలకున్నట్లు బాగా పెరిగిన జుట్టువున్నవాడని అర్థం. "గరిమ నా వయసున దాటికి జంపిన కౌసల్య నందన రాఘవా!" అంటే... గరిమన్ ఆ వయసునన్ తాటకిన్ చంపిన కౌసల్యపుత్రుడా! అని ఆశ్చర్యపోతున్నారు. చిన్నారి పొన్నారి వయస్సులో అన్న మాట. ఈ కీర్తన భజనలాగ కూడ పాడుకోవచ్చు. పెద్దపెద్ద చరణాలు వుండటం వల్ల రాఘవా అనే మకుటం బృందగానానికి అనుకూలంగా వుంటుంది.

**ఆ.వె॥ రామ రామచంద్ర రాజీవలోచనా!**
**రఘుకులేశ! భరత, లక్ష్మణులును,**
**జయము బలుక నీకు శత్రుఘ్నుతో గూడి**
**అవని నేలుమనెను అన్నమయ్య.**

**రాగం : వరాళి**

రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరత శత్రుఘ్నుల తోడ జయమందు దశరథ రాఘవా ॥రామ॥

శిరసు కూకటుల రాఘవా చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నా వయసున దాటకి జంపిన కౌసల్యనందన రాఘవా
అరిది యజ్ఞముగాచు రాఘవా అట్టె హరువిల్లు విరిచిన రాఘవా
సిరులతో జనకుని యింటను జానకి జెలగి పెండ్లాడిన రాఘవా॥రామ॥

మలయునయోధ్యా రాఘవా మాయామృగాంతక రాఘవా
చెలగి చుప్పనాతి గర్వమడచి దైత్యసేనల జంపిన రాఘవా
సొలసి వాలిజంపి(న) రాఘవా దండి సుగ్రీవు నేలిన రాఘవా
జలధిబంధించిన రాఘవా లంక సంహరించిన రాఘవా ॥రామ॥





దేవతలు చూడ రాఘవా నీవు దేవేంద్రు రథమెక్కి రాఘవా
రావణాదులను జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయ పట్నమేలి(న) రాఘవా
శ్రీవేంకటగిరిమీద నభయము చేరి మాకిచ్చిన రాఘవా ॥రామ॥

**భావామృతం**

ఓ రామా! రామచంద్రా! రాఘవా! (రఘువంశ తిలకా!) రాజీవలోచనా! (పద్మనయనా!) భరత, లక్ష్మణులు, శత్రుఘ్నులతోబాటు వారు జయజయ ధ్వానములుచేయుచుండగా, విరాజమానమైన దశరథరాఘవా! నీకు జయమగుగాక.

ఓ రాఘవా! నీవు శిరసుకూకటులవాడవు. (తలమీద చిన్నపిల్లలకున్నట్టు పెరిగిన జుట్టువున్నవాడవు) ఓ చిన్నారిపొన్నారి (మనోజ్ఞమైన) రాఘవా! గరిమన్, ఆ వయసునన్ (అంతాలేత వయస్సులో) తాటకిని చంపిన కౌసల్యానందనా! అరిది (దుర్లభమైన విధంగా) యజ్ఞసంరక్షణ చేసినవాడా! శివధనస్సును విరిచి జానకిని చేపట్టిన రాఘవా! నీకు జయమగుగాక!

ఓ రాఘవా! నీవు మలయునయోధ్య రాఘవుడవు (తిరిగి అయోధ్య జేరిన రాఘుడవు. మాయలేడిని చంపిన వాడవు. చేలరేగిన '(శూర్పణఖ) గర్వమును అడచిన వాడా, రాక్షస సైన్యాన్ని తుదముట్టించిన వాడా, సొలసి (మరుగున నుండి వాలిని సంహరించిన రాఘవా! సుగ్రీవునికి అభయము నొసగిన రాఘవా! సముద్రమును బంధించి వారధిని నిర్మించిన వాడవు, లంకను తుదముట్టించిన రాఘవా! నీకు జయమగుగాక!

ఓ రాఘవా! ఆ నాడు రామరావణయుద్ధంలో దేవతలందరు చూస్తుండగా దేవేంద్రుని రథమెక్కిరావణునితో యుద్ధమును చేసితివి. రావణునితో బాటువానిసేనను పుత్రులను తుదముట్టించితివి.కాని సజ్జనుడైన విభీషణుని పట్టాభిషిక్తుని చేసి రాజ్యమేలునట్లు చేసితివి. వేవేల (అతిశీఘ్రంగా) మరలి వచ్చి... ఇదిగో హంపీ విజయనగరమను ఈ పురమును పరిపాలించుచున్నావు. అంతేకాదు, అక్కడ తిరుమల నభయము నొసగుచు, రక్షించుచున్నావు. ఓ రాఘవా! అట్టి నీకు సదా జయమగుగాక! ఓ రామయ్య తండ్రీ! మమ్ముకనికరించుము.

**5-100**

## మున్నుడి

గొప్పశరణాగతి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అన్నిటికీ ఆ శ్రీవేంకటేశ్వరుడే నిర్వాహకుడు (నిర్వహించువాడు). కాబట్టి ఆ సర్వేశ్వరునే శరణుజొచ్చెదను... అంటున్నారు. తగు విధముగా, నిచ్చలు (ఎల్లవేళలా) తనదాసులు అయిన వారికి ఆ జగదేకపతియే శరణ్యము (దిక్కు) అంటున్నారు. ఆ మహానుభావుడు 'చిగురుజేవ' అవుతాడట. అంటే మనలో...మనకు ఆయనున్నాడనే, చేవ (ధైర్యము)ను, చిగురింపచేస్నాడట. అగు వరములిస్తాడట.. అంటే ఏమిటి? చదవండి..

**కం॥ సర్వేశ్వరుడే శరణము**

**నిర్వాహకుడిన్నిటికిని, నిగమ నుతుండున్**

**సర్వోత్తము డన్నయ్యానె**

**ఉర్వీపతి హరిని గొల్చె ఉద్ధతి తెలిపెన్.**

**రాగం : సింధుభైరవి.**

సర్వేశ్వరుడే శరణ్యము
నిర్వాకుడిన్నిటగాన ॥సర్వే॥

బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుడే శరణ్యము
అలరిన బ్రహ్మాండ మవిసిననాడును
నిలిపె నాతడిన్నిటి గాన ॥సర్వే॥

అనేక విధముల అఖిలజీవులకు
జనార్దనుడే శరణ్యము
అనాథనాథుడంతరాత్మకుడు
అనాదిపతి యితడటుగాన ॥సర్వే॥





తగునిశ్చలులగు తనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుజేవయగు శ్రీవేంకటేశ్వరుడు
అగువరములొసగు నటుగాన ॥సర్వే॥

**భావామృతం :**

ఓ మానవులారా! మనకు దిక్కు ఎవరు? కాపాడేవారు ఎవరు? ఇంకెవరున్నారు....ఆ సర్వేశ్వరుడే శరణము. ఎందుకంటే...అన్నిటినీ నిర్వహించేవాడు ఈ శ్రీవేంకటేశ్వరుడే కదా!

బలవంతులైన దేవతలకే కాదు, బ్రహ్మ మొదలైన దేవోత్తములకు కూడ పద్మనాభుడే శరణ్యము. వారంతా శరణని ఆయననే ప్రార్థిస్తారు. నేడు అలరియున్న ఈ లోకములన్నీ అవిసిన వాడు. వీటన్నింటిని ఆయనే నిలిపి సంరక్షిస్తాడు. అందుకే ఆయనని జగద్రక్షకుడని అందరూ కీర్తిస్తారు.

ఆ మహానుభావుని పేరే జనార్దనుడు. అఖిల జీవులకు ఎన్నెన్నో విధములుగా శరణు నందించి కాపాడుటయే అతని పని. దిక్కు మొక్కులేని ఆర్తులకు ఆయనే అండ. ఆయనే వారికి భర్త. పోనీ ఆయన యెక్కడో వైకుంఠంలో వుంటాడు మన గోడు ఆయనకు వినపడదేమో అని సందేహించాల్సిన పనియే లేదు. అంతరాత్మరూపంలో ఆయన మనలోనే వుంటాడు. పోనీ ఈ పతి (నాథుడు) మొన్నమొన్న వచ్చాడనుకోరాదు. ఆయన ఆదిలేని అనాది. అందుచేత ఆయనను శరణనండి.

'తగు నిశ్చలులగు' (తగినట్లు నిశ్చలత్వంతో) తన దాసులైన వారికి ఈ జగదేకపతియే శరణ్యము. "చిగురుజేవయగు శ్రీవేంకటేశ్వరుడు" (మనలో మనకే ఈ శ్రీవేంకటేశ్వరుడున్నాడులే... అనునట్టి చేవ (ధైర్యము) చిగురించునట్లు చేయు స్వామి, అగు వరము లొసగును (అన్నివరములు సానుకూలమయ్యేవే ఇస్తాడు). అటుగాన (అందుచేత) శ్రీవేంకటేశం శరణం ప్రపద్యే... అని శరణువేడండి.

**5-101**

## మున్నుడి

చక్కటి మంగళం పాడుతున్నారు అన్నమాచార్యులవారు చాలనిడుపైన చరణాలున్న కీర్తన ఇది. కాకపోతే, నారికేళపాకం కానందువల్ల తేలికగా అర్థమవుతుంది. నా అభిప్రాయమేమంటే... ఇటువంటి ఒక్క కీర్తన నిత్యపారాయణకు పెట్టుకుంటే ఇక ఏ స్తోత్రమూ, సహస్రనామపారాయణమూ, ధనవ్యయ శ్రమోపేతమైన వ్రతములు-యజ్ఞములు-తపస్సులు అవసరం లేదు. నా మాట నమ్మండి. అయితే ఒక చిన్న కిటుకువుంది.....పరిపూర్ణ విశ్వాసంతో, భక్తితో ఏకాగ్రతతో ఈ కీర్తన పాడాలి.. (దానికీ ఆయన అనుగ్రహం కావాలి, మరి)

**కం॥ గోవిందా! మంగళమిదె**
**దేవా! సర్వాత్మ! ధర్మదివ్య స్వరూపా!**
**భావించెను గరుడధ్వజ!**
**నీ వాడగు అన్నమయ్య నీరజనాభా!**

**రాగం : ఆనందభైరవి**

మంగళం గొవిందునకు జయ మంగళం గరుడధ్వజునకు
మంగళము సర్వాత్మునకు ధర్మ స్వరూపునకూ జయజయ॥మంగళం॥

ఆదికిని నాదైన దేవున కచ్యుతున కంభోజనాభున
కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని
వేద రక్షకునకును సంతతవేద మార్గ విహారునకు బలి
భేదికిని సామాదిగాన ప్రియ విహారునకు ॥మంగళం॥

హరికి పరమేశ్వరునకును శ్రీధరునకును కాలాంతకునకును
పరమపురుషోత్తమునకును బహు బంధదూరునకు
సురముని స్తోత్రునకు దేవ సురగుణ శ్రేష్ఠునకు కరుణా-
కరునకును కాత్యాయనీనుత కలిత నామునకు ॥మంగళం॥





పంకజాసన వరదునకు భవ పంకవిచ్ఛేదునకు భువనకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు
వేంకటాచలవల్లభవకును విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభకుంకుమ పంకలోలునకు ॥మంగళం॥

## భావామృతం

గోవిందుడైన శ్రీమన్నారాయణునికి మంగళమగుగాక! గరుడధ్వజునికి జయమునిచ్చు మంగళాశాసనములందించెదను. అందరి ఆత్మలలో నెలకొనిన, ఆ ధర్మస్వరూపునకు మంగళము, జయము కలుగుగాక!

ఆది అనేది ఏదివున్నా, దానికే ఆదియైన ఆ భగవంతునికి, చ్యుతి (నాశనము) లేని అచ్యుతునికి, కంబుజనాభునికి (పద్మము నాభియందు కలిగిన వానికి), ఆదికూర్మమువలె క్షీరసాగర మధనము చేయించిన జగదాధారునికి, వేదములను రక్షించిన మత్స్యరూపునకు, ఎప్పుడూ వేదములు నిర్దేశించిన మార్గములోనే చరించువానికి, బలిచక్రవర్తిని కట్టడిచేసిన వామనమూర్తికి, సామవేదము గానము చేయబడుచోట ప్రీతితో విహరించు దేవదేవునకు మంగళమగు గాక!

శ్రీహరికి, పరమేశ్వరుడైన నారాయణునికి, శ్రీవల్లభునికి, ప్రళయకాలమున ప్రభవిల్లు కాలాంతకుని, పరమపురుషుడని కీర్తింపబడు పురుషోత్తమునికి, అన్ని బంధములనుండి మనలను ముక్తులను చేయువానికి, దేవతలు, మునులు మొదలైనవారిచే స్తోత్రింపబడు వానికి, అన్ని దైవ సంబంధమైన గుణములున్న శ్రేష్ఠుడైన వానికి, కరుణాస్వరూపునకు, పార్వతీదేవిచే నిత్యమూ స్తోత్రింపబడు వానికి, కలితనామునికి (పొందబడిన పేరుగలవానికి... అనగా... నిత్యమూ, సర్వులచే హరి హరీ అని అంటూ నామపారాయణం చేయబడువానికి) జయమంగళ మగుగాక!

బ్రహ్మదేవుని అనుగ్రహించిన వానికి, బురదవంటి యెన్నో పాపములను ప్రక్షాళనము చేయువానికి, భవుడు అని పేరుగన్న శంకరునకే అవ్యక్తుడైన (గ్రహింబడని) వానికి, ఆశ్చర్యము గొలుపు రూపముగలవానికి, వేంకటాచలనాధునికి, విశ్వమంతటికీ ఈశ్వరుడయిన విశ్వరూపునకు, పద్మమునందు పుట్టిన శ్రీలక్ష్మి కుచకుంభములకంటిన కుంకుమాపంకము నందు మక్కువగల శ్రీవేంకటేశ్వరునకు మంగళము కలుగుగాక! సర్వజయములు కలుగుగాక!

**ఓం నమో వేంకటేశాయ**

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ





